# సిలికానాంధ్ర సుజనరంజని



# ప్రత్యేక సంచిక సంపాదక వర్గం

ముఖ్య సంపాదకులు

శ్యామలాదేవి దశిక

ఫణిమాధవ్ కస్తూరి

సహ సంపాదకులు

మధు రాచకుళ్ల

భారతి భావరాజు

సుజనరంజని సంపాదకులు

మృత్యుంజయుడు తాటిపాముల

# సుజనరంజని ప్రత్యేక సంచిక రచనలు వివరాలు


| | | | |
|---|---|---|---|
| 1. | "ఆంధ్రుల జానపద విజ్ఞానం"- సామెతలు | - | ఆర్.వి.ఎస్. సుందరం |
| 2. | జానపద గేయాలు-మానవ జీవిత ప్రతిబింబాలు | - | డా॥ ముక్తేవి భారతి |
| 3. | జానపదం-జ్ఞానపథం | - | డా॥ ద్వా.నా.శాస్త్రి |
| 4. | జానపద సాహిత్యం-కృష్ణుడు | - | డా॥ రావి ప్రేమలత |
| 5. | జానపదుల అట్లతద్ది పండుగ | - | డా॥ కరుగంటి శ్రీలక్ష్మి |
| 6. | సంప్రదాయ సాహిత్యంలో జానపద జీవన సౌందర్యం | - | శ్రీమతి. రాధ కాశీనాథుని |
| 7. | తెలుగు జానపద కళలు నిన్న నేడు రేపు | - | డా॥ పులికొండ సుబ్బాచారి |
| 8. | అన్నమయ్య జానపదం | - | గంధం బసవ శంకర రావు |
| 9. | పంబాలల పుట్టు పూర్వోత్తరాలు | - | పంబాల పర్వతాలు పరిశోధక విద్యార్థి |
| 10. | సంపూర్ణమైన పండుగ-బతుకమ్మ పండుగ | - | లేళ్ళపల్లి శ్రీదేవి రమేష్ |
| 11. | కిన్నెరసాని-బతుకమ్మ పాట | - | ఎన్నెల |
| 12. | స్త్రీల పాటలు-తెలుగు సంస్కృతి | - | డా॥జీ.ఎస్. మోహన్ |
| 13. | మీరైనా చెప్పండి | - | డా॥ పుట్టపర్తి నాగ పద్మిని |
| 14. | జానపదం-జనపదం | - | డా॥ శారదాపూర్ణ |
| 15. | వనచరులు - విశేషాలు | - | డా॥ యేలూరిపాటి ఆంజనేయ శర్మ |
| 16. | మామంచి ఊరు | - | శ్యామలాదేవి దశిక |
| 17. | కోడిపందేలు | - | యఱ్ఱమిల్లి శారద |
| 18. | వింజమూరి గేయాలు | - | డా॥ వింజమూరి అనసూయాదేవి |
| 19. | ఒగ్గుకథ | - | లింగ శ్రీనివాస్ |
| 20. | జానపదంలో పురాణాలు | - | డా॥ బిరుదురాజు రామరాజు |

# మా మాట



సిలికానాంధ్ర కుటుంబ సభ్యులైన తెలుగు వారందరికీ శుభ స్వాగతం!

పదహారు సంవత్సరాలుగా పశ్చిమ తీరాన వైభవంగా జరుగుతున్న **"తెలుగు సాంస్కృతికోత్సవం"** ఈ ఏడు మన న్యూజెర్సీ రాష్ట్రంలో జరగడం మనందరికీ ఎంతో ఆనందదాయకం, గర్వకారణం! తెలుగువారం అందరం కలిసి చేసుకుంటున్న ఈ పండుగలో భాగంగా సుజనరంజని ప్రత్యేక సంచికను విడుదల చేయాలని కార్యవర్గం నిర్ణయం తీసుకోవడం జరిగింది. జానపదాన్ని ఇతివృత్తంగా ఎంచుకుని చక్కని మేలైన రచనలతో, ప్రముఖ వ్యక్తుల విశేషాలతో, విజ్ఞానప్రదమైన విషయాలతో, అందమైన చిత్రాలతో జనరంజకంగా తీర్చిదిద్ది మీకు అందివ్వాలన్న మా ఆశయ ప్రతిరూపమే ఈ "జనపదావళి".

ప్రత్యేక సంచికను రూపొందించడానికి న్యూజెర్సీ నుంచి నన్ను సంధానకర్తగా నియమించి శరత్ వేట గారు నాకు ఒక గొప్ప అవకాశాన్ని ఇచ్చారు. ఈ కారణంగా నేను పొందిన అనుభూతి...ఆనందం మాటల్లో చెప్పలేనిది. అందుకు ముందుగా శరత్ గారికి నా కృతజ్ఞతలు.

పత్రికా రంగంలో ఎంతో అనుభవం ఉన్న సుజనరంజని సంపాదకులు శ్రీ తాటిపాముల మృత్యుంజయుడు గారు ఎంతో పెద్ద మనసుతో "మీరు చేయగలరు" అంటూ నాకు ధైర్యాన్నిచ్చి, తగిన సూచనలిస్తూ నన్ను ముందుకు నడిపించారు. వారికి నా ప్రత్యేక ధన్యవాదాలు.

మొదటి పరిచయంలోనే తన సౌమ్యతతో, హాస్యంతో నాబెరుకుని, భయాన్ని బయటకు నెట్టి, నా సందేహాలను తీరుస్తూ, ప్రశ్నలకు ఓపిగ్గా సమాధానాలిస్తూ నన్ను ఉత్సాహపరిచి, సంచికకు తుదిమెరుగులు దిద్ది "జనపదావళి" ని అత్యంత మనోహరంగా ముస్తాబు చేసిన బహుముఖ ప్రజ్ఞాశాలి శ్రీ కస్తూరి ఫణి మాధవ్ గారికి నా హృదయపూర్వక ధన్యవాదాలు.

ప్రత్యేక సంచికకు విలువైన రచనలను అందించిన రచయితలందరికీ ధన్యవాదాలు. అడిగిన వెంటనే తమ ఆశీస్సులను...సహాయాన్ని అందచేసిన ప్రముఖులు శ్రీ రాళ్ళపల్లి సుందరం గారికి మా సాంస్కృతికోత్సవం కమిటీ తరఫున ప్రత్యేక వందనాలు సమర్పించుకుంటున్నాం. జానపద రచనలను సేకరించే ప్రయత్నంలో నాకు ఎంతో సహాయం చేసిన నా చిరకాల స్నేహితురాలు డా. మృణాళినికి నా ధన్యవాదాలు.

అడిగిన వెంటనే నా టీమ్ సభ్యులుగా చేరిన రాచకుళ్ళ మధు గారికి, భారతి భావరాజు గారికి, ఈ సంచికను మీ ముందుకు తేవడానికి ఎన్నో విధాలుగా మాకు సహాయపడిన ప్రతి ఒక్కరికీ మా ధన్యవాదాలు.

తెలుగు భాష ఔన్నత్యాన్ని...మన ఆచార - సంప్రదాయాల అందచందాలను. . .తెలుగు కళల గొప్పతనాన్ని "తెలుగు సాంస్కృతికోత్సవం" పేరిట ఒక కుటుంబంలో జరిగే పండుగగా అందరం కలిసి జరుపుకుంటున్న శుభసందర్భంగా, మేము సవినయంగా అందిస్తున్న ఈ కానుక మిమ్మల్ని అలరిస్తుందని ఆశిస్తూ.........

**- శ్యామలాదేవి దశిక**

## SPECIAL ACKNOWLEDGEMENTS :

Syamala Devi Dasika

Kiran Borra

Mallesh Singathi

Rajani Singathi

Sekhar Konala

Mahesh Nagella

Suresh Padmanabhuni

Rajeswari Ramanand

Sreedhar Kondagunta

Vijaya Turimella

Pavan Borra

Laxmi Nanduri

Seshagiri Rao Kambhammettu

Ratna Veta

Madhu Rachakulla

Kiran Duddagi

Gangadhar Desu

Srividya Manikonda

Madhuri Kondagunta

Sarath Veta

**LAST BUT NOT THE LEAST ALL OUR ADVERTISERS, SPONSORS and ALL THE PARENTS OF PARTICIPANTS,**

**BIG THANK YOU ALL**





Sarath Veta



Ratna Veta



Syamala Devi Dasika



Madhu RachaKulla



Seshagiri Rao Kambhammettu



Mahesh Nagella



Rajeswari Ramanand



Srividya Manikonda



Lakshmi Nanduri



Sreedhar Kondagunta



Madhuri Kondagunta



Pavan Borra



Kiran Borra



Mallesh Singathi



Rajani Singathi



Usha Akella



Kiran Duddagi



Bala Ganamrutham Participants

## Flute Phani & Violin Vasu




Flute Phani & Violin Vasu garlu, famously known as DevanDrone, Phani and Vasu are are passionate youngsters, committed to promoting Carnatic Classical music in India and abroad. They have learnt music in gurukula system under the legendary musician Nadanidhi, Nadasudharnva Dr Sri Annavarapu Ramaswamy garu, who is 92 year old still performing concerts. He is a close friend and Sahadhyayi of legendary Dr Balamuralikrishna and accompanied him on the violin for more than 10 thousand concerts throughout the world. With that strong background in Carnatic music they have been giving pure classical, classical fusion concerts, conducting workshops and research in Indian Carnatic Music.

## Dr. Linga Srinivasa Garu



Dr, Linga Srinvasa Garu is a renowned Folk singer, choreographer, researcher, and instrument player who hails from Jagtial and currently lives in Hyderabad. A Musician at Telangana Samskrutika Saradhi and a graduate & scholar from Potti Sriramulu University

## Sri Gummadi Gopalakrishna garu



Internationally renowned drama artist Sri Gummadi Gopala Krishna, a native of Meduru in Krishna district, is known for his portrayal of Lord Krishna, Lord Rama, Jesus Christ, Narada among others. Sri Gopalakrishna gaaru, whose life mission is to restore telugu padya nATakam to its due glory, has conducted many 'padyaala workshops' abroad, where he taught how to render a padyam to fully bring out its saundaryam.

# ఆనంద వాక్యం!



తెలుగు సాహితీ సాంస్కృతిక సంప్రదాయ స్ఫూర్తితో 16 సంవత్సరాల క్రితం ప్రారంభమైన సిలికానాంధ్ర జగమంత కుటుంబం, ప్రపంచ వేదికపై తెలుగుదనానికి పట్టం కట్టడానికి నిరంతరం కృషి చేస్తున్నది. మనకే సొంతమైన అవధానాలు, పద్య నాటకాలు, బతుకమ్మ–బోనాలు, లలిత గీతాలు, కూచిపూడి నాట్యాలు, అన్నమయ్య కీర్తనలు ఒకటేమిటి, సిలికానాంధ్ర చేసే ప్రతీ కార్యకమం తెలుగుదనానికి మచ్చుతునకగా నిలుస్తాయి.

32వేల కీర్తనలు రచించిన అన్నమయ్యకు లక్షగళార్చన చేసినా, వందలాది సంవత్సరాల చరిత్ర కల్గిన కూచిపూడి నాట్యాన్ని వేలాది మంది కళాకారులతో ప్రదర్శింప జేసినా, నాలుగు వేలమందికి పైగా కళాకారులచే మంగళవాద్యాలు మ్రోగించినా – ప్రపంచమంతా మన తెలుగువారి వైపు చూడాలన్న తపనే – ఆ తపన లోంచి పుట్టుకొచ్చిన మనబడి తెలుగు భాషా సేవలో కొత్త ఒరవడి సృష్టించి, గత పది సంవత్సరాలలో 35 వేల మందికి పైగా ప్రవాస విద్యార్థులకు తెలుగు నేర్పించి, అమెరికాలో ప్రతిష్టాత్మక WASC సంస్థ గుర్తింపు సాధించిందంటే వేలాది భాషాసేవకుల నిరంతర కృషి పట్టుదల, తల్లితండ్రుల ప్రోత్సాహాలే అందుకు ఇంధనం.

సామాజిక సేవలోనూ సిలికానాంధ్ర జగమంత కుటుంబం ఎప్పుడూ ముందుంటుందని సిమెంటు రోడ్లు, LED లైట్లు, పాఠశాల, ఆనంద తరంగాలతో పొంగి పొరలుతున్న పుష్కరిణిలతో కళకళలాడుతున్న కూచిపూడి గ్రామమే అందుకు నిదర్శనం. త్వరలోనే ప్రారంభించనున్న సిలికానాంధ్ర సంజీవని మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం వడివడిగా సాగుతూ 150 గ్రామాలలోని పేద ప్రజలకు ఆరోగ్య అవసారాలని తీర్చబోతోంది. ఈ ఆరోగ్యప్రదాయక సంజీవని ఆస్పత్రి నిర్మాణానికి ఆర్థికంగా చేయూతనివ్వాలని ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తెలుగువారందరినీ కోరుతోంది సిలికానాంధ్ర.

తెలుగుదనం ఉట్టిపడే కార్యక్రమాలతో అలరించే సిలికానాంధ్ర తెలుగు సాంస్కృతికోత్సవాన్ని మొట్టమొదటి సారిగా న్యూజెర్సీ నగరానికి తీసుకువచ్చి, మనదైన తెలుగు పద్యానాటకాన్ని, మనబడి విద్యార్థుల కళాప్రతిభని, సంగీత, నృత్య, వాయిద్య, నాటక, జానపద కళలకు అధునాతన సాంకేతిక విజ్ఞానాన్ని జోడించి అందించబోయే నవరసాలతో నిండిన అద్భుతమైన అనుభూతిగా మీ అందరికీ పంచాలని చేస్తున్న ఈ మా ప్రయత్నానికి సహకరించి, ప్రోత్సహించిన ప్రతీ ఒక్కరికీ ధన్యవాదాలు. తెలుగు సాంస్కృతికోత్సవం సందర్భంగా జానపద సాహిత్యం ముఖ్య భూమికగా వెలువరిస్తున్న ఈ ప్రత్యేక సుజనరంజని, మీ మదిని నదిగా మలిచి హైలెస్సా అంటూ మన సొంతూరికి, చిన్ననాటి జ్ఞాపకాలలోకి విహారం చేయిస్తుందని ఆశిస్తూ

**ఆనంద్ కూచిభొట్ల**

వ్యవస్థాపక అధ్యక్షులు

సిలికానాంధ్ర

# జానపదాలే జనజీవనం



తొలిసారిగా న్యూజెర్సీ పట్టణంలో జరుతున్న సిలికానాంధ్ర 'తెలుగు సాంస్కృతికోత్సవం' ప్రదర్శనలకు విచ్చేసిన మీకందరికి ఘనంగా స్వాగతం పలుకుతున్నాను.

తెలుగు సాహిత్యం, సంస్కృతి, సంప్రదాయము పునాదిరాళ్ళుగా పదహారేళ్ళ క్రిందట ఆవిర్భవించిన సిలికానాంధ్ర సంస్థ మొదటి కార్యక్రమం నుండి జానపదకళలకు పెద్దపీట వేస్తూనే ఉంది. ప్రతి ఏడు జరిగే సాంస్కృతికోత్సవంలో బతుకమ్మ పండుగ ఉత్సాహంగా జరుపుకొంటాము. చెప్పుకుంటే అతిశయోక్తిలా ఉంటూందేమో కాని నేనూ ఒక దీక్షగా తీసుకొని చేసే పోతురాజు నాట్యం అందరిని అలరిస్తుంది. పదేళ్ళ కిందట 'మన పండగలు ' ప్రదర్శనలో ఒక భాగమైన 'జడకోలాటం' మంచి ఆదరణ పొంది ఇప్పటికి పలుమార్లు ప్రదర్శింపబడింది అని ప్రస్తుతించడం అతిశయోక్తి కాదు. న్యూయార్కు తెలుగు సంస్థ వారి ఆహ్వానం మేరకు అక్కడికి వెళ్ళి రామాయణాన్ని 'తోలుబొమ్మలాట 'గా విజయవంతంగా రూపొందించిన అనుభవం ఇప్పటికీ స్మృతుల్లో మెదలుతూనే ఉంది.

లలిత, జానపద సంగీతాల్లో విదుషీమణి అయిన 'కళాప్రపూర్ణ ' వింజమూరి అనసూయదేవి గారితో సిలికానాంధ్రకు ప్రత్యేకమైన అనుబంధం ఉంది. వారి సంగీత, సాహిత్య ముద్రణలను సిలికానాంధ్ర విరివిగా ప్రచారం చేస్తూనే ఉంది. అలాగే, 'జానపదబ్రహ్మ ' గా పేరొందిన కీ.శే. మానప్రగడ నరసింహమూర్తి గేయాల క్యాసెట్లను సిలికానాంధ్ర విడుదల చేసింది. ఇరు తెలుగు ప్రాంతాల జానపద కళారూపాలను ఎప్పటికప్పుడు ముందు తరాలకు అందిచాలన్న తపన సిలికానాంధ్రకు ఎల్ల వేళలా ఉంటుంది.

జానపదమే ప్రాతిపదికగా తీసుకొని ముద్రించిన ఈ ప్రత్యేక సుజనరంజని సంచికలోని రచనలు మిమ్మల్ని ఆనందింప చేస్తాయని అభిప్రాయపడుతూ, మీకందరికి మరొక్కసారి స్వాగతం పలుకుతున్నాను.

ఇట్లు,

**దిలీప్ కొండిపర్తి**

వైస్ చైర్మన్ – సిలికానాంధ్ర

# శరత్ కాలమ్



‘సిలికానాంధ్ర’ జగమంత తెలుగు కుటుంబం యొక్క నినాదం “తెలుగు సాహితీ సాంస్కృతిక సంప్రదాయ స్ఫూర్తి”, మరియు దాని ఆశయం తెలుగుదనాన్ని, సంస్కృతినీ అందరికి అందించడం. స్థాపించినది మొదలు అంతర్జాతీయ కూచిపూడి నాట్య సమ్మేళనాలు, అన్నమయ్య లక్షగళార్చన, సహస్ర సంకీర్తనలు, మొదలగు ఎన్నో వినూత్నమైన కార్యక్రమాలు నిర్వహించడమే కాకుండా, ఎందరెందరో గొప్ప గొప్ప కళాకారులను స్వదేశంనుంచి తీసుకు వచ్చి ప్రదర్శనలు ఏర్పాటు చేసి మన కళలు సంప్రదాయాలను నేటి తరానికి, రేపటి తరానికి పరిచయం చేయడాన్ని తమ బాధ్యతగా భావిస్తూ అద్భుతమైన సాంస్క ృతిక కార్యక్రమాలు చేయడం సిలికానాంధ్ర ప్రత్యేకత.

సిలికానాంధ్ర గత పది సంవత్సరాలుగా మనబడి ద్వారా ప్రవాసాంధ్రుల పిల్లలకి తెలుగు నేర్పటంతో పాటుగా, వారి ప్రతిభాపాటవాలను వెలికి తీసే మాట్లాట పోటీలు, వారిలోని కళాత్మకతకు అద్దంపట్టే “పద్యనాటకం”, “నాటకోత్సవాలు” మనబడి పిల్లలపండగలు, నిర్వహిస్తోంది. ఇప్పటి వరకు మనబడి ద్వారా 35000 మంది పిల్లలు తెలుగు నేర్చుకున్నారు. ప్రఖ్యాత Western Association of Schools and Colleges(WASC) గుర్తింపుతో పాటు, అనేక స్కూల్ డిస్ట్రిక్ట్‌లలో ప్రపంచభాగా గుర్తింపు(**World Language Credit**) అర్హత సాధించడంతో పాటు, తెలుగు విశ్వవిద్యాలయం గుర్తింపు పొంది, తెలుగు ను ప్రాచీన భాషనుండి ప్రపంచభాషగా మలిచే అద్భుతమైన విద్యాలయంగా పేరొందిన ఈ మనబడి చేసే భాషాసేవలో నేను పాలుపంచుకోవటం ఎంతో అదృష్టంగా భావిస్తున్నాను.

అంత్యంత వైభవంగా ఏటా కాలిఫోర్నియాలో నిర్వహించే “తెలుగు సాంస్కృతికోత్సవాన్ని, మొట్టమొదటిసారి మన న్యూ జెర్సీ రాష్ట్రానికి తీసుకువచ్చాం. మన తెలుగువారింట దసరా, బతుకమ్మ, మరియు దీపావళితో పాటుగా వస్తున్న మనఅందరికీ మరో పండుగ ఈ ‘తెలుగు సాంస్కృతికోత్సవం’. ఉత్సవం అంటే ఏదో ఆషామాషీగా కాక, మన తెలుగువారి సంప్రదాయాన్ని, సంస్కృ తిని ప్రతిబింబించే విభిన్న కార్యక్రమాలు, “తెలుగుభాషా గానామృతం “, మనబడి పిల్లలచే సందేశాత్మక హాస్య నాటిక, “మన తెలంగాణం “, “ శ్రీకృష్ణ రాయబారం పద్యనాటకం, ‘నాదామృతవర్షిణి, మేరా భారత్ మహాన్, మనపండగలు మొదలగు కార్యక్రమాలు, వేటికవే సాటిగా తమ ప్రత్యేకతను చాటనున్నాయి. ఇక్కడి కళాకారులతో పాటు భారత దేశం నుండి ఎందరో ప్రముఖులైన కళాకారులు కూడా మిమ్ము అలరిస్తారు.

ఈ సందర్భంగా “హైలెస్స” – సుజనరంజని ప్రత్యేక సంచికగా విడుదల చేయటం నాకు మరింత ఆనందంగా ఉంది. ఈ సంచికకు ప్రత్యేక ఆకర్షణ “జానపద కళల “ పై ప్రత్యేక వ్యాసాలు, విశ్లేషణలు, ఎందరో లబ్ధప్రతిష్ఠుల రచనలు. ఈ సంచికను ఇంత అద్భుతంగా తీర్చిద్దినవారందరికీ నా మన:పూర్వక నమస్సులు.

ఈ కార్యక్రమ నిర్వాహకులు అందరికి, సిలికానాంధ్ర జగమంత కుటుంబ సభ్యులకు నా హృదయ పూర్వక ధన్యావాదాలు. నాకు ఈ కార్యక్రమ నిర్వహణ బాధ్యతలు అప్పగించి, నన్ను ఇందులో భాగస్వామిని చేసినందుకు సిలికానాంధ్ర వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీ ఆనంద్ గారికి, మరియు గ్లోబల్ ఎగ్జిక్యుటివ్ కమిటీకి నా కృతజ్ఞతలు.

భవదీయుడు

**శరత్ వేట**

చైర్‌మెన్

సిలికానాంధ్ర తెలుగు సాంస్కృతికోత్సవం

న్యూ జెర్సీ



# ఆచార్య ఆర్వీయస్ సుందరం గారితో ముఖాముఖి

నమస్కారం సుందరం గారు. జానపద సాహిత్యం లో విశేషంగా క అషి చేసి ఎన్నో పుస్తకాలు రచించిన మిమ్మల్ని ప్రశ్నలు అడిగే ముందు, మొదటగా మీ గురించి తెలుసుకోవాలని ఉంది. మీ గురించి చెప్పండి.

నా పూర్తి పేరు రాళ్ళపల్లి వెంకట సుబ్బు సుందరం. నేను పుట్టింది నెల్లూరులో. 11వ తరగతి (ఎస్సెల్సీ) వరకు అక్కడే చదివాను. తర్వాత మద్రాసులో బియ్యెస్సి జువాలజి చేశాను. జంతుశాస్త్రం చదివి, తెలుగు ఎం.ఎ. ప్రెసిడెన్సి కళాశాలలో పూర్తి చేశాను. వెంటనే (1969) నాకు కర్నాటకలో చింతామణి అనే చోట ఉద్యోగం దొరికింది. తర్వాత 1973లో మైసూరు విశ్వవిద్యాలయంలో తెలుగు ఉపన్యాసకునిగా చేరాను. అక్కడే రీడరుగా, ఆచార్యుడిగా, ప్రసారాంగ(ప్రచురణ విభాగం) నిర్దేశకునిగా, కన్నడ అధ్యయన సంస్థ నిర్దేశకునిగా చేసి 2008లో పదవీవిరమణ చేశాను. మధ్యలో 1990 నుంచి 1993 వరకు తెలుగు విశ్వవిద్యాలయం, సాహిత్యపీఠం, రాజమండ్రిలో తెలుగునాట మొదటి జానపద విజ్ఞాన ఆచార్యునిగా వెళ్ళి , డీన్ గా కూడా చేసి మళ్ళీ మైసూరికి తిరిగి వచ్చాను.

పదవీవిరమణ చేసిన తర్వాత కూడా అమెరికన్ విద్యార్థులకు పాఠాలు చెప్తూనే ఉన్నాను. 2011నించి యూనివర్సిటీ ఆఫ్ పెన్సిల్వేనియాలో సందర్శక ఆచార్యునిగా ప్రతి సంవత్సరం వస్తూ ఉన్నాను. 48 ఏళ్ళనించి బోధన పరిశోధన సాగుతూనే ఉంది.

సుమారు పదో ఏటినుంచే పుస్తకాలు చదవటం మొదలు పెట్టాను. 15వ ఏటినుంచి రాయటం మొదలుపెట్టాను. ఇప్పటికి 100కు పైగా పుస్తకాలయ్యాయి. తెలుగు, కన్నడం, ఇంగ్లీషు, సంస్క అతం భాషల్లో పుస్తకాలు వచ్చాయి. కవిత, నవల, విమర్శ, జీవనచరిత్ర, జానపద విజ్ఞానం, అనువాదంలాంటి అన్ని ప్రక్రియల్లో రచనలు వచ్చాయి. పోతన భాగవతం, క్రీడాభిరామం, కాటమరాజు కథలు, వేయిపడగలు, మాలపల్లి, ఫిడేలురాగాల డజన్ లాంటి ఎన్నో కన్నడానికి అనువాదం చేశాను, చేయించాను. ఇలా సాగుతోంది జీవితం. ఇటీవలే నా తాత్విక ఆలోచనల్ని "జీవిద్దాం" అనే పుస్తకం ద్వారా వ్యక్తం చేశాను.

**ఈ జానపదం సబ్జెక్ట్ మీద మీకు ఆసక్తి ఎలా కలిగింది? ప్రత్యేక కారణం ఏమైనా ఉందా?**

నేను ఎం.ఎ. చదువుతున్నప్పుడు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ వారు అవార్డుకోసం ఒక పోటీ పెట్టారు. అప్పటికి అలాంటి అవార్డును నిడుదవోలు వెంకటరావు, కొత్తపల్లి వీరభద్రరావు, రావూరి దొరసామి శర్మ, గిడుగు సీతాపతిలాంటి మహామహులు మాత్రమే పొందారు. నాకు అప్పుడు 20ఏళ్ళు. నేనూ పోటీ పడ్డాను. నాకు అంత చిన్న వయసులోనే 'తెలుగు సాహిత్యములో దేశికవిత ' రాసినందుకు సాహిత్య అకాడెమీ అవార్డు వచ్చింది. అప్పుడు మొత్తం దేశికవిత (పదకవిత్వం, శతకాలు, యక్షగానాలు, దండకాలు మొదలైనవి) చదవటం జరిగింది. జానపద సాహిత్యం గురించి అప్పుడే పుస్తకాలు, వ్రాతప్రతులన్నీ చూడటం తటస్థించింది. పిహెచ్.డి.కి 'తెలుగు-కన్నడ జానపద గేయాలు' అనే విషయాన్ని తీసుకున్నాను. తర్వాత డి.లిట్. కోసం ఆంధ్రుల జానపద విజ్ఞానాన్ని తీసుకున్నాను. ఇలా జానపదం మీద నా ఆసక్తి పెరుగుతూ వచ్చింది.

**ఇప్పుడు ఎవరిని జానపదులు అనగలం? అలాంటి వారు ఉన్నారా? ప్రస్తుత కాలాన్ని బట్టి "జానపదులు" అన్న మాటకు మీరిచ్చే నిర్వచనం ఏమిటి?**

జానపదులు అంటే పల్లెటూరివారు, చదువురానివారు, వ్యవసాయదారులు అనే అభిప్రాయం ఉండేది. ఇప్పటికీ చాలా మంది అలాగే అనుకుంటారు. నాగరికులకు విరుద్ధమయిన వారే జానపదులని చెప్తూవచ్చాం. అలన్ డండస్ అనే జానపదవిజ్ఞానవేత్త జానపదులను నిర్వచిస్తూ సంస్క అతికి సంబంధించిన ఏ విషయాలనయినా పంచుకొనే ఏ సముదాయమయినా జానపదులే అన్నారు. మనం పల్లెలో ఉన్నా, పట్టణంలో ఉన్నా నమ్మకాల్ని, సంప్రదాయాల్ని, పండగల్ని, ఆటల్ని, పాటల్ని పంచుకుంటాం. అది జానపదం కాదని చెప్పలేం. అయితే పల్లెల్లో, పల్లెటూరివారిలో జానపదం ఎక్కువగా ఉంటుంది. సంప్రదాయాల్ని పంచుకొనే వారందరూ జానపదులే, ఎవరితో ఏదీ పంచుకోకుండా "ఇది నాది, నేనే చేశాను, నేనే రాశాను" అనే వారు జానపదులు కారు.

జానపదులు అంటే తరతరాల సంప్రదాయాలను, ఆచారాలను, నమ్మకాలను, పాటలను,కళలను కాపాడుకుంటూ వస్తున్నవారు. ఇలాంటివారు పల్లెల్లో ఎక్కువగా ఉంటారు. కాని జానపదత్వం అనేది మన అందరిలోనూ ఉంటుంది. అది ఏదో ఒక సమయంలో బయట పడుతుంది. అందువల్లనే మనం విమెన్ ఫోక్, స్టూడెంట్ ఫోక్, కాలేజ్ ఫోక్ లాంటి పదాలను వాడుతుంటాం. ఇలా నాగరికుల్లో ఉన్న జానపద అంశాలను కూడా అధ్యయనం చెయ్యాల్సి ఉంటుంది.

**ప్రస్తుతం జానపదుల పరిస్థితి ఎలా ఉంది? జానపద కళలు వారిలో ఎంతవరకు సజీవంగా ఉన్నాయి?**

రోజురోజుకూ దూరంగా తయారవుతోందనే చెప్పాలి. దీనికి ఎన్నో కారణాలు. ఆధునికత అనేది మన సంప్రదాయాలను మింగేస్తోంది. టీవీ, సినిమాలాంటి మాధ్యమాలు సామాన్య ప్రజల అలవాట్లను, వినోద సాధనాలను వెనక్కి నెట్టేస్తున్నాయి. ఇలాంటి సమయంలో ప్రభుత్వం అలాంటి కళల పరిరక్షణకి, కొనసాగింపుకు తగిన అవకాశాలను కల్పించాలి. ఈ విషయంలో కర్నాటక ప్రభుత్వం వివిధ అకాడెమీల ద్వారా ప్రశంశనీయమయిన సేవ చేస్తోంది. నిజానికి ఇంకా అనేక కళారూపాలు సజీవంగానే ఉన్నాయి. ప్రభుత్వ ప్రోత్సాహంతో అవి నిలదొక్కుకోవటానికి అవకాశం ఉంది.

**జానపద సాహిత్య సేకరణలో మీకు ఎదురైన ఇబ్బందులు ఏమిటి?**

అప్పట్లో ఇప్పుడు ఉన్నన్ని సౌకర్యాలు లేవు. కనీసం మంచి టేప్ రెకార్డర్, కెమెరా, విడియోలు లేకపోవటం వల్ల ఎంతో కష్టంతో జానపద సాహిత్యాన్ని సేకరించాల్సి వచ్చేది. నేను జానపద సాహిత్యంతో ఊరుకోక మొత్తం జీవితానికంతా సంబంధించిన విషయాలను సేకరించటానికి పూనుకోవటం వల్ల మరింత కష్టమయింది.



**అలాగే మరచిపోలేని అనుభవాలు పాఠకులతో పంచుకోగలరా?**

జానపదవిజ్ఞానాన్ని సేకరించే సమయంలో జానపదుల అమాయకత్వం, సామాజిక స్ప అహతో కూడిన జీవనవిధానం నన్ను ముగ్ధణ్ణి చేశాయి. వారి దగ్గర ఉన్న సాంస్క అతిక సంపద అమూల్యం. సేకరించటానికి వెళ్ళినప్పుడు వారు చూపించిన ఆప్యాయత ఎన్నోసార్లు నోట మాట రాకుండా చేసింది. మహబూబ్ నగర్ జిల్లాలో ఎల్లమ్మ కథాగేయాల్ని సేకరించటానికి వెళ్ళినప్పుడు వారు రాత్రింబవళ్ళు 20 కేసెట్లకయ్యేంత పాటలు పాడి వినిపించారు.

**సాంకేతిక /నగరీకరణ ప్రభావం జానపద సంస్క అతి మీద ఎంత ఉన్నది?**

రోజురోజుకూ నాగరికత జానపద జీవితంలోని సొగసుల్ని ఆక్రమించేస్తోంది. ముగ్గుల్ని పెయింట్ చేస్తున్నారు. తోలుబొమ్మల్ని ప్లాస్టిక్ తో తయారు చేస్తున్నారు. జానపద గేయాలు పాడమంటే సినిమా పాటల బాణీలతో పాడుతున్నారు. సామెతలు వాడటం ఎప్పుడో మర్చిపోయాం.

**జానపద అధ్యయనంలో మీలాగ కృషి చేస్తున్న ఇతర పరిశోధకుల పేర్లు, వివరాలు తెలియజేస్తారా?**

మొదటి తరం పరిశోధకులలో డా.బి.రామరాజుగారు జానపద సాహిత్య అధ్యయనాన్ని ఒక ఉద్యమంగా చేశారు. తర్వాత నాయని కృష్ణకుమారిగారు, తంగిరాల సుబ్బారావుగారు దీన్ని ముందుకు తీసుకువెళ్ళారు. వారి తర్వాత నా వల్ల జానపద సాహిత్యం మాత్రమే కాక మొత్తం జానపద విజ్ఞానాన్ని అధ్యయనం చెయ్యాలనే ఆలోచన వచ్చింది. ఈ విషయంలో బాగా క అషి చేసిన వారిలో ఆచార్య జి.ఎస్.మోహన్ ఒకరు. జానపద విజ్ఞానానికి సంబంధించిన అనేక విషయాలను పరిశోధించిన వారు డా.రావి ప్రేమలత, డా.గోపు లింగారెడ్డి, డా.కసిరెడ్డి వెంకటరెడ్డి, డా.ఆండమ్మ, డా.కె.సుమతి, డా.కె.శ్రీలక్ష్మి, డా.పి.సుబ్బాచారి మొదలైన వారిని చెప్పుకోవాలి.

**మిమ్మల్ని మెప్పించిన, అబ్బురపరిచిన మొదటి ఐదు తెలుగు జానపదకళల పేర్లు చెప్పండి. వాటి గురించి క్లుప్తంగా వివరించండి.**

1. తోలుబొమ్మలాట: కొన్ని వందల సంవత్సరాలుగా తెలుగు వారిని అలరిస్తున్న కళారూపం. తోలుబొమ్మల్ని తయారుచెయ్యటం, వాటికి రంగులు అద్దటం, సంగీతాన్ని, సాహిత్యాన్ని జోడించటం, ప్రదర్శించటం – అన్నీ సాంప్రదాయికమైన కళాత అష్ణకు నిదర్శనాలే.

2.యక్షగానం: యక్షగానం, వీధిభాగోతం, తూర్పు భాగోతం, బయలాట అనే పేర్లతో తెలుగు నాట ప్రదర్శనపొందే సమాహార కళ. ఇందులో సాహిత్యం, న అత్యం, సంగీతం, రంగాలంకరణ, చిత్రకళ, అభినయం, ఆహార్యం అన్నీ కలిసి ఉంటాయి. ఇప్పటికీ పల్లెటూళ్ళలో జనాన్ని రంజింపజేయగల సత్తా ఈ కళకుంది.

3. వీరనాట్యం: తెలుగు వారి కళాపటిమను, నృత్య విన్యాసాలను తెలియజెప్పే గొప్ప ప్రదర్శన.

4. తప్పెటగుళ్ళు: ప్రేక్షకుల్ని దిగ్రమేపరచగల సామూహిక న అత్యం. సంగీతం, న అత్యం, వీరావేశం అన్నీ కలిసిన కళారూపం.

5. ఒగ్గు కథలు: ఒగ్గు అనే వాద్యాన్ని వాయిస్తూ కథాగేయాలను పాడటం వందల సంవత్సరాలనుంచి జరుగుతూ ఉంది.



**జానపద సాహిత్యంలో విస్తారంగా పరిశోధన జరిపే విశ్వవిద్యాలయాలు ప్రస్తుతం ఇండియాలో, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలలో ఉన్నాయా? వాటిపేర్లు.**

భారతదేశంలో జానపద విజ్ఞానంలో ఎం.ఏ., పరిశోధన ప్రారంభించిన మొదటి విశ్వవిద్యాలయం మైసూరు విశ్వవిద్యాలయం. తర్వాత మణిపూర్, అస్సాం, తమిళనాడులోని పాళయంకోట్టైలాంటి చోట్ల ఈ అధ్యయనం ప్రారంభమయింది. తెలుగునాట దీనికి బీజం వేసింది రామరాజు గారు, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో. హైదరాబాదు విశ్వవిద్యాలయం ఒక విభాగాన్ని ఏర్పాటు చేసింది. తెలుగు విశ్వవిద్యాలయం మొదటి జానపద ఆచార్యునిగా నన్ను నియమించింది. హైదరాబాదులో జానపద కళల శాఖ ఏర్పడింది. తర్వత వరంగల్లులో జానపద, గిరిజన విజ్ఞాన పీఠం ఏర్పడింది. ద్రావిడ విశ్వవిద్యాలయం జానపద విజ్ఞాన శాఖను ఏర్పరిచింది.

**జానపద సాహిత్యాన్ని-కళలను సజీవంగా ఉంచటానికి సమాజపరంగా ప్రభుత్వ పరంగా మనం ఏమి చెయ్యాలి?**

శాసనాలను, పురావస్తువుల్ని, మానవశాస్త్రపరమైన వాటిని పరిరక్షించటానికి కేంద్ర ప్రభుత్వ సంస్థలున్నాయి. జానపద విజ్ఞాన పరిరక్షణకుకూడా అలాంటి సంస్థ ఏర్పడాలి. జానపద విజ్ఞానాన్ని సేకరించటానికి, రక్షించటానికి, ప్రచురించటానికి, వస్తుప్రదర్శనశాలలు నెలకొల్పటానికి పూనుకోవాలి. అకాడెమీలను స్థాపించి అన్ని సాంస్క అతిక కార్యక్రమాలలో జానపద కళల ప్రదర్శనానికి అవకాశం కల్పించాలి.

**మీరు అనువాద రంగంలో కూడా విశేషంగా క అషి చేసారు. ముఖ్యంగా కన్నడ, తెలుగు భాషల మధ్య. ఈ రెండు భాషాసాహిత్యాలతో మీకు విశేషంగా పరిచయం ఉంది. రచయితల పరంగా, సాహిత్య పరంగా వీటి మధ్య ఉన్న ప్రధానమైన తేడాలేమిటి?**

కర్నాటక ప్రభుత్వానికి భాషాసాహిత్యాలమీద ఉన్న గౌరవంలో అభిమానంలో పది శాతం కూడా మనకు లేదని తలదించుకొని చెప్పాల్సి వస్తోంది. అక్కడ కన్నడ భాషాసంస్క అతులకోసం ఆ ప్రభుత్వం సుమారు 400 కోట్లకు పైగా ఖర్చు చేస్తోంది. కన్నడానికి ప్రత్యేక శాఖ, మంత్రి, కన్నడ అభివ అద్ధి ప్రాధికారం, కన్నడ పుస్తక ప్రాధికారం, సాహిత్య అకాడెమీ, సంగీత, నాటక, యక్షగాన, బయలాట అకాడెమీలు, మహా కవులు, సంగీతకారుల పేరిట పరిశోధన సంస్థలు, అనువాదాలకోసం సంస్థ ఉన్నాయి. మనం ఎప్పటికీ ఆ విధంగా చెయ్యలేము.

**ఇప్పుడు జరుగుతున్న తెలుగు భాషోద్యమంలో మీరు కీలక పాత్ర నిర్వహిస్తున్నారు.మన భాష పరిరక్షణకు తీసుకోవలసిన చర్యలు ఏమిటని మీరు భావిస్తున్నారు?**

తెలుగు నాట తెలుగుకే మొదటి స్థానం అని మన పాలకులు అర్థం చేసుకునేంతవరకు తెలుగు భాష దౌరాగ్యేస్థితిలోనే ఉంటుంది. ఇంగ్లీషు చక్కగా నేర్చుకోవలసిందే. కాని తెలుగు మాట్లాడే రాష్ట్రాలలో ప్రాథమిక విద్య తెలుగులోనే జరగాలి, పరిపాలన తెలుగులోనే జరగాలి. ఇది అర్థమయితేనే తెలుగు ప్రపంచ భాషస్థాయికి ఎదగగలుగుతుంది.

**"భాషకన్నా, ప్రదేశం కన్నా జాతి బలమైనది" అని అన్నారు మీరు. దాని మీద వివరణ ఇవ్వగలరా?**

తెలుగు జాతి బలమయిన జాతి అని అర్థం చేసుకోగలిగితే ఆ జాతి ఏ దేశంలోనయినా, ఎన్ని భాషలు నేర్చుకున్నా తన మనుగడను స్థిరం చేసుకోగలుగుతుంది. తెలుగు జాతికి అంత శక్తి లేదనుకుంటే ఆ భాష దేనికీ పనికిరాదనుకుంటాము, తెలుగుకు ప్రపంచ భాష అయ్యే స్థాయి లేదనుకుంటాము, తెలుగు వాళ్ళు అమెరికాకో మరే దేశానికో వెళ్తేకాని బలవంతులు కాలేరు అని భావించకూడదు. అందువల్ల తెలుగు భాషకు, సంస్క అతికి ఒక ప్రత్యేక అస్తిత్వం ఉన్నాయని గుర్తించగలగాలి.

**మీకు లభించిన బహుమతులు, పురస్కారాలను గురించి చెప్పండి.**

నేను మద్రాసు, త్యాగరాయ కళాశాలలో బిఎస్.సి. చదువుతున్నప్పుడు అంతర్ కళాశాల వక్త అత్వం, వ్యాస రచన, కథారచన మొదలైన అన్నిట్లో ప్రథమ, ద్వితీయ బహుమతులు దాదాపు 27 గెల్చుకున్నాను. ఇది ప్రెసిడెన్సీలో ఎం.ఎ. తెలుగు చదివేటప్పుడూ కొనసాగింది.

నేను ఎం.ఎ.చదివేటప్పుడే ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ వారు పోటీ పెట్టారు. 20 ఏళ్ళ వయసులో తెలుగు సాహిత్యములో దేశికవిత పుస్తకం రాసి చాలా పిన్న వయసులోనే సాహిత్య అకాడెమీ బహుమతి గెల్చుకున్నాను. తెలుగులోని నవలా సాహిత్యంలో తలమానికమైన మాలపల్లిని, శేషేంద్రశర్మ గారి 'గొరిల్లా' ను కన్నడానికి అనువదించినందుకు కేంద్ర ప్రభుత్వం రెండుసార్లు పురస్కారాలు అందజేసింది. మాత అభాష కాని భాషలో రచనలు చేసే వారికి కేంద్ర మానవవనరుల శాఖ ఇచ్చే 'భాషాభారతీ పురస్కారం' కూడా నాకు లభించింది. ఇవికాక పాల్కురికి సోమనాథ పురస్కారం, చిలుకూరి నారాయణరావు స్మారక పురస్కారంలాంటివి కొన్ని లభించాయి.

మీ అమూల్యమైన సమయాన్ని వెచ్చించి, జానపదానికి సంబంధించిన ఎన్నో విషయాలను మా "సుజనరంజని ప్రత్యేక సంచిక"తో పంచుకున్నందుకు మీకు మా ధన్యవాదాలు సుందరం గారు!



# "ఆంధ్రుల జానపద విజ్ఞానం" సామెతలు

సామెతలు కూడా జానపద సాహిత్యంలో భాగమే. అనుభవ సారమంతా ఈ సామెతల్లో ఉండటంవల్ల ఇవి సూటిగా హృదయాన్ని తాకుతాయి.

తెలుగులో ఉండే వేలకొద్దీ సామెతలను ఏం చేస్తారు. ఎప్పుడు వాడతారు. ఎలా వాడుతారు అన్నది చాలా కుతూహలకరమైన విషయం. తెలుగు సామెతలను గురించి ఏవో అక్కడా ఇక్కడా ఒకటి రెండు వ్యాసాలు తప్ప (నాయని కృష్ణకుమారి, తెలుగు స్వతంత్ర, జనవరి 1954) సమగ్రమైన పరిశీలన జరగలేదు. సామెతల విలువను, సమాజంలో వాటి పాత్రను లోతుగా పరిశీలించవలసిన 'అవసరం' ఎంతయినా ఉంది. సాహిత్యపరంగా, సామాజికంగా, సాంస్కృతికంగా సామెతలను విశ్లేషించ వలసిఉంది.



**సాహిత్యపరమైన సౌందర్యం :**

సామెతలు అర్థగాంభీర్యం కలవి కావడంచేత సాహిత్య పరంగా వాటికి చాలా విలువ ఉంది. అల్పాక్షరాలలో అనల్పార్థరచనకు చక్కని ఉదాహరణలుగా సామెతల్ని చెప్పుకోవచ్చు. అయితే అన్ని సామెతలూ సాహిత్య గంధం ఉండే వనడానికి కూడా వీలులేదు. ఎందుకంటే సామెతల్లో పౌరాణికాలు, చారిత్రకాలు, నీతి సంబంధాలు మొదలైనవి అనేకం ఉన్నాయి. అయితే ధ్వని ప్రధానాలై, మనిషిలోని అనుభవాన్ని సూచనా ప్రాయంగా తెలిపే సామెతలు కూడా అసంఖ్యాకంగా కనిపిస్తాయి. ప్రాసానుప్రాసలే పరమావధిగా భావించి. శబ్దాడంబరంతో ఆ కవిత్వాన్ని కవిత్వంగా భాసింపజేసిన కవులెంతోమంది మనకున్నారు. అలాంటి కవిత్వంకంటే రసాత్మక వాక్యాలైన సామెతలే ఎంతోమేలనిపిస్తాయి. అర్థానికి అర్థం. శబ్ద సౌందర్యానికి శబ్ద సౌందర్యం-రెండూ ఉండే సామెతలు సాహితీ విమర్శకులను ఎక్కువగా ఆకర్షించక పోవడం దురదృష్టమనాలి.

'కాలుజారితే తీసుకోవచ్చుగాని-నోరు జారితే తీసుకోగలమా'

ఏ విధంగా చూచినా మహార్థం భాసించే సామెత ఇది. జీవితంలో మాటకు ఉండే విలువను, సమాజంలో వ్యక్తికి వ్యక్తికి ఉండే సంబంధాన్ని, సంఘంలో మనిషి తీసుకోవలసిన జాగ్రత్తను ధ్వని ప్రధానంగా చెప్తున్న ఉత్తమ వాక్యమిది. కాలు జారితే దేహానికి బాధ కలుగవచ్చు. కాని నోటి మాట గాలిలో పయనించేది. ఒక సారి మాట నోటి నుంచి వెలువడితే మళ్ళీ దాన్ని వెనక్కి తీసుకోవడం సాధ్యం కాదు. మాట ప్రభావం మనసు మీద ఉంటుంది. దేహం మీద కాదు. దేహానికి కలిగే బాధకన్నా మనసుకు కలిగే బాధ గొప్పది. అందువల్ల నోరు జారేముందు నాలుగుసార్లు ఆలోచించవలసి ఉంటుంది. ఇది జీవితంలో మనకు కలిగే అనుభవం. దీన్ని వివరించే ఉపన్యాసాలు మన పురాణాలలో, ఇతిహాసాలలో చాలా దొరుకుతాయి. కైకేయి దగ్గర నోరు జారిన దశరథుడు ఎన్ని పాట్లు పడ్డాడో మన మెరిగిందే. సూర్యుని దగ్గర నోరు జారిన కుంతి కర్ణుణ్ణికని ఎన్ని అవస్థలు పడిందో మనకు తెలిసిన విషయమే. ఇలాంటి సందర్భాలు పురాణాలలో చెప్పుకుంటూ పోవచ్చు.

పడమట క్రుంకిన పొద్దు తూర్పున లేవదా అల్పాక్షరాలలో అనల్పార్థ రచనకు మరో చక్కని ఉదాహరణమిది. కేవలం వాచ్యార్థమే రమణీయంగా ఉంది. సూచ్యార్థం పరమ రమణీయంగా ఉంటే అది రసవత్కావ్యం కాక మరేమవుతుంది. ప్రకృతిలోని సూర్యుని దినచర్యను చూచిన వారికి తూర్పున ఉదయించడం, మళ్ళీ పడమట అస్తమించడం, మళ్ళీ ఉదయించడం నిరంతరంగా సాగిపోతూ కనిపిస్తాయి. లోక వ్యాపారమూ అంతే. మనం ఉన్నాలేకున్నా అదిసాగిపోతూనే ఉంటుంది. ఉదయాస్తమయాలంటాము గాని అస్తమయోదయాలనం. కాని పై సామెతలో మొదట పొద్దు క్రుంకడాన్ని చెప్పి తర్వాత ఉదయం వస్తుందనడంలో విశేషార్థం స్ఫురిస్తున్నది. మానవునికి మొదట జన్మ తర్వాత మరణం. కాని జీవితాన్ని చవిచూచిన తాత్వికులకు మొదట మరణం, తర్వాత జన్మ. భారతీయ సమాజంలో మానవుని చావుపుట్టుకలు నిరంతరంగా సాగుతుండే వ్యాపారాలని గట్టి నమ్మకం ఉంది. చనిపోయే ప్రతివాడూ మళ్ళీ జీర్ణవస్త్రాన్ని తీసివేసి మరో వస్త్రాన్ని ధరించినట్లు ఇంకో దేహాన్ని పొందుతాడని మన నమ్మకం. 'పడమట క్రుంకిన పొద్దు తూర్పున లేవదా' అనడంలో తాత్విక దృక్పథం కనిపిస్తున్నది. ఈ వాక్యంలో మరో అర్థంకూడా స్ఫురిస్తుంది. కష్టసుఖాలు కావడి కుండలనేది మనం జీవితంలో రుచి చూడగల్గిన సత్యం. ఈనాడు కష్టం అనుభవిస్తున్నా రేపు సుఖం లభించగలదనే ఆశే జీవిని నిలబెడ్తుంది. ఈ ఆశావాదమే పై వాక్యంలో ధ్వనిస్తుంది. సూర్యుడు పడమట

క్రుంకుతూ చీకటిని మన మీదికి తోలుతున్నా రేపు మళ్ళీ తూర్పున అరుణ రేఖలు పొడచూపుతాయనే విశ్వాసమే మనకు ధైర్యాన్నిస్తుంది. ఈ విధంగా సామెతలలో రమణీయార్థక ప్రతిపాదక శబ్దాలను మనం చూడవచ్చు.

**సాంస్కృతిక పరమైన విలువ:** సామెతలు సంస్కృతికి ప్రతి రూపాలని చెప్తే అందులో అతిశయోక్తి లేదు. అనుభవాల వేర్ల ద్వారా ప్రపంచజ్ఞానాన్ని గడించి సంస్కృతి అనే లత పూచిన పూవులే సామెతలు. చిక్కనైన చొక్కపు మాటలలో మన సంస్కృతిలోని అనేక ముఖాలను దర్శించేట్లు చేస్తాయి. సామెతలు సంఘానికి, సంస్కృతికి విడదీయరాని సంబంధం ఉంది. సంఘం లేకుంటే సంస్కృతి లేదు. సంస్కృతి లేకుంటే సంఘంలేదు. సంఘంలోని కట్టుబాట్లు, ఆచారాలు, మర్యాదలు, సంప్రదాయాలే సంస్కృతి అనిపించుకుంటాయి. ఒక్కొక్క సామెతకూ సాంస్కృతికమైన విలువ కొద్దిగానో గొప్పగానో ఉండనే ఉంటుంది.

అత్తకు సంబంధించిన సామెతలే ఒకప్రత్యేక విభాగమంతా ఉన్నాయి. ఆంధ్రుల సామాజిక జీవితంలో అత్తకుండే స్థానం ఎలాంటిదని ఈసామెతలు తెలుపుతాయి. మాతృ ప్రధాన కుటుంబంలో అయితే తల్లికి విశిష్ట స్థానం ఉంటుంది. పితృప్రధాన కుటుంబంలో అత్త వారింటికి వెళ్ళిన స్త్రీ ఒక విధమైన మానసిక వేదనకు గురి అవుతుంది. బానిసత్వానికి ప్రతీకగా బ్రతకాల్సిన భారతీయ మహిళ బహుశా తనమానసిక వేదనను కోడలిని పీడించడం ద్వారా తీర్చుకుంటుందేమో. ఇది మనస్తత్వవేత్తలు తీర్చాల్సిన సందేహం. అత్తాకోడళ్ళ సంబంధం మన సంస్కృతికి ఒక నల్లమచ్చ. నేడు పరిస్థితి మెరుగవుతున్నా, సామాన్య మానవుని మనస్సులో అత్తగారి పాత్రకు మసి ఏర్పడిందనడానికి అనేక జానపదగేయాలు, కథలు, సామెతలే సాక్ష్యం. కుటుంబంలో అత్తగారి పాత్రను వ్యక్తం చేసే సామెతలు కొన్ని.

**అత్తకాలం కొన్నాళ్ళు - కోడలికాలం కొన్నాళ్ళు**
**అత్తకు మంచిలేదు, చింతకు పచ్చిలేదు**
**అత్తకు లేక అటికలు నాకుతూ వుంటే అల్లు డొచ్చి దీపావళి పండగన్నాడట**
**అత్త చేసిన పనికి ఆరళ్ళు లేవు**
**అత్తమీద కోపం దుత్తమీద చూపినట్లు**
**అత్తసొమ్ము అల్లుడు దానం చేసినట్లు**
**అత్తవారింటి సుఖం మోచేతి దెబ్బ**

సంబంధ బాంధవ్యాలను తెలిపే సామెతలు కొన్నయితే జీవితంలోని సత్యాలను సూచ్యంగా చెప్పేవి కొన్ని. మానవ జీవితంలో డబ్బుకుండే ప్రాధాన్యం ఇంకదేనికుంది? 'ధనంమూల మిదం జగత్' అన్నారు కదా! ప్రాచీన మానవ సమాజంలో సమిష్టికృషికి ప్రాధాన్యమేగాని డబ్బుకిలేదు. ఎస్కిమోలవంటి ఆదిమ జాతులకు డబ్బులు దాచి పెట్టుకోవడం అంటే ఏమిటో, డబ్బులు దాచుకోవడానికి ఎంత స్వార్థానికైనా పాల్పడటమంటే ఏమిటో తెలియదు. డబ్బుతో బాటే స్వార్థం, పిసినారితనం అన్నీ వస్తాయి. దీన్ని ఎంతో చక్కగా చెప్పే సామెత ఎన్నడూ దొరకనమ్మకు ఏగాని దొరికితే ఏడుముళ్ళు వేసిందట'అన్నది.

మనుషుల్లోని ఒక్కొక్కగుణాన్ని, సమాజంలోని ఒక్కొక్కముఖాన్ని, కుటుంబంలోని బాంధవ్యాలను, వృత్తులను, విద్యలను, అలంకరణాలను, ఆహార విధానాలను ఈ సామెతలు చెప్తాయి. 'పాడి ఆవును దానం చేసి పాలు తాను పితుక్కునే' ఆ సామీని గురించి చెప్తుందొక సామెత. 'పాడిగుట్టు పంటరట్టు' అని ఈ రెండు ముఖ్యవృత్తుల తారతమ్యాన్ని నాలుగే నాలుగక్షరాలలో అద్భుతంగా చెప్తుంది. మరో సామెత, పాడిలో అనుభవం కలవారు 'పాడి పసరం పసిబిడ్డ ఒకటి' అంటారు మన సమాజంలో మనుషుల స్వభావాలు ఏ విధంగా ఉంటాయంటే 'పెట్టిన పెళ్ళి గోరు, పెట్టుకున్న కాపు గోరు'.

మన సంస్కృతిలో ఏమిటి, ప్రపంచంలోనే సాంస్కృతిక అధ్యయనంలో వివాహానికి అత్యంత ప్రాధాన్యం ఉంది. జీవితంలోని ప్రముఖ సంఘటనల్లో పెళ్ళి ఒకటి. శుభకార్యంగా పెళ్ళిని గురించి చెప్పడమే కాక. సామెతలు దాంపత్యంలోని ఎదుగుబొదుగుల్ని కూడా అనుభవ పూర్వకంగా చేస్తాయి. 'పెళ్ళాం బెల్లం తల్లి దయ్యం' అని భావించే వాళ్ళను చూచే ఈ సామెత పుట్టింది. మన సమాజంలో పెళ్ళి కొందరి పాలిట వరమైతే మరికొందరికి శాపం. కూడబెట్టిన నాలుగుకాసులు పెళ్ళికి కరిగి పోగా జీవితమంతా విలపించే తండ్రులెంతమందో! అందుకే అన్నారు "పెళ్ళి అయిన ఇంట్లో ఆరు నెలలు కరువు". అని ఈనాడు ఒక విధమైన ఖర్చులైతే కొన్ని దశాబ్దాల ముందు మరో విధమైన ఖర్చులుండేవి. స్నేహితులు, పేరంటాండ్రు, బంధువర్గం నిండుగా ఉంటేనే పెళ్ళిఇంటికి కళ. అది ఒక్కొక్కప్పుడు మితిమీరుతుంది. "పెళ్ళికి చేసిన పప్పు, పేరంటాండ్రు చవిచూడను సరిపోయింది" పెళ్ళి శుభకార్యమైతే, పిల్లి అశుభానికి గుర్తుగా మన సమాజం భావిస్తుంది. "పెళ్ళికి పోతూ పిల్లిని చంకను పెట్టుకొని పోయినట్లు" అన్న సామెతను వేరువేరు సందర్భాలలో

ఉపయోగించవచ్చు.

నానాటికి సంఘంలో కనిపించే మార్పులను, సంఘంలోని వ్యక్తుల సంపర్కంవల్ల కలిగే వివిధ అనుభవాలను జానపదులు సామెతల రూపంలో ఎంత చక్కగా వ్యక్తం చేస్తారో చూస్తే ఆశ్చర్యం కలుగుతుంది. ఇవి ఏ సందర్భంలో వెలువడినా అనేక సందర్భాలలో వాడడానికి అనువుగా ఉండడం వీటి ప్రత్యేకత. కొత్త నీరు వచ్చి పాతనీరు కొట్టుకొని పోయినట్లు యంత్రాలు వచ్చి అనేకులకు పని లేకుండా పోయింది. దీన్ని తెలపడానికి పుట్టిన సామెత కాకున్నా ఇలాంటి సందర్భంలో వాడదగిన సామెత "మేకలే మడకలు దున్నితే ఎద్దులు ఎవరికి కావాల? అన్నది. ఈ విధంగా సామెతలు చెప్పని విషయం లేదు అందుకే వాటికి సంఘంలో విశిష్టమైన స్థానం ఉంది.



## ఇరుగు పొరుగు సామెతలు

సామెతలు చాలా చిన్నవి కాబట్టి ఎక్కడి నుంచి ఎక్కడికి ప్రయాణం చేశాయన్నది చెప్పడం కష్టసాధ్యం. సోదర భాషల్లో ఉండే సమానార్థకాలైన సామెతల విషయంలో ఇది ఇంకా నిజం అనవచ్చు. ఇరుగుపొరుగు భాషల్లో సమానార్థకాలైన సామెతలు వందలు, వేలు ఉంటాయి. పంచతంత్ర కథలు, ఈసపు నీతి కథలు మొదలైన పరభాషా సాహిత్యాల నుంచి కూడా కొన్ని సామెతలు ఉద్భవించాయి. చాలా దగ్గరి సంబంధం ఉండే తెలుగు, కన్నడం, తమిళం మొదలైన భాషల్లో అయితే ఇలాంటి సామెతలు సమానార్థకాలుగా దాదాపు ముక్కాలు భాగం ఉంటాయనవచ్చు. అన్ని రకాల సామెతల్లోనూ ఇటువంటివి ఉంటాయి. దక్షిణ భారతీయ భాషల్లోని ఇటువంటి సామెతల్ని దక్షిణ భారతీయ పుస్తక సంస్థవారు ప్రచురించారు. ఇదే పుస్తకాన్ని కన్నడం, తమిళం మొదలైన దక్షిణ దేశ భాషల్లోనూ ప్రచురించి ఈ సంస్థవారు మహోపకారం చేశారు. కన్నడం-తెలుగు సామెతల్ని డా॥జి.ఎన్. మోహన్ ప్రచురించారు. అయితే ఇలాంటి పని చేసేటప్పుడు ఒక విషయం గమనించాలి. ఒక భాషలోని సామెతల్ని మరో భాషలోకి కేవలం అనువాదం చేసి చూపించడం సరికాదు. అచ్చంగా అదే భాషలోకి కేవలం అనువాదం చేసి చూపించడం సరికాదు. అచ్చంగా అదే భాషలో ప్రచారంలో ఉండే సామెతల్ని, కొంత అర్థభేదం ఉన్నాసరే అట్లే ఇవ్వవలసి ఉంటుంది. అప్పుడే ఆయా భాషల ప్రత్యేకత, నుడికారపు సొంపు తెలిసివస్తుంది.

"రాత్రంతా రామాయణం విని రాముడికి సీతేమవుతుందని అడిగినట్లు" అని తెలుగు సామెత, కన్నడంలో 'బెళగానే రామాయణ కేళి బెళగ్గె రామనిగె సీతేనాగ బేకంద్వాగె' అని సామెత (పొద్దుటదాకా రామాయణంవిని పొద్దున్నే రాముడికి సీతేం కావాలన్నట్లు). రెండు సామెతల అర్థం ఒక్కటే 'అయినా' చెప్పే విధానంలో కొంత మార్పువుంది. 'పనిలేని మంగలి పిల్లితల గొరిగాడు' అని తెలుగు సామెత (ఇది పిల్లతల గొరిగాడని ఉండాలేమో అనిపిస్తుంది) కన్నడంలో సామెత "కెలన నిల్లద మురవ హెండతి బోళిసిద" (పనిలేని మంగలి పెళ్ళాం తల గొరిగాడు). తెలుగు సామెతలో బెల్లం చుట్టూ చీమలు చేరితే కన్నడం సామెతలో బెల్లం చుట్టూ ఈగలు ముసురుతాయి. (బెల్లక్కెనాణముత్తిదహాగె) కొన్ని సామెతలు పూర్తిగా సమానార్థకాలుగా ఉంటాయి. "నివురు గప్పిన నిప్పులాగా" అని తెలుగు వాళ్ళంటే "బూది ముచ్చిద కెండద హాగె" అని కన్నడిగులంటారు.

సామెతల పరిశీలన విషయం ఎట్లున్నా, ప్రతిభాషలోను వీటి సేకరణ విస్తృతంగా జరగాల్సి వుంది. జానపద సాహిత్య ప్రక్రియల్లో చాలా త్వరగా పుట్టి, త్వరగా నశించి పోయే వాటిలో సామెతల్ని ముందు చెప్పుకోవాలి. దీనికి కారణం స్పష్టమే. అనుభవమున్న ప్రతివాడూ సందర్భానికి తగ్గట్లుగా, ఏదో ఒకమాట అంటాడు. అది గట్టిదైతే అలాగే ఆ నోట ఆ నోట ప్రచారమై చివరికి సామెతగా స్థిరపడుతుంది. ఇది మనం చెప్పినంత నిదానంగా జరగదు. కొన్ని దినాలలోనే సామెత రూపకల్పన జరుగవచ్చు. అయితే దానికి తగిన నేపథ్యం లేకపోతే మళ్ళీ అది మరుగున పడిపోవచ్చు. ఉదాహరణకు కొన్ని సామెతలు ప్రజాన్యాయ స్థానాలలో శక్తివంతంగా ఉపయోగపడతాయి. ఈ నాటికీ ఆఫ్రికా ఖండంలోని కొన్ని ప్రదేశాలలో సామెతల సహాయంతోనే తీర్పు చెప్పే పద్ధతి ఉంది. అయితే ప్రభుత్వ న్యాయస్థానాల పరిధిలోకి ఇటువంటి ప్రదేశాలు వస్తే అక్కడి

సామెతలలో చాలా వరకు వాడుకనుంచి తప్పిపోతాయి. అట్లే నాగరికత వికాసం చెందేకొద్దీ ప్రాచీన సంస్కృతికి సంబంధించిన అనేక ఆచారాలు, సంప్రదాయాలు నశించి వాటితోపాటే, సామెతలను కూడా తీసుకుపోతాయి. ఈ విధంగా కొన్ని సంవత్సరాలలోనే వందలకొద్దీ సామెతలు వాడుక తప్పిపోతాయి. ఈ కారణాలవల్ల ఆంధ్రుల సామెతలను సేకరించి భద్రపరచవలసిన అవసరం ఎంతయినా ఉంది. కొత్తగా సామెతల పేరుతో వాక్యాలను సృష్టించే పనికి పూనుకోకుండా, ఇంకా నాశనమవకుండా జనుల నోళ్ళలో మిగిలివున్న సామెతల్ని మాత్రమే సేకరించి భద్రపరచవలసిన అవసరాన్ని కూడా గుర్తించాలి.



ఆర్.వి.యస్. సుందరం


Manasa Sangeeth Music

**Best Wishes From**

**Manasa Sangeetha School**

*Carnatic, Semi-Classical music lessons*
*At my home in Plainsboro*
*Students training offered in*
*Laltha Sageetham and Film Music to prepare for public Singing*
*And stage performing*

Girija Kolluri
kolluri03@gmail.com
6097996303



# జానపదగేయాలు – మానవ జీవిత ప్రతిబింబాలు

డా॥ ముక్తేవి భారతి

జానపదులు అంటే పల్లెటూరి వారనే అర్థమే సుస్థిరమైంది. జానపదగేయాలు పల్లెపాటలని, పల్లెటూరి వారు పాడే పాటలని ప్రచారానికొచ్చాయి. ఇవి మౌఖిక ప్రచారం ద్వారా ప్రసిద్ధమయ్యాయి. ఇవి ప్రయత్న పూర్వకంగా వెలువడేవి కావు. ఒక నోటినుండి అప్పటికప్పుడు బయటపడి వాటంతటవే రూపుదిద్దుకున్నవి. మనసులో పుట్టిన భావానికి అక్షరమద్ది, కవితామయంగా భావుకుడై కవి పాటగా సృష్టిస్తే, అదే భావం మనసుకి తోచింది తోచినట్టుగా నోటి నుంచి వెలార్చిన జానపదుని పాట సృష్టి అద్భుతమైందే. జానపద గేయం ఎలా వుంటుందో తెలుసుకుంటే, ఆ గేయ రసాస్వాదనలో పరవశింపక తప్పదు.

"చెట్టుమీదనే మాగవండిన సీతాఫలము రుచిని, గ్రీష్మతపమునకెండి బీటలు వారిన పుడమితల్లి తొలకరినాడు జలదరించునప్పటి సువాసనను కొండకోనలందు పుట్టి ఎత్తులెక్కి పల్లములు పారి పల్లెటూళ్ళ ప్రక్కప్రక్కగా గలగల పరుగులెత్తెడు సెలయేటి నాదమును, నడియెడారిలో పలపలమని విరిసెడి పండు వెన్నెల చలువను – ఇన్ని నోకచో జేర్చిన జానపద గేయమగును" – జానపదగేయం ఎంతమధురంగా వుంటుందో, ఎంత సహజంగా వుంటుందో చెప్పడానికి ఇంతకుమించిన నిర్వచనం మరొకటుండదు. (జానపదసాహిత్య పరిశోధకులు, "త్రివేణి" ఆంధ్రదేశ జానపద గేయముల సంపాదకులు, ఆచార్య బిరుదరాజు రామరాజుగారు)

జానపద గేయాలు ఎవరు రాసారూ అనే ప్రశ్నకి సమాధానమే ఉండదు. అవి అజ్ఞాత కర్తృకాలు, అంతేకాక, ఏకాలంలో ఏ సమయంలో రాసారోకూడా తెలియదు. కారణం మౌఖిక ప్రచారమే! జనంలో వున్న అంశమే వాటి వస్తువు, ఆయాసందర్భాలలో ఒకవ్యక్తి యొక్క భావావేశం, భావోద్రేకం, భావుకత ఇలా అన్నిటివల్ల ఆసువుగా వెలువడినవే. జానపదగేయాల్లో మానవజీవితం ఎన్ని కోణాలలోనో ఆవిష్కృతమయింది.

మనపండుగలు, పెళ్ళిళ్ళు, వినోదాలు, వేడుకలు, నమ్మకాలు మాత్రమేకాక మానవ జీవితంలోని సుఖదు:ఖాలు మొదలైనవన్నీ జానపదగేయ అవతారాలెత్తాయి. ఇవి మానవజీవిత ప్రతిబింబాలు జానపదగేయాలను సేకరించి, జానపదుల నోటినుంచే పాడించి భద్రపరుచుకోటం, ఒక నిధిని కాపాడుకోవటం లాంటిదే!

జానపదగేయాల్లో ఎన్నో విభజనలున్నాయి. పిల్లలపాటలు, వేడుకపాటలు, స్త్రీలపాటలు, శ్రామికులపాటలు, వలపు పాటలు, హాస్యపుపాటలు, కన్నీటిపాటలు, పారమార్థికగేయాలు ఇవి అన్నీ జానపద గేయ సాహిత్యంలో ప్రత్యేక స్థానాన్ని పొందినవే.

వేడుకపాటలు, స్త్రీల పాటలు పరిశీలిస్తే, సామాన్యమైన అంశాలెన్నో కనిపిస్తాయి. ఈ రెండు విధాల పాటల్లోనూ ప్రధానభూమిక గృహమే – కుటుంబమే. పెళ్ళిలో ముఖ్యాంశాలు నలుగు పెట్టడం, తలంబ్రాలు, హారతి, పెళ్ళికొడుకు అలక, వదినా మరదళ్ళు, అత్తాకోడళ్ళు, కట్నాలు, ఇలా ఎన్నెన్నో మన జీవిత



ప్రస్థానంలో కలసిపోయిన విశేషాలే. ఈ పాటలో జానపదులు ఏదోవంకతో దేవుళ్ళని స్తుతిస్తారు, ప్రస్తావిస్తారు. రాముడు, సీత, విష్ణుమూర్తి, శివుడు, వేంకటేశ్వరుడు, గౌరిదేవి, మొదలైనవారెందరో. వేడుకపాటల్లో పెళ్ళితంతు ఎక్కువగా వినిపిస్తుంది. పెళ్ళి కొడుక్కి నలుగు పెట్టడం వివాహ విధిలో ముఖ్యమైంది. పెళ్ళికొడుకుని వేణుగోపాలునిగా భావిస్తూ, ముత్తైదువలు నలుగుపెడుతూ పాటపాడుతారు.

**'నలుగూకు రావయ్య నాదవినోదా**
**వేగమే రావయ్య వేణుగోపాలా**
**సూరి గన్నేరిపూలు సూసకముకట్టించి**
**సుందరుడనాచేత సూసక మందుకో, –**
**(సుసకము అంటే పూలతో అల్లి శిరసుకి పెట్టే అలంకరణ)**
**సిరిచందనపు చెక్కగందము తీయించి**
**కాముడా నాచేత గందము అందుకో**
**నలుగూకు రావయ్య నాదవినోదా' –**

అలాగే పెండ్లికూతురుకి నలుగుపెడుతూ పాటపాడారు జానపదులు.

**'వనజాక్షి వేగరావే వనితరో నలుగుకిపుడు**
**గజ్జెలందియలును గల్లుగల్లున మోయగను**
**వయ్యారి నడపులతో వెలదిరో నలుగుకిపుడు"**

పెళ్ళికొడుక్కి బాసికం కట్టడం ఆచారం

**కూరిమితో రాముణ్ణి కూర్చుండబెట్టి**
**చెందురుని బాసిలిగం కట్టనేళాయే'–**

జానపదులు వివాహవేడుకలన్నీ ముచ్చటగా చెప్తారు. వధూవరులు తలంబ్రాలు పోసుకోటం పెళ్ళిలో గొప్పవేడుక. అయితే, సీతారాముల కళ్యాణంలో కూడా తలంబ్రాల శ్లోకం ఎంత అందమైందో అందరికీ తెలుసు.

**"జానక్యా: కమలాంజలిపుటే యాపద్మరాగయితా**
**న్యస్తామన్తక రాఘవేంద్ర విలనత్కుందీ ప్రసూనాయితే...**

ఈ శ్లోకంలో సీతారాములు తలంబ్రాలు పోసుకుంటుంటే, అవి పద్మరాగ మణులలాగ, మల్లెపూలలాగ ఎలాఎలా మారాయో చెప్పే గొప్పశ్లోకం. జానపదులు వధూవరులు తలంబ్రాలు పోసుకునే వేళ పేరంటాండ్రు పాడేపాట ప్రత్యేకత దానిదే.॥

పూలపాట ఇది.

**"రావిన్న మల్లెలు రాసి వడబోసి**
**మంచి మల్లెలురాసి తట్టెలోబోసి**
**ఆ తట్ట తీసుకుబండిపై పెట్టి**
**దొరలుండె తావుకి తరలెనాబండి.**

ఆబండిలో తుమ్మగన్నెరు పూలున్నాయి. ఆకు గన్నెపూలున్నాయి. ఇలాచెప్పి. "తలవంచి నరసింహతాళిబొట్టు కట్టె, తలవంచి నరసింహ తలబాలునోసె"–

ఇలాహారతిపాటలు, ఊరేగింపుపాటలు, కాముని పున్నయపాటలు, జాజరపాటలు చాలా వేడుకపాటలుగా వున్నాయి. జానపదులు సరదాగా ఉత్సాహంగా వేడుకలు జరుపుకుంటూ పాటలు పాడుకోటం చాలా సామాన్యంగా కనిపిస్తుంది.

జానపదగేయ విభాగంలోనే స్త్రీలపాటలు అనేవిభాగంవుంది – ఇక్కడ స్త్రీలు వారి మనోభావాల్ని వెనుకాడకుండా చెప్పేస్తారు. అత్త, కోడలు, ఆడబిడ్డల గురించి చెప్పుకునే అంశాలు స్త్రీలందరిజీవితాలలోను వున్నవే. ఆ స్త్రీల పాటలు ఎంతో ఆత్మీయంగా కనిపిస్తాయి అందుకే పురిటిల్లు, విసుర్రాయి, మేనరికపు పెళ్ళిళ్ళు, పుట్టింటి గొప్పలు – ఇలాస్త్రీల జీవితాలకి సంబంధించిన అంశాలన్నీ గేయరూపాన్ని పొందిన జీవిత ప్రతిబింబాలే!!

ఒకనాడు తెలుగిళ్ళలో పురుడయితే, పురిటిస్నానానికి ఇరుగు పొరుగు
వాళ్ళు వేడినీళ్ళ బిందెలపై పసుపు ముద్దవుంచి, ఆనీళ్ళలో వేపాకు వేసి, పురిటింటికి తెచ్చేవారు. సమాజంలో ఒకరికొకరు సహకారం, సహాయం ఎంతో ఆనందాన్నిస్తాయి. ఇదే విషయం ఎంత అందంగా చెప్పారో జానపదులు!!

ఇది పురిటిపాట

**పుణ్యశాలి చెల్లెమ్మ తుమ్మితీలా**
**పురుడని చాటింది తమ్మితీలా**
**ఇంటికీ కడివెడు నీళ్ళని చాటండి**
**గడపకీ కడివెడు నీళ్ళని చాటండి**
**ఉల్లితోటలు దాటి**
**ఊళ్ళన్ని చాటేరు ....**

ఆనాడు నుంచి నేటిదాకా అత్తాకోడళ్ళు సఖ్యంగా వుండరనే మాట సమాజంలో ఎందుకో స్థిరపడిపోయింది. అత్తా కోడళ్ళ తగవులు, తల్లి భార్యమధ్య తగవులు తీర్చలేక సతమతమయే మగవాడు – ఇదంతా కుటుంబ వ్యవస్థలో చూస్తున్నదే. జానపదులు విసురు రాలె పాటలుగా ఈ విషయాలు చెప్తారు.

**అత్తింటి కోళ్ళెమ్మ వుత్తమ్మరాలు**
**చేట జొన్నలు పోసి చెడనిద్రపోయె**
**కొన్ని జొన్నలు తిన్నె కోళ్ళి కనుకొన్నె**
**అన్ని జొన్నలు తిన్నె అత్త కనుగొన్నె**
**కొళ్ళిరో, వోకొళ్ళి కోడుకు పెండ్లామా**
**నీవు నీమగడు వేరుండవలెను –**

ఇక్కడితో ఆగదిది. ఆ కోడలు కోదుక్కెళ్ళి చేప్తుంది, అత్త తనని వేరుండ మందని. అది ఆ కోడలికిష్టమే – మరి కొడుక్కి ఇష్టమా? నీ కోడల్ని ఏమన్నావు అన్నాడు. అత్త ఏమందీ – కొట్టలేదు, తిట్టలేదు, కోప్పడలేదు– అరుగుదాటద్దంది, తోడువేసిన పాలు తాగద్దంది, నలుగురిలో పళ్ళు కనపడేలా నవ్వద్దంది – అంతే?

కోడలు మనసులో బాధని చెప్పుకుంటుంటే, ఎంతో కరుణరసాత్మకంగా వుంటుంది. అత్త పెట్టిన ఆరళ్ళవలన, భరించలేక అడవిలో మానుగావాలని, చెట్టునైతే నరికి వేసేవారుకదా, పండునైతే పక్షులారగించేవికదా! పాలుపిండే బంగారు చెంబులో ధారనైనా కాకపోతిని, కవ్వపు కొయ్యనైనా కాకపోతిని అని విలపించింది కోడలు. ఆ ఆవేదనని ఆ జానపదులు, కోడలి మనసుని ఎంతబాగా అర్థం చేసుకున్నారో!

ఆడపిల్లంటే ఇంట్లో అందరికీ ప్రేమ. కాని ఆడపిల్లపెళ్ళి చేయటం చాలా కష్టం. అమ్మాయి సుఖాన్ని, సౌభాగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని సంబంధంవెతకాలి. ఆ సందర్భంగా అమ్మాయి మనసు విప్పి మాట్లాడుతుంది.

**'సామలదేశానికి నన్నియ్యబోకవ్వ**
**నేను తినలేను సామల బువ్వ**
**వడ్లు పండేదేశానికి నన్నియ్యబోకవ్వ**
**నేను దంచలేను ఆవడ్లన్నీ**
**కొఱ్ఱల దేశానికి నన్నియ్యబోకవ్వ**
**నేను తినలేను కోఱ్ఱాలబువ్వ**

ఈకూతురు తోడికోడళ్ళున్న ఇంటికి, బావలు మరుదులు వున్న ఇంటికి, వెళ్ళనంటుంది. ఇలా చెప్పి ఏ సంబంధమూ కుదుర్చుకోదు॥

ఇలాంటివే ఎన్నోస్త్రీలపాటలు జానపదగేయాలుగా చాలా ప్రచారం పొందాయి. జానపదగేయాలు ఒక ప్రాంతానికి చెందినవే కాదు. ఈపాటలు సేకరించి భద్రపరుస్తున్న వారికి అందరం కృతజ్ఞతలు చెప్పాలి.

ఈ వ్యాసరచనకు తోడ్పడిన "త్రివేణి" ఆంధ్రదేశ జానపదగేయములు అనే సంకలనానికి సంపాదకత్వం వహించిన వారందరికీ ముఖ్యంగా బిరుదరాజు. రామరాజుగారికి (తెలుగుజానపదగేయసాహిత్యము) కృతజ్ఞతా పూర్వక వందనాలు సమర్పిస్తున్నాను. జానపదగేయాల్లోని ఆత్మీయత మనల్ని పలకరించి పరవశింప చేస్తుందనేది అక్షరసత్యం!!.




**డా॥ ముక్తేవి భారతి**

**ఉస్మానియా యూనివర్సిటీలో ఎం.ఎ, పి.హెచ్‌డి చేసారు. ఆర్.బి.వి.ఆర్. ఆర్ మహిళా కళశాల, హైద్రాబాద్‌లో 30 సంవత్సరాలు అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. ఆరు సంపుటాలు కథలు, ఎనిమిది సాంఘీక నవలలు, ఎనిమిది పౌరాణిక నవలలు, చిలకమర్తి వారిమీద నాలుగు పరిశోధనా గ్రంథాలు, అనేక వ్యాసాలు, ఇల్లిందల సరస్వతీదేవి, ఊటుకూరి లక్ష్మి కాంతమ్మ వంటి ప్రముఖ మహిళల జీవిత చరిత్రలు రాసారు. పదమూడు పురస్కారాలు అందుకున్నారు. 2014లో "వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా" డా॥ ముక్తేవి భారతి గారికి "జీవిత సాఫల్య పురస్కారం" ఇచ్చి సన్మానించారు.**


INVITATION
UNITED AMERICAN TELEGU CONVENTION
(UATC)
Philadelphia, PA
JULY 6-8, 2018
Cordially invites all families
to attend Mega Convention
organized by 3 major
USA Telugu Organizations
NORTH AMERICAN TELUGU ASSOCIATION
NATA
Welcome
INFORMATION
Please join us.
Convention at,
Pennsylvania Convention Center, 1101
Arch Street Philadelphia, PA 19107
www.UATC2018.org


UTSAV
BY RAJANI
WE SPECIALIZE IN :
* WEDDINGS * ENGAGEMENTS * ANNIVERASARIES
* ARANGETRAMS * RANGAPRAVESAMS * DANCE SHOWS
* GRADUATIONS * SWEET 16 PARTIES * BRIDAL SHOWERS
* BABY SHOWERS * BIRTHDAY PARTIES * AND MORE
FOR ALL YOUR EVENTS NEEDS
CONTACT RAJANI 732 397 2400
HTTPS://M.FACEBOOK.COM/UTSAVBYRAJANI/

# జానపదం - జ్ఞానపథం



## డా॥ ద్వాదశి నాగేశ్వర శాస్త్రి

తెలుగులో విమర్శనాత్మక సాహిత్యం కొరవడిన సమయంలో ఆయన తన కలాన్ని ఝుళిపించినవాడు. నాలుగున్నర దశాబ్దాలుగా ఎత్తిన కలం దించకుండా విమర్శనారంగంలో నిరంతరకృషిచేస్తున్నవారు. ఆయన వ్యాసాలు రచయితల హృదయావిష్కరణకు అద్దంపడుతాయి. ప్రాచ్యలక్షణ పరిజ్ఞానాన్ని, పాశ్చాత్య వివేచనాన్ని సమన్వయిస్తూ ఆధునిక పాఠకులకు అవలీలగా అర్థమయ్యే రీతిలో వివరించడంలో ఆయనది అనుభవమున్న కలం. వస్తు వైవిధ్యం, సామాజిక స్పృహ, స్పష్టత నిండిన కవిత్వాన్ని అందించడంలో ఆయనది అనుభవమున్న కలం, వస్తు వైవిధ్యం, సామాజిక స్పృహ, స్పష్టత నిండిన కవిత్వాన్ని అందించడంలో ఆయనకు ఆయనే సాటి. శతాధిక రచనలు, అంతకుమించిన పురస్కారాలు అందుకున్న సాహితీ సవ్యసాచి ద్వాదశి నాగేశ్వరశాస్త్రి.

"ఆంధ్రుల నిజమైన సంస్కృతిని అర్థం చేసుకోవాలంటే జానపద విజ్ఞానమే ఎక్కువ సహాయకరం. ఆంధ్రుల జానపద విజ్ఞానస్వరూపాన్ని అర్థం చేసుకొని విశ్లేషించిననాడు "ఆంధ్రత్వం" అంటే ఏమిటో తెలుస్తుంది. తెలుగుదనం అన్నది ప్రత్యేకంగా అసలు వున్నదా? అన్న విషయం తెలుస్తుంది." అన్న ఆచార్య ఆర్.వి.ఎస్. సుందరంమాటలు సత్యసన్నిహితాలు. జానపద వాఙ్మయం లిఖిత సాహిత్యంకాదు. మౌఖికమైనది. అనాదిగా జానపదుల నోళ్ళల్లో, రోళ్ళల్లో, రోకళ్లల్లో, బడిలో, మడిలో సజీవంగా ఉన్నది. జానపదులు అంటే గ్రామీణులు, నిరక్షరాస్యులు అనే భావన వుంది. అది ఒకప్పటి సంగతి. కానీ ఇవాళ జనసముదాయం' అనే అర్థంవుంది. ఒక తరంనుంచి మరొక తరానికి సంక్రమించేది జానపద సాహిత్యం జానపద విజ్ఞానం ప్రధానంగా నాలుగు భాగాలు -



జానపదసాహిత్యం (గేయాలు, కథలు, సామెతలు, పొడుపు కథలు మొ॥)

సాంఘిక ఆచారాలు (పండగలు, ఆటలు, నమ్మకాలు మొ॥)

వస్తు సంస్కృతి (చిత్ర, వాస్తు కళలు, దుస్తులు, అలంకరణలు మొ॥)

జానపదకళలు (తోలుబొమ్మలాట, పగటివేషం, కోలాటం మొ॥)

జానపద సాహిత్యం ఎప్పుడు, ఎక్కడ, ఎలా పుట్టిందో చెప్పలేం. జానపదసాహిత్యం దాదాపుగా అజ్ఞాత కర్తృత్వంగలది లేదా సామూహిక కర్తృత్వం గలది. ప్రాచీన మానవుడు సంఘజీవిగా నిరూపించేది జానపదం. ఒకనాటి సామాజిక చరిత్రను, ఆచారాలను, వేడుకలను, అచ్చమైన తెలుగు నుడికారాన్ని నిసర్గ సంగీతాన్ని భద్రవరుస్తూ వస్తోంది జానపదం. ప్రజల లోకజ్ఞతను, మనోవికాసానికి, మానవసంబంధాలకు తోడ్పడేది జానపదం. అందుకేదీనిని "జ్ఞానపథం" అన్నారు.

జానపద సాహిత్యంలో కవిత్వానిదే అగ్రస్థానం. జానపద కవిత్వాన్ని గేయం, కథాగేయం అని రెండు రకాలుగా వర్గీకరిస్తారు. జానపదగేయాల్లో కథ వుండదు. వీటిలో పిల్లలపాటలు, వేడుక పాటలు, స్త్రీలపాటలు, శ్రామిక గేయాలు, వలపు పాటలు, తాత్త్వికగేయాలు మొదలైన భేదాలున్నాయి.

" చందమామరావె - జాబిల్లిరావె
కొండెక్కిరావె - కోటిపూలుతేవె
బండెక్కిరావె - బంతిపూలుతేవె
తేరెక్కిరావె - తేనెపట్టుతేవె"
(రథం)

అంటూ పూర్వం తల్లులు పాటపడుతూ కడుపార పిల్లలకి బువ్వ పెట్టే అపూర్వ దృశ్యం కనుమరుగైంది. తెలుగు పదాలచమత్కారంతో భాషను నేర్పే పద్ధతి గమనిస్తాం -

**" పిట్టమ్మపిట్ట - ఏమిపిట్ట?**
**చిలుకపిట్ట - ఏమి చిలుక?**
**పచ్చ చిలుక - ఏమిపచ్చ?**
**ఆకుపచ్చ - ఏమి ఆకు?**

.... ఇలా ఊహాత్మకంగా (అంత్యాక్షరిలాగా) సాగేపాటలు మెదడుకి పదునుపెడతాయి. "బావా బావా పన్నీరు - బావను పట్టుకు తన్నేరు" వంటి హాస్యపు పాటలు కూడా పిల్లల పాటలే!

పండగలలో పాడుకొనేవి. లాలిపాటలు, గొబ్బిపాటలు, మంగళహారతి పాటలు, వేవిళ్ళపాటలు, అత్తాకోడళ్ళ పాటలు, పెళ్ళిపాటలు మొదలైనవి స్త్రీలపాటలు అసలుపాటల్లో స్త్రీల పాటలే ఎక్కువ. సంస్కృతీ సంప్రదాయాలకు కేంద్ర బిందువు స్త్రీ కాబట్టి, వాళ్ళకే వేడుకలు ఎక్కువ వుంటాయి కాబట్టి, స్త్రీలు పాటలు పాడటంలో చాలా మంది చతురతగల వారుకాబట్టి స్త్రీలపాటలకి జానపద గేయాల్లో ప్రత్యేక స్థానంవుంది. పెళ్ళిచూపులు ఒక సంప్రదాయంగా ఉండేది. అప్పుడు పుట్టిన పాట ఇది - మగ పెళ్ళివారి ప్రశ్న, ఆడపెళ్ళివారి సమాధానంగా సాగుతుంది.

**"పిలిపించు మాసీత - పిలుపుచూతాము**
**పిలుపేమి చూసేరు - చిలుక పలుకుల్లు**
**పిలిపించు మాసీత - నడకచూతాము**
**నడకేమిచూసేరు - హంస నడకల్లు"**

ఇదే విధంగా శృంగారం, హాస్యం, కరుణ, వీరం మొదలైన వాటికి సంబంధించిన పాటలున్నాయి.

**"గూటిలో చిలికేదిరన్నా, నా అన్నలారా!**
**గూడు చినబోయిన దన్నా"**

వంటి తాత్త్విక పరమైనవీ ఉన్నాయి.

జానపద సాహిత్యంలో కథావిభాగం కల్పనా శక్తికి సంబంధించినది.

ఉన్నవీ లేనివీ కల్పనను జోడించి చెప్పేది. జానపద కథలు. వీటిల్లో పురాణ కథలు, ఐతిహ్యాలు, కల్పితాలు, మూఢనమ్మకాలతో కూడినవి, వినోదకథలు వంటి

భేదాలున్నాయి. ఇంద్ర ధనస్సు ఎందుకు ఏర్పడుతుందో, వానలు ఎందుకు ఎవరు కురిపిస్తారో వంటి అంశాలతో పురాణ కథల్ని మరోరకంగా అన్వయించి చెప్పటం గమనిస్తాం. ఈ గద్య కథనాలలో రెండవది ఐతిహ్యం. స్థల పురాణాలకు, రహస్య నిధులకు సంబంధించినవి ఐతిహ్యాలకి సంబంధించిన కథలు. 'లేపాక్షి' అనే పేరు ఎలా వచ్చిందో కథ చెప్పారు. రాముడు రెక్కలు తెగిన జటాయువు పడిఉండగా చూసి "లే, పక్షి" అన్నాడట. అందుకని 'లేపాక్షి' పేరు వచ్చిందట. ఇలా చాలా ఊళ్ళ పేర్లకి పురాణాల కథలు జోడించి చెప్పటం 'ఐతిహ్యం' అంటారు. ఇక జానపదకథలు అత్యంత ప్రాచీనమైనవి. వీటికి తలా, తోక ఉండవు. విఠలాచార్య జానపద సినిమాలను తలపిస్తాయి. ఏడు నూతుల కథలు, మాయలూ మంత్రతంత్రాల కథలు మొదలైనవి జానపద కథలు. వీటిని తమాషా కథలు, వినోదకథలు అంటారు. అద్భుత కథలు అనీ అంటారు. ఈ కథలు ఎక్కువగా "అనగనగనగా...." అంటూ ప్రారంభమై "కథ కంచికి మనం ఇంటికి" తో ముగిస్తాయి. అందరకూ తెలిసిన "అనగనగనగా ఒక రాజు గారికి ఏడుగురు కొడుకులు. ఆ ఏడుగురూ వేటకెళ్ళారు. ఏడు చేపలు తెచ్చారు. వాటిని ఎండబెట్టారు. అందులో ఒక చేప ఎండలేదు. "చేపాచేపా, ఎందుకు ఎండలేదు?" "గడ్డి మోపు అడ్డు వచ్చింది". "గడ్డిమోపా గడ్డిమోపా, ఎందుకు అడ్డు వచ్చావ్?" "ఆవు నన్ను మేయలేదు" "ఆవా ఆవా ఎందుకు మేయలేదు?" "పిల్లవాడు నన్ను మేపలేదు" "పిల్లవాడా, పిల్లవాడా ఆవును ఎందుకు మేపలేదు?" "నన్ను చీమ కుట్టింది" "చీమా చీమా ఎందుకు కుట్టావ్?" "నా బంగారు పుట్టలో వేలు పెడితే నేను కుట్టనా!" అంది. మొత్తం మీద నిరక్షరాస్యులనుకుంటున్న గ్రామిణులు అద్భుత కల్పనా శక్తిని, లోకజ్ఞతను జోడించి కథలు చెప్పారు. ఈ కథలు సరళంగా వుండటం, కథనకుతూహలం ఉండటం, పునరావృతి, వినోదం అద్భుతాల మేళవింపుతో వేల సంవత్సరాలుగా ప్రజల నోళ్ళల్లో చోటు చేసుకున్నాయి.



సామెతలు, జాతీయాలు కూడా జానపద విజ్ఞానంలో భాగాలే. 'సామ్యత' నుంచి 'సామెత' పుట్టింది. సామ్యత అంటే పోలిక. ఏదైన ఒక సందర్భంలో పోలికతో చెప్పబడేది సామెత. ఇది సాధారణంగా వాక్యరూపంలో వుంటుంది. సామెతలు జీవితానుభవసారాలు. సందేశాత్మకాలు. జన ప్రియత్వం ఉన్నవే నిలిచిఉంటాయి. సామెతలలో పౌరణికాలు, హాస్యాత్మకాలు, మనస్తత్వబోధకాలు, లోకరీతులు, సంస్కృతి పరమైనవి, నమ్మకాలకు సంబంధించినవి మొదలైన విధంగా భేదాలు చూడవచ్చు.

ఉదాహరణకు కొన్ని....

**"ఎక్కడైనా బావ గానీ వంగతోటలోకాదు"**

**"బెల్లం వుందా అంటే అల్లం ఉందన్నట్టు"**

**ఎంత చెట్టుకు అంత గాలి"**

**"పైసా పైసా! ఏంజేస్తావూ అంటే ప్రాణమిత్రుడ్ని పగచేస్తాను అందిట"**

**"తాతా! పెళ్ళాడతావా? అంటే నాకెవరిస్తార్రా అబ్బీ అన్నాట్ట"**

**"ఉల్లిచేసిన మేలు తల్లి అయినా చెయ్యదు"**

**"రామాయణం అంతా విని రాముడికి సీత ఏమవుతుంది అన్నాట్ట.**

**"కయ్యానికైనా వియ్యానికైనా సమఉజ్జీ వుండాలి"**

జాతీయాలను 'పలుకుబడులు' 'నానుడులు' అనీ అంటారు. ఒక జాతికి గల ప్రత్యేకమైన పదబంధాలు జాతీయాలు. ఇవి సామాన్యంగా రెండు మూడు పదాల కలయికగా వుంటాయి. సహజమైన అర్థం కాకుండా – దానితో సంబంధం గల మరొక అర్థంలో జాతీయం వాడబడుతుంది. ఇతర భాషలలోకి యథాతథ అనువాదనికి ఇవి లొంగవు. ఉదాహరణకి "వాడు నన్ను చూస్తే కళ్ళల్లో నిప్పులు పోసుకుంటాడు". "కళ్ళల్లో నిప్పులు పోసుకోవటం" అనేది జాతీయం. నిజంగా నిప్పులు పోసుకోడు. అసూయ, సహించలేకపోవటం, విద్వేషం వంటి అర్థంలో వాడతాం. జాతీయాలలో కూడా పౌరాణికమైనవి, కుటుంబానికి చెందినవి, అవయవాలకు చెందినవి, జంతువులకు సంబంధించినవి, వృక్షాలకు, విశ్వాసాలకు సంబంధించినవి, ప్రకృతికి సంబంధించినవి అనే వర్గీకరణ వుంది. మచ్చుకి కొన్ని:

1. లక్ష్మణరేఖ, ఉడుతాభక్తి, శల్యసారధ్యం, గొంతెమ్మ కోరిక, భస్మాసురహస్తం, ధృవతార
2. గుడ్డిలోమెల్ల, నీళ్ళు నమలటం, కనువిప్పు, తలలోనాలుక.
3. గాలిమనిషి, నేతిబీర, ఎండమావి, అనావృష్టి – అతివృష్టి
4. కొంగజపం, మొసలికన్నీరు, గాడిదచాకిరీ, నత్తనడక, పాముపగ
5. మేడిపండు, కుక్కమూతి పిందెలు, మోడు వారిన, దోసపాదు (సంతానం)
6. పెద్దపీట, శంఖంలో తీర్థం, గంగిరెద్దు, అక్షింతలు, పప్పన్నంపెట్టడం, సంస్కృత సాహిత్య నుంచి తెలుగులోకి – కాకతాళీయం, హస్తిమశ కాంతరం, అసిధారావ్రతం వంటివి వచ్చాయి. ఇదే విధంగా, ఖతర్‌నాక్, ఖరాబు, సలాంగిరి, ఖతమ్ వంటివి

ఉర్దూ నుంచి వచ్చాయి.

జానపదవాఙ్మయంలో పొడుపు కథలు, ప్రత్యేక శాఖగా గుర్తిస్తారు. పొడుచుట, విప్పుట ముఖ్యమైనవి. పొడుచుట అంటే

ప్రశ్నించటం. సమస్యను ప్రశ్నిస్తే దానికి సమాధానం చెప్పటం, విప్పటం అవుతుంది. ఇందులో 'గూఢం' ఎక్కువ. జానపదుల అద్భుత కల్పనా ప్రతిభకు పొడుపుకథలు నిదర్శనాలు. వినోదంతోపాటు మెదడుకి మేతనందిస్తాయి. "తోకలేనిపిట్ట ఆమడలు పరుగెత్తింది" – అదేమిటో చెప్పుకోమంటారు. దీనికి సమాధానం ఉత్తరం (Letter –ఇప్పుడు లేనిది). బాల్యం నుంచే ఇవి అలవాటయితే బుర్ర పదునెక్కుతుంది. ఉదాహరణకి



1. **"వంకర టింకర 'శొ'**
   **వానితమ్ముడు 'అ'**
   **నల్లగుడ్ల 'మి'**
   **నాలుగుకాళ్ళ 'మే' ".**

ఇది పదకల్పనకి సంబంధించిన పొడుపుకథ. సరిగ్గా ఆలోచిస్తే సమాధానం అందులోనే వుంది.

శొ= శొంఠి; అ= అల్లం; మి= మిరియం; మే= మేక ఇవన్నీ ఆరోగ్యాన్నిచ్చేవే.



2. **చెక్కని స్తంభం – చెయ్యని కుండ**
   **పొయ్యని నీళ్ళు – వెయ్యని సున్నం**
   (కొబ్బరికాయ)
3. **పండు పండుకు ముప్పది విత్తులు**
   **పదిహేను విత్తులు నలుపు – పదిహేను విత్తులు తెలుపు**
   (మాసం –నెల)

జానపద కళారూపాలు ప్రజలతో విడదీయరాని సంబంధం గలవి. ఇవి ప్రదర్శింపబడేవి. ఆంధ్ర దేశం జానపద కళలకు పుట్టినిల్లు. దాదాపు 80కి పైగా జానపద కళా రూపాలున్నట్టు పరిశోధకులు వెల్లడించారు. తెలుగు వారి సాహిత్యం, సంస్కృతి, ఆచార్య వ్యవహారాలు ఈ కళా రూపాలలో భద్రపరచబడ్డాయి. కళారూపాలలోని తెలుగు ప్రజలు మాట్లాడుకొనే తెలుగు కావటం గమనార్హం. విశేషం ఏమిటంటే ఈ కళారూపాలు నిరక్షరాస్యులుగా, అట్టడగు వర్గాలుగా మనం భావించే జానపదులు ప్రదర్శించి ప్రజల మన్ననలు పొందటం. అభినయం, సాహిత్యం, సంగీతం అన్నీ



కలగలిపితేనే జానపద కళారూపం అవుతుంది.

తోలు బొమ్మలాట, చిందుయక్షగానం, కోలాటం, గంగిరెద్దుమేళాం, పగటివేషాలు, ఒగ్గుకథ, బతుకమ్మ, కూచిపూడి, భాగవతం, చెక్కభజన, బుర్రకథ, హరికథ మొదలైనవి నేటికీ ప్రజాదరణ పొందుతూనే ఉన్నాయి. సాంఘిక ఆచారాలు, వేడుకలు, కర్మకాండలు, ఆటలు మొదలైనవి కూడా జానపద విజ్ఞానానికి సంబంధించినవే. నేడు కనుమరుగైన దాడి, పులిమేకజూదం, వామన గుంటలు, తొక్కుడుబిళ్ళ, బిళ్ళంగోడు వంటివి జానపదక్రీడలే. పండగలలో వ్రతాలకు అధిక ప్రాధాన్యమిచ్చేది స్త్రీలే. ఇవన్నీ మానసిక ప్రశాంతత కోసం, సుఖసంతోషాల కోసం, ప్రజల సామూహికత్వం కోసం.

**"చెమ్మచెక్క చేరడేసిమొగ్గ**
**అట్లుపోయంగా – ఆరగించంగా"**

వంటి పాటలు ఇవాళ ఎక్కడన్నా కనిపిస్తే నమస్కరించవలసిందే. 'టెక్నాలజీ' లేని రోజుల్లోనే వినోదవిజ్ఞానాలను అందరకూ అందుబాటులోకి తెచ్చిన జానపదులు నిత్యస్మరణీయులు. జానపద విజ్ఞానం ఒక పెన్నిధి.

PATEL BROTHERS®
"Celebrating Our Food....Our Culture"
2800 State Route 27, North Brunswick, NJ 08902
T: 732-821-0667 / 0668 • F: 732-821-7232 • www.patelbros.com

# జానపద సాహిత్యం – కృష్ణుడు

ఈశ్వర: పరమ: కృష్ణ: సచ్చిదానంద విగ్రహ:
అనాదిరాదిర్గోవిన్ద: సర్వకారణ కారకమ్
(బ్రహ్మసంహిత 5.1)

ఆది భగవానుడైన శ్రీకృష్ణుణ్ణి భక్తులు పరమార్థ తత్త్వంగానూ, ప్రభువుగానూ, మిత్రునిగానూ, పుత్రునిగానూ, ప్రేమికుని గానూ భావించి, పూజించి మోక్షప్రాప్తిని పొందారని



భాగవతం ప్రబోధిస్తుంది. జానపదులు కూడా కృష్ణ పరమాత్మను తత్త్వవేత్తగా, అవతారమూర్తిగా, మిత్రునిగా, పుత్రునిగా, ప్రేమికునిగా ఆరాధించినట్లు వారి సాహిత్యం విశదపరుస్తుంది.

జానపదుల సాహిత్యాన్ని పరిశీలించినప్పుడు, వారిలో పురుషులకంటే ఎక్కువగా స్త్రీలే కృష్ణతత్త్వానికి ఆకర్షితులయినట్లు వ్యక్తమవుతుంది. కొన్ని జానపద గేయాలను పురుషులు రచించినను, అవి స్త్రీల నోళ్ళలోనే ఎక్కువగా నానుతున్నాయి. బాలకృష్ణునిగా, శృంగారమూర్తిగా, భక్తసులభునిగా కృష్ణపరమాత్మ జానపద స్త్రీల హృదయాలను ఆకట్టుకున్నాడు. బాలకృష్ణుని అల్లరి చేష్టలు స్త్రీల మాతృమమతలను స్పదింపచేసి, వారి మనస్సులను పరవశింపచేసాయి. అందుకే పల్లె తల్లులు తమ పిల్లలోనే కృష్ణ భగవానుణ్ణి సందర్శించి, తన్మయత్వంతో తనివి తీర పాటలు పాడుకున్నారు. కథలను చెప్పుకున్నారు. జానపద స్త్రీలకు పరమాత్మ, పరలోకం ఎక్కడో ఉండదు. వారికి తమ ఇల్లే వైకుంఠం, తమ పసిపాపలే పరమాత్మ స్వరూపులు, భగవదంశ సంభూతులు, పిల్లలు పుట్టినప్పుడు, ఊయలలూగినప్పుడు, అల్లరి చేసినప్పుడు, పెళ్ళి చేసుకున్నప్పుడు వారిలో తల్లులు పరమాత్మనే దర్శిస్తారు. కృష్ణ భగవానుని పరంగానే పాటలు పాడి వారు భగవంతునిపైన భక్తి భావాన్ని, పిల్లలపైన ప్రేమానురాగాలను ప్రదర్శిస్తారు.

జానపద సాహిత్యంలో కృష్ణుని పాటలను పరిశీలించినప్పుడు, అగ్రవర్ణ స్త్రీల పాటలెక్కువగా భాగవత కథననుసరించి ఉంటాయి, కొన్ని పాటలు మాత్రం మూలానికి భిన్నంగా, మార్పులు, చేర్పులతో ఉంటాయి. భాగవత కథల మాదిరిగానే వీరి కథా గేయాలు కూడా భక్తి, జ్ఞాన, వైరాగ్యబోధకాలు. శ్రీకృష్ణ జననం, కృష్ణ జలక్రీడలు, బృందావన క్రీడలు, గోపికా గీతాలు, భ్రమర గీతాలు, రుక్మిణీదేవి వివాహం, పారిజాత పల్లవి, సత్యభామ అలుకపాట, సవతి సంవాదం, తులసీ దళం, కుచేలోపాఖ్యానం, నామభాగవతం మొదలైనవే కాకుండా శ్రీకృష్ణ భగవానుని విభూతి విశ్వరూపం, గీతార్థసారం వంటి పాటలను కూడా అగ్రవర్ణస్త్రీలు పాడుతుంటారు. శ్రామికవర్గ స్త్రీలు ఎక్కువగా బాలకృష్ణుని అల్లరి చేష్టలను పాటల్లో వర్ణించడమే కాకుండా అతణ్ణి ప్రేమమూర్తిగా, శృంగార పురుషునిగా తమ మనోభావాలకూ, జీవితాలకూ అనుగుణంగా చిత్రించుకున్నారు. భాగవతంలో శ్రీకృష్ణుని రాసక్రీడలను మధురభక్తిగా వర్ణించినా, జానపద శ్రామిక స్త్రీలు మాత్రం కృష్ణుణ్ణి అల్లరి ప్రేమికునిగానే భావించి, తదనుగుణంగానే గేయాలను, కథలను కల్పించుకున్నారు. అగ్రవర్ణ స్త్రీల పాటల్లోని తాత్త్విక, ఆధ్యాత్మిక భావాలు శ్రామికవర్గ స్త్రీల పాటల్లో కన్పించవు. వీరి పాటలెక్కువగా శృంగార రస ప్రధానాలుగానే ఉంటాయి. జానపద కథా గాయకులు మాత్రం కృష్ణ భగవానుణ్ణి మానవాతీత అద్భుత శక్తులు కలిగిన సాహసికునిగా, చతురునిగా, మాయోపాయాలను కల్గిన వానిగా, కీర్తికాంక్షా పరునిగా చిత్రించారు.

**జానపద సాహిత్యంలో కృష్ణ కథా గేయాలు –**

**పరిత్రాణాయ సాధూనాం వినాశాయచ దుష్కృతామ్**
**ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి యుగేయుగే –**

అని భగవద్గీతలో కృష్ణ భగవానుడే చెప్పుకున్నట్లుగా, దుష్టుడైన కంసుణ్ణి, అతని అనుచరులను సంహరించడానికే విష్ణువే యశోదాదేవికి పుత్రునిగా, కృష్ణునిగా జన్మించాడు.

యశోదాదేవియే కృష్ణుని తల్లి కావడానికి గల కారణన్ని జానపదులొక కథను కల్పించి వివరించారు. యశోద చిన్నతనంలో తండ్రితో పుణ్యక్షేత్రాలకు వెళ్ళుతుంది. పుణ్యక్షేత్ర దర్శనానంతరం ఆమెకు తండ్రి భగవత్ప్రసాదంగా మామిడి పండునిస్తాడు. యశోద పండును తాను తినకుండ అక్కడనే చెట్టుకింద తపస్సు చేసుకుంటున్న ముసలి మునికిచ్చి, ఆకలితో ఉన్నట్టున్నావు పండును తిని ఆకలి తీర్చుకొమ్మంటుంది. ముని ఆ బాలిక దాన దయార్ద్ర గుణన్ని మెచ్చుకొని "నీవు సాక్షాత్తు విష్ణుమూర్తికే తల్లివి

అవుతావు" అని ఆశీర్వదిస్తాడు. అతని ఆశీర్వాద ఫలింతంగానే యశోద కృష్ణునికి తల్లి అవుతుంది.

**దాతవ్యమితి యద్దానం దీయతేऽనుపకారిణే**
**దేశే కాలే చ పాత్రేచ తద్దానం సాత్వికం స్మృతమ్**
(భగవద్గీత 17.20)

"ప్రతిఫలాన్ని కోరకుండా, తగిన ప్రదేశంలో, తగిన వ్యక్తి, స్వధర్మమనే దృష్టితో చేసే దానం సాత్త్వికమైంది" అని సాక్షాత్తు శ్రీ కృష్ణభగవానుడే భగవద్గీతలో బోధిస్తాడు. యశోద కూడ ప్రతిఫలేచ్ఛ లేకుండానే తన పండును ముని ఆకలి తీర్చడానికిచ్చింది. ధర్మసూత్రాలనూ, నీతి వాక్యాలనూ వాచ్యంగా బోధిస్తే వినేవారికి ఆసక్తి కల్గదని జానపదులు మనోజ్ఞమైన కల్పనలతో నీతి ధర్మాలను కథనం చేస్తుంటారు. అవి శ్రోతల మనస్సులో ముద్రవేసుకుంటాయి. ఆచరణకు ప్రేరేపిస్తాయి.

రామాయణంలో శబరి, శ్రీరామునికి మధురఫలాల నిచ్చి మోక్షాన్ని పొందితే, జానపదుల కృష్ణుని కథలో పైడికొండ అనే పండ్లవ్వ పండ్లనిచ్చి పరమాత్మలో లీనమవుతుంది. గోవర్ధన పర్వతంపైన పైడికొండ అనే పండ్లవ్వ ఉంటుంది. ఆమె బాలకృష్ణునికి పండ్ల నివ్వాలని, తన బుట్టలో పండ్లను నింపుకుంటుంది, రేపల్లెకు చేరుకుంటుంది. ఆ పండ్లను చూచి రేపల్లె ప్రజలు పండ్ల ధర చెప్పమంటారు, కొంటామంటారు, కానీ పండ్లవ్వ

**ధనమున కీయను ధాన్యముకీయను -**
**నగల కీయ మరి నాణ్యాలకియ్యా -**
**భూమినేలు మారాజుల కీయ్య -**
**భువిలో వెలసిన వేల్పులకియ్య -**

కానీ "గోవర్ధనగిరిని చిటికెన వ్రేలితో లేపి, గోకులమును రక్షించిన బాలశూరునికి" ఇస్తానని చెప్తుతుంది. పండ్లవ్వను చూచి బాలకృష్ణుడొస్తాడు. అతనికి కావల్సినన్ని పండ్లనిచ్చి తృప్తి చెందుతుంది. కృష్ణుడు దోసెడు ధాన్యాన్ని బుట్టలో వేస్తాడు. అవ్వ బుట్టతో పాటు కొండనెక్కుతుంటే బుట్ట బరువవుతుంది. బుట్టలోని ధాన్యమంతా బంగారమవుతుంది. కానీ అవ్వ మాత్రం బంగారంవైపు చూడక కృష్ణ ధ్యాసలో ధ్యానం చేసుకుంటూ ఉండిపోతుంది. కొన్ని సంవత్సరాలకు ధ్యానంలోనే తనువు చాలించి కృష్ణ భగవానునిలో లీనమై పోతుంది.

**పత్రం పుష్పం ఫలం తోయం యోమే భక్త్యాప్రయచ్ఛతి**
**తదహం భక్త్యు పహృతమశ్నామి ప్రయతాత్మన:**
(భగవద్గీత 9-26)

ఎవరైనను నాకు ప్రేమతోను, భక్తితోను ఆకునుగాని, పువ్వునుగాని, పండునుగాని, నీటినిగాని అర్పించినచో దాన్ని నేను అంగీకరిస్తాను' - అని శ్రీకృష్ణ భగవానుడు అర్జునునికి ప్రబోధించిన బోధననే జానపదులు 'పండ్లవ్వ' కథాగేయంలో అతి సరళమైన రీతిలో వ్యక్తం చేసారు.

**అన్తకాలే చ మామేవ స్మరన్ముక్త్వా కళేబరమ్**
**య: ప్రయాతి సమద్భావం యాతి నాస్త్యత్ర సంశయ:**
(భగవద్గీత 8-5)

(ఎవరు జీవితాంతమును నన్నే స్మరించుచు దేహమును విడుతురో వారు తత్క్షణమే నా భావమునే పొందుదురు. ఈ విషయమున సందేహం లేదు) అని శ్రీకృష్ణుడు బోధించినట్లుగానే కృష్ణ ధ్యాసలోనే, స్మరణలోనే దేహాన్ని త్యజించిన పండ్లవ్వ పరమాత్మలో లీనమైంది. అతి గహనమైన వేదాంత ఆధ్యాత్మిక భావాలను అలతి అలతి కథల్లోనే పిల్లలకు, పెద్దలకర్థమయ్యే విధంలోనే బోధించడం జానపదుల కథన నైపుణ్యానికి నిదర్శనం.

పూతనను, శకటాసురుని, తృణావర్తుని, వృషభాసురుని, వత్సాసురుని, బకాసురుని, అఘాసురుని సంహరించిన బాలకృష్ణుని సాహస కృత్యాలు జానపదులను ఆకట్టుకోలేదు, వాటిని వారు ప్రస్తుతించలేదు. కానీ బాలకృష్ణుని అల్లరి పనులలోనే పరమాత్మ తత్త్వం ఇమిడి ఉందని సూచించారు. కృష్ణుడు విష్ణ్వంశ సంభూతుడనీ, దుష్టశిక్షణార్థమై దశావతారాలను దాల్చినాడనే అంశాన్ని అనేక గేయాల్లో చాటి చెప్పారు. గుమ్మడు పాటలో యశోదాదేవి పెరుగు చిలికే సమయంలో బాలకృష్ణుడు వెన్నకొరకు కడవలో చేయిపెట్టబోవగా, అందులో గుమ్మడున్నాడని బెదిరిస్తుంది. తల్లి బెదిరింపులకు, అదరక, బెదరక బాలకృష్ణుడు -

**గుమ్మడేడే గోపిదేవీ - గుమ్మడేడే కన్నతల్లీ**
**గుమ్మడిని పొడసూపగదవే - అమ్మ గోపెమ్మా**
**ముచ్చుతనమున వేదములు గొని - తెచ్చి వెరచుచు జలధిలోపల**
**జొచ్చియున్నా వాని వెంబడి - జొచ్చి వెనుదగిలీ**
**మత్స్యమై సోమకుని ద్రుంచితి - మొదటి చదువులు (వేదములు) బ్రహ్మకిచ్చితి**
**అక్షయాంబు గుమ్మడనియెడి - మాట నేనెరుగా**

మత్స్యావతారంలోనే కాకుండా కూర్మావతారంలోనూ, వరాహావతారంలోనూ, నర్సింహావతారంలోనూ, వామనావతారంలోనూ, పరశురామావతరంలో, రామకృష్ణుల అవతారాల్లోనూ, కల్కి అవతారంలోనూ గుమ్మడను మాట నేనెరుగ'' అంటూ కృష్ణుడు నోరు తెరచి అమాయకంగా "ఇందుగలడా గుమ్మడంటవి ఎందుగలడో చూడుమా" అనగానే యశోద నందనందుని నోటిలో విశ్వాన్ని దర్శిస్తుంది, భయ విస్మితురాలవుతుంది.

**వెరువవలెనని గుమ్మడంటివి వెరచితిని తెరువాకు మూయుము**
**కన్నబలిమిని గుమ్మడంటిని కరుణ జూడుము దేవమణి**

అని వేడుకొంటుంది. "యశోద కొంగపాట"లో కూడా యశోద కృష్ణుని అల్లరిని సహించలేక ''కొంగ వచ్చి ఎత్తుకుపోతుంది' అని భయపెడుతుంది. కానీ కృష్ణుడు

దశావతారాల్లో కొంగనెక్కడా చూడలేదని తన నోటిలో ఉందేమో చూడమని నోటిని తెరుస్తాడు. కృష్ణుని నోట్లో విశ్వాన్ని దర్శించి భయకంపితురాలవుతుంది.

మహాభారత యుద్ధ ప్రారంభంలో అర్జునుడు పుత్రులు, పౌత్రులు, భ్రాతలు, ప్రజలే కాకుండా, ద్రోణుడూ, భీష్ముడు, కృపాచార్యుడు, అశ్వత్థామ మొదలైన కౌరవులున్న ఈ సైన్యంతో యుద్ధం చేయలేను అని,

కప్పెర దయ చేయు గంగకును బోదు
వస్త్రమ్ము దయచేయు వనములకు బోదు
అని యిట్లు పలుకగా వినుచు
కలకలా నవ్వెనే కమలనాదులు

అర్జునుని చేయిపట్టుకొని రథంపై కూర్చుండబెట్టి, కర్ణుడు, అశ్వత్థామ, భీష్మ ద్రోణాదులు మీ చేత చచ్చేటి వారే క్షత్రియ ధర్మం ప్రకారం శత్రువులను చంపి జయలక్ష్మిని చేకొనుమని తన మహిమను వివరిస్తాడు. అర్జునుని కోరిక మేరకు విశ్వరూపాన్ని ప్రదర్శిస్తాడు. అర్జునుడు విశ్వరూపాన్ని దర్శించి "నీతో బొంగరాలాడాను, సయ్యాటలాడాను, సరసమాడాను, పొత్తున కుడిచాను భమిడి తామర పువ్వులు పాదముల బోసి – ప్రదక్షిణలు చేతామంటే చోటింతలేదు" అని బాధపడతాడు. విశ్వమంతా నిండిపోయిన జానపద కృష్ణుని వర్ణన అమోఘం. భక్తి తత్వాన్నే కాకుండ స్నేహధర్మాన్ని బోధించడానికి కుచేలోపాఖ్యానం కథా గేయాన్ని స్త్రీలు గానం చేస్తుంటారు. కడు దరిద్రుడైనా బాల్యస్నేహితుడైన కుచేలుడు తెచ్చిన అటుకులను అతి ప్రేమగా ఆరగించి, అతిథి మర్యాదలతో అతణ్ణి సత్కరించి, భోగభాగ్యాలను ప్రసాదించిన కృష్ణుడు స్నేహధర్మానికి ప్రతిరూపం, స్త్రీలకు ఆరాధ్యనీయుడు.

జానపద శ్రామిక స్త్రీలలో "గోపెమ్మకథ" అధిక ప్రచారంలో ఉంది. కథాకథనం ప్రకారం రాధయే జానపదుల గోపెమ్మగా మారిందని ఊహింపవచ్చు. మూలభాగవతంలో రాధాకృష్ణ పాత్రలు భక్తి భావనకుద్దీపాలు. కాని జానపద గోపికా కృష్ణులు మాత్రం ఒక సామాన్యమైన శృంగార జంట. గోపెమ్మ తన భర్త ఎర్రన్నకు చద్దితీసుకొని పొలానికి పోతుండగా కృష్ణుడామెను చూచి ఆమె అందానికి ఆకర్షితుడవుతాడు. ఆమె మాత్రమతడ్ని నిరాకరించి వెళ్ళిపోతుంది. కృష్ణుడు నిమ్మకాయను మంత్రించి, ఆమె పై వేసి తనపై మనసు పడేటట్టు చేస్తాడు. ఆనాటి అర్ధరాత్రి గోపెమ్మ ఇంటికి వెళ్ళగా, తలుపులన్ని వాటంతటవే తెరచుకుంటాయి. ఆ రాత్రి ఆమెతో గడిపి "నీ వారు నిన్ననుమానించి కష్టాలు పెడితే నన్ను తలచుకొమ్మని" చెప్పి వెళ్లిపోతాడు. మరునాడు గోపెమ్మను అత్తింటివారు అనుమానించి, ఆమెను అగ్నిలో దూకమంటారు. గోపెమ్మ కృష్ణుని తలచుకొని అగ్నిగుండంలో దూకి సురక్షితంగా బయటకు వస్తుంది. మరునాడు మళ్ళీ కృష్ణుడు గోపెమ్మ దగ్గరకు వస్తాడు. బావలామెను మళ్ళీ అనుమానించి సలసల కాగుతున్న నూనెలో వేస్తారు. బావిలో వేస్తారు, అయినా ఆమె కృష్ణనామ స్మరణతో నిరపాయంగా వెలుపలికి వస్తుంది. బావల అనుమానం తీరుతుంది. కృష్ణుడు ద్వారకకు పోయేటప్పుడు గోపెమ్మ తనను కూడా తీసుకొని పొమ్మని ప్రార్థిస్తుంది. కానీ కృష్ణుడామెకు భర్త ఎర్రన్నతోనే సంసారం చేయమని వెళ్ళిపోతాడు. గోపెమ్మ కృష్ణుని మరచిపోలేక మతిభ్రమించి తిరుగుతుంటుంది. వంగ సాహిత్యంలో బడుచండీదాస్ రచించిన "శ్రీకృష్ణ కీర్తన్" లోని రాధ పాత్ర గోపెమ్మ పాత్రను పోలిఉంది. "శ్రీకృష్ణ కీర్తన్" కథలో వివాహిత అయిన రాధ సౌందర్యానికి ముగ్ధుడై, ఆమె నిరాకరించినను నిరాశచెందక "బడాయ్" అనే ముసలి అవ్వ సాయంతో, మోసంతో ఆమెను వశపరచుకొని, కొంత కాలం ఆమెతో గడిపి తర్వాత మధురకు వెళ్ళిపోతాడు. మళ్ళీ తిరిగిరాడు. రాధ కృష్ణుని విరహంతో కృంగి కృషించి పోతుంది. శ్రీకృష్ణ కీర్తన్‌లోని రాధా కృష్ణుల విహారాదులు గోపెమ్మ కథలో మాదిరే గ్రామ్యపద్ధతిలో వర్ణింపబడినాయి.

ఒక చెక్కభజనలో పాడే పాటలో గోపికామానస చోరుడు, గోపికలఇళ్ళలో కొన్ని రాత్రుళ్ళు గడిపి సత్యాదేవి ఇంటికి వస్తాడు. సత్య అలిగి తలుపులు తీయదు, ఆమె అలక తీర్చడానికి శ్రీకృష్ణుడు చతురతతో అనునయించిన విధానాన్ని జానపదులు పాటగా పాడుతారు.

కృష్ణుడు: తల్లి యశోద తనయుడనే సత్య
తలపు తీయవే భామ – నీవు తలుపు తీయవే భామ
సత్య: వాకిలి తీయగ వగలు వల్కెదవు
వచ్చిన దావను (దోవను) పోరా – నీవు వచ్చిన దావను పోరా
కృష్ణుడు: లెక్కకు మించిన ఎక్కువ సొమ్ములు
తెచ్చినానె ఓ కొమ్మా –నీకు తెచ్చినానే ఓ కొమ్మా
సత్య: గోపాల నీ సక్కని గోరులు
కొనలు వంగనేవోయి – కృష్ణకొనలు వంగనేవోయి
కృష్ణుడు: గోవర్ధనగిరి యెత్తితే గోరులు
మొద్దుబోయెనే సకియ – మొద్దు బాయెనే భామ

ఈ విధంగా సత్యభామ అనుమానాలన్నింటికి మహాచతురంగా జవాబులిచ్చి, సత్యఅలుకను తీరుస్తాడు.

కృష్ణునికి అష్టమహిషులు, పదహారువేల మంది భార్యలతో పాటు చెంచితను కూడా జానపదులు అంటగట్టారు. కృష్ణుడొకనాడు అడవికి వేటకు వెళ్ళి, అక్కడ చెంచిత అందానికి ఆకర్షితుడవుతాడు.

నన్ను ఎవడనుకుంటివీ చెంచితా
నేనవతార పురుసూడా చెంచితా
నేనాది నారాయణుడా చెంచితా
నేను గోపెమ్మ కొడుకూనే చెంచితా
నే గొల్లవారల్లుడా చెంచితా

అని తనను తాను పరిచయం చేసుకుంటాడు, అరవై

వేల మంది భార్యలు కూడా ఉన్నారని చెప్పుకుంటాడు. ఇంట్లో భార్యలను పెట్టుకొని నా దగ్గరకెందుకు వచ్చావని చెంచిత ప్రశ్నిస్తే, నా భార్యలెవ్వరు అందంలో నీకు సరిరార, ఏడంతస్థుల మేడకట్టి, నగలతో అలంకరించి సుఖపెడ్తానని ఆశపెట్టగానే చెంచిత సరే అని కృష్ణునితో వెళ్ళిపోతుంది. మరొక కథలో కృష్ణుడు మేమే అందగత్తెలము అని గర్విస్తున్న భార్యల అహంకారాన్ని అణచడానికి చెంచితను పెళ్ళి చేసుకొని వస్తాడు. కృష్ణునికి రాజ కన్యలతో, యాదవ కన్యలతో చెంచితతో వివాహం జరిపించి, శ్రీకృష్ణుణ్ణి కుల వర్గాల కతీతునిగా చిత్రించారు జానపదులు. తన భార్యలందరిపైన ప్రేమను సమంగా పంచుతాడు కృష్ణుడు. వీరందరిలో తామె కృష్ణునికి ప్రియాతి ప్రీతులమని రుక్మిణి, సత్యభామలు గర్వించినపుడు వారికి గర్వభంగం చేసిన విధం రుక్మిణీ విజయం, పారిజాత పల్లవి, తులసీ దళం పాటల్లో వర్ణింపబడింది.

సంస్కృత భారతంలో మాదిరే జానపద భారత కథాగమనానికి కృష్ణుడే కారకుడు. భారత కథలను "పాండవులోల్లు, పిచ్చుకుంటోళ్ళు" అనే వృత్తిగాయకులు అనేక అద్భుతాంశాలతో, కల్పనలతో గానం చేస్తూంటారు. వీరు చెప్పే కథల్లో కృష్ణుడు భగవానుడే గాక... మాయలమారి, పాండవ పక్షపాతి, కీర్తి కాంక్షాపరుడు.

పాండురాజు మరణానంతరం మునులు ధర్మరాజాదులనోదార్చి మీ తండ్రి మాంసాన్ని తింటే, మీకు త్రికాలజ్ఞత, వీరత్వం, ప్రాప్తిస్తుందని చెప్తారు. వారదేవిధంగా ఆచరించడానికి పూనుకోగా, ఆ దృశ్యం ద్వారకలోని కృష్ణునికి అరచేతిలో కన్పిస్తుంది. పాండవులు మునులు చెప్పిన విధంగా ఆచరిస్తే త్రికాలజ్ఞతలో వీరత్వంలో తనను మించిపోతారనీ, తనకు కీర్తి ప్రతిష్ఠలు లభించవనీ, ప్రజలు తనను పూజించరనీ భావించి పాండవుల ముందు ప్రత్యక్షమౌతాడు. వారితో తండ్రి మాంసభక్షణ మహాపాపమనీ, తండ్రికి కూడా నరకప్రాప్తి కలుగుతుందని వివరిస్తాడు. "భవిష్యత్తులో మీకు ఏ ఆపద కల్గినా నేను ఆదుకుంటాను" అని అభయమిస్తాడు. తనమాట ప్రకారమే కృష్ణుడు పాండవులను జీవితాంతం ఆదుకుంటాడు. ఆపదల నుండి గట్టెక్కిస్తాడు. దుర్యోధనాదులు భీమునికి విషప్రయోగం చేసినప్పుడతణ్ణి రక్షిస్తాడు. ద్రౌపదికి అక్షయమని చీరలను ప్రసాదించి, నిండు సభలో ఆమె గౌరవాన్ని కాపాడుతాడు. సుభద్రార్జునుల పెండ్లి జరగడానికి దొంగలను సృష్టించి వారి చేత బ్రాహ్మణుల ఆవులను అపహరింపచేసి, అర్జునుని తీర్థయాత్రలకు కారకుడవుతాడు. అర్జునుడి పాశుపతాస్త్రం కొరకు తపస్సు చేసేటప్పుడు స్త్రీ వేషంలో వచ్చి అతని దీక్షను పరీక్షిస్తాడు. అర్జునుడు అల్లిరాణి (ప్రమీలరాణి) చేత బందీ అయినప్పుడు శ్రీ కృష్ణుడు మాయోపాయాలచేత ఆమెను వంచించి, అర్జునునితో వివాహం జరిపిస్తాడు. అభిమన్యుడు భారత యుద్ధంలో మృత్యుంజయుడై విజయాన్ని సాధిస్తే, తన కీర్తికి భంగం కలుగుతుందని అర్జునుణ్ణి నదీ తీరానికి తీసుకొని పోతాడు, అభిమన్యుని మరణానికి కారకుడవుతాడు. ఘటోత్కచుడు కౌరవవీరులను గెలిస్తే, తన వీరత్వానికి ప్రతిష్ఠకు భంగం కల్గుతుందనీ, పాండవులకు తనపైన భయం భక్తి గౌరవాలు తగ్గుతాయని భావించి, కర్ణునిపైకి యుద్ధానికి పంపించి,



అతని మరణానికి కూడ కారణమవుతాడు. ఈ విధంగా మహాభారంలోని అద్భుతాంశాలు, అభూత కల్పనలతో కృష్ణపాత్రను జానపద కథానాయకులు చిత్రించారు. అద్భుత కల్పనలతో, అతిమానుష కల్పనలతో కథలను కథనం చేస్తేనే శ్రోతలకు ఆసక్తిదాయకంగా ఉంటుంది. అందుకు వృత్తి కథాగాయకులు శ్రోతలను ఆకట్టు కోవడానికి కృష్ణుణ్ణి అవతార పురుషునిగానే కాకుండా అద్భుత శక్తులను, మయోపాయాలను కల్గిన వాడిగా రూపొందించారు.

**"యే యథా మాం ప్రపద్యన్తే తాంస్తథైవ భజామ్యహమ్"**
– (భగ. 4-11)

అని కృష్ణ భగవానుడే చెప్పినట్లుగా జానపదులు తమ మనోభావాల ననుసరించి, తమతమ కోర్కెల ప్రకారం, జీవిత విధానాలననుసరించి వాసుదేవుణ్ణి వివిధ రకాలుగా కీర్తిస్తుంటారు. కానీ అందరి గమ్యం కృష్ణ పరమాత్ముని సన్నిధికి చేరడమే.

(వంశీ సంచిక నుండి గ్రహించబడినది )

**– రావి ప్రేమలత**



జానపద సాహిత్యంపై అపారమైన అభిమానం ఉన్న రావి ప్రేమలత గారు తెలుగులో పి. హెచ్. డి. లింగ్విస్టిక్స్‌లో డిప్లమా చేసారు. ఉపాధ్యాయురాలిగా 30 సంవత్సరాలు పనిచేసారు. ప్రేమలతగారి రచనలు: తెలుగు జానపద సాహిత్యం-పురాణ గాథలు, జానపద విజ్ఞాన పరిశీలనం, తెలుగు స్త్రీల చిత్రలిపి (ముగ్గులు), జానపద విజ్ఞానంలో స్త్రీ, వ్యాసలతిక, ఆలోకనం, యశోదారెడ్డి జీవితం-సాహిత్యం, Folk tales of South India - Andhra Pradesh. 60 వ్యాసాలు ప్రచురించారు. జానపద విజ్ఞనం పైన నిర్వహించిన జాతీయ, అంతర్జాతీయ సదస్సులో దాదాపు 20 పరిశోధనా పత్రాలను సమర్పించారు.

# జానపదుల అట్లతద్ది పండుగ

- కురుగంటి శ్రీలక్ష్మి

"తమి బూదీగెల దూగు టయ్యేలల బంతాలాడుచుందూగునా
కొమరం బ్రాయపు గబ్బి గుబ్బెతల యంఘ్రుల్ చక్కగా జాగిమిం
టి మొగంబై చనుదెంచుటీవి గనుగొంటి దివ్యమౌనీంద్రనా



కమ్మగీ నేత్రల మీద గయ్యమునకున్ గాల్చాచులాగొప్పెడున్
(కళాపూర్ణోదయం ఆ 1 - 32 వ)

అంటూ ఇక్కడ పింగళి సూరన తన కళాపూర్ణోదయంలో చెలికత్తెలతో ఉయ్యాలలూగే కలభాషిణి సౌందర్యాన్ని నారద మణికంధరులచేత చెప్పిస్తాడు. కవి కావ్యారంగానికి ఏదో ఒక సన్నివేశాన్నీ సందర్భాన్ని ఎన్నుకోవటం మామూలే అయినా సూరన ఎన్నుకున్న సందర్భానికి ప్రత్యేకత ఉంది. సూరన ఇక్కడ ఉయ్యాలలూగే ఘట్టానికి ప్రాధాన్యం ఇవ్వటమేగాక ఆ ఘట్టాన్ని తిలకించిన పాత్రలు దానిని గురించి విమర్శించే సందర్భాన్ని తన కావ్యానికి కేంద్రంగా గ్రహిస్తాడు. తెలుగు వారి ఆచార సంప్రదాయాలను తెలిసిన వాడు గనుకనే కవి ఉయ్యాలలూగే సందర్భాన్ని, కథకూ, పాత్రలప్రవేశానికి ఆలంబనంగా గ్రహించాడు, ఇక్కడ అతిసామాన్యమైన ఈ విషయం కవిలోని కథా కథన శిల్పాన్ని తెలియజేస్తుంది.

అయితే కావ్యారంభంలోనే ఈ ఉయ్యాలఊగే ఘట్టం ఇంత ప్రాధాన్యాన్ని సంతరించుకుంటే ఇక మానవ జీవితంలో ఉయ్యాల ఊగే ఘట్టానికి అంతే ప్రాధన్యత ఉంది. అష్టవిధ భోగాల్లాగానే ఉయ్యాల ఊగటాన్ని ఒక గొప్ప భోగంగా భావిస్తారు మనవాళ్ళు. మామూలుగా మన సంభాషణల్లో విలాసంగా జీవితం గడిపే వాళ్ళను గురించి వ్యాఖ్యానిస్తూ "ఆవాళ్ళకేం పెట్టిపుట్టారు, మొగుడూ పెళ్ళాలు హాయిగాతూగుటుయ్యాల లూగుతారంటాం. ఇక్కడ విలాసానికి వినోదానికీ ఉయ్యాల ఊగటం. సంకేతం పుట్టిన ప్రతి మనిషి తన జీవితం పూల బాటకావాలనుకుంటాడు. ఏ చీకూ చింతా లేకుండా ఉండాలనీ, ఒడుదుడుకులు లేకుండా సాగిపోవాలను కుంటారు. అది మానవనైజం. మనిషి జీవితంలో అటువంటి ఆనందాన్ని పొందటానికి మన వాళ్ళు కొన్ని సందార్భాలను ఏర్పరచారు. ఆ సందర్భంగా మనం ఆట పాటలతో ఉత్సాహంగా ఉత్తేజంగా గడిపేదే ఈ అట్లతద్ది పండుగ జానపదుల కళారూపంగా దీనికిగల స్థానం అత్యుత్తమం.

మామూలుగా ఈ పండుగ ఆశ్వయుజమాసంలో అంటే అక్టోబరునెలలో వస్తుంది. భాద్రపద బహుళతదియ ఉండ్రాళ్ళతద్ది అయితే అశ్వయుజ బహుళతదియ అట్లతద్ది అవుతుంది. ఈ ఉండ్రాళ్ళతద్ది, అట్లతద్ది రెండూ ఆటలతో పాటలతో ఆనందంగా గడిపే పండుగలే అయినా రెంటిలో అట్లతద్దికి ఎక్కువ ప్రాధాన్యాన్నిస్తారు. జనులు అష్టాదశ వర్ణాలకూ అట్లతద్ది అనే నానుడి ఈ ప్రాధాన్యం వల్ల వచ్చిందే. అట్లతద్ది పండుగ సమయంలో వాతావరణం ఎంతో ఆహ్లాదంగా ఉంటుంది. ఇటు పూర్తి వర్షరుతువూ అటు హేమంత రుతువు కాకుండా ఉంటుంది. ఈ పండుగను చిన్న పెద్దా, ఆడ మగా, అంతా ఎంతో సంబరంగా గడుపుతారు.

తదియ రేపనగా ఈ పండుగ హడావుడి ఆరంభమౌతుంది ముందురోజు తలంటు పోసుకోవటం ప్రధాన ఘట్టం, గోరింటాకు కోసుకొచ్చి దానిలో ఎర్రగా పండటానికి కాచుగాని, చింతపండుగాని వేసి మెత్తగా రుబ్బుతారు. ఈ రుబ్బిన ముద్దను అరికాళ్ళలో, అరిచేతుల్లో, కాళ్ళకు పారాణిగా చేతివేళ్ళకూ పెట్టుకుంటారు. అసలు ఆషాఢమాసంలో అయిదోతనం కోసం గోరింటాకు పెట్టుకోమని చెప్తారు. పెద్దలు, ఆషాఢమాసం నుంచే గోరింటాకు పెట్టుకోడం మొదలు పెడతారు. స్త్రీలు. చిన్న పెద్ద ముఖ్యంగా పెళ్ళైన వాళ్ళందరూ చేతుల నిండుగా చందమామల్ని చుక్కల్ని పెట్టుకుంటారు ఇది అందానికి ఆరోగ్యానికీ మంచిదంటారు, ఎండాకాలంలో వేడిని తగ్గిస్తుందనీ, పిప్పగోళ్ళుండవనీ, గోళ్ళలోని మట్టిని క్రిముల్నీ, ఈ చేదు హరిస్తుందనీ చెప్తారు. ఆరోగ్యరీత్యానే కాక అందానికీ ఆనందానికీ ఎర్రని చేతులు ప్రతీకలుగా భాసిస్తాయి. చేతుల్లో బంతిఆకుల్ని, లతల్ని వివిధ డిజైనేలలో పెట్టుకుంటారు. ఈ చిత్రకళ మనల్ని ఎంతో ఆకట్టుకుంటుంది. ముఖ్యంగా చంద్రుడూ, చుక్కలూ, వంకలు చాలా అందంగా ఉంటాయి.

మనలోనే కాక ముస్లింలు ఈ గోరింటాకును ఎంతో చక్కగా పెట్టుకుంటారు. రాజస్థాన్‌లో పంజాబ్‌లో, గుజరాత్‌లో అస్సాంలో ఒక ప్రాంతమనే పరిధి లేదు. దీనికి, అన్ని చోట్ల అందరూ ఈ గోరింటాకును అందంగా పెట్టుకుంటారు. అందులో వారివారి చిత్రకళానైపుణ్యం వ్యక్తమౌతుంది. ఎంత ఎర్రగా పండితే అంత మంచిదని ఎరుపును శుభసూచకంగా చెప్తారు.

గోరింటాకు పెట్టుకునే పని పూర్తవుతుంది. ముందు రోజు, తెల్లవారు ఝామున లేచి మొహాలు కడిగి పొట్లకాయ గోంగూరువచ్చడి, కంది వచ్చడి, ఉల్లిపాయాలపులుసు, పెరుగు భోంచేస్తారు. ప్రధానంగా ఇవి ఆ రోజు తినమని చెప్తారు. ఆరోగ్యమైనవి కనుకా, ఆకాలంలో దొరికేవి కనుక ఈ కూరల్ని తినమంటారు. ఇవన్నీ బలవర్థకాలు, తృప్తిగా భోంచేసీ తాంబూలం వేసికోవద్దంటూ పిల్లల్ని కోప్పడినా ఆ రోజు తప్పక తాంబూలాన్ని వేసుకోమంటారు పెద్దలు. నాలుక బాగా పండితే మొగుడిమీద

ప్రేమ ఎక్కువని పిల్లలు వాళ్ళల్లో వాళ్ళు గేలి చేసుకుంటారు. ఆ తర్వాత తలలు దువ్వుకోవటం కొత్త బట్టలు కట్టుకోవటం ఆటకుపక్రమించటం చేస్తారు. జట్లు జట్లుగా గెంతుతూ అందరికంటే ముందే లేచి తయారవుతూ మిగతావాళ్ళని లేపుతూ

**అట్లతద్దోయ్ ఆరట్లోయ్**
**ముద్దపప్పోయ్ మూడట్లోయ్**
**ఉసిరి చెట్టు కింద పాము లేలే**
**రండోయ్ చెలులారా**
**బాలకృష్ణుడ్ని చూదాం**
**కాళింది మడుగులో ఫణిరాజుతలపై**
**నృత్యం చేస్తున్నాడు తధిమికతోం**

అంటూ చిన్నకృష్ణుడి లీలల్ని గుర్తు చేసుకుంటారు. ఆడే పాడే బాలలకు బాలకృష్ణుడూ అతని వీరత్వం ఆదర్శం, కన్నె పిల్లలు ఇక్కడ కృష్ణుడు చేసిన సాహసాలను వల్లెవేయటం వాళ్ళూధైర్యంగా దేనినైన ఎదుర్కోవాలనే ఆత్మస్థర్యంకోసమే, అంతేకాకుండా పామును గూర్చీ పాడడం ఎవరైన వరాకు ఉన్న వాళ్ళను దడిపించటానికేననిపిస్తుంది వెన్నెల్లో సామూహికంగా అంతా ఆడుకుంటారు గనుక జనాన్ని పోగు చెయ్యటానికీ పాటలు పాడతారు. ఆట పదిమంది ఉంటే గాని రక్తికట్టదు. అందుకే అందర్ని పిలుస్తూ,

**"రచ్చబండమీద కోడికూసె**
**రామయ్య గజ్జలు ఘల్లుమనె"**

అంటూ త్వరగా అందర్ని లేపుకుంటు వెళ్తారు. ఇక ఆడపిల్లలు కుంటి కాళ్ళనీ, చెమ్మచెక్కలనీ, ఒప్పుకుప్పా ఒయ్యారిభామలనీ అనేకరకాలుగా ఆడతారు. అంతా చుట్టూ గుండ్రంగా కూర్చుని చాకలి బాన ఆటనూ, కళ్ళకు గంతలు కట్టించుకొని వీధీవీధీ గుమ్మడి పండు వీనిపేరేమి అంటూ, దూదంపుల్ల ఆటలనీ ఇలా అనేకరకాలుగా అలుపు సొలపు లేకుండా ఇష్టంవచ్చినట్లుగా ఆడుకుంటారు.

ఆటలాడటం ఉయ్యాలలూగటం ఇక్కడ ప్రధానమైన వినోదం. ప్రతి ఏడాదీ ఈ పండుగకు తప్పనిసరిగా ముసలీ, ముతకా, చిన్నా పెద్ద అందరూ చెట్టుకింద ప్రకృతి ఆహ్లాదాన్ని అనుభవిస్తూ ఉయ్యాల లూగుతారు, ఉయ్యాల ఊగకపోతే ముసలి మొగుడు ముసలి పెళ్ళాం వస్తారని సామెతల్ని చెప్తారు. అందుకే ఎక్కడికైనా వెళ్ళి ఆటలాడటం అయ్యాక ఉయ్యాలలూగివస్తారు. రెండు పెద్ద పెద్ద మోకులు కట్టి ఉయ్యాలలు వేస్తారు. వీటినే తాటి



ఉయ్యాల అంటారు. పెద్ద చెట్లకు కూడ వేస్తారు. అసలు అట్లతద్ది ఇంకా నెలరోజులుందనగానే ఉయ్యాలలూగటం మొదలు పెడతారు. పిల్లలు ఎంత ఎత్తు ఊపులూగితే అంత గొప్పగా భావిస్తారు. ఊగని వాళ్ళను గేలిచేస్తారు. ఇక్కడ ఉయ్యాల ఊగటం శరీరానికి మనసుకీ ఎంతో హాయిని కలిగిస్తుంది. పెద్ద పెద్ద ఊపులు ఎత్తుగా ఊగినప్పుడు పిల్లలకు ఎత్తువెక్కాలంటే భయం పోతుంది, నిమ్మ కులాల్లో అట్లు బెల్లం పెరుగన్నం, చెట్లున్నచోట ఆరుబయటకు తీసికెళ్తారు. అక్కడ అందరూ ఫలహారాలుచేసి ఉయ్యాలలు పది రోజులు దాకా ఊగుతారు, పెళ్ళైయిన ఆడపిల్లల్ని అల్లుళ్ళనూ ఇంటికి తీసుకొస్తారు. అందరూ పండుగ జరుపుకుంటారు, పదవ రోజు ఆడపిల్లలకు చీరసారె పెట్టి అత్తగారింటికి పంపుతారు.

తెలంగాణా ప్రాంతంలో కూడ అమ్మోరి పండుగ అయ్యాక చెట్లల్లోకెళ్ళి వస్తారు. జూలై ఆగష్టునెలల్లో వనభోజనాలు చేసి ఉయ్యాలలూగి ఆనందంగా పొద్దుపుచ్చుతారు.

పంజాబ్‌లో ఈ పండుగను తేయాన్ పండుగ అంటారు. దీన్ని ఆగష్టు నెలలో జరుపుకుంటారు. వర్షరుతువులో ఈ పండుగ వస్తుంది. శ్రావణమాసంలో కొత్తగా పెళ్ళైన ఆడపిల్లలు పుట్టింటి నుంచి ఎవరు వస్తారు తనను తీసుకెళ్ళడానికని ఎదురు చూస్తారు. పండుగ ముందురోజు ఆంధ్రలోలాగా చేతులకూ కాళ్ళకూ గోరింటాకు పెట్టుకుంటారు పండుగరోజు కొత్త బట్టలు కట్టుకుని ఎంతో ఆనందంగా పాటపాడుతూ ఆడతారు. ఈ పాటల్ని తేయాన్ పాటలంటారు. ఈ పండుగకు గిద్దానృత్యం (Gidda dance) చేస్తారు. చిన్నతనంలోని ఆట పాటలన్నింటినీ గుర్తు చేసుకుంటారు. మర్రి చెట్టుకింద ఉయ్యాలలూగటం ఇక్కడ ప్రధానం. ఎంతో ఉద్రేకంతో ఉత్సాహంతో పాటలు పాడుతూ ఆడుతూ తమ సంతోషాన్ని తోటి పిల్లలతో పంచుకుంటారు.

అదేవిధంగా ఒరిస్సాలో ఈ పండుగను జ్యేష్ఠమాసంలో చేసుకుంటారు. దీన్ని 'రాజపరబ్' (Raja parab) అంటారు. వీళ్ళ పండుగలన్నింటిలో ఇది ఎంతో ముఖ్యమైన పండుగ మూడు రోజులు ఈ పండుగను జరుపుకుంటారు. పనులన్ని ఆపేసి ఉయ్యాలలూగుతూ ఆడమగా ఎంతో ఉత్సాహంతో 'రాజా' గీతాలు పాడుకుంటూ ఆటలు ఆడటం దీని ప్రత్యేకత, ఈ పండుగ నాలుగోరోజు పొలాల్ని దున్నటం ఆరంభిస్తారు. ఇది వ్యవసాయానికి అనుకూలమైన సమయంగా భావిస్తారు.

రాజస్థాన్‌లో దీన్ని 'తేజ్' (Tej) పండుగ అంటారు. దీన్ని శ్రావణ, భాద్రపదాల్లో చేసుకుంటారు. కూతుళ్ళు, కోడళ్ళూ అంతా

మిఠాయిలు పంచుకుంటారు. ముఖ్యంగా పెళ్ళైన వాళ్ళు ఈ పండుగ చేసుకోవటానికి పుట్టింటికి వస్తారు. గోరింటాకు పెట్టుకోవడం ఉయ్యాలలూగుతూ ఆటపాటలతో గౌరిపూజలతో ఎంతో గొప్పగా ఈపండుగను జరుపుకుంటారు. పెళ్ళైన వాళ్ళు సిరిసంపదల కోసం పెళ్ళికాని వాళ్ళు మంచి భర్త దొరకాలని పూజలను క్రమం తప్పకుండా చేస్తారు. గుజరాత్‌లో కూడా ఉయ్యాలలూగటం గోరింటాకు పెట్టుకోడం ఆడటం పాడటం పండుగ సందర్భంగా జరుపుకునే వేడుకలు, ఇలా ఉయ్యాలలూగే పండుగ ప్రాధాన్యాన్ని అన్ని రాష్ట్రాల్లో మనం గమనిస్తాం.

ఆంధ్రలో ఈ పండుగరోజు అగ్రకులాల వాళ్ళు గౌరీదేవిని పూజిస్తారు. సాయంకాలందాకా ఉపవాసం ఉండి చంద్రదర్శనం చేసుకుని ముత్తయిదువుకు అట్లు వాయనంగా ఇచ్చి అపుడు భోజనం చేస్తారు. అదేవిధంగా నిమ్నకులాలవాళ్ళు అట్లు వాయనాలు తీర్చుకోడం అంటారు. పుట్టింటి వాళ్ళు ఈ వాయనం తీర్పిస్తారు పిల్లలచేత.

ఉయ్యాలలూగటం, గోరింటాకు పెట్టుకోడం ఆటలాడటం పాటలు పాడటం (సామూహికంగా) ఈపండుగ లక్షణం. ఇది కేవలం మనదేశంలోనే గాక పాశ్చాత్య దేశాల్లో కూడ ఉంది. ఈ ఉయ్యాల బల్లలు ప్రతి యింటా ఉంటాయి. మనిషి శారీరకంగా మానసికంగా ఆనందంగా ఉండటానికీ ఉయ్యాల ఊగటం ప్రధానంగా భావించి దీనినొక పండుగ సందర్భంగా మనవాళ్ళు ఊగమంటారు ముఖ్యంగా ఊగే ఊపుల వల్ల పిల్లల్లో భయం తొలగిపోతుంది. శారీరకమైన వ్యాయామం ఆటల వలన పొందవచ్చు.

జానపదుల సాహిత్యం, సంగీతం వినోదం విజ్ఞానం ఆరోగ్యం, మన ఆచార సంప్రదాయాలు అన్నింటినీ తనలో ఇమడ్చుకున్న ఈ అట్లతద్ది పండగ మన సంస్కృతిని విశదీకరించే పండుగ.

**- కురుగంటి శ్రీలక్ష్మి**



కీర్తిశేషులు డా॥ కురుగంటి శ్రీలక్ష్మి ఉస్మానియా విశ్వవిద్యాలయంలో తెలుగు ఎం.ఎ, ఎం.ఫిల్, పిహెచ్.డి చేసారు. "జానపద రామాయణం-మనోవిశ్లేషణ" అనే అంశంపై డా॥ నాయని కృష్ణకుమారి వద్ద ఆమె పరిశోధన చేసారు. వీరు జానపదసాహిత్యంపై రచనలతోపాటు "కన్యాశుల్కంలో తిట్లు" అనే గ్రంథాన్ని "ధీరవనిత" అనే శీర్షికతో తమ తల్లి జీవిత చరిత్రను, డా॥ రావి ప్రేమలతతో కలసి "జానపద విజ్ఞాన వ్యాసాలు రచించారు. ఇవికాక అనేక జాతీయ, అంతర్జాతీయ సదస్సులలో జానపద సాహిత్యంపై ఎన్నో ప్రసంగ వ్యాసాలు సమర్పించారు. 2007లో మానస సరోవర్ యాత్రలో ఆకస్మికంగా మరణించారు.


LAKSAN TECHNOLOGIES

LAKSAN Technologies, a custom IT solutions provider is one among the pioneers in this field offering various services like Business Intelligence, Big Data Analytics & Visualization, Cyber Security, Custom Software Development and Staff Augmentation. Established in the year 2010, LAKSAN Technologies, aims at enabling business excellence through innovative solutions, services and process improvements in global organizations, acting as a preferred and trusted technology solutions partner.

LAKSAN Management:
Bapuji Kothapalli, Founder & CEO, has over 20 years of IT experience in Program Management, Building IT Roadmap for large Enterprises, Solution Architecture, Resource Management and Customer Engagement. Has traveled to Asia, Europe and North America served various clients such as D&B, Volvo IT, JPM Chase, IBM, Mercedes Benz, AT&T, State and Federal governments.

Contacts:
Email: info@laksans.com
Phone: 732-722-5000
WebSite: http://www.laksans.com


Indian House of Dosas
1665 Stelton Road Piscataway NJ 08854
732 844 DOSA | 732 354 3820
www.indianhouseofdosas.com
Indian House of Dosas
SEE THIS AD
BRING THIS AD
GET
10%
OFF !
Persis BIRYANI
INDIAN GRILL
Persis Biryani & Indian Grill
1665 Stelton Rd, Piscataway, NJ 08854
732 543 0560 | 732 543 0548
persis.piscataway@gmail.com
www.persispiscataway.com
789 Newark Ave, Jersey City, NJ 07306
201 656 0777 | 201 656 0778
persis.jerseycity@gmail.com
www.persisjerseycity.com

## *Congratulations & Best Wishes to Silicon Andhra*



# Center for Kuchipudi Dance

*Artistic-director*

## Indira Sreeram Dixith

www.kuchipudidancecenter.com

C: 732-476-8745, E-mail: Cfkdance@gmail.com, New Jersey, USA

# సంప్రదాయ సాహిత్యంలో జానపద జీవనసౌందర్యం

– శ్రీమతి రాధా కాశీనాథుని

సుజనరంజని వారి ఈ ప్రత్యేక సంచికకు ప్రాతిపదిక "జానపదం" అన్నారు. "జనపదం"అన్నమాటకి గ్రామం లేదా పల్లె అని అర్థం. అక్కడ ఉండేవాళ్ళు జానపదులు. అంటే నగరాలకి, పట్టణాలకి దూరంగా ఉండే ప్రజలు.

ఈ పల్లె కొండకోనల్లో ఉండచ్చు, ఏటి ఒడ్డునో, వాగు,వంకల పక్కనైనా ఉండొచ్చు. ఈ జానపదులు పాడుకున్న పాటలు, పదాలు, చెప్పుకున్న కథలు,గాథలు అన్నీ వాళ్ళ అలవాట్లు,అభిరుచులు, ఆచారాలు, ఆలోచనలు, నమ్మకాలు, నడవడులు, సంబరాలు, సరదాలు పొందుపరుచుకుని ఉంటాయి. ఎక్కడా వ్రాసి పెట్టకపోయినా, నోటి మాటలుగా, పాటలుగా వాళ్ళ నాడులలో నాటుకుపోయి తరతరాలుగా సాగిపోతూనే ఉంటుంది ఈ "జానపద వాఙ్మయం." ఇది వినడానికి పెద్ద సమాసంలా కనబడ్డా, దీని భావం మాత్రం సామాన్యం. దీని పుట్టుక ఎక్కడైనా, ఎక్కడ పుట్టినవాడినైన వశం చేసుకోగలదు. పైరగాలికి, పల్లెపదానికి పరవశించని మనసు ఎక్కడవుంటుంది? కమ్మటి జోలపాటకు జోగని పాప, చీమలు దూరని చిట్టడవిలో జరిగిన కథకి ఊ కొట్టని పాపడు ఉంటారా?



మరి ఇలాంటి కవితలని, కథలని ఎవరైనా సేకరించి పొందుపరచారా? మన కవులెవరైనా ఈ విధమైన పంథాలో వ్రాశారా? అంటే "ఎందుకులేరు?" అనవలసి వస్తుంది. పూర్వం మనదేశంలో, ప్రాంతం ఏదైనా సంస్క అత ప్రాక అతాలు ప్రాచుర్యంలో ఉండి, దేశ భాషల ఖచ్చితమైన స్వరూపాలు, వాటిలో కవితలు,కథలూ సాగేయనటానికి ఎళీళీజువులు ఆధారాలు పెద్దగాలేని రోజులుండేవి. ఇలాంటప్పుడు ఒకటో శతాబ్దిలో ఆంధ్ర దేశాన్ని ఏలిన హాలుడు అనే శాతవాహన చక్రవర్తి ఒకడుండే వాడు. ఇతగాడు సాహిత్యంలో మంచి అభిరుచి గలవాడు, స్వయానా కవి కూడా. ఒకసారి ఈ తెలుగురాజు ఎక్కడికో వెళుతుండగా దారిలో ఎవరో పాడుతున్న ప్రాక అత గాథలని విన్నాడు. మనసుపడ్డాడు. రాజు కదా మందీ మార్బలాన్ని కూర్చుకుని అప్పట్లో ప్రచారంలో ఉన్న ఏడు వందల 'గాథల'ని(ఛందోబద్ధమైన జానపద కవితలను) "గాథా సప్తశతి" అన్న పేరుతో సంకలనం చేశాడు.

ఆధునిక కాలంలో తెలుగు జానపద సాహిత్యాన్ని వెలుగులోకి తీసుకు వచ్చే ప్రయత్నాలు బాగానే సాగుతూ ఉన్నాయి. ఇక పోతే మన కవుల సంగతి.. నన్నయ నాటినుండి ఉన్న ప్రాచీన ఆంధ్ర కవులు కావ్యాలను,ప్రబంధాలను,స్థలపురాణాలను వ్రాసుకుంటూ వెళ్ళారు. కాని వీళ్ళలో కూడా జానపదుల కథలను, వారి వ అత్తి ప్రవ అత్తులను అక్కడక్కడ చెపుతూ వచ్చిన వాళ్ళు కూడా లేకపోలేదు.

ఇలాంటి కవులలో ముందుగా చెప్పుకోవలసిన వారు పోతన గారు. భాగవతం దశమస్కంధంలో బాలకృష్ణుడు గొల్లపిల్లలతో కలిసి "బంతి చల్దులు" తినడానికి వెళ్ళి నట్టు –

"అంత నొక్కనాడు రామక అష్ణులు కాంతారంబున బంతి చలుదులు గుడువ నుద్యోగించి ప్రొద్దున లేచి, గ్రద్దనం తమ యింటి లేగ కదుపుల కదలించి, సురంగంబులగు శ అంగంబులు పూరించిన విని, మేలుకని, సంరంభంబున గోప డింభకులు చలిది కావడులు మూపుల వహించి, సజ్జంబులగు కజ్జంబులు గట్టికొని, పదత్రాణ వేత్ర దండధరులై, లెక్కలకు వెక్కసంబైన తమ తమ క్రేపు కదుపులం జప్పుడించి రొప్పుకొనుచు, కాననంబు సొచ్చి,...." (భాగవతం. దశమస్కంధం. వ. 455)

– అన్న వచనంలో వర్ణించడం జరిగింది. ఇందులో– బలరామకృష్ణులు పొద్దుటే లేచి తమ లేగ దూడలను బయటకు తోలి, చక్కటి కొమ్ము బూరాలను ఉదారు. అది విన్న గొల్ల పిల్లలంతా లేచి, కావళ్ళలో చద్ది అన్నం, దానితో బాటు తినుబండారాలు పెట్టుకుని వాటిని భుజానికి ఎత్తుకున్నారు. కాళ్ళకు చెప్పులు వేసుకుని, చేత కర్రలు పుచ్చుకుని బయలుదేరారు. అడవి వెంట పోతూ దారిన కనబడ్డ పూలు కోసి పెట్టుకున్నారు. కొమ్ముబూరాలను, వేణువులను ఊదుతూ, నెమళ్ళతో ఆడుతూ, తుమ్మెదలతో పాడుతూ, చిలుకలతో కూతలు పెడుతూ, పైన ఎగురుతున్న పక్షుల నీడలవెంట పరుగులు పెడుతూ, కోతులతో చెట్లు ఎక్కి పళ్ళు తింటూ, తీగెలను పట్టుకుని ఉయ్యాలలు ఊగుతూ, తమ నీడని తామే చూసుకుంటూ చెట్ల మీదనుండి దూకుతూ ఆడుకున్నారుట.

అవధులు లేని స్వేఛ్ఛ, కట్టుబాట్లు లేని ఆటలు,వాళ్ళలో నిండుకున్న అమాయకత సహజసుందరంగా వర్ణించడం జరిగింది. తరువాతి పద్యంలో

**క. తీపుగల కజ్జ మన్యుడు**
**గోపింపగ నొడిసి పుచ్చుకొని త్రోపాడం**
**పైపడి యది గొని యొక్కడు**
**క్రేపులలో నిట్టునట్టుఁ గికురించు న అహా!**
(భాగవతం. దశమస్కంధం. ప. 458)

ఒక గొల్లవాడి తీయని తినుబండారాన్ని ఇంకొకడు తీసుకునిపోతుంటే, మరొకడు వాడిమీద పడి దాన్ని లాక్కుని, ఆవులమంద మధ్యలో దారి గజిబిజిగా వరుగుపెడుతూ అందకుండా వాడిని ఏడిపించాడు. అసలు



తినుబండారాన్ని పోగొట్టుకున్న వాడికి బాగా కోపం వచ్చింది. అని దీనికి అర్థం. ఇది ఎంత చక్కటి పల్లెటూరి ద అశ్యం.

ధూర్జటి శ్రీకాళహస్తీ మాహాత్మ్యములో సిసలైన బోయవాడు తిన్నడి కథ ఉంది. తిన్నడు ఉడుమూరు అనే బోయపల్లె కు చెందిన వాడు. బోయవాడిని గురించి కాబట్టి విషయం అంతా బోయలకు సంబంధించినదే. దీనిలో కొన్ని విశేషాలు చూద్దాం. ఉడుమూరిలో రాగులు పండిస్తారు. పొలాలలో పక్షులను, జంతువులను భయపెట్టేందుకు దిష్టిబమ్మను పెట్టటం మనకి తెలిసినవిషయమే కదా. ఆ ఊరి బోయలు వాటిని ఎలా తయారుచేస్తారో చెబుతుంది ఈ కింది పద్యం.

**మ. అగురు క్ష్మారుహ కాష'ఖండముల సర్వాంగంబులం జేసి మై**
**మ అగనాభి న్మసి పూసి చామరము ధమ్మిల్లంబు గాఁ జుట్టి యే**
**నుగు కుంభమ్ముల లోని ముత్యములఁ గన్నుడ్డ ల్వినిర్మించి భి**
**ల్ల గజేంద్రు ల్వెర బమ్మలం తవిద చేలం జేయుదుర్ కాపుగన్.**
– (శ్రీ కాళహస్తీమాహాత్మ్యము. త అతీయాశ్వాసము. ప. 7)

అగురుచెట్ల కర్రలతో అవయవాలు చేసి,కస్తూరితో మసిపూసి,చమరీమ అగాల తోకలను జుట్టుగాచుట్టి,ఏనుగుల కుంభాల నుంచి పట్టుకొచ్చిన ముత్యాలతో కనుగుడ్లు చేసి దిష్టిబమ్మను తయారుచేస్తారుట.

అంతేకాదు పచ్చగా పండిన పైరుకు దిష్టి తగులకుండా ఏనుగు తలలను దంతాలతో సహా ఎత్తుగా నిలబెట్టటం కూడా ఒక పద్ధతిగా ఉన్నట్టు ఇందులో చెప్పబడింది.

**క. ఏనుగుల తలలు కొమ్ముల**
**తో నారబములకు ద అష్టి దోషము వాయం**
**గా నెత్తుదు రెకులు తమ**
**చేనికిఁ బసరంబు తలలు చెలువం బెసగన్.**

(శ్రీ కాళహస్తీమాహాత్మ్యము. త అతీయాశ్వాసము. ప. 8)

ఇక చెట్టుకొమ్మలని రాటలుగా పెట్టి, వేటలో తెరకట్టడానికి ఉపయోగించే గట్టి తాళ్ళతో వాటిని కట్టి పంట పొలాలలోకి అడవిపందులు చొరబడి పాడుచేయకుండా అడ్డుకడతారు అని తరువాతి పద్యంలో ఉంది.

క. కొండలలోఁ జేసిన తమ
పండినచేలకు వరాహపంక్తులు చొరరా
కుండం తెల్లని చామర
ఖండంబులు ప్రోగుద్రాళ్ళఁ గట్టుదు రెకుల్.

(శ్రీ కాళహస్తీమాహాత్మ్యము. త అతీయాశ్వాసము. ప. 9)

ఉడుమూరిలో ఉన్న ఆడవాళ్ళు గంధపు చెక్కలు పొయ్యిలో పెట్టి వంటా వార్పూ చెయ్యడం,మంచె లెక్కి అరుస్తూ పిట్టలని తోలడంతో ఆగిపోలేదు.

**సీ. కకు జుంజు వెంద్రుకల కొప్పు గాఢతరంబుగా**
**నెమలిఫించంబు చుట్టి,**
**తట్టు పున్గున వన్నె పెట్టినట్టి లలాట పట్టిక జేగురు బట్టు వెట్టి**
**గురివెంద పేర్లకుం దెరు వీని పాలిండ్ల బారుటాకులు గూర్చి పైటఁ దీర్చి**
**జమలి యెద్దాణంబునందున నిరియంగ బర్హాంబరము కటి పదిలపరిచి**
**వీకగల కురుగనుపుల వెదురు వింట**
**జాగపురి దాల్చి నారిగా సంతరించి**
**గసిక కోలలు గొని భిల్ల బిసరుహాక్షు**
**లడవిఁ దిరుగుదు రాత్మ నాయకుల గూడి.**

(శ్రీ కాళహస్తీమాహాత్మ్యము. త అతీయాశ్వాసము. ప. 15)

మోటైన చింపిరి జుట్టుని నెమలిఫించంతో చుట్టి, జవ్వాదితో మెరుగుపెట్టిన నుదుటిమీద ఎర్రని బట్టు పెట్టుకుని, నెమలిపింఛపు వస్త్రాన్ని కట్టి, పొడవైన వెదుళ్ళని వంచి అల్లెతాటిని కట్టి, కొయ్యముక్కలని చెక్కి పదునుపెట్టి బాణాలుగా చేసి తమ భర్తలతో బాటు వేటకు కూడా వెడతారు.

బోయరాజు భార్య ప్రసవానికి ముందు పల్లె పడుచులు చేసిన ఏర్పాట్లు, పురుడుపోసిన విధానం, తిన్నని చిన్ననాటి ఆటలు, వేటలో విశేషాలు, చివరికి పుల్లకి గుచ్చి కాల్చి తినే కకుట్లు (మాంసపు ముక్కలు) వీటన్నిటిని చక్కటి ద అశ్య కావ్యంలా చూపించాడు ధూర్జటి మహాకవి.

సాహితీ సమరాంగణ సార్వభౌముడు క అష్ణరాయల ఆముక్తమాల్యదలో జానపదుల సంగతులు చూద్దాం. ప్రథమాశ్వాసంలో విష్ణుచిత్తుడి కథ ఉంది. కథ ఉంటే ఊరు ఉన్నట్టేకదా! ఆ ఊరి పేరు విలుపుత్తూరు దాన్ని వర్ణిస్తూ ఉదయాన్నే కనబడే దృశ్యాన్ని గురించి ..

**మ. తలఁ బక్షఘటే గ్రుచ్చి బాతువులు కేదారంపుఁ గుల్యాంతర**
**స్థలి నిద్రింపఁగఁ జూచి యారెకులుష స్నాత ప్రయాతద్విజా**
**వలి పిండీక అత శాటిక ల్గని దదావాసంబుఁ జేర్వంగ రే**
**వుల డిగ్గ న్వెసఁ బారు వానిఁ గని నవ్వు న్శాలి గోప్యోఘముల్**
( ఆముక్తమాల్యద. ప్రథమాశ్వాసం. ప. 65)

అన్న పద్యం ఉంది. పదాలలో, అన్వయంలో ఉన్న కరుకుదనాన్ని ప్రక్కకు నెట్టి ఇందులో ఉన్న ముచ్చట ఏమిటో మూట విప్పి చూద్దాం.

తెల్లారింది. గ్రామం చివరన వరిపొలాలు, వాటిని ఆనుకుని పంటకాలువలు, వాటి గట్టు వెంబడి తలల్ని రెక్కల్లోకి ముడుచుకుని నిద్రపోతున్న బాతులు. ఆ దారిన నడిచిపోతున్న కాపలావాళ్ళ కళ్ళ బడ్డాయి ఈ బాతులు. దూరానికి అవి అప్పుడే స్నానం ముగించి, ఊళ్లోకి వెళ్ళిన బ్రాహ్మణులు పిండి ఉంచిన పంచలలాగా కనబడ్డాయి. అయ్యో పాపం మర్చిపోయినట్టున్నారు. వాళ్లకి పట్టుకెళ్ళి ఇచ్చేద్దాం అనుకుని చేత పుచ్చుకోబోతే రివ్వున ఎగిరాయి ఆబాతులు. ఇది చూసి పొలాలను కాస్తున్న పల్లెపడుచులు(శాలిగోప్యోఘముల్) ఫక్కున నవ్వారుట. ఇదీ రాయలవారు చిత్రించిన గ్రామీణ దశ్యం. సూర్యోదయానికి ముందే కాలవల్లో స్నానం చేసే బ్రాహ్మణులు, వాళ్ళు పిండి ఆరవేసుకునే పంచలు, మంచి మనసుగల కాపలావాళ్ళు, చిలిపితనం ఉట్టిపడే రైతు వనితలు.

రాయలు కవులకే కాదు కర్షకులకి కూడా తొడిగారు గండపెండేరాలు అన్నట్టుగా ఉంది కింది పద్యం. చతుర్థాశ్వాసంలో యామునాచార్యుడి కథలో వర్షఋతువును వర్ణించే సందర్భే ఇది.

**క. వరజుఁబడి రొంపిఁ ద్రొక్కం**
**చరణంబులఁ జుట్టి పసిడి చాయకడుపులం**
**బరి నీరుకట్టె లమరెను**
**బిరుదులు హాలికులు దున్నఁ బెట్టిరొ యనఁగన్**
(ఆముక్తమాల్యద. చతుర్థాశ్వాసం. ప. 125 )

వానలు బాగా పడి మెరక నేలలు కూడా సాగుకి సిద్ధం అయ్యాయి. రైతులు ఈ రేగడి భూమిని దున్నుతున్నారు. గట్ల వెంబడి నాగలి నడుపుతున్న వాళ్ళ కాళ్ళకి ఆ మట్టిలో ఉన్న నీటి పాములు పొట్టపైకి కనబడేటట్టు చుట్టుకున్నాయి. ఈ నీటి పాములకి పొట్టభాగం పచ్చగా మెరుస్తూ ఉంటుంది. ఇది ఎలా ఉందంటే అంతబాగా దున్నుతున్న రైతులు తమ నేర్పరితనాన్ని , గొప్పదనాన్ని చాటుకోవడానికి వేసుకున్న గండపెండేరాల(కడియాలు) వలె ఉన్నాయట.

**శా. ప్రాతర్వేళల నట్టివెట్ట సొగసై పాటిల్లెఁ గుంభోంభనో**
**దూతోంబుధ్వనివాద్యమై మరుదద్లపుంజీభవత్పాటల**
**వ్రాతామ్రేడితసిక్తభూసురభిళారామాంబుకుల్యాబహు**
**స్రోతస్సంధుల సంధుయంత్ర నతిక అత్రోద్గీత గేయౌఘముల్.**
\- ఆముక్త .ద్వితీయాశ్వాసం. ప. 55

అని వేసవికాలపు వర్ణనలో ఉంది. పల్లెటూళ్ళలో తోటలలో, మడులలో ఏతాం తొక్కడం ఒక ముఖ్యమైన పని. ఎండాకాలంలో మరింత శ్రమ పడతారు. ఎందుకంటే చిన్న చిన్న మడవలలోకి నీళ్ళు బిందెలతో ఎత్తి పోస్తే గాని నీళ్ళు తగలక మొక్కలు ఎండిపోతాయి. ఇక కూలి నాలి చేసుకునే వాళ్ళు అలసట తెలియకుండా పనిచేసేటప్పుడు పాటలు పాడుకోవడం మామూలే.

ఉదయాన్నే తోటలో ఏతాము తొక్కే వారు శ్రమ తెలియకుండా ఉండేందుకు ఎలుగెత్తి పాటలు పాడుతున్నారు. బావిలో మునుగుతున్న కుండల శబ్దం వాళ్ళ పాటకు మద్దెలవాద్యం లాగ ఉన్నదట. దీనితో బాటు పంటకాలువల మధ్య పాటల పుష్పాలతేనెతో తడిసిన నేల, సువాసనలను వెదజల్లుతూ మరింత మనోహరంగా ఉందట.

ఇలా వెతుక్కుంటూ పోతే ఈ కావ్యపు గనులలో ఎన్నెన్నో రత్నాలు కనబడుతూనే ఉంటాయి. సంప్రదాయ కవితా మార్గాన్ని ఎంచుకున్నా, సహజ సౌందర్యానికి ఆటపట్టైన జానపద జీవనంలో ఉన్న అందచందాలని తాము దర్శించి ఆనందించి, దాన్ని తమ కావ్యాలలో మచ్చుకి రుచి చూపిస్తూ వెళ్ళారు మన ప్రాచీన కవులు.

**- శ్రీమతి రాధా కాశీనాథుని**



**గత 35 ఏళ్ళుగా న్యూజెర్సీలో నివాసం ఉంటున్న రాధ గారు సాహిత్యాభిమాని. పూర్వం ఇండియాలో ఉండగా ఉపాధ్యాయురాలిగా పని చేసారు. ప్రస్తుత వ్యాసాంగాలు, ''తెలుగు జ్యోతి'' సహాయ సంపాదకత్వం, చిన్న పిల్లలకు తెలుగు నేర్పడం, కథలు, వ్యాసాలు, నాటికలు రాయడం. సంప్రదాయ సాహిత్యం అంటే ఎంతో ఇష్టపడే రాధగారు "సాహిత్య భారతి" అన్న పేరుతో రెండు నెలలకొకసారి సాహితీ సమావేశాలు ఏర్పాటు చేస్తూ ఉంటారు. వాలంటీర్ చెయ్యడం అంటే బోలెడు సరదా అంటారు. రాధ గారు! ఆమె భర్త కీర్తి శేషులు కాశీనాథుని సాంబశివరావు గారు "కాశీనాథుని దుర్గాంబ బుచ్చయ్య ట్రస్టు" అనే మానసిక ఇబ్బందులు గల బాలబాలికలకు ఉచితంగా శిక్షణ ఇచ్చే సంస్థను స్థాపించారు.**

# తెలుగు జానపద కళలు నిన్న నేడు రేపు

- పులిగొండ సుబ్బాచారి

ప్రొఫెసర్ పులికొండ సుబ్బాచారిజానపద విజ్ఞాన గిరిజన అధ్యయన శాఖద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం తెలుగు జానపద కళలు నిన్న నేడు రేపు జానపద కళలు అన్నీ మౌఖిక సమాజానికి చెందినవే. ఒక ప్రముఖ జానపద శాస్త్ర వేత్త చెప్పినట్లుగా దీన్ని తిప్పి చెప్పవచ్చు. మౌఖిక సమాజంలో ప్రవర్తించే కళలన్నీ జానపద కళలే. ఇక్కడ కళలు సాహిత్యం, విస్తృత పరిధిలో వాఙ్మయం, వృత్తి నైపుణ్యాలు, దేశీయ విజ్ఞానం, మౌఖిక కళలు ప్రదర్శన కళలు అన్నీ జానపదమే అవుతాయి. ద్రావిడ భాషలు 27 ఉండగా వాటిలో కేవలం నాలుగు భాషలలోనే లిఖిత సంప్రదాయం కలిగిన పరివర్ధిత సాహిత్యం వెలువడింది. అయినా ఇంకా 24 భాషలు మాట్లాడే సమాజాలు మౌఖిక సమాజాలుగానే ఉన్నాయి. వారికి చెందిన అన్ని రకాల కళలు జానపదమే అవుతాయి. తెలుగు రాష్ట్రాలలో ఉన్న జానపద కళల సంస్థితిని వాటి ప్రస్తుత ఉనికిని తెలుసుకోవడం రాబోయే రోజుల్లో మన నేలపైన ఉన్న జానపద కళ పరిస్థితి ఎలా మారుతుందో ఊహించడం దానికి అనుగుణంగా తీసుకోవలసిన చర్యలగురించి ఆలోచించడం ఈ వ్యాసంలోని ఉద్దేశం. మనదేశంలో మౌఖిక సంప్రదాయానికి చెందిన జానపద కళలు ఎన్నో నేటికీ కొనసాగి వస్తూ ఉన్నాయి. అభివృద్ధి చెందిన పాశ్చాత్య సమాజంలో ఈ పరిస్థితి లేదు. జానపద సంప్రదాయాలు జానపద ప్రదర్శన కళలు అక్కడ అంతరించాయి. జానపదానికి (zú_herlJ“³ úf ‡úlklúre) మాతృభూమి అని చెప్పే ఫిన్లాండులో కూడా జానపద ప్రదర్శన కళలు అంతరించాయి. మౌఖిక కళలు:తెలుగు రాష్ట్రాలలో ఉన్న జానపద కళలు చాలా రకాలుగా ఉన్నాయి. మౌఖిక కళలను అంటే మౌఖిక సాహిత్య కళలను, జానపద సాహిత్యాన్ని గమనించినట్లైతే ఇది వృత్తి కళాకారుల వద్ద ఉన్నది లేదా అందరి వద్ద ఉన్నది అని రెండు రకాలుగా మనకు కనిపిస్తూ ఉంది. వృత్తి కళాకారుల వద్ద జానపద సాహిత్యం ప్రదర్శన కళలో భాగంగా వర్తిల్లేది కాక పాటల రూపంలో కథల రూపంలో సామెతలు, ఉక్తుల రూపంలో చాలా ఉంది. ఇలాంటి సాహిత్యం జానపదులు అందరి దగ్గరా ఉంది. అయితే ఏ పల్లెకు వెళ్లినా ప్రతి ఇంట్లో పాట పాడే వారు కథ చెప్పే వారున్న ఒకనాటి పరిస్థితి నేడు లేదు. పాటలు పాడే వారు అక్కడక్కడా ప్రతి ఊర్లో కనిపిస్తున్నారు. కాని చాలా రకాల పాటలు అంతరించాయి. కొన్ని పనులు అంతరించగా ఆ పనులతో ఉన్న పాటలు అంతరించాయి. దంపుడు పాటలు, ఇసుర్రాతి పాటలు నేడు పూర్తిగా కనిపించకుండా పోయాయి. నాలుగు సంవత్సరాల క్రితం జానపద కథలపైన నేను చేసిన పరిశోధనలో ఆరు జిల్లాలలో సుమారు 200 ఊర్లు తిరిగితే 240 కథలు మాత్రమే సేకరించగలిగాము. చాలా ఊర్లలో అసలు కథలు చెప్పగలిగేవారే దొరకలేదు. విసుగు పుట్టిన దాకా అడిగినా ప్రయోజనం కనిపించేది కాదు. పెద్దతరం వారు కూడా “మాకే గుర్తులేవు నాయనా. పిల్లలు వింటే చెబుతాం కాని వారికి ఇవెందుకు వాళ్ళకి టి.వి చూడడానికే సమయం చాలడం లేదు కదా”. అనే సమాధానం వచ్చేది.



కాని సామెతలు ఇంకా బాగానే వినిపిస్తున్నాయి. ప్రతి పనిలోని వారూ సామెతలను ప్రయోగించడం కనిపించింది. పొడుపుకథల ప్రదర్శన ప్రత్యేకించి కనిపించలేదు. సేకరిస్తే అక్కడక్కడా దొరుకుతాయి. జానపద సాహిత్యం అని చెప్పబడే మౌఖిక కళల (లవతీఎజీశ్రీ జీతీబిబ) పరిస్థితి ఇది. మౌఖిక కళలలో పాట ముఖ్యమైన మార్పులకు గురైనా కూడా పాట అనేది ఇంకా చాలా కాలం బతికి ఉండే అవకాశం ఉంది. కారణం దీని అవసరం సమాజానికి ఇంకా ఉంది. ఉద్యమాలకి రాజకీయ అవసరాలకి పాట అవసరం ఇంకా చాలా ఉన్నట్లుగా మనకు తెలిసి వస్తూ ఉంది. అయితే జానపద గేయం అన్నది అంటే నోటి పాట అన్నది నయావాగ్గేయ కారుల ద్వారా కొత్త రూపు దాలుస్తుంది. దీన్నే మనం అనువర్తిత జానపద గేయం (జీజూజూశ్రీతివట టనీశ్రీని బనీనిణ) అని అంటాము. ఈనాడు మనకు వినిపించే గూడ అంజయ్య, గద్దర్, వంగపండు ప్రసాదరావు, గోరటి వెంకన్న తదితరుల పాటలు ఇలాంటివి. వారు జానపద గేయాల బాణీలను తీసుకుంటారు. ఆ భాషని వాడుకుంటారు. ఆ సంగీతాన్నీ వాడుకుంటారు. కాని తమకు కావలసిన వస్తువును అందులో ప్రవేశ పెడతారు. దీన్నే మనం అనువర్తిత జానపద గేయం అని అంటాము. కార్టూన్ షోల రూపంలోనికి కొన్ని జానపద కథలు కొత్త అవతారం ఎత్తే అవకాశం ఉంది. పొడుపు కథలు మరొక క్రీడగా అధునిక రూపం ఎత్తితే తప్ప అవి బతికే అవకాశం కనిపించడం లేదు. జానపద కథ సినిమా మాధ్యమంలో చాలా బలంగా పనిచేసింది. 1960-70 దశకాలలో చాలా జానపద అద్భుత కథలు సినిమా రూపాన్ని పొందాయి. విఠలాచార్య అనే దర్శకుడు చాలా జానపద కథలను సినిమా మాధ్యమంలోనికి చేర్చాడు. అవి అక్కడ చాలా విజయవంతంగా ఆడాయి. నిన్న మొన్న వచ్చిన బాహుబలి పొందిన విజయం చూస్తే తిరిగి జానపద కథలు సినిమా మాధ్యమంలో మంచి పాత్ర పోషించే పరిస్థితి కనిపిస్తూ ఉంది. బాహుబలి సినిమా నాలుగైదు జానపద కథల సమాహారంగా కనిపిస్తుంది. జానపద సాహిత్యం కొత్త రూపు

ఇది. జానపద ప్రదర్శన కళలు:తెలుగు నేల జానపద కళలకు పుట్టినిల్లు. దాదాపు 120కి పైగా జానపద ప్రదర్శన కళలు మనకు ఉన్నాయి. వాటిలో కనీసం 90 వరకు నేటికీ జీవించి ఉన్నాయి. వీటిలో కొన్ని నామమాత్రావశిష్టంగా ఉన్నాయి. అంటే ఒకరిద్దరు లేక ఒకటి రెండు కుటుంబాలే జీవించి కనిపిస్తాయి. అవి అంతరిస్తే ఆ కళలు కూడా అంతరించినట్లే. మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి గారు 140 జానపద కళలు ఉన్నాయని పేర్కొన్నారు. వాటిలో కొన్ని ప్రదర్శన కళలు ప్రాచీన గ్రంథాలలో పేర్కొన్నవి బయట లేనివి. మరికొన్ని జానపద ప్రదర్శన కళల విభాగంలో చేరే అవకాశం లేనివి. వీటిలో కొన్ని తెలుగు రాష్ట్రాలకు బయట ఉన్నవి కూడా ఉన్నాయి. తెలుగు నేలలో ఉన్న జానపద ప్రదర్శన కళలను కొన్ని వర్గాలుగా విభజించుకొనే వీలుంది. సార్వజనికంగా అందరూ ప్రదర్శించే కళలు. కేవలం ఒక కులం వారు వృత్తిగా ప్రదర్శించే వృత్తి జానపద కళలు అని ప్రాథమికంగా రెండు రకాలుగా విభజించవచ్చు. ఉదాహరణకి కోలాటం, గిన్నగిర్ర, వంటి ప్రదర్శన కళలు గ్రామంలోని ఏకులం వారైనా కలిసి అందరూ కలిసి చేసే ప్రదర్శనలు. ఉప్పుచర్రాట వంటి జానపద క్రీడలు కూడా ప్రదర్శన కళలలాగే కనిపిస్తాయి. ఇలాంటి క్రీడా ప్రదర్శనలు కూడా గ్రామంలోని అందరూ కలిసి చేస్తారు. ఇలా కాక గ్రామంలోని ఒక కులం మాత్రమే ఒక ప్రదర్శన కళను తీసుకొని వారు మాత్రమే ప్రదర్శించే జానపద కళలు కొన్ని ఉన్నాయి. వీటిని వృత్తి జానపద ప్రదర్శన కళలు అని చెప్పవచ్చు. ఇలాంటి జానపద ప్రదర్శన కళలు ఆంధ్ర ప్రదేశ్ అంటే రెండు తెలుగు రాష్ట్రాలలో చాలా ఉన్నాయి. ఈ వృత్తి జానపద కళలను తిరిగి మరికొన్ని విధాలుగా విభజించడానికి వీలుంది. ఒకరు మాత్రమే ఉండి ప్రదర్శించే కళలు ఉన్నాయి. రుంజకథ, పనసకథ, పిట్టలదొర, చోడిగాని కలాపం, హరికథ (ఇది పూర్తిగా జానపద కళ కాదు) ఇవి కేవలం ఒక కళాకారుడు మాత్రమే ఉండి ప్రదర్శించే కళలు. రుంజకథ ఒకే కళాకారుడు రుంజ అనే వాద్యాన్ని వాయించుకుంటూ కథ చెప్తాడు. పిట్టల దొర ప్రదర్శన వాద్యం లేకుండానే ఉంటుంది. చోడిగాని కలాపం కూడా ఒకే కళాకారుడు ఊరి మధ్యలో నిలబడి చేసే ప్రసంగం లాంటి వర్ణనాత్మక కళారూపం.ముగ్గురు కళాకారులు కలిసి ప్రదర్శించే జానపద ప్రదర్శన కళలు మనకు చాలా ఎక్కువగా ఉన్నాయి. ప్రధానమైన జానపద ప్రదర్శన కళలు ఎక్కువగా ముగ్గురు కళాకారులు కథ చెప్పేవి ఉన్నాయి. ఒక ప్రధాన కథకులు పాడుతూ కథను చెబుతూ ఉండగా ఇద్దరు వంతలుగా ఉంటూ కథని పాడుతూ లేదా వాద్యాలు వాయిస్తూ గాత్రసహకారం చేస్తూ ప్రదర్శించే కళలు ఈ కోవకు చెందుతాయి. పిచ్చుకుంటి కథ, ఒగ్గుకథ, బైండ్లకథ, కొమ్మల కథ, మందెచ్చుకథ, గౌడజెట్టికథ, చాకలి పటం కథ, దక్కలి పటం కథ, కూనపులికథ, శారదకథ, చిందుకథ, (చిందు యక్షగానం కాదు) బుర్రకథ (ఇది పాక్షిక జానపదకళ), పాండవులకథ, తొగటిజోగుల కథ, తెల్జీరోళ్ళకథ, జంగంకథ, ఆసాదికథ, గొల్లసుద్దులు, కాకిపడిగెల కథ, జముకుల కథ, వీరముష్టికథ తోలుబొమ్మలాట, చెక్కబొమ్మలాట ఇంకా ఇలాంటి కళారూపాలలో ప్రధానంగా కథకులు ముగ్గురు ఉంటారు. వీరికి తోడుగా కొందరు వాద్యకారులు అధికంగా కూడా ఉండవచ్చు. చాలా కళారూపాలలో ఇద్దరు వంతగాయకులుగా ఉన్నవారే వాద్యాలుకూడా వాయిస్తారు. మరికొన్నింటిలో వాద్యకారులు అధికంగా ఉంటారు. ఒగ్గుకథలో ముగ్గురు కథ చెబుతూ ఉండగా ఒగ్గుడోలు తాళాలు వాయించే వారు వెనుక ఉండి వాద్యాలు వాయిస్తారు. కొన్నింటిలో ఈ పద్ధతి ఉంటుంది. జానపద ప్రదర్శన కళలలో ప్రధానంగా జానపద నాటకానికి సంబంధించి వీటిని ప్రాచీన నాటక కళగా చెప్పవచ్చు.



నాటక కళ అనేది పూర్తి నాటకంగా పరివర్థితం చెంది అంటే ఒక పాత్రకు ఒక నటుడు ఉంటూ కథలోని పాత్రలన్నీ ప్రదర్శనలో ఉంటూ సన్నివేశాలు అన్నింటినీ పూర్తిగా నటిస్తూ కథను పాత్రలు అన్నింటి ద్వారా వ్యక్తం చేసే ప్రదర్శనలో పూర్తి నాటకం తయారు అవుతుంది. కాని పైన చెప్పిన ఒకే కళాకారుడు చేసే ప్రదర్శనలో ఒకే వ్యక్తి అన్ని సందర్భాలలో తానే నటిస్తాడు. అలా కథని పూర్తిగా ప్రేక్షకులకు అందిస్తాడు. ప్రేక్షకులలో కూడా కథా పాత్రలని చూచిన అనుభూతిని పరోక్షంగా పొందుతారు. ఇక ముగ్గురు కళాకారులు ప్రదర్శిస్తూ చెప్పే కథలో కూడా ఈ ముగ్గురే కథలోని పాత్రలను అన్నీ తాముగా సందర్భాన్ని బట్టి పాత్రలను మార్చుకుంటూ ప్రదర్శిస్తారు. ఇక్కడ పైన చెప్పిన ఒక కళాకారుని ప్రదర్శనలో కాని ఇక్కడ ముగ్గురు చెప్పే ప్రదర్శనలో కాని ఆహార్యం అనేది వారికి స్థిరంగా ఉంటుంది. మారదు. కాని అదే ఆహార్యంలో అన్ని పాత్రలను ప్రేక్షకులకు సూచించగలుగుతారు. కథ పూర్తిగా ప్రేక్షకులకు వ్యక్తం అవుతుంది. పూర్తి నాటక ప్రక్రియ అభివృద్ధి కాకముందు నుండి ఉన్న కళారూపాలు ఇవి. అంటే నాటకానికి పూర్వరంగంగా ఉన్న కళలు. అందుకే వీటిని ప్రాక్తన నాటకం అని చెప్పాలి. దీన్నే ఇంగ్లీషులో ప్రిమిటివ్ థియేటర్ (జూతీతిఎతిబితిలవ బిష్టవజీబితీవ) అని చెప్పవచ్చు. ఇలా ఉన్న ఇద్దరు ముగ్గురు ఉన్న కళా ప్రదర్శనల తర్వాత అన్ని పాత్రలకు అన్ని కళాకారులు ఉండి పూర్తి నాటక స్థాయికి వచ్చిన జానపద ప్రదర్శన కళలు మనకు ఉన్నాయి.



చిందుయక్షగానం, చిరుతల యక్షగానం, తెలంగాణ యక్షగానం, గొండ్లి నృత్యం వంటి నృత్య కళలు, తూర్పు భాగవతం, వీధినాటకం, కుప్పం వీధి నాటకం, ఇవి పూర్తి నాటక ప్రదర్శనలు అవుతాయి. వీటిలో కూడా కొన్ని నాటక ప్రదర్శనలు సాంప్రదాయికంగా ఒక కులం వారు ఒక ప్రాంతం వారే ప్రదర్శిస్తూ వస్తున్నారు. చిందు యక్షగానం చిందు మాదిగలు ప్రదర్శిస్తారు. చిరుతల యక్షగానాన్ని ఏ కులంవారైనా గ్రామంలోని ఎవరైనా పాల్గొని జట్టుగా ఉండి ప్రదర్శించవచ్చు. తెలంగాణ యక్షగానంలో కూడా ఎవరైనా ప్రదర్శించవచ్చు. తూర్పు భాగవతం జంగాలు అనేవారిది. కుప్పం వీధి నాటకం కూడా ఒక కులం వారిదే. ఈ ప్రదర్శన కళలు అన్నీ కూడా పూర్తి నాటక స్థాయికి చేరినవి. కథను పూర్తిగా అన్ని పాత్రలతో ప్రదర్శిస్తాయి. జానపద ప్రదర్శన కళల నేటి పరిస్థితి:తెలుగు రాష్ట్రాలలో పైన చెప్పిన జానపద కళలే కాక ఇంకా కొన్ని కనిపిస్తాయి. కొన్ని కళారూపాలు ఇంకా చాలా బలంగా ఉన్నాయి. కొన్ని పేరుకు మాత్రమే నిలిచి ఉన్నాయి. కొన్ని ఏడాదికి ఒకసారి కనిపిస్తాయి. కొన్ని జానపదుల తిరునాళ్ళలో జాతరలలో మాత్రమే కనిపిస్తాయి. కొన్ని అంతరించి పోయాయి. తెలంగాణలో ఒగ్గుకథ చాలా బలంగా ఉంది. కనీసం 200 ఒగ్గు కథా బృందాలు పనిచేస్తున్నాయి. జీవనోపాధిని బాగా పొందుతున్నాయి. వీళ్ళు కురమలకు చెందిన కులపురాణం మల్లన్న కథలు ప్రధానంగా చెబుతారు. ఇవి కాక, బీరప్పకథ, మాంధాత కథ, ఎల్లమ్మ కథలను చెబుతారు. కురమలు వీరిని బాగా ఆదరిస్తారు. వీరు కథలు చెప్పడం మాత్రమే కాక పూజారి పనులు అన్నింటినీ కురమల ఇండ్లలో వీరే చేస్తారు. అందుకే వీరిని ఒగ్గు పూజారులు అని కూడా అంటారు. ఈ కారణంగానే ఒగ్గు బృందాలు ఇంకా చాలా బలంగా ఉన్నాయి. ఇలా క్రతువులు ఆచారాలతో సంబంధం ఉన్న ప్రదర్శన కళలు సజీవంగా ఉండి నిలబడగలుగుతున్నాయి. పిచ్చుకుంటి కథ, శారదకథ వంటివి నామమాత్రంగా ఉన్నాయి. వీటిని పోషించే వారు ప్రత్యేకించిలేరు. ఇక కొన్ని కళలను ప్రజలు అడగటం లేదు. కేవలం ప్రభుత్వ కార్యక్రమాలలో ఇతర మైన అధికారికి కార్యక్రమాలలోనే ఇవి జరుగుతున్నాయి. తోలుబొమ్మలాట, చెక్క బొమ్మలాట, తప్పెట గుళ్ళు వంటివి ఇలా మిగిలాయి. ఆసాది కథ, కొమ్ముల కథ వంటివి జాతరలలోనే కనిపిస్తాయి. అందువల్ల అవి సంవత్సరానికి ఒకసారైనా ప్రజలకు కనిపిస్తున్నాయి. జానపద ప్రదర్శన కళలకు గ్రహణం:గ్రామాలలో ప్రవర్తించే ఈ జానపద కళలు అన్నింటికి ప్రజల ఆదరణ ఒకప్పుడు అంటే కనీసం 20 లేదా 30 సంవత్సరాల క్రితం బాగా ఉండేది. గ్రామీణ ప్రజలకు మంచి వినోదం వారికి దగ్గరలో ఉన్న పట్టణంలో ఉన్న సినిమా. నెలకొకసారైనా దగ్గరలో ఉన్న పట్టణానికి పోయి సినిమా చూసేవారు. కాగా మిగతా రోజుల్లో వారికి వినోదాన్ని అందించేవి పూర్తిగా అందించినవి జానపద కళలే. వారికున్న ఖాళీ సమయం అంతా జానపద క్రీడలతో జానపద ప్రదర్శనలతో గడిచేది. ఈ ఖాళీ సమయాన్ని అంతా ఆక్రమించింది టి.వి. దూరదర్శన్ మాత్రమే ఉన్న రోజుల్లో కూడా జానపద కళలు కొంతకు కొంత బతికి ఉన్నాయి. కాని సెటిలైట్ టి.వి వచ్చి గ్రామ గ్రామానికి వ్యాపించిన తర్వాత గ్రామీణుల ఖాళీ సమయం అంతా టి.వి కే పరిమితం అయింది. 1997లో మొదటి సారిగా సెటిలైట్ టి.వి తెలుగు నేలపైకి వచ్చింది. ఈటివి తో ఇలా మొదలై క్రమంలో చాలా ఛానళ్ళు కార్యక్రమాలను అందించడం మొదలైంది. మొదట్లో కొన్ని వినోద కార్యక్రమాలు సినిమాలు వచ్చేవి. రోజులో కొన్ని గంటలే ఉండేవి. తర్వాత 24 గంటలూ నడిచే ఛానళ్ళు వచ్చేయి. అంతే కాదు సినిమాలకు వేరే ఛానళ్ళు, మతకార్యక్రమాలకు కొన్ని, హాస్యానికి కొన్ని, ఆటలకు కొన్ని ఇలా రకరకాలుగా వచ్చాయి. సీరియళ్ళు కూడా గ్రామీణులను ఇంటిలోనుండి బయటికి రాకుండా కట్టి పడవేస్తున్నాయి. ఇంతకు ముందు హరికథలలాంటి మతపరమైన ప్రదర్శనలకు టి.వి కట్టేసి వచ్చేవారు. ఇప్పుడు వాటిని కూడా ఇంటి దగ్గర టివిలో చూచే పరిస్థితి వచ్చింది. సెటిలైట్ టి.వి అనే మాధ్యమ వ్యవస్థ జానపద కళలను చావు దెబ్బకొట్టింది. జానపద కళలు అంతరించి పోవడానికి ప్రపంచీకరణ ఫలితంగా వచ్చిన ఈ సెటిలైట్ టి.వి యే ప్రధాన కారణం అని చెప్పవచ్చు. ఒకప్పుడు సినిమా నాటక రంగంపైన గట్టి ప్రభావం చూపింది. రేడియో కూడా జానపద కళలపైన కొంత ప్రభావం చూపింది. అయినా సినిమా దెబ్బకు జానపద కళలు కొంత తట్టుకున్నాయి. సెటిలైట్ టి.వి అనేది గ్రామీణుల అభిరుచులను మార్చింది. నగరవాతావరణం ప్రతి గ్రామంలో రావడానికి కారణం అయింది. సంస్కృతిని మార్చింది. గ్రామీణుల వేష భాషలు మారాయి. సినిమా అనేది గృహ ప్రక్రియ అయింది. పనిలేని ఖాళీ సమయం అంతా టి.వి కే సరిపోయింది. ఇదే జానపద కళల పట్ల జీవాంతకం అయింది. అంతర్జాలం (ఎనిబివతీనివబి) సీమాంతర వ్యాప్తి, జానపదకళల రేపటి స్థితి:ప్రపంచీకరణలో మరొక కోణం కూడా ఉంది. అంతర్జాలం

కారణంగా ఒక ప్రాంతానికే పరిమితం అయిన జానపద కళలు ప్రపంచం మొత్తానికే వ్యాప్తి చెందే స్థితి కూడా వచ్చింది. జానపద కళాకారులు కొందరు వారి కళలను వీడియో చేసి యూట్యూబ్ కి అప్ లోడ్ చేసారు. ఫలితంగా వాటిని ప్రపంచంలో చాలా దేశాలలో ఉన్న తెలుగు వారు ఇతర పరిశోధకులు చూచే అవకాశం వచ్చింది. ఒగ్గుకథ, బైండ్లకథ, తప్పెటగుళ్ళు వంటివి ఇంకా చాలా నేడు నెట్ లో కనిపిస్తున్నాయి. కొన్ని బ్లాగులు కూడా జానపద కళలను పరిచయం చేస్తున్నాయి. కొన్ని ఛానళ్ళు కూడా జానపద కళలను ప్రసారం చేస్తున్నాయి. టి.వి ముందే కూర్చొనే ప్రేక్షకులకు వారి జానపద కళలు వారు బయటికి పోకుండా వారి ఇంట్లోనే కనిపించే సౌకర్యం కూడా వచ్చింది. ఇది జానపద కళలకు మరొక దశ అని నావఇనీనిట శ్రీతిటవ రెండో జీవితం అని కూడా చెప్పడానికి వీలుంది. అయితే కొన్ని కళారూపాలకు మాత్రమే ఈ స్థితిలో ఉన్నాయి. పరిశోధకులు మరికొన్ని సంస్థలు కలిసి కృషి చేస్తే ఇప్పటికి బతికి ఉన్న కళలను ఈ విధంగా డాక్యుమెంట్ చేసి అంతర్జాలంలో వ్యాప్తి చేయడానికి వీలుంది. అలా మరికొన్ని దశాబ్దాలపాటు వాటిని బతికించడానికి వీలవుతుంది. ఇలా నెట్ లో జానపద కళలు పరిచయం అవుతూ అంతర్జాతీయ స్థాయిలో కనిపిస్తూ ఉండడంవల్ల ఆయా కళలను వివిధ ప్రాంతాలో ఉన్న సంస్థలు పిలిచి వారి ప్రదర్శనలను ఏర్పాటు చేస్తున్నాయి. నగర ప్రజలలో ఉన్న గ్రామీణ సంస్కృతిపైన ఉన్న ఒక రకమైన ఔత్సుక్యం వలీనీబితిఇ తినిబివతీవబబి వల్ల ఈ కళలను ఇలా అంతర్జాలంలో చూచి వారిని ప్రదర్శనకు పిలుస్తున్నారు. ఇలా ఈ కళాకారులకు కొంతైనా వ్యాపకం దొరుకుతున్నది. భవిష్యత్తులో జానపదకళలు ఇలా అంతర్జాలం ద్వారా ద్వితీయ జీవితాన్ని పొంది మరికొంత వ్యాప్తి పొందే అవకాశం ఉంది. కొన్ని పూర్తిగా అంతరించినా ప్రజాకర్షకమైన కొన్ని జానపద కళలు కొత్త మాధ్యమాలలోనికి చేరి సజీవంగా సరికొత్త రూపంలో ఉండే అవ కాశం ఉంది.

ఉపయోగపడే పుస్తకాలు:రాధాకృష్ణ మూర్తి. 1992. తెలుగు వారి జానపద కళారూపాలు. హైదరాబాదు: తెలుగు విశ్వవిద్యాలయంరామరాజు బిరుదురాజు. 1978. తెలుగు జానపద గేయసాహిత్యము. హైదరాబాదు: జానపద ప్రచురణలు.సుందరం ఆర్వీయస్. 1983. ఆంధ్రుల జానపద విజ్ఞానం. హైదరాబాదు: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ సుబ్బాచారి పులికొండ. 2000. తెలుగులో కులపురాణాలు ఆశ్రిత వ్యవస్థ. హైదరాబాదు: ప్రజాశక్తి బుక్ హౌస్.సుబ్బాచారి పులికొండ. 2006. తెలుగు జానపద విజ్ఞానం. కుప్పం: ద్రావిడ విశ్వవిద్యాలయం.

**– పులిగొండ సుబ్బాచారి**



**ఈయన ద్రావిడ విశ్వవిద్యాలయంలో జానపద శాఖలో ఆచార్యుడిగా పనిచేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ జానపద సాహిత్య పరిషత్ నుండి 1991లో, జానపద అద్భుత కథా నిర్మాణం అనే గ్రంధానికి రామరాజు జానపదవిజ్ఞాన బహుమతి అనే రాష్ట్రస్థాయి బహుమతి పొందారు. జానపద విజ్ఞానం, ప్రదర్శన కళలు, తెలుగు సాహిత్యం, భాష, సాహిత్య విమర్శలలో నిరంతరం కృషి చేస్తున్న సుబ్బాచారి గారు ఇప్పటి వరకు 16 పుస్తకాలు ప్రచురించారు.**



# అన్నమయ్య జానపదం

తాళ్ళపాక అన్నమయ్య వేవేల సంకీర్తనలతో తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామిని ఆరాధించిన తొలి తెలుగు వాగ్గేయకారుడు, తెలుగు పాటకు ప్రాణం పోసి, పదకవితకు పట్టం కట్టి జానపదానికి వన్నె తెచ్చిన కవివరేణ్యుడు. సంస్కృత వేదాల్లోని సారాన్ని అలతి అలతి అందాల అచ్చ తెలుగు పదకవితలలో "ఆంధ్ర వేదం"గా మలచి సామాన్యుడికి సులభంగా అర్థమయ్యే రీతిలో అందించి అసామాన్యుడైన పదకవితా చక్రవర్తి. ముప్ఫైరెండు వేల సంకీర్తనలతో ముక్తి మార్గాన్ని పరచిన మహనీయుడు. దక్షిణ భారత దేశంలో తొలి వాగ్గేయకారుడైన ఈ భక్తాగ్రగణ్యుడు కడప జిల్లా రాజంపేట తాలూకా తాళ్ళపాక గ్రామంలో క్రీ.శ. 1408 సం.లో వైశాఖ మాసం విశాఖ నక్షత్రంలో ఆకాశంలో ముచ్చటగా మూడు గ్రహాలు ఉన్నత స్థానంలో ఉండగా శక్తి మునికి పరాశర ముని పుట్టినట్లు పుణ్య దంపతులైన లక్కమాంబ నారాయణసూరిలకు జన్మించాడు. ప్రబంధ కవులు రాజ్యమేలుతున్న కాలంలో పద్యాన్ని త్రోసి రాజని పదానికి పట్టం కట్టిన ధీరుడు అన్నమయ్య, ఈ మహనీయుడు తన సంకీర్తనలను పండితుల కోసం కంటే, పామరులకోసమే రాసాడు. జానపదులతో మమేకమైనాడు. సామాన్య మానవులతో కలసి తిరిగి విష్ణు భక్తిని ప్రచారం చేసాడు. జానపద సంగీతాన్ని తన పదాలలో చొప్పించాడు. జీవితంలోని ప్రతి ఘట్టానికి అనువైన పాటనొక దానిని సృష్టించాడు అందుకే అన్నమయ్య సంకీర్తనలలో జాజఅలు, చందమామలు, కోవెల, చిలుక, తుమ్మెద పదములు, లాలి, సువ్వి, గొబ్బి, ఉయ్యాల, లాల, జోల, జోజో, జేజే, జయ జయ, విజయీభవ, శోభన, మంగళ, వైభోగములు, మేలుకొలుపులు, నలుగులు, దంపుళు ్ళ, కొట్నాలు, కూగూగులు, గుజ్జెనగూళ్ళు, చందమామ గుటకలు, నివాళు లు, ఆరతులు, మంగళారతులు, జయమంగళాలు, అల్లోనేరేళ్ళు, చాగుబళాలు, బళాబళాలు, సాసముఖాలు, అవధానాలు, తందానలు, వెన్నెలలు ఇలాంటి జానపద ప్రక్రియలు కోకొల్లలు. ప్రతి తెలుగు తల్లి తన మురిపాల బిడ్డను పొత్తిళ్ళలో పొదుగుకుని సాయం సంధ్య వేళ వినీలాకాశంలో వెలుగులీనుతున్న చందమామను చూపిస్తూ "చందమామ రావో జాబిల్లి రావోమంచి కుందనంపు వెండికోర వెన్న పాలు తేవో"అంటూ కమ్మని గోరుముద్దలు తినిపిస్తుంది. తర్వాత ఆ బిడ్డను ఉయ్యాలలో పడుకోబెట్టి "జో అచ్యుతానందా జోజో ముకుందరావె పరమానంద రామ గోవింద"అంటూ మధురమైన జోల పాడుతుంది. అన్నమయ్య పాట లోని మాధుర్యానికి, అమ్మ ప్రేమలోని కమ్మదనానికి పరవశించిన బిడ్డ హాయిగా నిద్రలోకి జారుకుంటుంది. తరతరాలుగా తెలుగు వారిని అలరిస్తున్న ఈ పాటలు అన్నమయ్య తెలుగు జాతికి అందించిన వరాలు. అన్నమయ్య వేదాంత సారాన్ని 'బ్రహ్మమొక్కటే, పర బ్రహ్మమొక్కటే, తందనాన ఆహి, తందనాన పురే' అంటూ ఎలుగెత్తి చాటాడు. 'నిండార రాజు నిద్రించు నిద్రొకటే! అండనే బంటు నిద్రదియు నొకటే, అందరికీ శ్రీహరే అంతరాత్మ' అంటూ సర్వ సమానత్వాన్ని జానపద కీర్తనలలో చాటి చెప్పాడు. ఇంకో



అడుగు ముందుకేసి"ఏ కులజుడేమి ఎవ్వడైననేమిఆకడ నాతడె హరి నెఱిగిన వాడు"అని తాను చెప్పదలుచుకున్న విషయానికి మాధ్యమంగా జానపదాన్ని ఎంచుకుని పల్లెలలోని జనావాసాలకు చేరుకున్నాడు. సత్య సంపన్నత, ధర్మ తత్పరత, భూత దయ మొదలగు లక్షణాలు కలిగినవాడే ఉత్తముడనే మేలుకొలుపు సందేశాలను వాడ వాడలా ప్రచారం చేశాడు. అన్నమయ్య కవిత్వంలో స్త్రీ సంబంధమైన జానపద కీర్తనలు అనేకం ఉన్నాయి. శ్రీవేంకటేశ్వర స్వామి వారి దేవేరియైన అలమేల్మంగపైనా అన్నమయ్య పాటలనేకం రాశాడు. 'చక్కని తల్లికి చాంగు భళా, తన చక్కెర మోవికి చాంగు భళా' అంటూ అమ్మవారి అతిశయ సౌందర్యాన్ని కీర్తిస్తాడు. అందమైన అచ్చ తెలుగు పదాలతో నిండిన ఈ పాటలో లాలిత్యం, సౌకుమార్యం, సహజత్వం ఒప్పారి ప్రవహిస్తున్నాయి. సువ్వి సువ్వి అని స్త్రీలు రోకళ్ళతో దంచే దృశ్యాలను మనం పల్లెటూళ్ళలో చూస్తుంటాం! ఈ సందర్భంలో పాడే పాటలను దంపుడు పాటలు అంటారు. రోకళ్ళతో రోలులో పోటు వేసేటప్పుడు పునరుక్తితో 'ఇస్' అంటూ స్త్రీలు దంచటం జరుగుతుంది. ధ్వన్యనుకరణలో 'ఇస్' కాస్తా సువ్వి సువ్విగా మారుతుంది. అన్నమయ్య 'సువ్వి సువ్వనుచు దేవకి నందను గనియె' అని కృష్ణుని పుట్టుకను వర్ణిస్తాడు. ఇక్కడ దేవకి దేవి అందరి తల్లుల్లా ప్రసవ వేదనతో కాకుండా నవ్వుతూ ప్రసవించినదట! ఈ పాటలో చంద్రోదయం కావడం, కలువలు వికసించటం, గాడిద అరవటం వంటి ప్రకృతి సంబంధమైన విషయాలు కూడా ప్రస్తావితమైనాయి. తెలుగు జానపద సంస్కృతిలో ముఖ్య భాగమైనపండుగ సంక్రాంతి. దక్షిణాయనం నుండి ఉత్తరాయణానికి తీసుకెళ్ళే ఈ పండుగ చుట్టూ అనేక విశేషాలు కొలువుదీరి ఉన్నాయి. తెల్లవారు ఝామునే లేచి చలికాచుకోవటానికి వేసే 'చలి మంటలు' , 'హరిలో రంగ హరి' అంటూ హరిదాసుల కీర్తనలు, 'డూ డూ' బసవన్నల గంగిరెద్దు విన్యాసాలు, పిట్టల దొరల కారు కూతలు... ఇలా ఎన్నో తెలుగు వారి గ్రామీణ జానపద సంస్కృతిని ప్రతిబింబించే అపురూప ఘట్టాలు!సంక్రాంతి నెలలో బాలికలు తమ ఇళ్ళ ముందు గొబ్బిళ్ళు పెట్టి వలయాకారంలో వాటి చుట్టూ తిరుగుతూ గొబ్బిళ్ళో, గొబ్బిళ్ళో అని పాడుకుంటారు. 'కొలని దోపరికి గొబ్బిళ్ళో, యదుకులము స్వామికిని గొబ్బిళ్ళో' అంటూ ఈ సందర్భాన్ని కళ్ళకు కట్టినట్లు చూపిస్తాడన్నమయ్య!లోకంలో అత్తా కోడళ్ళ మధ్య ఉండే తగాదాలు మనందరికీ తెలిసినవే! అన్నమయ్య చమత్కారంగా లక్ష్మీ సరస్వతుల మధ్య గల గొడవలను ఓ పాటలో చిత్రీకరించాడు. 'రావే కోడల రట్టడి కోడల' అని లక్ష్మి సరస్వతిని పిలిస్తే, 'పోవే పోవే అత్తయ్యా, పొందులు నీతో చాలును' అంటూ ఎత్తిపొడుస్తుంది. ఈ విధంగా పాటంతా ఒకరినొకరు తిట్టుకుంటూ



సంభాషణాత్మకంగా హాస్యధోరణిలో సాగుతుంది. వసంతోత్సవాలలో పూలతో, వాటి పుప్పొడులతో ప్రేయసీ ప్రియులు సరసంగా ఆడుకునే ఆట జాజరాట! 'జగడపు చనవుల జాజర, సగినల మంచపు జాజర' అంటూ అన్నమయ్య వేంకటేశ్వర స్వామి జాజరను వర్ణిస్తాడు. 'తొల్లింటి వలె గావు మమ్ము తుమ్మెదా! ఇంక నొల్లవుగా మమ్ము వో తుమ్మెదా' అని అద్భుతంగా తుమ్మెద పదాలను రాశాడు అన్నమయ్య! ఇక ప్రకృతి వర్ణనలో భాగంగా సూర్య చంద్రులను స్వామి వారి నేత్రాలతో పోల్చిన అన్నమయ్య ఒక పాటను పూర్తిగా చందమామపై రాశాడు. "సందెకాడ పుట్టినట్టి చాయల పంట యెంత చందమాయ చూడరమ్మ చందమామ పంట" భావ సంపదతో, తెలుగు భాషా వైభవంతో చందమామను వర్ణించిన పదమిది."అరుదై తూరుపు కొండ నారగబండిన పంట అని అన్నమయ్య జానపద ధోరణిలో వర్ణిస్తుంటే, వినే వారి మనసులలో వెన్నెల ప్రకాశించి చల్లని అనుభూతినిస్తుంది. శ్రీమహా విష్ణువు యొక్క దశావతార విశేషాలను జానపద కీర్తనలలో అన్నమయ్య అందించాడు. 'శిఋత నవ్వుల వాడె శిన్నెకా' అనే పాట పొడువు కథా రూపంలో సాగుతుంది. పొలసుమేనివాడు అని మత్స్యావతారాన్ని బోరవీపువాడు అని కూర్మావతారాన్ని సెలసుమోరవాడు అని వరాహావతారాన్ని గొలుసుల వంకల కోరలతో బూమి వెలసినాడు అని నరసింహావతారాన్ని మేటి కురచవాడు అని వామనావతారాన్ని సీటకాలవాడు అని బలరామావతారాన్ని ఆటదాని బాసి అడవిలో రాకాసి వేటలాడి అని రామావతారాన్ని బింకపుమోతల పిల్లగోవి వాడు అని కృష్ణావతారాన్ని హృద్యంగా వర్ణిస్తాడు అన్నమయ్య అన్నమయ్య జానపద కీర్తనలలో భాగంగా వ్యవసాయ పనులను వర్ణించాడు. పొత్తుల పాపమనేటి పోదు నతికి వేసిచిత్తమనియెదు చేను చేనుగా దున్నిమత్తిలి శాంతమనే మంచి వాన పదనున విత్తుదురు హరిభక్తి వివేకులు కామక్రోధాదులనే కలుపు చేసివేమరు వైరాగ్యమనే వెలుగు వెట్టి దోమటి నాచారవిధుల యెరువులు వేసివోముచున్నారు జ్ఞానపు పైరుద్యోగ జనులు అలాగే "వాడల వాడల వెంట వాడెవో వాడెవో, నీడనుండి చీరలమ్మే నేత బేహారి" అంటూ చేనేత పద్ధతులను, చీరలమ్మే విధానాన్ని తెలియజేశాడు. ఆటవారి గూడితౌరా... అంటూ మానవాళినంతటినీ సంచార జానపదులైన తోలుబమ్మలాటవారితో పోల్చిన విధం చూడండి:ఆటవారి గూడితౌరా ఆటవారి గూడి అన్నిచోట్ల బమ్మలాట లాడించ నధికుండవైతివి గురుతరమగు పెద్ద కొట్టాము లోపల తిరమైన పెను మాయ తెర గట్టిఅరయ నజ్ఞానము లవి యడ్డముగ జేసిపరగ సుజ్ఞాన దీపములు ముట్టించితోలుబమ్మల దొరకొని గడియించి గాలిచేత వాని గదలించితూలేటి రసములు తొమ్మిది గడియించినాలుగు ముఖముల నలువున నాడించనిన్నే మెత్తురుగాని నీకేమి నీలేరు మన్నించు దాతలు మరి లేరుయెన్నగ తిరువేంకటేశ్వర నీ దాసులున్నతులై నిన్ను నుబ్బించి పొగడగఅన్నమయ్య అనేక రీతులలో జానపదుల జీవనశైలిని తన సంకీర్తనలలో ప్రతిబింబించాడు. ఉదాహరణకు 'తిరుమలయ్య విందు మంచిదే వుండంటే వుంటినమ్మ, సరవిలేని చెంచువారి సంగతేల తనకు అని గిరిజనుల నిర్మల భక్తిని, నెయ్యములల్లో నేరేళ్ళో, ఒయ్యన వూరెడి వువ్విళ్ళో అనే జానపదుల ఆనంద వైచిత్రిని, లాలి లాలి లాలెమ్మ లాలి అంటూ లాలిలోని మాధుర్యాన్ని తన జానపద సంకీర్తనల మధు కలశము నుండి ఒలికించిన జానపద ప్రేమికుడు అన్నమయ్య. ఈ విధంగా అన్నమయ్య జానపదుల జీవభాషలో పాటలు రాసి వాటిని దేవ దేవుడైన శ్రీవేంకటేశ్వరునికి అంకితం చేసి చరిత్రలో చిరస్మరణీయుడయ్యడు. ఇంత వరకూ లోకం వెలుగు చూడని, పరిశోధనలో బయటపడిన ఓ చక్కటి జానపద శైలి మంగళం ద్వారా ఈ వ్యాసానికి మంగళారతి పలుకుదాం!!!మదనుని తల్లికి మంగళం ? మదగజ గమనకు మంగళం//పల్లవి//కంజదళాక్షికి కప్పురగంధికి ? మంజులవాణికి మంగళంమంజరికుచకును మధుకరవేణి(కి) ? మంజులపదకును మంగళం//1//ఇందువదనకు(ను) ఇభరిపుమధ్యకు – మందస్మితకును మంగళంకుందరదనకును గురునితంబ కబ్జ ? మందిర కెపుడు(ను) మంగళం//2// అంగనామణికిని అంబుజపాణికి మంగళవతికిని మంగళంరంగుగ వే0కటరమణుని యలమే ల్మంగకు నెప్పుడు మంగళం//3//

**– గంథం బసవ శంకరరావు**



వృత్తిరిత్యా హైదరాబాద్‌లోని శాంతా బయోటెక్నిక్స్‌లో పనిచేస్తున్న గంథం బసవ శంకరరావు గారు అన్నమయ్య సంకీర్తనలపై నిరంతర పరిశోధనను చేస్తూ ఆ పరిశోధనా ఫలితాలను తెలుగు జాతికి అందించే ప్రయత్నంలో ఉన్నారు. విద్యార్థి దశలో అన్నమయ్య సాహిత్యాన్ని పరిశోధనా క్షేత్రంగా ఎంచుకుని 300పైగా కొత్త కీర్తనల్ని వెలికితీసి, నిపుణుల ముందుంచి నిర్ధారణ చేసి వెలుగులోకి తెచ్చారు. వీరు "అన్నమయ్య పదామృతవర్షిణి" "అన్నమయ్య పదమందాకిని" అనే గ్రంథాల ద్వారా 400 పైగా సంకీర్తనలకు వ్యాఖ్యానం అందించారు. శంకరరావు గారు తెలుగు విశ్వవిద్యాలయం వారు పరిశోధనా రంగంలో ప్రముఖులకు ఇచ్చే "కీర్తి పురస్కారం" అందుకున్నారు.

# పంబాలల పుట్టు పూర్వోత్తరాలు

పంబాల పర్వతాలు పరిశోధక విద్యార్థి

జానపద సాహిత్యం, విజ్ఞానం నిరంతర పరిశోధనకు ప్రేరణనిస్తూనే ఉన్నాయి. ఒకే విషయాన్ని వివిధ కోణాలలో పరిశీలించడం వల్ల పరిశోధన లక్ష్యం, రూపం మారుతుంటాయి. ఇలా ఒక అంశంపై ఎన్నో పరిశోధనలు వెలుగుచూసినా ఇంకా పరిశోధించ వలసిన విషయాలు లెక్కకు మించి ఉంటాయి. జానపద పరిశోధనలో ఒక భాగం గాయక సమాజాలు లేదా వృత్తి గాయకులు, వీరిపైన సుమారుగా 1956వ సంవత్సరం నుంచి విషయ సేకరణలు జరుగుతున్నాయి. బిరుదురాజు రామరాజు నుంచి నేటి వరకు అనేక మంది పరిశోధకులు ఈ విషయాలను అనుసరించి పరిశోధిస్తూనే ఉన్నారు. ఎన్ని పరిశోధనలు జరుగుతున్నప్పటికీ ఇంకా పరిశోధించ వలసిన అంశాలు కోకొల్లలు. అలాంటి అంశాలలో పరిశోధనకు నోచుకోని గాయక సమాజం పంబాలలు. తెలుగు సాహిత్యంలో జానపద పరిశోధనలు జరిగి ఇప్పటికి అర్థశతాబ్దం గడిచినా పంబాలలపైన చేసిన చర్చలు ఒకింత అస్పష్టంగా ఉన్నందువల్ల తిరిగి వారి గురించిన నత్యాలను కూలంకషంగా బహిర్గతం చేయాల్సిన అవసరం ఏర్పడింది. ఎందుకంటే పంబాలలపైన పూర్వ పరిశోధకులు వెలుబుచ్చిన అభిప్రాయాలు మొత్తంగా పంబాల సమాజాన్ని బహిర ప్రపంచానికి తీసుకువచ్చాయని చెప్పలేం. కులం, మతం, ఆశ్రితత్వం, కొలిచే దేవుడు, వాయించే వాద్యాలు ఇంకా అనేక రకాల అంశాలలో ఈ గాయక సమాజానికి చెందిన సమాచారం అస్పష్టంగా ఉన్నందునా ఈ పంబాల గాయకులకు సంబంధించిన ప్రతి చిన్న అంశాన్ని నాకు లభించిన విషయ సామగ్రి సహాయంతో నిరూపించే ప్రయత్నం చేస్తాను.



**చారిత్రకంగా పంబాలలు :** పబాలలు జానపద సాహిత్యంలో అతి ప్రాచీనులు. క్రీ.పూ. 2వ శతాబ్దికి చెందిన "నట్రినై" అనే తమిళ కవి తన "నట్రినై" గ్రంథంలో పంబాల ప్రస్థాన కనిపిస్తుంది. ఇందులో.. చెలికత్తె నాయికను ఓదార్చుతూ. ఇలా చెప్పింది(1).

"కడుంగురల్ పంబై కదనాయ్ వడుగర్ నేడుం పేరుంగున్రం నింది,

నామ్ వయినర్ వందనర్".

**అర్థం :** పంబ అనే వాయిద్యాన్ని మోగిస్తున్న వారునూ, బలిష్టమైన కుక్కలను కలిగిన వారును అయిన తెలుగు ప్రజలు నివసిస్తున్న ప్రాంతాలకు ధన సంపాదన నిమిత్తమై వెళ్ళిన నీ ప్రియుడు త్వరలోనే తిరిగి వస్తాడు అని ఉన్నది. పై పంక్తులలో చాలా స్పష్టంగా పంబాలలు లేదా పంబకారుల ప్రస్థావన కనిపిస్తున్నది.

పంబై అనగా తమిళ భాషలో పంబ అనే అర్థం వస్తుంది. వడుగర్ అనగా తెలుగు వారని మనకు తెలిసిందే. ధన సంపాదన కొరకు తెలుగు ప్రాంతానికి వెళ్ళిన అని పేర్కొనడంలో ఈ సాహిత్యం తమిళ ప్రాంతం నుంచి వచ్చింది, మరొక కోణంలో చూస్తే దక్షిణ దేశంలో సంఘ సాహిత్యమే ప్రప్రథమమైనది కాబట్టి పంబకారులు (పంబాలలు) తమిళ ప్రాంతం నుంచి తెలుగు ప్రాంతాలలో సంబంధాలు ఉండడంతో పంబాలు తెలుగు ప్రాంతాలకు వలన వచ్చి ఉండవచ్చు. ఆ తర్వాతి కాలాల్లో పంబకారులు దక్షిణ భారతం మొత్తం విస్తరించినట్లుగా తెలుస్తుంది.

సాహిత్య కోణంలో చూసినా తమిళ సాహిత్యం జానపద సాహిత్య అధ్యయనంతోనే ప్రారంభమైంది. తమిళ జానపద సాహిత్యంలో, శిష్ట సమాజంలో జరుపుకే పండుగలు, జాతర్లలలోనూ పంబ వాయిద్యానికి విశిష్ట స్థానం వుంది. సుబ్రహ్మణ్య స్వామి కావడి పండగలోనూ, నయ్యాండి మేళంలోనూ, మారియమ్మన్ జాతరప్పుడు పంబ వాద్యం తప్పనిసరి(2). ఈనాటికీ తమిళ సమాజంలో పండగలలోనూ, జాతర్లలోనూ, పెళ్ళిళ్ళలోనూ పంబ వాయిద్యం తప్పనిసరి అయ్యింది. ఈ విషయాన్ని చూస్తే పంబ చాలా ప్రాచీన కాలం నుంచే ఉన్నదని చెప్పవచ్చు.

"తెలుగు ప్రాంతాన్ని ఏలిన చాళుక్యులలో (కలచూరి చాళుక్యులు) మారాసపు రాజులు ఒకరు. ఏడుగురు అన్నదమ్ములు. వారిలో చివరివాడు వీరసోమరాజు. ఇతడు పల్నాటి వారితో కలిసిపోయి తన కూతురు సిరా దేవిని పెదమల్లి దేవరాజుకిచ్చి వివాహం చేశాడు. ఈ వీరసోమరాజు కొడుకే కొమ్మరాజు. ఇతడు తనతో పాటు తన కులదైవమగు అంకమ్మను కూడా పల్నాడు తీసుకొచ్చాడు. ఈమె పల్నాటి అంకమ్మ లేక వీరుల అంకమ్మ. ఇది చారిత్రక సత్యం కూడా"(3) ఇలా పల్నాటి కాలంలో పంబ వాద్యానికి మంచి ఆదరణ ఉండేదని తెలుస్తుంది. ఈ కాలంలో రాజ్య వ్యవహారాలలో కూడా పంబాలలు ప్రముఖ పాత్ర పోషించారని కొన్ని సంఘటనలు తెలుపుతున్నాయి. వాటిలో ఒకటి గుర్రం చెన్నారెడ్డి గారు రాసిన పల్నాటి చరిత్రలో కనిపిస్తుంది.

"రాయబారం అనంతరం చెర్ల గుడిపాడు చేరిన అలరాజు తంబళ్ళ (పంబాల) కొమ్మజియ్యరిచ్చిన విషపుష్పాల వాసన పీల్చి అంతిమ దశకు చేరాడు. కొమ్మజియ్యరు తనకు కన్నమదాసు ద్వారా మరణం తప్పదని తెలుసుకొని వెంటనే అలరాజుకిచ్చిన విషపు పుష్పాలనే వాసన పీల్చి కొద్ది దూరంలోనే చనిపోయాడు. అలా చనిపోయిన అలరాజు, కొమ్మజియ్యరుల పేర్లతో ఉన్న శిల్పాలు ఇప్పటికి చేర్లగుడిపాడులో వేరు వేరు ప్రదేశాలలో పాతిపెట్టబడి వున్నాయి"(4). ఈ విషయం ద్వారా పంబాలలు రాజులతో చాలా దగ్గరి సంబంధాలు కలిగి ఉన్నట్లు తెలుస్తుంది. శ్రీనాధుడు రాసిన క్రీడాభిరామంలో మంచన శర్మ, టిట్టిభ శెట్టి ఓరుగంటి ప్రాంతంలో పల్నాటి వీర చరిత్రను ప్రదర్శిస్తే చూసినట్లుగా, ఈ వీరుల కథను ద్విపదగా పాడుతుండగా విన్నట్లు కనిపిస్తుంది. 14వ శతాబ్దిలో ఓరుగంటిలో పల్నాటి వీరుల కథ పాడి ఆడిన విధానం ఇలా ఉన్నది.

**యం. ద్రుత తాలంబున వీరగుంభి తక ధుంధుంధుం కటాత్కర సం**
**గతివాయించు నాంతనాళిక యతి గ్రామభిరామంబుగా**
**యతి గూడం ద్విపద ప్రబంధమున వీరనికముం బాడె నొ**
**క్కతె ప్రత్యక్షరముం గుమారకులు ఫీత్కారంబునం దూలగాన్!**

శ్రీనాథుని పూర్వం పల్నాటి కథలను సుద్దులవారు, పంబాలవారు పాడేవారని చారిత్రిక పరిశోధకులు ఆమోదించారు. కాకతీయుల కాలంలో పంబాలలకు సంబంధించిన అనేక అంశాలు అనుమాన స్థితిలో కనిపిస్తున్నాయి. చాళుక్యుల నుంచి పల్నాడు పాలన వరకు తమ ఉనికిని చాటిన పంబాలలు ఒక్కసారిగా చరిత్రలో అదృశ్యం కావడం ఆశ్చర్యం కలిగిస్తుంది. దీనిపైన లోతుల్లోకి వెళ్ళి అధ్యయనం చేయవలసివుంది.

పల్నాడు రాజ్య పాలనలో సైనిక మహామంత్రి మాలకన్నమదాసు మాల కులస్థుడు. ఇతని మాదిరిగానే కాకతీయ సామ్రాజ్యంలో మాల కులస్థులు ఉన్నత పదవులు అధిరోహించారు. రేచర్ల రుద్రుడు, ఇతని బావమరిది జయాపసేనాని వంటి వారు తమ శక్తి మేరకు కాకతీయ సామ్రాజ్య, సాంస్కృతిక విస్తరణలో పాలుపంచుకున్నారు. కాకతీయుల పాలన ప్రారంభమయ్యే నాటికి పంబాలలు పంబ వాయిద్యాన్ని వాయించడంతోపాటు పూజారిత్వం కూడా పొంది నూతన జీవితాన్ని కొనసాగించారని తెలుస్తుంది. దీనికి సంబంధించిన ఆధారాలు చరిత్రలో అక్కడక్కడ కనిపిస్తున్నాయి. వేటూరి ప్రభాకరశాస్త్రి గారి మాటల్లో.. "శైవమత ప్రభావంవల్ల బ్రాహ్మణేతరులు పూజారులుగా ఉండడం జరిగింది. శివాలయాలలో తంబళ్ళు పూజారులైనారు. అర్చకులుగా ఉండే తంబళ్ళ (పంబాలలు)ను జియ్యరులంటారు. ప్రతాపరుద్రుని కాలంలో ఆంధ్రదేశంలో చాలా చోట్ల తంబళ్ళను తొలగించి వెలనాటి వారు పూజారులుగా ఉన్నారని గోళకీమఠ గురువుల ఉద్బోధలవల్ల ఈవిధంగా జరిగి ఉండవచ్చని శాస్త్రి" గారు అన్నారు(5). ఇవే కాకుండా తక్కువ కులాలవారు పూజారిత్వం పొందిన దృష్టాంతాలు చరిత్రలో ఎన్నో ఉన్నాయి. వాటిలో పాల్కురికి సోమనాథుడు రాసిన పండితారాధ్య చరిత్రలో ఈ విధంగా పేర్కొన్నాడు. "తమిళ శైవ భక్తులైన నాయనారుల చరిత్రములు ఈ దేశమంతట వ్యాపించినవి. అరువత్తు మువురేకాక ఇతరులైన తమిళ శైవ భక్తులున్నా తమిళ దేశంలోనే కాక ఆంధ్ర, కర్ణాటక దేశంలో కూడా పూజారులైనారు"(6). ఇదే విషయాన్ని చారిత్రక కోణంలో పరిశీలిస్తే పంబాలలు పూజారులుగా పల్నాటికాల అనంతరం ఏర్పడ్డారని తెలుస్తుంది.

పల్నాడు ప్రాంతంలో జరిగిన యుద్ధం అనంతరం పల్నాడు ప్రాంతంలో తీవ్రమైన కరువు సంభవించింది. దానితో అక్కడ బ్రతకడం సామాన్య ప్రజానికానికి కష్టంగా మారింది. అప్పుడు మాచర్ల చెన్నుని కొలిచే మాల కులస్థులు వివిధ ప్రాంతాలకు వలస వెళ్ళి జీవిస్తూ తమతో పాటు అక్కడక్కడ చెన్నుని దేవాలయాలను నిర్మించుకొని పూజలు కొనసాగిస్తున్నారు. నేటికి ఈ పరిస్థితి కన్పిస్తుంది. తెలంగాణ ప్రాంతంలో కరీంనగర్ జిల్లా అరువెల్లి గ్రామం (నాగమ్మ జన్మస్థానం) మహబూబు నగర్ జిల్లా రాయలగండి గ్రామం, గొనబోయిన పల్లి, నల్లగొండ జిల్లా పెద్దమునిగల్, చిత్రియాల గ్రామాలలో ఇప్పటికి ఈ పద్ధతి సజీవంగా నిలుపుకొని తమ పూర్వ సంస్కృతిని ప్రదర్శిస్తూ ఏటా కార్తీక మాసంలో వచ్చే అమావాస్యలో వేడుకలు జరుపుకుంటున్నారు.

సాహిత్యంలో ఈ కొన్ని ఆధారాలే కాక 2008 సంవత్సరంలో సత్యం శంకరమంచి వారు రాసిన అమరావతి కథలలోని "మేమే మేకపిల్ల, బలి"(7) కథలలో పంబాలల ప్రస్తావన పంబజోళ్ళ గురించిన విషయాలు కనిపిస్తున్నాయి. ఇలా స్పష్టమైన ఆధారాలు లభిస్తున్నప్పటికీ కొంతమంది పరిశోధకులు పంబలవారిని బైండ్ల(బవనీలు)కింద జమకట్టారు. "బవనీలు ఒక పరిశీలన" అను గ్రంథంలో "బైండ్ల వారను పేరు వీరు వాయించే వాద్యం వల్ల వచ్చి ఉ ఒడును. వీరి వాయిద్యములకు జమిడికలని పేరు. శిష్టులు వీటిని బావనిక అందురు. బావనికలు వాయించు వారు బవనీలు లేదా బైండ్లవారు. బవనికనే జమిదిక లేదా పంబ అందురు"(8).

ఈ పరిశోధనలో పేర్కొన్న విషయాలను అంతకు ముందు కాలాలలోని అంశాలతో పరిశీలిస్తే



1852 సం.లో బ్రౌన్ తెలుగు-ఇంగ్లీష్ నిఘంటువులో పంబ గురించి C.P. బ్రౌన్ పేర్కొన్నాడు. “A class of beggars or gyp sic's who are for fortune teller's పంబ వాయించే వాళ్ళు పంబల వాండ్లు, పంబరు వాండ్లు” అని చెప్పారు. పంబలవారు బాపని పనిచేసేవారని చెప్పడాన్ని బ్రైన్ ఇలా పేర్కొన్నాడు “The sound of a shell trump భవ్య హస్తముల బంబ లింగముల బాపనివాడు బంబ“(9) అని చెప్పాడు. శ్రీ శబ్ద రత్నాకరములో బహుజనపల్లి సీతారామాచార్యులు “పంబ అనగా ఒక చర్మ వాద్య విశేషన”మని తెలిపారు(10), అదే విధంగా జానపద వాయిద్యాల వర్గీకరణలో పంబ చర్మ వాద్యంగా వున్నది. అంటే పంబ చర్మ వాద్యం, జమిడిక తంత్రి వాద్యం కాబట్టి ఈ రెండు ఒకటి కావు. ఇంకా లోతుల్లోకి వెళితే జానపద సామెతలలో కూడా పంబాలల ప్రస్థావన కనిపిస్తుంది.

సామెతలు మనిషి జీవిత సత్యాలను తెలుపుతాయి. ఇవి అతి ప్రాచీనమైనవి. “తంబళి అనుమానం తలతిక్కతో సరి, తంబల్ల అక్కయ్య మోదుముడి వెళ్ళనూ వెళ్ళాడు, తిరిగి రానూ వచ్చాడు” వంటి సామెతలను తెలుగు ప్రజలు నిత్యం తమ వ్యవహారాలలో ఉపయోగిస్తున్నారు. కోస్తా ప్రాంతంలో ప్రజలు ఇతరులను హెచ్చరించే సందర్భంలో “పంబరేగుద్ది” అనే మాటను వాడతారు. ఇక్కడ పంబ అనగా చర్మం అనే అర్థం వస్తుంది. (నేను కొట్టే దెబ్బలకు చర్మం కమిలి పోతుంది) అనే అర్థంలో పై పదాన్ని వాడతారు. సాహిత్యం, జనవ్యవహారాల చారిత్రక కోణంలో చూసిన పంబ చాలా ప్రాచీనమైనదని తెలుస్తుంది. బిరుదురాజు రామరాజు గారు “తెలుగు జానపద గేయ సాహిత్యంలో” బవనీలకు బైండ్ల, పంబాలనియు పేర్లున్నాయి. బవనీలు తెలుగు దేశమంతట కలరు అని పేర్కొన్నారు.

“తెలంగాణమున గ్రామ దేవతల కొలువులు గొలుచుటకును, గత్తర, స్ఫోటకము వంటి రోగములు కుదిర్చేడు మాంత్రికులు గాను బవనీలు, పంబాలాలు ఒక్కటేనని చెప్పారు. వీరు ఏ ఆధారాలతో చెప్పారో స్పష్టంగా లేదు. ఎల్లమ్మ, అంకమ్మ ఇద్దరు ఒక్కరేనని చెప్పారు. ఎల్లమ్మ దేవత ప్రస్థావన కాకతీయుల కాలంలో కనిపిస్తుంది. కాని అంతకు మునుపే అంకమ్మ చాళుక్యుల కాలంలో కనిపిస్తుంది. అంటే మూడు శతాబ్దాలకు మునుపే అంకమ్మ ప్రస్థావన కనిపిస్తుంది. ఒకవేళ ఎల్లమ్మ దేవత ఉంటే బైండ్ల ప్రస్థావన వచ్చివుండేది. కాని అలాంటి ఒక్క సాక్ష్యం కూడా లేకుండా బైండ్లను పంబాలనడం పేలవమైన ఆధారంగా కనిపిస్తుంది. అసలు పంబాలలు పాడుకొనే పాటలలో పశ్చిమ చాళుక్యులకు సంబంధించిన వీర గాథలు కన్పిస్తున్నవి. చారిత్రిక కోణంలో చూసినా కాకతీయుల కన్నా చాళుక్యులు చాలా ప్రాచీనవైనవారు. ఇలా చూసినా పంబాలలు బైండ్ల వారికన్నా ప్రాచీనులని తెలుస్తుంది.

కాకీతీయుల కాలం నుంచే పంబ వాద్యం వివిధ గాయక సమాజాల చేతులలోకి వెళ్ళినట్లు తెలుస్తుంది. ప్రస్తుతం లభిస్తున్న ఆధారాల ప్రకారంగా పంబ వాద్యంను బైండ్ల, అసాదులు, తెరచీరలవారు, కొమ్ముువారు, గరగనృత్యం వారు, వినియోగిస్తున్నారు. పంబ వాద్యం పంబకారుల నుంచి ఈ కాలంలోనే బైండ్ల చేతికి వెళ్ళి వుండవచ్చు. సామాజిక కోణంలో చూసినా చాళుక్యులు, పల్నాటి పాలకుల కాలంలో మిగతా కులాల వారు పంబాలవారితో కలిసిపోయి తమతమ వృత్తి ప్రదర్శనలలో పంబను ఉప యోగించి ఉండవచ్చు. పంబాలలు కేవలం తెలుగు రాష్ట్రాలలోనే కాకుండా దక్షిణ భారతం మొత్తం విస్తరించి ఉన్నారు. నేటికీ తమిళనాడులో పంబై అని కేరళలో పంబారు అని పిలవబడుతూ అక్కడి జానపద సమాజంలో చాలా విస్తృతంగా వాడబడుతుంది. పంబ వాయిద్యం అక్కడి పండుగలు, జాతర్లు, వివాహ సమయాలలో తప్పనిసరి. తమిళ సాహిత్యం జానపద సాహిత్యంతోనే మొదలైంది కాబట్టి అక్కడి సాహిత్యాన్ని పరిశీలిస్తే పంబాలల యొక్క ప్రాచీనత్వం ఇంకా ముందుకు వెళ్ళే అవకాశం ఉంది.

**పంబాల పర్వతాలు పరిశోధక విద్యార్థి,**
హైదరాబాద్ యూనివర్శిటి

# సంపూర్ణమైన పండుగ బతుకమ్మ పండుగ

- లేళ్ళపల్లి శ్రీదేవి

తెలంగాణ ప్రాంతంలో మాత్రమే జరుపుకునే అతి ముఖ్యమైన పండుగ బతుకమ్మ పండుగ ఈ పండుగ తెలంగాణ ప్రజలందరికీ ప్రీతిపాత్రమైనది. భగవంతుణ్ణి పూలతో పూజించటం ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఆనవాయితీ. అయితే, పూలనే గౌరీదేవిగా భావించి పూజించటం ఈ ప్రాంతవాసుల ప్రత్యేకత. మహిళల మధ్య, కుటుంబాల మధ్య ప్రేమానురాగాలను పెంచే అదుతేమైన పండుగ ఈ బతుకమ్మ పండుగ.

బతుకమ్మ పండుగను పెత్రమావాస్య (భాద్రపద బహుళ అమావాస్య) నుండి తొమ్మిది రోజులు జరుపుకుంటారు. ఆశ్వయుజ శుక్ల అష్టమి అనగా, దుర్గాష్టమి నాడు అత్యంత వైభవంగా పుట్టింటి నుండి అత్తగారింటికి బతుకమ్మను పంపిస్తున్నట్టు అనుకొని స్త్రీలంతా కలిసి దగ్గరలోని చెరువులో అయినా, కొలనులో అయినా ఓలలాడిస్తారు. నీటిలో వదులుతారు. చివరి రోజున నైవేద్యంగా తొమ్మిది రకాల సద్దులు చేస్తారు.



ఈ పండుగలో పూలకెంత ప్రధాన్యముందో పాటలకీ అంతే ప్రాధాన్యముంది. బతుకమ్మ పాటలన్నీ ఎప్పుడో పూర్వ కాలంలో అజ్ఞాత మహిళలు ఆశువుగా అల్లినవే. సరళమైన భాషతో, రాగయుక్తమైన శైలిలో బతుకు చిత్రాన్ని ఆవిష్కరించే అందమైన పాటలివి. వీటిలోని సాహిత్య విలువలు అమూల్యమైనవి. జానపద, పురాణేతిహాస, చారిత్రక ఘట్టాలతోపాటు సున్నితమైన మానవ సంబంధాలు పాటలలో ప్రధాన వస్తువులు.

బతుకమ్మ పండుగ వర్షాకాలంలో వస్తుంది. ఈ సమయంలో ప్రక అతి అంతా పూల వనంలా అందంగా కనిపిస్తూ కనువిందు చేస్తుంది. రకరకాల, రంగురంగుల పూలు విరబూస్తాయి. ఈ కాలంలో ప్రక అతిలో లభించే అడవిపూలనే ఎంచుకొని బతుకమ్మను పేర్చుతారు. తంగేడు, గునుగు, కట్ల, గోరంట, గుమ్మడి, రుద్రాక్ష, మందార, గన్నేరు, సీత జడల పూలు మొదలైనవాటితో ఎంతో ఆకర్షణీయంగా బతుకమ్మను తీర్చిదిద్దుతారు. ఔషధ గుణాలున్న ఈ పూలను వాడటం వలన వర్షాకాలంలో వచ్చే జలుబు, జ్వరాలను నివారించుకోవచ్చు. ఎన్నో జబ్బులు నివారించడంలో తంగేడు వంటి అడవిపూలు మంచి ఔషధంలాగా పనిచేస్తాయి. ఆధునిక వైద్యులు కూడా ఈ విషయాలను ఒప్పుకుంటున్నారు.

ఇంక నైవేద్యాల విషయానికొస్తే... ఈ తొమ్మిది రోజులూ ఆరోగ్యాన్ని ప్రసాదించే ధాన్యాలనే నైవేద్యాలలో ఉపయోగిస్తారు. రోజుకొక రకమైన పులిహోర, చివరి రోజైన సద్దుల బతుకమ్మ రోజు తొమ్మిది రకాల సద్దులు (పులిహోరలు) చేస్తారు. చింతపండు, నువ్వులు, కొబ్బరి, పల్లీలు, పెసరపొడి, ఆవపొడి, దధ్యోజనం (పెరుగన్నం), బెల్లం అన్నం, నిమ్మకాయ, మామిడికాయ... ఇలా అందుబాటులో ఉన్నవాటితో చేస్తారు. సద్దుల బతుకమ్మను తీసుకొని చెరువు దగ్గరికి వెళ్ళినప్పుడు నువ్వులపొడి, పల్లీలపొడి, కొబ్బరిపొడి, నెయ్యి కలిపిన సత్తుపిండి, తులసీదళాలు మొదలైనవి నైవేద్యంగా తీసుకెళ్తారు. వర్షాకాలంలో శరీరానికి వేడి కలగాలని నువ్వులు, పల్లీలు మొదలైనవి బెల్లంతో కలిపి నైవేద్యం చేస్తారు. దీని ద్వారా ఐరన్, ప్రోటీన్లు లభించి ఆరోగ్యంగా ఉంటాము. అందుకే ఈ పండుగ ఆరోగ్య ప్రదాయిని అని కూడా చెప్పుకోవచ్చు.

బతుకమ్మకు పాడే పాటలు జీవితంలోని ఎన్నో రకాల కోణాలను తెలియజేస్తూ మంచి విషయాలు చెప్పేవిగా ఉంటాయి. అటువంటి కొన్ని పాటలను పరిశీలిద్దాం.

బతుకమ్మ పండుగ తెలిసిన ప్రతీ ఆడపడుచుకు తెలిసే పాట ఇది...

ఏమేమి పువ్వప్పునే గౌరమ్మ
ఏమేమి కాయప్పునే గౌరమ్మ
తంగేడు పువ్వప్పునే గౌరమ్మ
తంగేడు కాయప్పునే గౌరమ్మ
తంగేడు పువ్వుతోని ఆడెవారెవ్వరో పాడెవారెవ్వరో
అందాన పుట్టినా బంగారు బాలలు
నెలకొన్న నెలరాజులే గౌరమ్మ
ఎప్పటికి వైభోగమే గౌరమ్మ
ఇంకేమి పువ్వప్పునే గౌరమ్మ
ఇంకేమి కాయప్పునే గౌరమ్మ

ఇలా గుమ్మడి, గునుగు, గోరంట, కట్ల, మందార అంటూ రకరకాల పూలను చెప్తూ పాట పాడుతారు. దీన్ని బట్టి ఆ కాలంలో దొరికే పూల గురించి మనకు తెలుస్తుంది.

జనకు జనకునింట్లో కోల్
సత్య జనకునింట్లో కోల్
పుట్టింది సీతమ్మ కోల్
పురుడే కోరింది కోల్

అంటూ సీతాకళ్యాణం పాట.

శ్రీగౌరి నీపూజ ఉయ్యాలో
చేయబూనితినమ్మ ఉయ్యాలో
కాపాడి మమ్మేలు ఉయ్యాలో
కైలాస రాణి ఉయ్యాలో
అంటూ మహిళలందరూ తమ పసుపుకుంకుమలను కాపాడి, సకల సౌభాగ్యాలు ఇవ్వమని ఆ గౌరీదేవిని కోరే పాట.

గొల్లభామలమ్మా చక్కని
గోపిక స్త్రీలమ్మా చక్కని
పదహారు వేల స్త్రీలు భామలు
పడుచు కన్యలమ్మా భామలు
అంటూ గోకుల క అష్ణుడు, గోపికల మధ్య రాసక్రీడల పాట.

కలవారి కోడలు కోల్
కలికి కామాక్షి కోల్
వచ్చిరి అన్నలు కోల్
వనములు దాటి కోల్
పండుగకి అన్నలు అక్కచెల్లెళ్ళని పుట్టింటికి తీసుకెళ్ళడానికి వాళ్ళ ఇంటికి వచ్చి, అత్తమామల అనుమతి తీసుకొని తోబుట్టువులను తమతో తీసుకెళ్ళే పాట. ఇటువంటి పాటల వల్ల కుటుంబం, సంస్క అతి, సాంప్రదాయం,బాంధవ్యాలు తెలుస్తాయి.

చివరి రోజున బతుకమ్మను ఓలలాడించే పాట పాడుతారు.
ఇసుకలో పుట్టిన గౌరమ్మా
ఇసుకలో పెరిగిన గౌరమ్మా
పసుపులో పుట్టిన గౌరమ్మా
పసుపులో పెరిగిన గౌరమ్మా
ఇలా కుంకుమలో, పూలలో... అంటూ అన్నింటినీ కలిపి చెప్తూ, అన్ని కులాల పేర్లు కూడా చెప్తూ పాట పాడుతారు.

అంటే, అందరూ కులమతాలను వీడి వాటికి అతీతంగా కలసికట్టుగా ఈ పండుగను చేసుకుంటారని అర్థమవుతుంది.
బతుకమ్మను నీళ్ళలో వదిలి మళ్ళీ ఏడు రావాలని వేడుకుంటూ ఓలలాడించే పాట.
హిమవంతు నింట్లో పుట్టి
హిమవంతు నింట్లో పెరిగి
అంటూ శ్రీమహాలక్ష్మి రూపమైన బతుకమ్మను గౌరీదేవిగా భావించి పుట్టింటి నుండి అత్తవారింటికి పంపిస్తున్నట్టుగా భావిస్తూ అత్తవారింట్లో ఎలా మసలుకోవాలో తెలియజేస్తారు.



అత్తమామల పట్ల బుద్ధి కలిగి వుండాలి
ఎవరితో ఎదురు తిరిగి మాటకు మాట సమాధానం ఇవ్వకూడదు
ఎక్కువగా బయట తిరుగకూడదు
సాయంత్రం నిద్రపోవటం మంచిది కాదు
కాళ్ళతో భూమిని తన్నకూడదు

పెళ్ళైన ఆడపిల్ల ప్రవర్తన వలన తల్లిదండ్రులకు, అత్తమామలకు చెడ్డపేరు రాకుండా, కుటుంబ గౌరవమర్యాదలు
కాపాడాలి... అని తెలియజేస్తున్నట్టుగా ఉంటుందీ పాట.
పెళ్ళైన ఆడపిల్లలు పండుగ సందర్భేగా పుట్టింటికొచ్చే ఆనవాయితీ ఉండబట్టి చిన్ననాటి స్నేహితులందరినీ కలుసుకోవచ్చని పెళ్ళైన మహిళలంతా ఈ పండుగ కోసం ఆసక్తిగా, ఉత్సాహంగా ఎదురు చూస్తుంటారు.
ఈ విధంగా బతుకమ్మ పండుగ భక్తిని పెంపొందించే పండుగ. అంతేకాక ఆరోగ్యాన్ని, కుటుంబ బాంధవ్యాలను, ప్రక అతిని,
సుఖసంతోషాలను, సంస్క అతీ సాంప్రదాయాలను తెలియజేసే సంపూర్ణమైన పండుగ.
లేళ్ళపల్లి శ్రీదేవిరమేష్

**- లేళ్ళపల్లి శ్రీదేవి**



**చెన్నైలో ఉంటున్న శ్రీమతి లేళ్ళపల్లి శ్రీదేవి గారు తెలుగులో ఎం.ఎ.ఎమ్ ఫీల్ చేసారు. ఇంటర్, డిగ్రీలలో కూచిపూడి, జానపద నృత్యాలకు అనేక బహుమతులు గెలుచుకున్నారు. భర్త రమేష్ గారి సహకారంతో "FACES" (Food, Aid, Clothing, Education, Shelter) అనే పేరుతో గత కొన్ని సంవత్సరాల నుండి అనాథ పిల్లలకు సహాయం చేస్తున్నారు. 2016లో AMN గ్లోబల్ గ్రూపు వారు "ఉత్తమ మహిళ" అవార్డును అందించారు.**

**With all the best wishes from the staff and students of**
**Nritya Madhavi(An Odyssey of Cultural Entanglement), Edison , NJ, USA**
**(Founder and Artistic director – Guru. Smt.Divya Yeluri)**

Nritya Madhavi School of Dance
Where words fail, dance and music speak

# NrityaMadhavi School Of Dance

**-An Odyssey of Cultural entanglement**









Founder/Artistic Director - Guru Smt. Divya Yeluri
(Senior Disciple of Padmabhushan Dr.Vempati Chinna Satyam
& Smt.A.B.Bala Kondala Rao.)

NrityaMadhavi School of Dance:
Known for its exemplary style and standard of presenting Kuchipudi
Email: Nrityamadhavi@gmail.com
Phone: 908-397-2681/732-902-2131/908-226-0580 https://facebook.com/nrityamadhavi
Address: 3775 Park Avenue, Units, 9M+10M, Edison, NJ-08820



Coming soon. Meet South Asian singles in your area.

pyar.com

Sign up today to get a 30-day **FREE** premium membership trial.

@pyarcommunity @pyardating @pyardating



Vidyadhar Garapati, CEO

TANA Regional Coordinator – New York



# కిన్నెరసాని

– ఎన్నెల

కిన్నెర సాని( బతుకమ్మ పాట)
రచన : ఎన్నెల

గల గలా పారింది ఉయ్యాలో గంభీర గోదారి ఉయ్యాలో
కిల కిలా నవ్వింది ఉయ్యాలో కిన్నెరా సాని ఉయ్యాలో
ఊరంత సందడే ఉయ్యాలో ఊర్ల బండి దిగె ఉయ్యాలో
అడుగుపెట్టె బమ్మ ఉయ్యాలో అత్తగారింటను ఉయ్యాలో
ఇరుగమ్మ పొరుగమ్మ ఉయ్యాలో ఇటుచూడరండ్రీ ఉయ్యాలో
కొత్త కోడలిని ఉయ్యాలో కొసరీ చూసిపొండ్రి ఉయ్యాలో
నీకోడలోయమ్మ ఉయ్యాలో నాజూకు కొమ్మ ఉయ్యాలో
చిలకల కలికమ్మ ఉయ్యాలో కులికె కుందనాలు ఉయ్యాలో
పొయ్యొస్త ఒదినమ్మ ఉయ్యాలో పార్వతి దేవీ ఉయ్యాలో
చిన్న పిల్లనమ్మ ఉయ్యాలో చేతుల్ల పెడుతున్న ఉయ్యాలో
అత్త మాటిను బిడ్డ ఉయ్యాలో అమ్మ నీకామెనే ఉయ్యాలో
మామ మాటిను బిడ్డ ఉయ్యాలో మా రాజు పరమేశుడుయ్యాలో
కోడలా కోడలా ఉయ్యాలో కొడుకు పెండ్లామా ఉయ్యాలో
కుండ కడుగావేమె ఉయ్యాలో కూడు వొండవేమె ఉయ్యాలో
అన్నమయ్యె అత్త ఉయ్యాలో ఆకు వొడ్డించిన ఉయ్యాలో
మామగారిని పిలువు ఉయ్యాలో మంచి నీలు తెస్త ఉయ్యాలో
పొయ్యి అలకావేమె ఉయ్యాలో జాజు పెట్టవేమె ఉయ్యాలో
పచ్చాని గడపకు ఉయ్యాలో పసుపు పూయవేమె ఉయ్యాలో
చిన్న బక్కెనతోని ఉయ్యాలో చిల్లుబిందె నింపు ఉయ్యాలో
పదును లేని కత్తి ఉయ్యాలో పనస పండు కొయ్యి ఉయ్యాలో
అయినయీ పనులన్ని ఉయ్యాలో ఆకలయ్యె అత్త ఉయ్యాలో
పతి రాకపొయ్యెనూ ఉయ్యాలో పాపమేడుండో ఉయ్యాలో
నా కొడుకు మారాజు ఉయ్యాలో వాని ఊసెందుకె ఉయ్యాలో
ఇప్పుడాకలేంది ఉయ్యాలో ఇల్లలుకుడెన్నడు ఉయ్యాలో
పాలు పిండు పిల్ల ఉయ్యాలో పిడుకలు గొట్టూ ఉయ్యాలో
కారడవికి బయ్యి ఉయ్యాలో కట్టెలు కొట్టితే ఉయ్యాలో
అట్లనే అత్తమ్మ ఉయ్యాలో అడవికీ పొయ్యొస్త ఉయ్యాలో
మగడు తినకా తింటె ఉయ్యాలో మరియాదా గాదు ఉయ్యాలో
నువ్వు పొయ్యింట్లేంది ఉయ్యాలో నీ కోడలేది ఉయ్యాలో
ఆకలయ్యెనమ్మ ఉయ్యాలో ఆకులెయ్యమను ఉయ్యాలో
బంగారు నా కొడక ఉయ్యాలో బాగ్యమేందిర నీది ఉయ్యాలో
ముద్దుగున్నదని ఉయ్యాలో మురిసి చేసిన కొడక ఉయ్యాలో
ఏంచెప్ప కొడకా ఉయ్యాలో ఏడుపే మిగిలింది ఉయ్యాలో
కూడు ఒండుమంటె ఉయ్యాలో కుండ పగలగొట్టె ఉయ్యాలో
దీపమ్ముట్టీమంటె ఉయ్యాలో దీపంత పలగొట్టె ఉయ్యాలో
ఐరేని కుండనూ ఉయ్యాలో అరికాల తన్నింది ఉయ్యాలో
మాట మంచీ లేదు ఉయ్యాలో మరియాదా లేదు ఉయ్యాలో
ఒయినమే లేదాయె ఉయ్యాలో ఓటిచేతుల పిల్ల ఉయ్యాలో
చిన్నమ్మ పెద్దమ్మ ఉయ్యాలో చీచీ అంటుండ్రు ఉయ్యాలో
ఊరిజనులందరు ఉయ్యాలో ఉంచి పొయ్యేరు ఉయ్యాలో
నీకొద్దు నీకొద్దు ఉయ్యాలో నీకు తగదయ్యో ఉయ్యాలో
ఆ ఊరు ఈ ఊరు ఉయ్యాలో తిరిగి రావయ్య ఉయ్యాలో
యాష్టకొచ్చిందాక ఉయ్యాలో యాపారమే జెయ్యి ఉయ్యాలో
దండిచ్చొ దనమిచ్చొ ఉయ్యాలో దారికి తెస్తాము ఉయ్యాలో
కదిలి రా బిడ్డా ఉయ్యాలో కబురంపినంకా ఉయ్యాలో
పోయిరా పయనమయి ఉయ్యాలో పైలము కొడుకో ఉయ్యాలో
మాయమ్మ అత్తమ్మ ఉయ్యాలో మా ఆయనేడీ ఉయ్యాలో
ఎటు పంపినారూ ఉయ్యాలో ఏడాది కావట్టె ఉయ్యాలో
కోడల కోడల ఉయ్యాలో కొరకంచు దాన ఉయ్యాలో
కనులల్ల నీల్లేంది ఉయ్యాలో కాలు ఒత్తు నాకు ఉయ్యాలో
వేడి పాల మీద ఉయ్యాలో వెన్న దీయవమ్మ ఉయ్యాలో
పచ్చి పాల తోడు ఉయ్యాలో పెరుగు చెయ్యవమ్మ ఉయ్యాలో
రామ రామ రామ ఉయ్యాలో ఏమి నా కర్మము ఉయ్యాలో
నాధుడు కాన్రాడు ఉయ్యాలో నాకు దిక్కు లేరు ఉయ్యాలో
పుట్టింటికి పోతె ఉయ్యాలో పట్టెడన్నము దొరుకు ఉయ్యాలో
తల్లి తండ్రులకు ఉయ్యాలో తరగని దుఖ్ఖము  ఉయ్యాలో

పిట్టా నవ్వేనూ ఉయ్యాలో పుట్ట నవ్వేనూ ఉయ్యాలో
పదిమంది లోనా ఉయ్యాలో పరువు పోగల్లా ఉయ్యాలో
ఊరి చివరీ కాడ ఉయ్యాలో ఊడల మఱ్ఱీ ఉయ్యాలో
మఱ్ఱి చెట్టు కింద ఉయ్యాలో మైసమ్మ తల్లీ ఉయ్యాలో
పొర్లు దండంబెడత ఉయ్యాలో పసుపు పూజలు చేస్త ఉయ్యాలో
పతిని కలుపూ తల్లి ఉయ్యాలో పరమేశు రానీ ఉయ్యాలో
బంగారు కిన్నెరా ఉయ్యాలో బాగున్నవా పోరి ఉయ్యాలో
ఇంత రాతిరి పూట ఉయ్యాలో ఈడున్నవేందీ ఉయ్యాలో
మొక్కనొచ్చానయ్య ఉయ్యాలో మైసమ్మ తల్లికీ ఉయ్యాలో
మహిమగల తల్లయ్య ఉయ్యాలో మనల గలిపిందీ ఉయ్యాలో
కనులా నిదుర రాదు ఉయ్యాలో కాలమె కదలదు ఉయ్యాలో
కష్టమయ్యె బతుకు ఉయ్యాలో కాటి పిలిచింది ఉయ్యాలో
ఏమి మాటాలవి ఉయ్యాలో ఏడ్వకు బంగారి ఉయ్యాలో
ఇంటికీ పోదాము ఉయ్యాలో ఇవరమే చెపుతాను ఉయ్యాలో
నేను రానూ రాను ఉయ్యాలో నీ ఇంటికే రాను ఉయ్యాలో
నాది గాని చోటు ఉయ్యాలో నేనుండనయ్యో ఉయ్యాలో
ఇంటెడు చాకిరీ ఉయ్యాలో ఇంపుగా చేసినా ఉయ్యాలో
పట్టెడన్నము నాకు ఉయ్యాలో పెట్టగా దయ రాదు ఉయ్యాలో
ఏమిజేయుదు పిల్ల ఉయ్యాలో ఎదురు జెప్ప రాదు ఉయ్యాలో
రాత బాలేదెమొ ఉయ్యాలో రాయినయిపోతున్న ఉయ్యాలో
కండ్లల్ల పానాలు ఉయ్యాలో కాపాడుకొచ్చినా ఉయ్యాలో
కష్టాలలో తేలి ఉయ్యాలో కలలన్ని కొండెక్కె ఉయ్యాలో
కంట నీరాగదు ఉయ్యాలో కాలువయి పోతుంది ఉయ్యాలో
కన్నీరై పారుత నుయ్యాలో నేను కిన్నెరసానినుయ్యాలో
నిన్ను విడిచీ బెట్టి ఉయ్యాలో నేనుండలేనూ ఉయ్యాలో
నువ్వు రాయీవైతె ఉయ్యాలో నీ చుట్టు తిరిగేను ఉయ్యాలో
ఆనందమయ్యింది ఉయ్యాలో అలనై పొంగుతుంటె ఉయ్యాలో
రాయైన నిను తాకి ఉయ్యాలో రాగాలె పాడుతా ఉయ్యాలో

నదినైన సుఖమేది ఉయ్యాలో నా మీదె కన్నురో ఉయ్యాలో
పాడు సంద్రము గాడు ఉయ్యాలో పారి రమ్మంటుండు ఉ
య్యాలో పావనీ గోదారి ఉయ్యాలో పాపనమ్మా నీకు ఉయ్యాలో
కలిసిపోతీనమ్మ ఉయ్యాలో కడుపులో దాచుకో ఉయ్యాలో
పుట్టింటి పేరును ఉయ్యాలో పుట్టి ముంచనీకు ఉయ్యాలో
అత్తింటి పేరును ఉయ్యాలో ఆదమరువనీకు ఉయ్యాలో
బద్రంగ వచ్చేను ఉయ్యాలో బద్రాద్రీ వరకు ఉయ్యాలో
కనుమరుగు అయ్యేను ఉయ్యాలో కన్నీటి ఏరునై ఉయ్యాలో
పువ్వు పువ్వు లోన ఉయ్యాలో నవ్వు నవ్వు లోన ఉయ్యాలో
ఆడబిడ్డలలోన ఉయ్యాలో అగుపడుతు ఉంటాను ఉయ్యాలో
కిల కిలా నవ్వుల్ల ఉయ్యాలో కిన్నెరా సానినీ ఉయ్యాలో
పల్లె పల్లె లోన ఉయ్యాలో పదమై పలుకుతుంట ఉయ్యాలో
ఎలుగెత్తి పాడింది ఉయ్యాలో ఎన్నెల్ల గోదారి ఉయ్యాలో
కిల కిలా నవ్వింది ఉయ్యాలో కిన్నెరా సాని ఉయ్యాలో


- ఎన్నెల



**పేరు: లక్ష్మీ రాయవరపు, కలం పేరు : ఎన్నెల, వృత్తి: చిత్రగుప్తుల వారి పని. హాస్య కథలు వ్రాయడం, హాస్య నాటికలు వ్రాసి ప్రదర్శించి కెనడా, గ్రేటర్ టోరొంటో తెలుగు వారిని భయపెట్టటం బాగా ఇష్టం. కెనడా నుంచి వెలువడుతున్న "తెలుగుతల్లి" అంతర్జాల పత్రిక కమిటీ మెంబర్‌గా ఉండటంలో బోలెడు ఆనందం అంటారు లక్ష్మీ గారు? యాసపై మమకారంతో మైండ్ మీడియా అంతర్జాల రేడియోలో ప్రతి ఆదివారం తెలంగాణా యాసలో ఒకగంట ముచ్చట్లతో పాటు యాసకథలు, జానపద గీతాల హోరులో తన్మయత్వం!**

# స్త్రీలపాటలు - తెలుగు సంస్కృతి

- జి.యస్. మోహన్

'ఒక జాతి ప్రజానీకము యొక్క సంపూర్ణ జీవిత చరిత్రయే సంస్కృతి చరిత్ర' అంటారు ఖండవల్లి లక్ష్మీరంజనంగారు. సంస్కృతిలో భౌతిక, మానసిక, సాంఘిక



అంశాలు ప్రాధాన్యం వహిస్తాయి.

తెలుగువారి సాంస్కృతిక చరిత్రలో బంధుత్వాలు, కులవ్యవస్థ, వివాహ పద్ధతులు, కుటుంబ జీవనం, మతం నమ్మకాలు, వృత్తులు, కళలు, ఆభరణాలు, చేతిపనులు మొదలైనవన్నీ చోటు చేసుకొంటాయి. ఇవన్నీ జానపద గేయాల్లో ప్రతిబింబితమయ్యాయి. ఇవేకాక పుట్టుక, పెళ్ళి, మరణం మొదలైన వాటికి సంబంధించిన ఆచారాలు, నోములు, వ్రతాలు, జాతరలు, పండగలు, ఆటలు, వినోదాలు, జానపద వైద్యం మొదలైన అంశాలు కూడ అభివ్యక్తమవుతాయి. వీటిలో కొన్నింటిని గురించి తెలుసుకుందాం.

మానవజీవితంలో ప్రథమ ఘట్టం పుట్టుక, పుట్టుకకు సంబంధించిన ఆచారాలు అనేకం స్త్రీ జీవితంలో సంతానానికి చాలా ప్రాముఖ్యం ఉంది. సంతానార్థం చేసే పూజలు, వ్రతాలు మొదలైనవి స్త్రీలపాటల్లో ఉల్లేఖింపబడ్డాయి.

అశ్వత్థ ప్రదక్షిణము గావిస్తే సంతానప్రాప్తి కలుగుతుందన్న విశ్వాసం ఉంది. 'రావిచెట్టుపాట' అశ్వత్థ వృక్షాన్ని పూజిస్తూ పాడేపాట ఈ పాటలోని ఫలశ్రుతి -

'అష్టైశ్వర్యములనిచ్చునే రావి
పంచమహాపాపములు బాపునే రావి
ముత్తైదువలు విన్నాను 'జాతీయ' లాగు
కన్యతావిన్నాను కల్యాణమందు
గొడ్రాలు విన్నాను బిడ్డలాగనును
పొన్నగంధులు విన్నాను పొందుదురు సుఖము
రాజుతావిన్నాను లక్షపతి యగును
విధవా విన్నాను విష్ణులోకమ్ము పొందు
బ్రహ్మచారి విన్నను కల్యాణమందు
అపుత్రవతులైన అంగనలు విన్న
పుత్రులా ఎత్తుదురు సొంపుగను'

(స్త్రీల పాటలు - అనంతపుర మండలం)

- ఇలా అశ్వత్థ వృక్షాన్ని పూజించడం వల్లనూ, పాటలు విన్ననూ పుత్రుల్ని ఎత్తుకుంటారని చెప్పడంలో జానపదుల విశ్వాసం వ్యక్తమవుతుంది.

సంతానంకోసం నాగ ప్రతిష్ఠ చేస్తే పిల్లలు కలుగుతారన్న నమ్మకం కూడ జానపదుల్లో ఉంది. 'నాగుమయ్యపాట'లో

'కోరిన వారికి పుత్రులనిస్తాను నాగుమయ్య
నిన్ను కొలచీనవారికి కొంగుబంగారు ఇస్తావు
నాగమయ్య' - అని చెప్పబడింది.

వ్రతాలు, నోములు నీతినియమాలను, ప్రాచీనాచారాలను, పురాతన సంప్రదాయాలను, నాగరకతా సంస్కృతులను, భక్తి విశ్వాసాలను ప్రదర్శిస్తాయి. స్త్రీలకు గొడ్రాలితనం, వైధవ్యం, కడుపుశోకం, దారిద్ర్యం, ఇత్యాదులు తీరనిదుఃఖాలు. అందువల్లనే వాటిని నివారించకోవడానికి వ్రతాలనొక సాధనంగా గ్రహించి, భగవద్భక్తిని పెంచుకొని దైవకృపను పొందగలుగుతుండడం మనం గమనించవచ్చు.

బిడ్డ జన్మించిన తర్వాత జాతక కర్మ ముఖ్యమైంది. ప్రసవమైన పదకొండోరోజు సాధారణంగా నామకరణం జరుపుతారు. నామకరణం చేసి బిడ్డ చెవిలో పేరు చెప్పి లోకానికి అప్పజెప్తారు. ఉయ్యాలలో బిడ్డను పడుకోబెట్టి ఉయ్యాల పాటల్ని పాడేసంప్రదాయం ఉంది. ఒక పాటలో

'నాగులకు తనిబోసి నేనెత్తుకొంటి
పుట్టాకి తనుబోసి పుత్రున్నిగంటి
తోతాపురి కొండ మీద తోపుఏస్తి
తోపాకి ఫలమందె నాకి ఫలమందె'

(స్త్రీల పాటలు - అనంతపుర మండలం)

అమ్మాయి వయసుకు వచ్చిందంటే 'పెద్దమనిషి' అయిందని అర్థం. దీన్నే 'సమర్త' అంటారు. సమర్తకు సంబంధించిన ఆచారాలు ఆంధ్రదేశంలో అన్ని వర్ణాల్లోను కన్పిస్తాయి. ఒక్కొక్క వారం సమర్త అయితే ఒక్కొక్క ఫలమని మనలో విశ్వాసం కన్పిస్తుంది.

'అల్లో నేరేడల్లో వెలది రుక్మిణి సమర్త వేడూకలాయ
" ఆదివారమునాడు అతిరోగి యౌను
" సోమవారమునాడు సుదతి పతివ్రత
" మంగళవారమునాడు మతిమంతురాలు
" బుధవారమునాడు బుద్ధిమతియౌను
" బేస్తవారమునాడు పుత్రవతియగును
" శుక్రవారమునాడుశుభతి సంపదకలిగియుండు
" శనివారమునాడు సతిపేదరాలు'



పై పాటలో ఋతుమతి అయిన బాలిక రుక్మిణితో పోల్చబడింది. జానపదులు తమ ఆచారా వ్యవహారాలను పురాణ పాత్రలకు ఆరోపించి పురాణ కాలంనుంచీ ఇలాంటి ఆచారవ్యవహారాలు ఉన్నట్టుగా పాటలు కట్టారు. అంతేకాక పాపులు మోక్షాన్ని పొందటం, పేదలు ఐశ్వర్యవంతులు కావడం, దీర్ఘరోగాలు నయంకావడం అనేవి వ్రత ఫలాలుగా మనవాళు పరిగణించారు. దంపతులు అన్యోన్యానురాగ వర్తనులై ఉండడానికి 'దంపతుల తాంబూలము నోము', 'పువ్వు తాంబూలము' ఇత్యాదులు, గర్భవిచ్ఛిత్తి తొలగడానికై 'కడుపు చెదరని ఆదివారాలనోము', అంగవైకల్యము తొలగడానికి 'పదహారు ఫలాలనోము', దారిద్ర్యం తొలగించుకోవడానికి 'సంపదశుక్రవారమునోము' ఇత్యాదుల్ని వ్రత ప్రయోజనాలకు ఉదాహరణలుగా తీసుకోవచ్చును.

స్త్రీ గర్భవతి అయినప్పటినుంచి ప్రసవించేదాకా అనుసరించాల్సిన ఆచారాలు ఎన్నో ఉన్నాయి. గర్భవతిని ఏడవ నెలలో పుట్టింటికి పిలుచుకొని వస్తారు. సీమంతమన్నది గర్భవతిగా ఉన్నప్పుడు చేసేవాడుక, ఆచారం. ఆ గర్భిణీ స్త్రీని చక్కగా అలంకరించి, ముత్తయిదువులచేత పసుపుకుంకుమలు, అక్షతలు ఇప్పించి ఆశీర్వదిస్తారు. గర్భిణికి ఇష్టమైన పదార్థాలన్నీ చేసిపెడతారు. తల్లిశ్రేయస్సు, పుట్టబోవు శిశువుకు దీర్ఘాయుస్సు, గర్భిణీస్త్రీ ఉల్లాసంగా ఉండాలన్న ఆశయం సీమంత సంస్కారోద్దేశాలుగా కన్పిస్తాయి. సీమంతానికి సంబంధించిన ఒక పాటలో

'కులమెల్లదీపించు కొమరుని గనుమంచు
ఎల్లముత్తయిదువలు దీవించరమ్మ'

- అని సీమంతోద్దేశం చెప్పబడింది.

స్త్రీ ప్రసవించిందంటే ఆ యింటిలో పురుడని చెప్తారు. బిడ్డకు పదోరోజు వచ్చేదాకా ఈ పురుడు ఉంటుంది. సమర్త అయిన బాలికకు నువ్వులనూనె, బెల్లం తినడానికి ఇస్తారు. దీనివల్ల నడుముకు బలం వస్తుందంటారు. చిమ్మిలిదంచడం ఒక వేడుక. అప్పుడు రోకటి పాటల్ని పాడతారు. వీటినే సువ్విపాటలంటారు.

వివాహం ఒక సాంస్కృతిక వ్యవస్థ. ఇది వేడుక సమయం హిందూ సమాజంలో స్త్రీ పురుషులు దంపతులనిపించుకోవడానికి జరిగే సంస్కారం వివాహం. ఇది షోడశ సంస్కారాల్లో ఒకటి. వివాహబంధం వధూవరుల్ని యావజ్జీవం ఒక్కటిగా చేసే అనుబంధం.

వివాహ సంబంధమైన ఆచారాలు ఒక్కొక్క ప్రాంతానికి, కులానికి, కాలానికి మారుతూ ఉంటాయి. పెండ్లికి ముందు నిశ్చితార్థం ఒక ఆచారం.

పెళ్ళిరోజుకు ముందు రోజు సాయంత్రం ఏదైనా గుళ్ళో వరపూజ చేస్తారు. గుడినుంచి రాగానే 'ఎదురుకోళ్ళు' జరుపుతారు. మరుసటి రోజు ఉదయం స్నాతక వ్రతంతో వివాహ కార్యక్రమం ఆరంభమవుతుంది. నలుగుపాటలు పాడుతూ వధూవరులకి నలుగుపెట్టి స్నానాలు చేయిస్తారు. ముహూర్తానికి ముందు కాశీయాత్ర జరుగుతుంది. ముహూర్తంలో భాగంగా మధుపర్కం, మహాసంకల్పం, కన్యాదానం, మాంగల్యపూజ, మాంగల్యధారణం, తలంబ్రాలు, బ్రహ్మముళ్ళు, చదివింపులు, అప్పగింతలన్న శాస్త్రాలు, ఆచారాలు జరుగుతాయి. ఈ వివాహఘట్టాలన్నింటికీ ప్రత్యేకంగా పాటలుప్రచారంలో ఉన్నాయి.

మంగళ సూత్ర ధారణ సమయంలో ముత్తయిదువలు పాడే 'మంగళసూత్రం పాట'.

'ఆనందమానందమాయెను
మనరాముడు పెండ్లికొడుకాయెను
ఆనందమానందమాయెను
అలజానకి పెండ్లికూతురాయెను
కౌసల్యనోచిన నోము సఫలమాయెనేడు'

జీవితంలో బాల్యం, యౌవనం, కౌమారం, వార్ధక్యం మొదలైన ఘట్టాలన్నిటినీ దాటిన తర్వాత చివరిగా అందరూ ఎదుర్కొనే ఘట్టం మరణం. ఇది షోడశ సంస్కారాలలో చివరిది కావడం వల్ల దీన్ని అంత్య సంస్కారమని కూడ అంటారు. ఒక్కో కులానికి సంబంధించి శవసంస్కారాలు ఉన్నాయి. ప్రతియేట చనిపోయినవాళ్ళకి తద్దినం పెట్టే సంప్రదాయం ద్విజుల్లో కన్పిస్తుంది. ద్విజేతరుల్లో ఆశ్వయుజ అమావాస్యను పితృ అమావాస్య (మహాలయ అమావాస్య)గా ఆచరిస్తారు.

నమ్మకం, ఆచరణ, సంప్రదాయం - ఈ మూడింటికీ అవినాభావ సంబంధం ఉంది. నమ్మకం ఒక మానసిక పరికల్పన అవుతే, ఆచరణ దాని క్రియాత్మకరూపం అవుతుంది. ప్రతి ఆచరణ వెనకా ఏదేని ఒక నమ్మకం లేదా విశ్వాసం దాగి ఉంటుంది.

'సందెకాడ దీపంబు పెట్టేటివేళ
సప్పుడు కాకుండ పెట్టి రమ్మన్న
మాపుకాడ దీపంబు మలిపెటప్పుడు
మర్లిచూడకుండ మలపిరమ్మన్న'
(తెలంగాణా పల్లెపాటలు)

- సందె దీపాన్ని వెలిగించేటప్పుడు ఏమీ మాట్లాడక, చప్పుడు కాకుండా వెలిగించాలనీ, రాత్రి దానిని మలిపే వేళ తిరిగిచూడకుండ మలిపి వేయాలని విశ్వాసం, ఆచారం.

తెలంగాణ సంస్కృతిలో పండుగలు, జాతరలు, ఉత్సవాలు ప్రముఖ పాత్రను వహిస్తాయి. జాతరలు, ఉత్సవాల సందర్భంగా ప్రదర్శించే జానపద కళారూపాలు పండగల్ని ఇంకా చైతన్యవంతంగా ఉంచుతున్నాయి. ఉరకలు వేసే ఉత్సాహాన్నీ, ఆవేశాన్నీ కల్గిస్తుండడం వల్లే ఇప్పటికీ ఇవి నిలద్రొక్కుకోగలిగాయి. ఇవన్నీ ధార్మిక ఆచరణాలకు సంబంధించినవి.

ఉగాది, శ్రీరామనవమి, సంక్రాంతి, దసరా పండుగలతోపాటు ఏరువాక పున్నమ, నాగులచవితి, నాగపంచమి, బొడ్డెమ్మ పండగ, బ్రతుకమ్మ పండగ, అట్లతద్దె మొదలైన పండగల్ని అతిసంబరంతో జరుపుకొంటారు.

బొడ్డెమ్మ పండగలో తొమ్మిది రోజులూ బొడ్డెమ్మను కొలిచి, తొమ్మిదవ నాడు బొడ్డెమ్మను చెంతనున్న బావిలో జారవిడుస్తారు.

'బొడ్డెమ్మ బొడ్డెమ్మ బిడ్డలెందారే
బావిల పడ్డవారికి వారిద్దరమ్మా
చెర్లపడ్డవారికి చేరిద్దరమ్మా
కుంట్ల బడ్డావారికి కోరిద్దరమ్మా
నిద్రబో బొడ్డెమ్మ నిద్రబోవమ్మా
నిద్రకూ నూరేండ్లు నీకు వెయ్యేండ్లు
నినుగన్న తల్లికీ నిండనూరేండ్లు'

- అని పాడతారు.



జానపదగేయాల్లో వైద్య సంబంధమైన శాస్త్రవిషయాలు చోటు చేసుకొన్నాయి.

'కౌసల్య బైకలు' పాటలో కౌసల్యా దేవి కోసం 'బాలెంతకారం' సిద్ధం చేయడం చెప్పబడింది.

'పిప్పళ్ళు, సొంటి, మిరియాలు కొట్టి ఉనచారే ఎక్కువైన లవంగము పత్రి చేర్చారోయమ్మా తాటి బెల్లమును ఇంగువతెచ్చి ఉనచారోయమ్మా మేటిగా వేపాకు పలుపునూరి ఉచారోయమ్మా'
(తెలుగు జానపద గేయ సాహిత్యము)

ఇలా స్త్రీల పాటల్లో తెలుగువారి సాంస్కృతిక చరిత్ర అభివ్యక్తమవుతుంది.

**- జి.యస్. మోహన్**



**బెంగుళూరు విశ్వవిద్యాలయ, తెలుగు శాఖాధ్యక్షులుగా 37 సంవత్సరాలు పనిచేసి 2011లో పదవీ విరమణ పొందారు. తెలుగు, కన్నడ, ఇంగ్లీష భా,లలో 66 పుస్తకాలు, 300కు పైగా వ్యాసాలు ప్రచురించారు. 2005లో కేంద్ర సాహిత్య అకాదమి అనువాద పురస్కారం, 2003లో తెలుగు విశ్వవిద్యాలయం సాహితీ పురస్కారం. ఇలా 13కు పైగా పురస్కారాలకు పాత్రులైన డా. జి.ఎన్. మోహన్ జానపద విజ్ఞానరంగంలోను, తులనాత్మక సాహిత్య రంగంలోను, అనువాద సాహిత్య రంగంలోను నిష్ణాతులు.**



# మీరైనా చెప్పండి !!!! (గల్పిక)

- డా॥ పుట్టపర్తి నాగ పద్మిని

యేమిటోనమ్మా...కాలమిలా తొందరగా పరుగులు పెడుతూ....మారిపోతోంది క్షణ క్షణానికీ....!! ఈ రోజున్న వస్తువు రేపటికి పాతబడిపోతోంది చూశారా ? మా చిన్నప్పుడు..అంటే..ఓ యాభై అరవై సంవత్సరాల క్రితం..అస్సలు ఫోన్లుండేవా? ఫోన్ అంటే...అదేదో బ్రహ్మ పదార్థమే !! అక్కడెక్కడో టెలిఫోన్ ఆఫీస్ లో ఒకటీ, రెండూ ఫోన్లుండేవా? మా ఇళ్ళల్లో పెద్దవాళ్ళకు ఫోన్లొస్తే, ఆ ఆఫీసువాళ్ళు మాకేదో మెహర్బానీ చేసినట్టు, ఇంటికి దయచేసి, 'మీకు ఫలానా ఊరినుంచీ ఫోనొచ్చింది..ఓ అరగంటలో ఉండమన్నారన్న ముక్క మా చెవుల్లో వేసి....ఆఘమేఘాలమీద వెళ్ళిపోయే వాళ్ళు. .. ఇహక్కణ్ణించీ..మా ఇంట్లో పెద్దవాళ్ళు, ఫోనెందుకొచ్చిందోనని గాభరాతో పడుతూ లేస్తూ...అక్కడికెళ్ళి, పడిగాపులు పడి, ఆ సమచారమేదో తెలుసుకుని వచ్చేవాళ్ళు. అదో కథలా ఇంట్లో అందరికీ..వివరంగా చెప్పి, ఆపై దానిగురించి, ముందేంచేయాలో అని చర్చించుకోవటాలూ!!

మరి ఇప్పుడంటారా? అమ్మో అమ్మో....కోటీశ్వరుల చేతుల్లోనూ, పాచిపని చేసేవాడి చేతుల్లోనూ సెలో'నే నాయె ! యెవడి స్థాయిని బట్టేననుకోండి ! ఐనా !! సమాచారమేదైనా క్షణాల్లో భూమి ఆ చివరినుంచీ యీ చివరికి చేరిపోవటం, దాన్ని గురించి ఇహ..అబ్బో...మాటలే మాటలు..!! చూస్తుంటే...ఇంత వేగం అవసరమా? అనిపిస్తుందమ్మా..మా తరం వాళ్ళకు !!

ఇదుగో... ఇప్పుడిప్పుడే మీసాలు మొలుస్తున్న కుర్రకారూ, పైట..కాదు..కాదు...చున్నీ..హబ్బే..అదేమిటబ్బా..జీన్సూ, షర్టుల్లో తెగ మిడిసిపడుతూ తిరుగుతున్న పదహారేళ్ల పడుచుపిల్లలూ....అందరూ ...సెలో'నులే !! రకరకాల సినీమా వీడియోలూ, పాటలూ..మరీ మాట్లాడితే...ఇంగిలీషు సంగీతమూ ..!! పైగా స్టెప్పులతో డాన్స్ కూడానూ!! విన్న పాటలే యెన్ని సార్లు వింటారో యేమిటి..!! ఇక చెప్పేదేముందీ? మాలాంటి పెద్దవాళ్ళ మాట ఖాతరు చేస్తారా వాళ్ళు?

మా కాలంలో ఇలా ఉండేదా? అమ్మావాళ్ళు గీచిన గీత దాటకుండా బుద్ధిగా చదువుకుంటూ..ఇంట్లో వాళ్ళ పనుల్లో సహాయం చేస్తూ...ఉమ్మడి కుటుంబాలే అప్పట్లో యెక్కువ కాబట్టి, పిన్నీ, బాబాయ్..పెదనాన్నా, పెద్దమ్మా...తాతయ్యా, నాన్నమ్మా..ఇంకా ఇంట్లో పాతుకుపోయి యెప్పటినుంచో ఉన్న వేలు విడిచిన మేనత్తలో..మేనమామలో ఉంటే వాళ్ళతోనూ సర్దుకుపోతూ...పండగలూ పబ్బాలూ కలిసి మెలిసి చేసుకుంటూ...కష్టసుఖాలు పంచుకుంటూ...మామిడి తోపుల్లో కాయలు దొంగిలిస్తూ, చెరువునుంచీ నీళ్ళు తెచ్చే మిషతో ఆడపిల్లలంతా చేరి, వయసుకు తగిన ముచ్చట్లు చెప్పుకుంటూ..'కాళ్ళా గజ్జా కంకాళ్ళమ్మలూ, తొక్కుడు బిళ్ళాటలూ..వెన్నెల రాత్రుల్లో దోబూచులాటలూ..యెన్నెన్ని ముచ్చట్లో..!! కాలం యెలా గడిచిపోయేదే తెలిసేదే కాదసలు !! యేడాది పొడుగునా, యెన్నెన్ని పండగలూ..యెన్నెన్ని నోములూ..యెన్నెన్ని పాటలూ..యెన్నెన్ని జానపద కళకారుల హడావిడులో !!

ప్చ్.. అసలు పల్లెటూళ్ళలో లేని అందాలూ, సోయగాలూ, తీయతీయని పొలం గట్టు సంగీతాలూ ఇప్పటి తరాలకేవీ??

తోలుబమ్మలాటల ఆరాటాలూ, పగటి వేషగాళ్ళ హాస్య వినోదాలూ, వీధినాటకాలవాళ్ళ ప్రతిభా కౌశలాలూ...ఇప్పటితరం వాళ్ళెరుగుదురా అని? అంతేనా? శివుని కథలు బుడిగె జంగాల వాళ్ళు చెబితేనే వినాలి ! ఆ విద్యలెలా నేర్చేవారో కానీ.. గమ్మత్తైన గారడీ విద్యల కనికట్టులు మతులు పోగొట్టేవి !! లయబద్ధంగా..నెత్తిమీద గరగలు పెట్టుకుని..కాళ్ళ గజ్జెల్లు ఘల్లు ఘల్లున మోగుతుంటే....చింత నిప్పులపై నడుస్తూ చేస్తున్న నాట్యం గుర్తుకొస్తే..ఇప్పుడు యీ సినీమాల్లో చేసే కుప్పిగంతులూ, సర్కసు ఫీట్లూ యేపాటి అనిపిస్తుందమ్మా మాకైతే !!

పాములనాడించే మోడీ వాళ్ళను చూసి తీరాలి !! బూరపై వేళ్ళు కదిలిస్తూ..పాము ద అష్టినాకర్షిస్తూ..దాన్నాడిస్తున్న ఆ పాములవాణ్ణి చూస్తే..సకల స అష్టినీ తన వేళ్ళకొనలపై ఆడిస్తున్న క అష్ణ పరమాత్మే గుర్తొచ్చేవాడు సుమా !!రెండు తాచు పాముల మధ్య పోటీలూ పెట్టేవాళ్ళు కొంతమంది.

దసరా వేళల్లో పులి వేషాలు చూస్తుంటే..ఒళ్ళు గగుర్పొడిచేది సుమా !! సంక్రాంతి సమయాల్లో గంగిరెద్దు విన్యాసాలు..అబ్బో..యెంత ముద్దొచ్చేవో !!ముగ్గులతో తీర్చి దిద్దిన పచ్చటి ముంగిళ్ళలో చప్పట్లు తడుతూ గొబ్బిళ్ళపాటలు ..కన్నెపిల్లలంతా 'సుబ్బీ గొబ్బెమ్మా శుభమూలియ్యవే...చామంతి పువ్వంటీ తమ్ముణ్ణియ్యవే...మొగలీ పువ్వంటీ....' అన్న చోటే..ఆగిపోయి..సిగ్గుల మొగ్గలైపోతూ 'మొగుణ్ణియ్యవే..' అని సిగ్గుతో పాట ముగిస్తే..అందరూ ఘల్లున నవ్వటాలు..ఆ ద అశ్యాలు.. కమనీయాలూ..రమణీయాలూ కూడా మరి !!!

ఇంతేనా..గోండుల గూసాడీ,సామంతుల మయూరీ , చెంచులూ, లంబాడీల నాట్యాలూ..ఇవన్నీ మేము అప్పడప్పుడూ వెళ్ళే దూరబ్బంధువుల ఊళ్ళలో చూసేవాళ్ళం లెండి.

అసలు యెరుక చెప్పే యెరుకలసాని శాణీతనం యేంచెప్పాల్లెండి ? ఆ కళ్ళు తిప్పడమేంటి? జలపాతంలా గలగలా మాట్లాడుతూ 'కంచి కామాక్షి, మధుర మీనాక్షి, కాశీ విశాలాక్షి, బెజవాడ కనక దుర్గమ్మ సాక్షిగా మాటల కోటలు కట్టి మరీ భవిష్యవాణి వినిపించే ఆ గడసరితనం యెంత గొప్పదో మీకేంతెలుసస్సలు?

మా కాలం వాళ్ళకు రామాయణం, భారతం, భాగవత కథలన్నీ తాతయ్యలూ, అవ్వలవల్ల కాస్తా...ఇదిగో యీ జానపద కళాకారుల వల్ల చాలా...తెలిసిపోయేవి..అబ్బబ్బ..పటం కథలో రామాయణం చెప్పేవాళ్ళోవైపు...వీధి నాటకాల్లో ద్రౌపది మానభంగం, కీచక వధ, దుర్యోధన పరాభవం ఇలాంటి కథలను కళ్ళకు కట్టేలా చూపించేవాళ్ళో వైపు, కుచేలోపాఖ్యానం, శ్రీక అష్ణ రాయబారం, భక్త ప్రహ్లాద వంటి హరికథల న అత్య, గాన, హావ భావ విన్యాసాలలో ముంచెత్తే కళాకారులో వైపూ....యెంత సందడీ..యెంత సందడీ !!!

అరెరే..ఇంతా చేసి బంగారు తిమ్మరాజు, బాల నాగమ్మ, కాటమరాజు, సారంగధరాలాంటి జానపద కథల గురించి చెప్పనేలేదే? అస్సలు కళ్ళార్పనిచ్చేవే కావు కదా అవన్నీ....రెక్కల గుఱ్రం పై రాకుమారుడు, రాకుమారిని ఆకాశవీధుల్లో తీసుకెళ్ళిపోతుంటే...గండుపిల్లి మొహమేసుకుని..నల్లని కారుమబ్బులాంటి ఒళ్ళు, చింత నిప్పుల్లాంటి కళ్ళూ, పెద్ద పెద్ద కోరల్లాంటి పళ్ళున్న రాక్షసుడు వెంటపడి తరుముతున్న ఘట్టం..యేకంగా కల్లోకొచ్చి దడుసుకుని , అమ్మ పక్కలో బల్లిలా ముడుచుకుని పడుకోవటం..అబ్బో..యెంత బాగుండేదో !! ..మాయల మరాఠీ..పేదరాసి పెద్దమ్మా...మా ఇంటి సభ్యులైపోయేవాళ్ళంతేగా !!

ఇవి కాక పండరి భజనల శ్రావ్యత యెంత బాగుండేది? 'పురమును చూడండీ..పండరి క్షేత్రము చూడండీ...' 'విట'ల్ విట'ల్...జై జై విట'ల్...' అని పాడుతూ, ఒళ్ళుమరచి నాట్యం చేసే ఆ భక్తి పారవశ్యం ముందు మరేదైనా సాటి రాదంతే !!

'ఎందుకయ్యా ఉంచీనావూ బందిఖానలో..' 'కాళ్ళూ ఉండగా ..మో....కాళ్ళతో నడవగ...'అంటూ రామదాసు కీర్తనలు పాడుతుంటే , రామ కథామ అతాన్ని జుఱ్రుకోవటం యెంత మధురమో ఈతరం వాళ్ళకు తెలుస్తుందా ??

అరెరే...నోములూ వ్రతాల గురించిన ముచ్చటే మర్చి పోయాను..దేవుడా !!! క్షమించు..!!!అట్ల తద్దె, ఉండ్రాళ్ళ తద్దె, కుంకుమ గౌరీనోము, చిక్కుళ్ళ గౌరీ నోము, చిలుక ముగ్గుల నోము, నందికేశ్వర నోము, పోలాల అమావాస్య నోము, లక్ష వత్తుల నోము..యెన్నెన్ని నోములు? యెన్నెన్ని వ్రతాలు? శ్రీ మంగళగౌరీ వ్రతము, శ్రీ వినాయకచతుర్థీ వ్రతము, శ్రీ కేదారేశ్వర వ్రతము ,శ్రీ కార్తీకసోమవార వ్రతము , శ్రీ స్కందషష్టీ వ్రతము, శ్రీ సావిత్రీగౌరీ వ్రతము , శ్రీ శివరాత్రి వ్రతము, శ్రీ నందికేశ్వర వ్రతము, వరలక్ష్మీ వ్రతం, ..... ఇన్నిటినీ భక్తి శ్రద్ధలతో చేసుకుంటూ, పెద్దలకు తల్లో నాలుకల్లా మెలుగుతూ, పిల్లల్లో పాలూ నీళ్ళలా కలిసిపోతూ.. ఆడుతూ పాడుతూ..కాలం ఇట్టే గడిచిపోయేది !!

పేరంటానికి వచ్చిన వాళ్ళు యేదో ఒక పాట పాడే వెళ్ళేవాళ్ళు. 'వరములిచ్చీ, బ్రోవవమ్మా, వరమహాలక్ష్మీ...' అని ఒక పిన్నిగారు వినసొంపుగా పాడితే, మరో ముత్తైదు, 'భాగ్య సంధాయినీ మా తల్లీ...' అని ఆరున్నొక్క శ అతిలో అదరగొట్టేది. 'రామలాలీ మేఘ శ్యామా లాలీ..' అని ఒకావిడ గొణిగితే, 'రంగా నీకిదే మంగళం..' అని మరో అత్తయ్య శ్రీరంగని ధ్యానం చేసేది. ఊర్మిళదేవి నిద్ర, సీత సమర్త, సీతారామ కల్యాణం, సీతారాముల వామనగుండ్లాట.... ఇలాంటి గొలుసు పాటలకు ఇంట్లో తల చెడిన పెద్దవాళ్ళు పెట్టింది పేరు. ఇప్పుడేపిల్లనడిగినా..'అబ్బే నాకలాంటి పాటలు రావండీ....అని మెలికలు తిరిగి పోతుం దొక్కొక్క మహాతల్లి !! సినిమా పాటలనండి...ఓ ఇంపూ సొంపూ లేని పాటలు యేకధాటిగా పాడేస్తామంటారు...యేంకాలమండీ బాబూ !!!

పాటలంటే పాటలా మా కాలం పాటలు? ఒక వరమహాలక్ష్మిని వర్ణిస్తే, ఆమె కాలి గోరునుంచీ, జడలో తురుముకున్న పూల దండలవరకూ..అన్నీ వివరంగా వర్ణించే పాటలు. కాలి పట్టీలు, అందెలు,మెట్టెలు, నడుముకు ముత్యాలూ రత్నలూ పొదిగిన బంగారు వడ్డాణం, చేతులనిండా మరకత మాణిక్యాలు, ముత్యాల తాపడంతో గాజులు, అన్ని వేళ్ళకూ ఉంగరాలు, భుజలకు వంకీలు, చెవుల్లో పెద్ద పెద్ద దుద్దులు, ఇక మెడలో వజ్రాలూ, పగడాలూ, జాతి రత్నాలతో మెరిసిపోతున్న రకరకల కంఠాభరణాలు, దానికి తోడు వివిధ సుగంధ సురభిళ సుమ హారాలు, ముక్కుకు ధగ ధగలాడే ముక్కు పుడకలు, నుదుట రత్న కాంతులతో మెరిసిపోయే కుంకుమ, బుగ్గలపై మకరికా కాంతులు, తలపైన చంద్రవంకా, సూర్యవంకా, పాపిటిబట్టూ..ఇవన్ని ధరించి కొలువు దీరిన జగదంబను తనివి తీరా చక్కటి తేలిక పదాలతో వర్ణిస్తూ, తమను బ్రోవమంటూ ఆర్తితో వేడుకుంటూ..అందరి తరపునా ఆ తల్లిని వేడుకునేవారా పాటల్లో ! అసలా పాటలు రాసిందెవరో..వాళ్ళ ఊరేమిటో ..యేవీ తెలియకపోయినా, అజ్ఞాత రచయితలుగానే సంత అప్తి చెందిన ఆ రచయితలు భారత రామాయణ కర్తల అడుగు జాడల్లో నడుస్తూ, అక్కడక్కడ తమ రచనలకు మరిన్ని మెరుగులు కూడా పెట్టినా..రవ్వంత భేషజమూ లేని నిగర్వులే కదూ !!! అదే ఇప్పుడైతేనా ? ఒకే వాక్యాన్ని 'ముక్కస్య ముక్క:...' అన్నచందాన తునకలుగా విడగొట్టి ఇదే కవిత్వమని విఱ్ఱవీగడాలూ, డబ్బిచ్చి సన్మానాలు చేయించుకోవడాలూనూ !!! చిఱ్ఱెత్తుకొస్తుంది సుమా !!

మా ఇంటిపక్కనో పండు ముత్తైదువుండేది.'సితాదేవి ఆనవాలు' అన్న పాట యెంత అదుతేంగా పాడుతుండేదో తెలుసాండీ?

'బంగారు కొక చాయ గలదె మా కాంత, పెట్టకనె కాటుక పెట్టినట్టుండు,

దిద్దకయె తిలకమ్ము దిద్దినట్టుండు, చేయకనె శ అంగారము చేసినట్టుండు,

అద్దకనె పరిమళము అద్దినట్టుండు, వేయకనె తమ్ములము వేసినట్టుండు,

తొలకరి మెరుపువలె తా వెలుగుచుండు, మసిపాతగట్టినా మాణిక్యమటుల

నివురుపై గప్పినా నిప్పులావలెనూ, కసుగంది యున్నట్టి కుసుమమ్ము వలెనూ,

శీతకాలమునాటి ఉదకమ్ము వలెనూ, మేఘములోనున్న సూర్యునివలెనూ,

మెరుగుజెడియున్నట్టి అద్దమ్మువలెనూ, పాడ్యమినిజదివినా వేదమ్ము వలెనూ

రాహుబట్టిన చంద్ర మండలము రీతి, చింతచే కడు చిన్నబోయి ఉండేను...'

అని పాడుతూ వెక్కిళ్ళుపెట్టి యేడుస్తుండేది ఆ సీతమ్మవారి కష్టాలు తలచుకుని !!! చెప్పొద్దూ..మాకూ కన్నీళ్ళు ఆగేవి కాదు సుమా !! అసలిందులో..పాడ్యమిని చదివినా వేదమ్ము వలెనూ..' అని యెందుకన్నారయ్యా అంటే...పాడ్యమినాడు, యే పనీ మొదలెట్టకూడదనే ఆచారం చెప్పారని మా అమ్మమ్మ చెప్పిందండీ నాకు..!! నిజమే సుమా..! నేనూ గమనించానీ సంగతి..పాడ్యమి రోజెదైనా చేస్తే కలిసి రాదు యెవరికైనా! ఇంకా గడపమీద నిలబడకూడదనేవాళ్ళు ! యెవరైనా యే పనిమీదైనా వెళ్తుంటే ..యెక్కడికని అడిగితే ఆ పని సక్రమంగా జరగదట మరి ! పండంటి పిల్లలపై పదిమంది ద అష్టి పడితే, దిష్టి తీసేసే వాళ్ళు ఇంట్లో పెద్దవాళ్ళు. ఇరుకు మంత్రాలూ. తేలుకుడితే మంత్రించే పెద్దవాళ్ళూ బోలెడంత మంది!! అసలు మా అమ్మే ఇరుకు మంత్రం వేసేదెందరికో ! ఉదయ సూర్యుని ముందు నుంచుని, ఇనుప పట్టకరో, మూడు గొలుసుల ఇంటి చిలుకో ఆ ఇరుకు పట్టిన ప్రాంతంలో రాస్తూ యేదో మంత్రం చెప్పేది. రెండు రోజుల్లో నొప్పి మాయం. తేలు కుడితే, బీడీ పొగాకు రసం తీసి, తేలు కుట్టింది యెడవ వైపైతే కుడి చెవిలోనూ, కుడి వైపైతే ఎడమ చెవిలోనూ ఆ తేయాకు రసం పిండేది. రెండు మూడు గంటల్లో తేలు కుట్టిన నొప్పి తగ్గిపోయేది. ఇలాంటి యెన్నెన్నో గ అహ వైద్యాలూ, చిట్కాలూ..అన్నీ మర్చిపోయామే అని బాధేస్తుంది..నాకు తెలీకడుగుతా..ఇవన్నీ మన సంస్క అతిలో భాగాలే కదండీ ? మీరేచెప్పండి?

భారత కాలం నాడే అణువణువులోనూ నేనున్నానని చెప్పిన శ్రీకృష్ణుడు, గాంధారి కడుపులో నూరు మంది పుట్టటం, ప్రహ్లాదుడు తల్లి గర్భం నుంచే శ్రీమన్నారాయణ జప ధ్యాన తత్పరుడు కావటం, అభిమన్యుడు తల్లి గర్భం నుంచేయుద్ధ విద్యలు నేర్వటం, శల్య చికిత్సలూ, రామాయణ నాడే పుష్పక విమానాలూ, హనుమ కొండనెత్తుకుని రావటమూ....ఇన్ని కథల్లోని అద్భుత సాంకేతిక పరిజ్ఞాన వివరణ చూస్తుంటే..పాతంతా రోతనేవాళ్ళనో చెంపదెబ్బ కొట్టాలనిపిస్తుంది నాకైతే !!

అసలెక్క మాటండీ...ఆనాటి రంగస్థల కళాకారులు వేమూరి గగ్గయ్యా...ఈలపాట రఘురామయ్యా..ఇంకా మరెందరో..రాగమెత్తుకుంటే..వినేవాళ్ళ ఊపిరాగి పోవలసిందేగా !! ఆ గొంతుల్లో గాంభీర్యత, ఖంగుమనే గాత్ర ధర్మమూ, ఆ వేషధారణ..ఆయా పురాణ పాత్రలు ..స్వర్గం నుంచీ అచ్చంగా మా వూరిలోని వేదికపైనే అవతరించినట్టుందేదంటే నమ్మండి.

యేదో... ఇలాంటి జ్ఞాపకాలు..ఇంకా తాజాగా ఉన్నాయి కాబట్టే..రామా కృష్ణా..అని పాడుకుంటూ.. జీవితం నడిపించుకుంటున్నాం గానీ..ఇప్పుడుండే యీ స్పీడ్ యుగంలో అన్నీ స్పీడే గా !! ఈ స్పీడ్ లో ఇప్పటి వాళ్ళ జీవితాలూ మరింత స్పీడ్ గా గిర్రున పరుగులు తీస్తూనే ఉన్నాయాయె !!! ఓర్పూ, సహనమూ, విద్యలపట్ల ఆసక్తీ, అందరితో కలిసిమెలిసి సహజీవన సౌందర్యాలను ఆస్వాదించే కుతూహలమూ...కలికానిక్కూడా కనబడటం లెదే ? యెంతసేపూ నీ జీతం 4కే..నా? 5కే నా? అని ఆరా తీయటాలూ..ఇతరులతో పోల్చుకుని అసంత అప్తితో ఈర్ష్యతో రగిలిపోవటాలూనూ ! మళ్ళీ అలనాటి మంచిరోజులొస్తాయా అసలు అని తెగ దిగులేస్తుందంటే నమ్మండి !!! కాస్త మీరైనా చెబుతారా !!!!!!!!!!

**- డా॥ పుట్టపర్తి నాగ పద్మిని**



**సరస్వతి పుత్ర పుట్టపర్తి నారాయణాచార్య, కనకమ్మ గారల పుత్రిక, శ్రీమతి పుట్టపర్తి నాగపద్మిని విద్యార్హతలు. ఎం.ఎ., ఎం.ఫిల్, పి.హెచ్.డి (హిందీ) ఎం.ఎ (తెలుగు) పాత్రికేయత, అనువాద కళలలో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లమా, ఆకాశవాణి, దూరదర్శన్‌లలో కార్యక్రమ నిర్వాహకురాలిగా.. సాహిత్య, సంగీత, నాటక విభాగాలలో ఎన్నో కార్యక్రమాలు రూపొందించారు. సాహిత్య వ్యాసాలు, విమర్శలు, కవితలు, లలిత భక్తి గీత రచన, అనువాదాలు వెలువరించారు. ఉత్తమ అనువాదకురాలిగా తెలుగు విశ్వవిద్యాలయ పురస్కారంతోపాటు ఎన్నో పురస్కారాలు ఆమె పుట్టపర్తి సంపూర్ణ సాహిత్య సర్వస్వ ప్రచురణ సంపాదకత్వ బాధ్యత నిర్వహించారు.**

# " జానపదం " " జనపదం "

- శ్రీమతి డా॥ శారదాపూర్ణ



సొంత గొంతు ఉన్న మాటలే పదాలౌతాయి . ఆ పదాల గుత్తులు పాటకి పాదాలవుతాయి . సహజంగా ప్రాణంతో బయటకి వచ్చే ఆ స్వరాలు అచ్చమైన అక్షరాలని ఎన్నుకుంటాయి . మనసులో పుట్టిన రాగం, స్వరం,లయ ఆ మాటల వెంట నడిచి వస్తాయి . నిజ జీవనంలో పాట వేరు , సాహిత్యంతో పాట వేరు, సంగీత లోకంలో పాట వేరు , శాస్త్రం నిర్ధారించే పాట వేరు. భాష నిరంతరం గా మారిపోతుంది. ప్రవాహ గుణం సహజంగా ఉండటం చేత. దానితో మనం చెప్పే పదాలకి, మాటలకి అర్థాలు మారిపోతాయి . మాటల పాటల సహజత్వం నిబిడి, నిండి ఉంటేనే 'జానపదం'. సహజత్వం ఉన్న చోట అసహజత్వానికి చోటు లేదు . వ్యాఖ్యానాలు అవసరం లేకుండానే వినే వారి మనసుల లోకి చేరతాయి . ఈ రోజున " జానపదం" అన్న మాటని మరలా నిర్వచించుకోవలసిన అవసరం వచ్చింది . ప్రపంచ సాహిత్యంలో అన్ని భాషల్లో లాగానే తెలుగులో కూడా చాలా ప్రక్రియలు .

జంగమ దేవర పాటలు, సాతాని పాటలు , స్త్రీల పాటలు , గొల్ల కాపరుల పదాలు, జాజర పదాలు, చచ్చర పదాలు , కోలాటాలు , గొబ్బిళ్ళు , ఇలా ఎన్ని ప్రక్రియలో మన తెలుగు సరస్వతి పేరు పేరునా చెప్పింది. పండితారాధ్యుడు వెలనాటి చోళుల కాలం లో బౌద్ధ గురువులతో వాదించటానికి పోనప్పుడు వెంట వచ్చిన శిష్యులు

- " పదములు, తుమ్మెద పదముల్ , ప్రభాత పదములు

శంకర పదముల్, నివాళి పాదములు, వాళేసు పదములు

గొబ్బి పదములు, , వెన్నెల పదములు , సంజ వర్ణన,

మణి గణ వర్తన పదములు బాడుచు నడుచు " అని చెప్పటం తో ఆ నాటి పల్లెల పదాల రూపం లో విషయాలు తెలుస్తున్నాయి . ఇక పదిహేనవ శతాబ్ది ఆంధ్ర పద కవిత పితామహుడు , సంకీర్తనా సార్వభౌముడు అన్నమాచార్య సారస్వతం ఈ నాటి మనకి ' జానపధం' అనే మాటకి క్రొత్త నిర్వచనం ఇవ్వటానికి నిస్సందేహంగా తోడ్పడుతుంది.

- లాలా, జోల , జాజా, జోజో , జేజే, గుటక, చిలక, చాంగుభళా , చందమామ, ఉయ్యాల, దంపులు, గుజ్జెనగూళ్ళు, అల్లో నేరేళ్ళు , కుడుగులు, కొట్నాలు, లాలీ, నాలుగులు, ఆరాటాలు, సానముఖాలు, తందనాలు,మంగళాలు, శోభనాలు, హారతులు, ధ్వానాలు, తుమ్మెద, ప్రభాత, ఆనంద - జీవిత సన్నివేశాలనన్నిటినీ కుదించి పదుల వేల సంకీర్తనలు ప్రసాదించాడు అన్నమయ్య. ఆరు వందల సంవత్సరాలు అజ్ఞాతం గా ఉండి ఈ నాటి మనకి సంకీర్తనలుగా అందాయి. ఎల్లలు చెరిపేసుకుని ప్రపంచ కుగ్రామంలో నివసిస్తూ , విశ్వ పౌరులమని ముక్త కంఠం తో ఉదొటిస్తున్న ప్రస్తుత తరాలకి ఆనాటి ప్రజాకవి మరో శతాబ్దానికి సరిపడ్డ సంపద నందించాడు.

పుట్టినది మొదలు పోయేవరకు , నిద్ర లేచింది మొదలు తిరిగి పడక చేరేవరకు, ప్రతీ సంఘటనా, ప్రతీ సన్నివేశం , ప్రతీ అనుభవం పాటకి లంగి పోతుంది. ఇష్టానికి పాట , కష్టానికి పాట ! పుట్టుకకి పాట, కాషా'నికి పాట ! మన నిత్య జీవనం లో , సహజ స్వభావం లో భాగమై మన మనసులకి అత్యంత దగ్గరగా ఉన్న అనుభూతులు కనుక మాటలే, పాటలై సాహిత్య ప్రక్రియలుగా రూపొందాయి. భారత దేశం 'బ్రతుకుని పండగ' చేసిన విధానం, ద అక్కృథం ' పాట' లో సుస్పష్టం . ఈ రోజున మన మధ్య ప్రియమార ప్రచారం లో ఉన్న సినిమా పాటలు కూడా ఈ పట్టికలో నిరభ్యంతరంగా చేర్చవచ్చు . అందరు ఆమోదించవలసిన విషయం .

మనం చర్చించుకుంటున్నది ' జానపదమా' జనపదమా' ? వీటి మధ్య నున్న బేధాన్ని గ్రహించటానికి కాస్త ద అష్టి పెట్టాలి . నిర్దిష్టమైన నిర్వచనం ఇవ్వ సాధ్యం అవునా కాదా అని చర్చించక తప్పదు.

వేదం వాఙ్మయం లో , బ్రాహ్మణాల్లో , ఉపనిషత్తుల్లో దర్శన మిచ్చే' జానపదం " భిన్నార్థం లో ప్రయోగమైంది. జానపదం అంటే ' ప్రదేశం, జనసమూహం, దేశం' అనే అర్థం లో మాత్రం ప్రయుక్తం. పల్లె లనీ, గ్రామాలనీ ఎక్కడా లేదు. పైగా " గ్రామం " అన్న మాట సంగీతం లో " రాగం" అన్న విషయం తెలియ చేస్తుంది. జానపద సాహిత్యం అంటే "Folk Literature" అని విదేశీయులు చెప్పిన మాట. తర్వాత కాలంలో భాషలో వస్తున్న మార్పుల తో సంస్కృతం తో పాటు

తెలుగు కన్నడం ఇంకా ఇతర భాషల్లో కూడా ' జానపదం ' అన్న మాటకి ' పల్లెటూరు గ్రామం' అనే అర్థం మొదలైంది. నానార్థ రత్న మాల నిఘంటువు ' జనే గ్రామే జానపద్గ ' అని చెప్పటం , ఉత్తర రామ చరిత్రలో భవభూతి మహాకవి ' పౌర , జానపద్గా ' అనీ, ప్రాంత భాషలో ' పోర జాణపాదయా అనీ చెప్పటం జరిగింది. భారత కవిత్రయ ఎర్రపగ్గడ ' జానపదుల్ పురీజనుల్ ' పౌరులు అంటే పట్నవాసులనీ , జానపదులు అంటే గ్రామ వాసులనే అర్థంతో ప్రయోగం చేశారు. పల్లెటూరివాళ్ళని జానపదులని , పల్లెల్లో సాహిత్యాన్ని జానపద సాహిత్యమనీ , చదువుకున్నవారు , నగరం లోని వారు , విద్యావంతులు మాత్రమే అనటం చూడవచ్చు. ఎందువల్లనంటే పల్లెల్లోకి పోయి జానపద సాహిత్యం అంటే ' అదే ఊరు బాబు ' అని అడుగుతారు. వారిని వారు జానపదులుగా గుర్తించుకోరు. అందు వలన ఆంగ్లేయుల భాషా ప్రయోగం ప్రయోగం ఒక విధంగా సమ్మతం .

ఎన్ని శతాబ్దాలు పరిశోధనలు చేసినా ప్రజా సాహిత్యం ఊట బావి వంటిది. ఊరుతూనే ఉంటుంది. మురముర పొంగులు పడుతూనే ఉంటుంది . పాత నీరు కొట్టుకు పోతూ ఉంటుంది. ఆర్ద్ర హృదయాలే ప్రజా సాహిత్యానికి జన్మ స్థానం. కానీ ఆ యా కాలాల్లో అధికారంలో ఉన్న భాషావేత్తలు, విమర్శకారులు గొంతెత్తి నినాదాలు చెయ్యటం కద్దు. ఎప్పటికప్పుడు తెలుగు భాష సంస్క అతానికి దాస్యం చేస్తోందంటున్నారు. తెలుగు ప్రజల నిసర్గ మార్దవాన్ని పండితులు గ్రహించటం లేదని ఉదౌటిస్తున్నారు. సామాన్య ప్రజాసామాన్య సాహిత్య ప్రక్రియలకి పండితులు విలువ నివ్వటం లేదని వాటిని విడ దీసి ప్రత్యేక వర్గం చేస్తున్నారు. కాలానికి అనుగుణం గా ప్రజల అభీష్టాలకి తగినట్లుగా ప్రయత్నం సాగుతూనే ఉంది. ఈ రోజు మనం పెట్టుకున్న " జానపదం" పేరు పాత పేరే. క్రొత్తగా మరో రూపం ఇస్తున్నాం . వీటికి శాశ్వతత్వం ఇవ్వ ప్రయత్నిస్తున్నాం . ఇక్కడ జరుగు తున్నది 'భాషని పక్కకి పెట్టి భావానికి ప్రాధాన్యత ' నివ్వటం . కొందరు ప్రజా భాషకి కూడా ఛందస్సుందనీ, వ్యాకరణం ఉందనీ వ్యాసాలు వ్రాస్తున్నారు, పత్రికలలో ప్రకటిస్తున్నారు. శాస్త్రీయం, గ్రాంథికం , శిష్ట వ్యవహారికం , వ్యవహారికం , జానపదం , మాండలీకం , అంటూ వర్గాలు గా విభజించి వాటికి వేరే వేరే నిర్వచనాలనీ , నియమాలని ఏర్పరుస్తున్నారు. క్రొత్త నిర్వచనాలనివ్వటానికి రూపం ఇచ్చే భాషని, నియతినిచ్చే వ్యాకరణాన్ని, ఊపునిచ్చే ఛందస్సుని , భావగాహనతనీ ఏ కాలం లోనూ ఏ ప్రాంతం లోను ఎవరూ ఖండించ నవసరం లేదు. ఉద్యమాలు లేవదీయ్యనవసరం లేదు . భాషతోపాటు సాహిత్యాన్ని, మానవ జాతిని ముక్కలు చేసి వర్గాలు చెయ్యనక్కర లేదు . పల్లెటూళ్ళకీ, చిన్నచిన్నగుంపులకీ, కుటుంబాలకి మాత్రమే పరిమితమైపోయి ఉన్న పదాలని పాటలని అందరికీ అందించాలన్న కోరిక మాత్రం జాతికి శ్రేయోదాయకం! జానపదుల మధ్య అనునిత్యం పెరిగే భావ ప్రకటనల విన్యాసం ఒక తియ్యని దాహం . ఈ జానపద సాహిత్య మాధుర్యాన్ని, రస ప్లావితతనీ, నిసర్గ మార్దవాన్నీ ఆస్వాదించగల గుణం ఏఒక్క కాలానికి , ప్రదేశానికి , వర్గానికీ పరిమితం కాదు, కాలేదు . ఆనందం అందరిదీ !

బహు భాషలకి కూడలి భారత దేశం . లెక్కలు అందని మాండలికాలు. ఎవరి వ్యవహారాలు వారివే. ఎవరి నమ్మకాలు, సంప్రదాయాలు వారివే . ఆంధ్ర దేశానికి చుట్టుపక్కల నున్న రాష్ట్రాల వారు సరిహద్దు ప్రాంతాలలో వారు, రెండు రాష్ట్రాల భాషలనీ కలిపి వేరే భాష తయారు చేసికొని వ్యవహరిస్తారు. ఇది అతి సహజం . సామాన్యం . 2016 నాటికి ఆంధ్ర దేశం లో 18,987 గ్రామాలు , 664 మండలాలు జాబితా లోకి చేరాయి . మాండలికాలకి కొదవలేదు. ఎవరి యాస వారిదే . ఆంధ్ర ,ఒరిస్సా సరిహద్దు లలో ఉన్న జిల్లాలు కొన్ని గంజాం , శ్రీకాకుళం , పలాసా, బరంపురం మొదలైన చోట్ల లో వారు తెలుగు ఒడియా భాషల్ని కలిపి వేరే భాషగా చెప్తారు. ఆ భాషకి " కరణం" అని పేరు స్థిరం చేసుకున్నారు. ' శిష్ట కరణము' అన్న మాటని అపభ్రంశం చేసి, ఉచ్చారణ కి అనుకూలం గా ' చిట్టి కరణం ' అని వ్యవహారం లోకి తెచ్చారు. విశాఖ జిల్లా సరిహద్దుల్లో వారు ' ఓఢ్రుల' మని పిలుచుకుంటారు. వారి పాటలు వారివే . అన్ని గ్రామాలలో పాటలు జానపద సాహిత్యం లోకి చేరతాయి. గంజాం కొరాపుట్టి జిల్లాలలో, గుణుపురం , కార్ణి భద్ర, రాయగడ, నవరంగ పురం, కొద్దాటు, కాశీ నగరం , గోపాలపురం, చిత్ర పురం, ఆస్కా, భాంజా నగరం , రంగాయిలుండ, గాయిలుండి మొదలైన చిన్న చిన్న గ్రామాల్లో వేటికవి వేరు వేరుగా పాటలు ప్రాచుర్యం లో ఉన్నాయి .ప్రతీ కుటుంబానికీ నమ్మకాలూ ,ఆచార వ్యవహారాలలో తేడాలుంటాయి . అడిగినా అన్ని విషయాలు అందరితో పంచుకోరు. విషయం సేకరించటం ప్రయాసతో కూడిన పని. పల్లెలలో పల్లె ప్రజల సాహిత్యం , పట్టణాలలో నాగరికుల, విద్యా వేత్తల సాహిత్యం భిన్నం గా ఉంటాయి . ముఖ్యం గా భారత దేశంలో వేలలెక్కలో ఉన్న గ్రామాల్లో వ్యవహారం లో ఉన్న ప్రజా సాహిత్యం మనని ఆశ్చర్య చకితులని చేస్తుంది . మనసులని ప్లావితం చేస్తుంది . రాష్ట్రాల సరిహద్దులలో ఉన్న సాహిత్యం తప్పక తెలియ వలసినదే . తెలుగు భాష, తెలుగు దేశం,తెలుగు జానపద సాహిత్యం గురించి ప్రస్తావించు కుంటున్నాం కాబట్టి విశ్వ ద అష్టి నార్జించ టానికి ఈ ప్రజాసాహిత్యం ఆమూలాగ్రం పరిశీలించటం అవసరం. ఆంధ్ర దేశంలో ఇప్పటి తెలంగాణా తో కలిపి అసంఖ్యాకంగా గ్రామాలున్నాయి. తెలుగు భాష , తెలుగు జానపద సాహిత్యం విస్తీర్ణత లని గ్రంథస్థం చెయ్యటం సామాన్య విషయం కాదు . ప్రస్తుత కాలం లో జానపద సాహిత్యం క్రింద ఎటువంటి పాటలని, కవితలని

, రచనలని, వచనాలనీ, చేర్చాలో సాహితీ వేత్తలు తీర్మానించ వలసినదే .

కాలం తో సంబంధం లేకుండా మన మధ్య ఉన్నవీ ఎప్పటికీ ఉ ఒడేవీ స్త్రీల పాటల వర్గానికి చేరిన పాటలు . సాహితీ వేత్తలు స్త్రీల పాటలని జానపద సాహిత్య వర్గంలో చేర్చటం సాహిత్యం లో చూడవచ్చు. ఈ పాటలకి సాహిత్యపు విలువ గౌరవం ఇచ్చి మన్నన చేసిన నేదునూరు గంగాధరం గారు , "B" రామరాజు గారు, తూమాటి దోణప్ప గారు , "SV" జోగారావు గారు , నాయని

కృష్ణ కుమారి గారు , "GN" మోహన్ గారు, ఎల్లోరా, కృష్ణ శ్రీ , బుటేకుమళ్ళ గారు , శిష్ట లక్ష్మి నరసమ్మ గారు , హరి ఆది శేషువు, వేటూరి గారు ఇంకా మరెందరో మహానుభావులు. వీరికి తెలుగు జాతి ఋణపడి ఉంటుంది . కుటుంబంలో పురుషుడు విద్యావంతుడైతే తనకు తాను జ్ఞాని కాగలడు . స్త్రీ విద్య నేరిస్తే కుటుంబం అంతా, పొరుగింటి వారి తో సహా విద్యావంతు లౌతారు. సంస్కారాన్ని నేర్పాలన్నా, జ్ఞానం పెంచాలన్నా, వ్యక్తిత్వం అందించాలన్నా, ఆధ్యాత్మిక సంపత్తి నివ్వాలన్నా, స్త్రీ నుంచి వచ్చే సాహిత్యానికి మాత్రమే సాధ్యం. బాల సాహిత్యం , నోముల వ్రతాల పాటలు, శుభకార్యాల పాటలు, సంస్క అతీ పరమైన పాటలు, జోల పాటలు , లాలి పాటలు, మంగళ హారతులు, అన్నీ స్త్రీలపరమైనవే గానీ జీవితానికి సంబంధించినవి . దేశాలబట్టీ, సంప్రదాయాల బట్టీ భాష మారుతుంది. రాగం మారుతుంది , లయ మారుతుంది. రోజూ వారీ ఆచార వ్యవహారాలూ , నిత్య జీవన కార్యాలు అన్వయ విషయం అవటం వలన ఈ పాటలు చాలా వరకు ప్రదేశానికి , ఆ దేశ సంప్రదాయాలకి పరిమితమై ఉంటాయి. ఈ జానపద సాహిత్యాన్ని గ్రంథస్తం చెయ్యటం ఒక సామాజిక బాధ్యత, నైతిక ధర్మం గా భావించి ఎందరో విద్యావేత్తలు శ్రమించి సేకరించారు. మహానుభావులందరికి చెయ్యెత్తి దండం పెట్టక తప్పదు. సామాజిక జీవనం లో జానపద సాహిత్య ప్రక్రియలన్నీ భాగం కనుక, జాతి అభ్యుదయానికి ఆదర్శమైన సంఘ నిర్మాణానికి ఆధారం కనుక ఈ ప్రక్రియని రక్షించటం బాధ్యతే.

దేశ రాజకీయ వ్యవస్థలో సిద్ధాంతాల తర్వాత తిరుగుబాటు, ఉద్యమ వాదం ప్రధానమైనవి. సామాజిక వ్యవస్థ, నైతిక వ్యవస్థ, ఆర్థిక వ్యవస్థ , సాంస్కృతిక వ్యవస్థ, సాహిత్య వ్యవస్థ భాషా వ్యవస్థ అన్నీ కూడా భాగమే అయినప్పటికీ ఆయా వ్యవస్థలకి పట్టు , అధికారం కలిగించటానికి తిరుగుబాటు ఒక మార్గం . ఎప్పటికప్పుడు మార్పు కోరుకుంటుంది సామాన్య ప్రజ. భాషనీ, సాహిత్యాన్నీ సాధనం గా తీసుకుని ఎదుర్కొంటుంది . విప్లవ భావం ప్రజానీకంలో రేకెత్తించాలంటే, ఉద్రేకం పెంచాలంటే, ఉత్సాహం కలిగించాలంటే , పాటల్లో జోరు హెూరు కావాలి. ఈ సాహిత్యానికి ఒక నిర్దిష్ట మైన ప్రణాళిక, పథకం కావాలి. విప్లవాత్మకతని పెంచే మాటలుండాలి. వ్యాకరణం, ఛందస్సు ప్రధానం కాదు. కానీ లయ అత్యంత ప్రధానం. ఆ కాలాల్లో ఉన్న గేయవచనాలూ, వ్యవహారం లో ఉన్న పాటలూ వాహికలుగా సాగుతాయి . అనుకున్నంతం విప్లవ స్ఫూర్తి వచ్చినా రాకపోయినా , ఫలితం కలిగినా కలగక పోయినా, తాత్కాలికంగా యువతలో, సామాన్య ప్రజానీకంలో ఉత్సాహం, ఉద్రేకం పొంగుతుంది . కేకలు, అరుపులు, మిన్నంటుతాయి. స్ఫూర్తి కలుగుతుంది . ఐ అందగానాలు మొదలై ఉద్యమ స్ఫూర్తి పెరుగుతుంది. మార్పుకి మొదటి మెట్టు. అనుక్షణం మార్పు నూతనత్వం కోరుకునే మానవ జాతికి లయబద్ధమైన పాటలు భావ ప్రకటనకీ, ప్రేరణకీ ఆలంబన అవటం సహజం . " Entire life situations are - Sing Song- pattern for the Easterns" అని మన దేశానికి వచ్చిన పాశ్చాత్యుల లో వినిపించేది ఇదే !

జానపద రీతులు ప్రాచుర్యం లోకి రావటం తో గేయ రచనకి రాజ మార్గం ఏర్పడింది. ప్రతీ వ్యక్తికీ గేయ రచన ఒక హక్కుగా మారింది. అభ్యుదయ రచనా విధానాలకు అండ దొరికింది. ఆవేశానికి, ఉత్సాహానికి, ఉద్రేకానికి గేయం బాగా ఉపయోగ పడింది. ఒక ఊపు, తేలికైన మాటలు, అర్థం అవసరం లేని శబ్దాలు, సూటిదనం, వాడితనం, వేడితనం, వ్యంగ్యం, రెండేసి అర్థాల ప్రయోగం, కేవలం ప్రాసకోసం అన్ని భాషల పదాలు అవసరం బట్టీ సందర్భాన్ని బట్టీ ప్రయోగించటం, భావ సంకీర్ణం, భాషా సంకీర్ణం పాటల్లో బాగా మయ్యాయి. ఈ పాటలు, పదాలు ' ప్రజా కవితలు' గా ప్రచారం లోకి వస్తున్నాయి. ఇక్కడ అవగాహన కంటే ఆవేశం ప్రధానం. ఆలోచన కంటే ఆనందం ముఖ్యం. భాష కన్నా జోరు పెంచే శబ్దాలు ముఖ్యం. ఇది ఒక సాహిత్య ప్రక్రియగా మారింది. పలుకు బడి సంపాదించింది . ప్రజాదరణ, ప్రజారంజకత్వమే ధ్యేయం. ఒకప్పుడు భక్తికీ రక్తికీ ఆధార పీఠమై నిలచిన 'పదం పాట' క్రొత్త రూపంతో ఈ రోజు ప్రజాసామాన్యం లో వీర విహారం చేస్తోంది. ఆనాడు ఆ పదాలన్నీ జానపద సాహిత్యం లో భాగమయ్యాయి.

అయితే ఈరోజు పాటని ఏమనాలి ? స్వేచ్ఛగా ఏమాత్రం అదుపు లేక రచనలు వస్తున్నాయి. పాట రచయిత ప్రావీణ్యత బట్టీ అనేక మైన విన్యాసాలు పోతోంది . వాచ్యత బదులు వక్రత నిలుస్తోంది. వైవిధ్యంతోబాటు అన్య భాషా అలంకరణ ఎక్కువైంది. పారడీలు ,గారడీలు అనంతంగా పెరిగాయి. సాహిత్య లో వికట అతి వెకిలిగా మారింది. శృంగారం రతిగా బూతుగా మారువేషం వేస్తోంది. పాటే బలమైనదనే భావన ప్రజానీకంలో పెరిగింది. ప్రజల బ్రతుకు పాటలోనే ప్రచారం చెయ్యవచ్చని గాఢంగా విశ్వసిస్తున్నాడు ఇప్పటి సమాజ మానవుడు. జానపద సాహిత్యాభి మానులు 'జానపద సాహిత్య' మనీ, సినీ కవులు ' చలన చిత్ర ' కవితలనీ, జాతీయ వాదులు ' ప్రబోధ గేయ' మనీ, విప్లవ వాదులు '

ప్రచార పదాలు' అనీ పిలుస్తున్నారు. సాంకేతిక ప్రగతి వలన అంతర్జాల ప్రభావం వలన మారు మూల పల్లెటూళ్లలో విన వచ్చే పాటల్లో కూడా ఇప్పటి సినిమా రచనా రీతులు చోటు చేసుకుంటున్నాయి . అన్నిటినీ మూస పోసి ' జానపద సాహిత్య' మంటున్నారు పరిశోధకులు , సాహిత్య కారులు. జానపద గేయాలకి సాంఘిక ప్రయోజనం ప్రాణమైతే ఈ నాడు మన మధ్య నున్న సాహిత్యం సర్వం జానపదమే అవుతుంది. ఆ సాహిత్యం క్షణ క్షణం మారుతుంది. దేశ దేశాలకీ మారుతుంది. వ్యక్తి వ్యక్తికీ క్రొత్తగా ముందుకొస్తుంది. ప్రజల మధ్యకి దూకుతూ దూసుకు వస్తున్న ' గేయం', ఉరకలతో వస్తున్న కాలాచారం , దేశాచారం ' ప్రామాణికత, శాస్త్రీయత, నియతి, నిర్దిష్టత, సమగ్రత, కాలాధిక్యత' వంటి అంశాలకి అవసరం లేకుండా చేస్తున్నాయి. ఒకప్పటి జానపద సాహిత్యం వేరు. ఈనాడు మన మధ్య నున్న జానపద సాహిత్యం వేరు. నన్నె చోళుడు, నాచన సోమన, అన్నమాచార్యుడు, శ్రీనాధుడు, రామలింగ కవి, వంటి ప్రాచీన కవులు చెప్పిన ' జానపద రీతులు' ఈ రోజున మన మధ్య 'ప్రజాస్వామ్యం లో జామీనులు పోగొట్టుకున్న జమీందారులు' లాగా నిలుస్తున్నాయి . పర్వదినాల్లో పూర్వ వైభవాలని స్మరించుకున్నట్లుగా జానపద గేయాలని పాడుకోవటం, నాట్యం చెయ్యటం , ఉపన్యసించటంలో మిగులుతోంది. ఈ సాహిత్యశాఖకి భవితవ్య మేమిటని ప్రశ్నించుకోక తప్పదు. సమాధానం కోసం అన్వేషణా తప్పదు. మహోదయానికి సాహితీ వేత్తలు నడుం కట్టాలి ఏది ఏమైనా ఈ నాటి మనమంతా ప్రపంచ కుగ్రామ వాసులమవటం వలన నిశ్చయం గా " జానపదులమే" 'పాట' ' పదం' మన మనసులని స్పందింపచేసి ' ఆనంద ప్రణయ మంత్రాలు '.



**- శ్రీమతి డా॥ శారదాపూర్ణ**

రచయిత్రి, విద్యావేత్త, తత్వవేత్త, గాయని, పరిశోధకురాలు అయిన శ్రీమతి డా॥ శారదాపూర్ణ గారు 1975 నుంచి చికాగోలో నివాసం, 1997లో స్వర్ణ పతకంతో తెలుగులోను, 2010లో బెస్ట్ థీసిస్ తో సంస్కృత భాషలోను డాక్టరేట్ డిగ్రీలను పొందారు. ఉత్కళ్ విశ్వవిద్యాలయం నుండి సంగీత శాస్త్రంలో డి.లిట్. చేసారు. ఇంతవరకు 14 గ్రంథాలు ప్రచురించారు. "బ్రహ్మి" వంటి అనేక సారస్వత పత్రికా సంపాదకత్వమే కాకుండా భర్త డా॥ శ్రీరాం శొంఠి గారితో "సప్నా" శ్రీ ఫౌండేషన్" సంయుక్త వ్యవస్థాపకత్వం వహిస్తున్నారు. 2017లో "Top 15 Women of Excellence award" తో పాటు శారదాపూర్ణ గారు ఎన్నో పురస్కారాలు అందుకున్నారు.

With Best Compliments from NATS



# వనచరులు - విశేషాలు

- డా॥ యేలూరిపాటి ఆంజనేయ శర్మ

ఇది ఓ 30 సంవత్సరాల క్రితం జరిగిన అనుభవం. నేను, నా స్నేహితుడు హనుమాన్ ప్రసాదు ఓ సాహస యాత్రకు సంకల్పించాం. ఆ వయసు అలాటిది! సుమారు 35 కిలోమీటర్లు అడవిలో కాలినడక తప్ప మరోదారి లేదు.

మేము చేరవలసిన ప్రదేశం గుర్తేడు. బయలుదేరింది అడ్డతీగలకు ఆవల ఉన్న వైరామవరం వద్ద. ఓ 20 కిలోమీటర్లు వెళితే ఒక ఊరు వస్తుంది. తరువాత 15 కిలోమీటర్లకు గుర్తేడు. అది ఒరిస్సా,, ఆంధ్ర సరిహద్దు అడవుల్లోని ఆంధ్ర ప్రాంతంలోనిది. తూర్పు గోదావరి విశాఖ జిల్లాల అడవులగుండా ఈ ప్రయాణం. వెళ్తున్న ఉద్దేశ్యం గిరిజన ప్రాంత జీవనవిధాన పరిశీలన. ప్రేరణ- సాహత్సోహాలు దట్టించిన ఆసక్తితో అక్కడి ప్రజలకేదో సేవ చేసేయాలన్న తాపత్రయంతో బయలుదేరాం.

ఒక చిన్న సీసాతో కిరసనాయిలు, కాస్త దూది, ఒక అగ్గిపెట్టె, రెండు పులిహార పొట్లాలు, నాలుగైదు బిస్కట్టు పాకెట్లు, ఇవన్నీ చుట్టబెట్టి కట్టడానికి ఒక తువ్వాలు-దుప్పటి. ఒక చేతి కర్ర, రెండు మూడు తాళ్ళు. ఇదీ మా సరంజామా.

దారిలో అక్కడక్కడ రకరకాల పక్షులు, చెట్లపై నేలపై చిన్న చిన్న జంతువులు, రాచెలుకలు, కుందేళ్ళు, నెమళ్ళు, తేళ్ళు, నక్కలు వగైరా వగైరా అక్కడక్కడ పలకరించినవి. కొన్ని పాములు సరేసరి! అడవిలోని ఏ జంతువు స్వతహాగా ప్రమాదకారి కాదు. తనకేదైనా ప్రమాదం అనుకుంటే తెగిస్తుంది, పోరాడుతుంది. ప్రమాదం ఎదురైతే పోరాడేది జంతువు. ప్రమాదం వస్తుందేమోనన్న ఊహతోనే చంపడానికి వెనుకాడనివాడు మానవుడు.

ఉదయం బయలుదేరి కొండలు.. గుట్టలు... ఎక్కుతూ, దిగుతూ సెలయేళ్ళలో నీళ్ళు తాగుతూ, కాయలు, పళ్ళు కనబడుతున్నా తినదగినవేవో, తినగూడనివేమో తెలియక, తినకుండానే సాగుతూ సాయంకాలానికి మధ్యలో ఉన్న 'మఠం భీమవరం' అనే ఊరు చేరాం. మాకు దారిలో ఒకరిద్దరు గిరిజనులు ఎదురయ్యారు. వారానికో నెలకో ఓ సారి దిగువ ప్రాంతానికి వచ్చి ఉప్పు, కిరసనాయిలు కొనుక్కొని పోతుంటారు. సాధారణంగా మనం పలకరిస్తేనే మాట్లాడుతారు. బహుశ భయమో, అనుమానమో, నమ్మకం లేకపోవటమో... లేక వారి గత అనుభవాల కారణం కూడా కావచ్చు. దిగువవారిని కలుపుకోవటం కొంచెం కష్టమే.

'కొండరెడ్డి-కోయదొర-వాల్మీకి" అనేవి ముఖ్యజాతులు ఆ ప్రాంతంలో. చెంచు మొదలగు జాతులు శ్రీశైలం నల్లమల అడవులలోనూ, సవర, గదబ, కురుమ, గోండు వారు ఆదిలాబాద్ అడవుల్లోనూ ఇంకా చాలాచాలా జాతులవారున్నారు. ఈ తూర్పు కనుమల్లోనివారు, లిపి వర్ణ సమామ్నయం లేని తెలుగుని పోలిన అస్పష్టమైన భాషలేవో వారిలో వారు మాట్లాడుకున్నా మనతో మాత్రం గ్రామ్యమైన తెలుగే మాట్లాడుతారు. దారిలో ఎదురైన గిరిజనుల్లో ఒకరు వాల్మీకి. మేము వెళ్తున్నదారి సరైందేనని ఖాయపరుచుకోవటంకోసం పలకరించాం. మాటల్లో అతను "వాల్మీకి మావాడే" అంటూ రామాయణంలోని ఓ శ్లోకం వినిపించాడు!

అదిరిపోయాం! నీకెవరు నేర్పారని అడిగాం. 'మా ఊళ్లో నాగన్న గురువుగార' న్నాడు. వెళ్ళగానే గుర్తేడులో ఆయన్ను కలవాలని నిశ్చయించుకున్నాం.

తరువాతి రోజుల్లో అమితాబ్ బచ్చాన్ "కౌన్ బనేగా కరోడ్ పతి" లో వచ్చిన పోటీదార్లు ప్రపంచంలోని ఎన్నెన్నో విషయాలను చకచకా చెప్పేసినా భరతుని తల్లిపేరు, వసుదేవుని భార్య పేరు లాటివి చెప్పలేక కుర్చీ దిగి పోతుంటే ఆ వాల్మీకి వారసుణ్ణి చాలాసార్లే తల్చుకున్నాను.

చీకటి పడటంతో ఆరోజుకు దారిలో ఉన్న ఆ ఊళ్ళో ఆగిపోయాం. ఆ రాత్రికి ఓ కొండరెడ్ల ఇంట్లో పడక. రాత్రికి భోజనం కూడా వారింట్లోనే. సాధారణంగా జన్నలు-గంట్లు బుడం బియ్యం వండుకునే వారు, మాకోసం తెల్ల వరిఅన్నం వండారు. పెరట్లో పాదునుండి చిక్కుడుకాయలు కోసి కూర. అరిటాకు కోసుకొచ్చి, బోర్లించి వడ్డించారు. ఆశ్చర్యపోతూ ఆకు తిరగవేయడం ఎందుకు అని అడిగాం.

'అరిటాకు పైభాగాన పిట్టలు రెట్టలు వేస్తుంటాయి. శుభ్రం కాదు. అందుకోసం' అన్నారు. కారణం చాలా సబబుగా అనిపించింది. వడ్డించి గుడిశలోంచి బయటకు వెళ్ళిపోయింది ఆ ఇల్లాలు, ఎదురుగా ఉంటే సిగ్గుపడి మేము సరిగా తినమేమో అని. ఒక్కక్క ఆకులోముగ్గురు తినేంత అన్నం,వేడివేడి చిక్కుడు కూర. కూర విపరీతమైన కారంగా ఉన్నా నడిచి బాగా ఆకలిమీద ఉన్నామేమో ఆవురావురుమంటూ తినేసాం. తినడం ఇంచుమించు అయిపోవస్తుండగా ఆవిడ లోపలికొచ్చి "పప్పుచారు, పచ్చడి తేనా" అంటే కూర ఒక్కటే అనుకుని దాంతోనే కడుపునిండా తిన్న మేము ఒకరి మొహాలు ఒకరం చూసుకున్నాం! కారంతో నోరు మండిపోతుంటే నీళ్ళు తాగుదామని పక్కనున్న సత్తుగ్లాసు నోటి దగ్గర పెట్టుకున్నాం. అందులో ఉన్నది పల్చటి వేడివేడి గంజి! కారం మంటతో పాటు వేడికి నోరు కూడా కాలింది!

పాపం! మా బాధ చూడలేక పెద్ద ఆనపబుర్ర (తొలచిన- ఎండిన ఆనపకాయ) లోంచి నీళ్ళు మరో ఆనప గరిటతో ముంచి మరో సత్తుగ్లాసులో ఇచ్చారు. చల్లగా తాగి అమ్మయ్యా! అనుకున్నాం.

"మాకు మజ్జిగ తాగే అలవాటు లేదంటూ" మజ్జిగ పోయనందుకు నొచ్చుకుంది ఆ ఇల్లాలు . ఫరవాలేదంటూ ఆ పూటకు ముగించాం. తర్వాత అతిథి మర్యాదలో భాగంగా "జీలుగ కల్లు" ఇవ్వబోతే వద్దని దణ్ణం పెట్టాం.

పదింటికి పడుకున్న మేము, రెండింటికి దంపుడు చప్పుడుతో లేచాం. ఆమె మర్నాటి వంటకి వడ్లు దంచుతోంది. ఆశ్చరపోయాం! అసలామె ఎప్పుడు నిద్రించింది? తెల్లారితే భర్త, ముగ్గురు పిల్లలు, దూడ..దుక్కి. భర్తకు వ్యవసాయంలో సాయం. దుక్కిదున్నటం దగ్గర్నుండి ప్రతి పని భర్తతో సమానంగా చేస్తుంది. మళ్ళీ ఇంటిపని. ఇంట అలుకుళ్ళు-ముగ్గులు. పండగల్లో ప్రత్యేకవంటలు (మాంసాహారం). ఇంట్లో ఏ ఆధునిక సౌకర్యాలూ లేవు. ఉన్నదల్లా కత్తి, చాకు, గొడ్డలి, బల్లెం, బాణం. అవే ఆయుధాలు అవే పనిముట్లు.

ఆలోచిస్తుండగా తెల్లవారింది. పుల్లలతో మొహాలు కడుక్కోగానే మాకోసం రాగి అంబలి సిద్ధం అయింది. జుర్రేశాం. 'కాఫీపొడి లేదు ఏమనుకోకండి' అంటూ ఏదో చెట్టు బెరడు కాసేపు నీళ్ళలో మరిగించి బయటకట్టివున్న ఆవు దగ్గరకెళ్ళి కాసిని పాలు పితుక్కొచ్చి కలిపి యిచ్చింది. కాఫీకంటే అద్భుతంగా ఉందది.
మాటవరసకు అడిగాను "ఆవులున్నాయికదా, పాలుతీసి పెరుగు, మజ్జిగ చేసుకోవచ్చుకదా" అని.

'ఛీ దూడ నోటికాడ కూడు లాక్కుంటామా? పాపం కదా?' అంది. వెంటనే చెంప తడుముకున్నాను. చంటిపిల్లలకు, అదీ అత్యవసరమైతే పాలకు ఆవుపాలు ఇస్తారు. ఎద్దులు వ్యవసాయ అవసరాలకు మాత్రమే.

వారి దగ్గర శెలవు తీసికొని, కబుర్లు చెప్పుకుంటూ మా ప్రయాణం కొనసాగించాం.

ఇంటికి చుట్టుపక్కల కొన్ని చెట్లు నరికి చోళ్ళు, గంట్లు, రాగులు, జన్నలు, మొక్కజన్నలు పండిస్తుంటారు.

వర్షాధారమే. ఇది పోడు వ్యవసాయం. వేసవికాలంలో వేట. అది రెండు రకాలు. మాటువేట, పారువేట.

జంతువులు నీళ్ళు తాగే ప్రదేశాల్లో చాటుగా మాటువేసి అవి వచ్చినప్పుడు బాణాలతో, బళ్ళాలతో చంపి వేటాడటం మాటువేట. ఐదారుగురు కలిసివెళ్ళి లేడినో, దుప్పినో చంపి తెచ్చి సమంగా పంచుకుంటారు.

గంగాలమ్మ పండుగవంటి పర్వదినాల్లో 30, 40 మంది - ఇంచుమించు ఊరంతా కలసి గోలగోల చేస్తూ అరుస్తూ

కనబడ్డ జంతువుల్ని కార్నర్ చేస్తూ చంపి పంచుకుంటారు. జంతువే పారిపోయేలా చేసి వేటాడుతారు కనుక ఇది పారువేట.

దూరంనుండి బాణం, దగ్గరకొస్తే బల్లెం లేదా కత్తి - చాకు ఇవి ఆయుధాలు. పక్షుల్ని, పిట్టల్ని కొట్టే బాణాలను మిట్ట బాణం అంటారు. వాటి చివర ఇనుప ములుకు ఉండదు. వెదురుముక్క - సూదిగా కాక గుండ్రంగా ఉంటుంది. ఎందుకలా? అంటే, పిట్టల్లో ఉండేదే కొంచెం రక్తం. అదికాస్తా పోతే ఎలా? గాయం కాకుండా దెబ్బతో అవి పడాలి.

మెకం (మ అగం) అంటే పులి. అదంటే భయమే. దాన్ని వేటాడ్డం గురించి వాళ్ళు విన్నవి చెప్పారు తప్ప, అనుభవంగా చెప్పలేదు. చిరుతను వేటాడటం ఉంది. నక్క, రేచుకుక్క (ఇది ఒకరకం నక్కజాతి) మొదలైన వాటిని పశువులను, తమను రక్షించుకోవటానికి చంపినా తినరు. ఐదు గోళ్ళున్న జాతి - నిషేధం (రామాయణ కాలంనుండి పంచనఖ జంతు మాంస నిషేధం ఉంది).

నెమళ్ళు, బింగిరాజు (మాట్లాడే పక్షి), చిలుకలు, గోరింకలు, కొన్నిచోట్ల బాతులు పెంచుకుంటారు. ఆవులు, మేకలు సరేసరి. గుడిశల్లో కాపురం. 30, 40 ఇళ్లుంటే పెద్ద ఊరే! 7, 8 ఇళ్ళు మాత్రమే వున్న జనావాసాలు కూడా ఉన్నాయి. వెదురు-మట్టి-తాటాకు- తాటివాసం..నిర్మాణసామాగ్రి. పాలకర్ర దడిగా కట్టి మెత్తుతారు. జీలుగకల్లు - తాటికల్లు - ఈతకల్లు ఉదయమే పసిబిడ్డ బాలాది సపరివారంగా తాగుతారు. దుంపలు పండిస్తారు. కర్రపెండలం వంటి దుంపలు కాల్చి తింటారు. కాయలు, పండ్లు సరేసరి.

ఓసారి ఓ మామిడికాయ కోసుకొని తినబోయి ఓ గిరిజనుడి కంట పడ్డాం. 'మీరు బాగానే వుంటారు. మా జంతువుల్ని మెకాలెత్తుకు పోతాయి' అంటూ తిట్టిపోశాడు. వెంటనే మామిడికాయ కిందపడేసాం. కొత్తామాస వెళ్ళకుండా తినకూడదు. అది అటవీ నియమంట. కొత్తకొర్ర పండుగ చేయకుండా క్రొత్త ధాన్యాలు వాడరు. అది నియమం.

చింతపండు, శీకాయ, కొన్నిపప్పులు వారాంతపు సంతల్లో ఇచ్చి ఉప్పు, కిరసనాయిలు, అద్దాలు, గాజులు, దువ్వెనలు కొనుక్కుపోతారు. మగవాళ్ళు నిత్యం గోచీయే. పంచెలు, ఇటీవల నిక్కర్లు - పాంట్లు వచ్చాయి. ఆడవాళ్ళు చీరలే. జాకెట్లు, చొక్కాలు వంటి వాడకం - దర్జీ ఉన్నా తక్కువ. ముఖ్యమైన పనులన్నీ సంతల్లోనే. ఇలాయి బుడ్డి దీపాలు, కిరసనాయిలు. ఈ పాటికి కరెంటు చాలా చోట్ల వచ్చి ఉండవచ్చు.
కొద్దిచోట్ల బహుభార్యాత్వం ఉంది. బహు భర్త అత్వం లేదు. అయితే, ఒకసారి ఒకరితోనే కాపురం. మరొకరితో జత కుదిరినా ముందు ఉన్న భార్యతో తెగతెంపులు అవ్వాలి. అది నియమం. ఆ తెగతెంపుల కార్యక్రమం ప్రహసనంలా అనిపించినా ఓ పద్ధతుంది.

ఒకతనికి - భార్య ఉండగా మరొకామెతో సంబధం ఏర్పడితే ముందామే తగవు పెడుతుంది. ఆ పంచాయితీలో (ఆ జనావాసంలోని నాలుగు పెద్దతలకాయలు) మొగుడ్ని తిట్టిపోన్తుంది. వీలైతే తగల్నిన్తుంది కూడా. అతను మాట్లాడకూడదు. పడి ఊరుకోవాలంతే. అలా కొంతసేపు గడిచాక "అయిందేదో అయింది, మనసులేని మనువెందుకు, దానితోనే పోనీయ్" అని ఈమెకు సర్దిచెప్పి- అతని తప్పుకు జరిమానా వేసి, దానిని కొంత మనోవర్తిగా ఆమెకిప్పించి, మిగిలింది పెద్దలంతా కల్లు-సారాకి పంచాయితీ ఖర్చులుగా తీసుకుంటారు. రాత కోతలకు పంతులుకి ఒకటి రెండు రూపాయలిస్తారు. కాగితంమీద రాస్తే, తప్పటానికి వీల్లేదు. ఆ కాగితం ఓ పెద్ద దాస్తాడు.

గంగాలమ్మ పండుగల్లో థింసా న అత్యంలో పాటలుంటాయి. కొమ్ము డాన్సులని ఓ ప్రత్యేక న అత్యముంది. పాటల్లో శ అంగారం పాలు కాస్త ఎక్కువే ఉంటుంది. కొన్ని నీతి పాటలుంటాయి. ఉదా: పెళ్ళిసంబంధాల్లో "రాగులే నల్లన రారా, రాగిపిండి తెల్లన రారా, మాయమ్మి నలుపు రారా, మాట తెలుపు రారా" ఇలా సాగుతుంది పాట. నరసంలో:- నలినంవదు లేలే, సలిపుడుతోందరి బాయ్యి, కాళ్ళ పట్టాల మీద - సలి పుడతోందోరి బాయ్యి, చేతి గాజులమీద సలిపుడతోందోరి బాయ్యి" ఇలా గోముగా కోర్కెలు తీర్చుకోవటం ఉంటుంది.

గిరిజన ప్రాంతాల్లోని జానపద బాణీలను ఒడిసిపుచ్చుకున్న విప్లవగీతాలు కూడా జానపద గీతాలుగా చెలామణి అయిపోతున్నాయన్నది వేరే సంగతి. కొద్దిమంది జనం -నివాసం ఉండే ఆ వాస ప్రాంతం 'జనపదం'. వారి నోళ్ళల్లో నానుతున్న సాహిత్యం జానపద సాహిత్యం. ఇది గిరిజన ప్రాంతాల్లోనే కాదు- పల్లెల్లోను, పట్టణ శివార్లలోను, కొన్ని సంచార జాతుల మధ్యకూడా లభించవచ్చు.

వాటి విషయం-రామాయణం భారతాది ఆఖ్యాన -ఉపాఖ్యానాల కథలు, వాడుకలో వున్న పుక్కిటి పురాణాలు, స్థానిక కథలు, అనుభవాలు, పని ఊతంకోసం పాడే పల్లెపదాలు - ఏవైనా కావచ్చు.

ఒకరికి తెలిసిన సమాచారం మరొకరికి చెప్పుకుంటూ..మాటల్లో పడి దారితప్పాం! అడవిలో అగమ్యగోచరం. ఆకాశం కనబడనంత ఎత్తైన గుబురు చెట్లు. మధ్యాహ్నమే చీకటి. ఏదో వాసన. పులి, మాంసాన్ని దాచుకొని తింటుందంటారు. ఇది కుళ్ళిన మాంసం వాసనే అని ఒకరు, ఓషధుల వాసన అని ఒకరు. జంతువుల లద్దెలు కావచ్చు. ఇలా ఏవేవో ఊహించుకుంటున్నాం. ఎటు పోతున్నామో తెలియదు. ఏమైపోతామో తెలియదు. మొదటిసారి భయమేసింది. ఇలాంటి సాహసాలు వద్దని ఒట్లు పెట్టుకున్నాం.

కొన్ని గంటల తరువాత చెట్లు నరుకుతున్న శబ్దం వస్తే అటుగా వెళ్లాం. కాసేపటికి ఒక మహా వ అక్షం నేలకూలిన చప్పుడు. అక్కడికి చేరాం. వాళ్ళు కలప దొంగలు. స్మగ్లర్లు. అయితేనే మాకు దేవుళ్ళు. మొదట్లో భయపెట్టినా.. బెదిరించినా మావల్ల ప్రమాదం లేదని తెలిసి చివరకు మాకు దారి చెప్పారు. మరో రెండు మూడు గంటల్లో లక్ష్యం చేరాం.

గుర్తేడులో గురువు నాగన్నగారు అత్యదుఃతే వేదాంతవిషయాలను శ్లోకాలతో సహా అతి సులభమైన ఉదాహరణలతో మాటలతో చెబుతుంటే చెవులప్పగించాం. నోరెళ్ళబెట్టాం!

ఆ ఊళ్ళో ఒక వ్యక్తి కాలువిరిగి కాకినాడ ఆసుపత్రికి చేరి వారు శీల వేస్తానంటే ఒప్పుకోక ఏదో కొండమందు - కోడి మాంసంతో తిని మామూలయ్యాడని విని ఆశ్చర్యపోయాం. వాళ్ళల్లో పూర్వకాలపు నాడి విజ్ఞానాలు ఇప్పుడు లేవు. మందులు తెలిసినా డోసు తెలియదు. రోగ నిర్ధారణ తప్పి మందులు పనిచెయ్యకపోవచ్చు.

జాగ్రత్తగా వెతికి తీస్తే అదుతే వైద్యమూలికలు, బెరళ్ళు, ఆకులు, తీగలు లభించవచ్చు. పేటెంట్లదాకా వెళ్ళే దెవరు? వేపకీ, పసుపుకే దిక్కులేదు.

ఆ ప్రాంతాల్లో రంగురాళ్ళ అన్వేషణలో కూలీలుగా బలైపోయిన గిరిజనులు ఉన్నారు. బాక్సైట్ నిక్షేపాల కూలీలున్నారు. అమూల్యమైన సంపద ఉంది. అదుతేమైన వ్యక్తులున్నారు. వారిపట్ల చిన్నచూపే తప్ప గౌరవంతో కూడిన కలుపుగోలుతనం సమాజంలో కనిపించదు. మనం అభివ అద్ధి అనుకొంటున్నది, సౌకర్యాలు అనుకొంటున్నవి ఒక కోణం మాత్రమే.

గిరిజనులు సినిమాల్లో చూసినట్లు ఈకలతో ఏమీ లేరు. చాలవరకు మనలాగే ఉన్నారు. కలుపుకు పోయేవారు లేక మానసికంగా దూరంగానే వున్నారు!

**- డా॥ యేలూరిపాటి ఆంజనేయ శర్మ**

**తెలుగు, సంస్కృతం, రెలిజియస్ స్టడీస్, ఫిలాసఫీల్లో మాస్టర్స్ చేసి సంస్కృతంలో పి.హెచ్.డి పట్టాను పొందిన శ్రీ శర్మగారు "న్యూజెర్సీ బ్రిడ్జ్ వాటర్ వేంకటేశ్వరాలయం" లో మేనేజర్‌గా పనిచేస్తున్నారు. సంస్కృత పండితునిగా పనిచేసే రోజుల్లో, టీ.వీలో 3 సంవత్సరాల పాటు రామాయణాన్ని ధారావాహికంగా ప్రవచనం చేసారు. ఎన్నో సాహితీ సదస్సుల్లో పాల్గొన్నారు. గిరిజన ప్రాంతంలోని బాలబాలికలకు సంస్కృత భాషను బోధించి, హైద్రాబాద్‌లో వారిచేత ఛత్రపతి శివాజీ, అభిజ్ఞాన శాకుంతలం నాటికలు వేయించటం ఎంతో సంతృప్తిని ఇచ్చింది అని అంటారు.**



# మా మంచి ఊరు!

– శ్రీమతి శ్యామలాదేవి దశిక

అంత శ్రద్ధగా చదువుతూ...నీలో నువ్వే నవ్వుకుంటున్నావు ఏమిటి అంటారా?



అదా! ఏమిలేదు... ప్రత్యేక సంచికలో ప్రచురణ కోసం "జానపదం" మీద వచ్చిన ఆర్టికల్స్ చదువుతుంటే మేం కూడా జానపదులం అని తెలిసి నవ్వొచ్చింది. జానపదానికి ఎంతోమంది ఎన్నో అర్థాలు చెప్పినా చివరికి పల్లెటూరు అన్న అర్థమే ఖాయం చేసారుట. అంటే నేను "జానపది"నన్నమాట!

ఏమిటీ.....అయితే ఇకనుంచీ నేను అమెరికా ఇల్లాలి ముచ్చట్లు కాకుండా "జానపది ముచ్చట్లు" రాయాలంటారా?

ఎలాగో అలా నామీద జోక్ వెయ్యందే మీకు తోచదు కదా?!

ఈ వ్యాసాలన్నీ చదువుతుంటే నాకు ఉన్నట్టుండి మా ఊరు....మా చిన్నతనం...అప్పటి ఆటలు..పాటలు... సరదాలు కళ్ళముందు కదులాడుతున్నాయి. పొద్దున్నే చద్దన్నాలు తిని చదువుకుంటూ.... ఆటలాడుకుంటూ... పొలాల్లో పరుగులెడుతూ.. వాళ్ళు పాడే పాటలు వింటూ పెరిగాం. పైరగాలి కమ్మని తిండి, కల్మషంలేని ప్రేమలు...... జానపద సాహిత్యం లాగే, సహజమైన స్వచ్ఛమైన జీవనం. మళ్ళీ ఆ రోజుల్లోకి వెళ్ళగలిగితే ఎంతబావుండు!

మాది చిన్న ఊరైనా, ఊళ్ళో ఎప్పుడూ ఏదో హడావిడి ఉండేది. గుళ్ళల్లో పూజలు...ఉత్సవాలు...వీధి భాగవతాలు.... హరికథలు...నాటకాలు... దసరా వేడుకలు...పులి వేషాలు...పోలేరమ్మ జాతరలు...ఏరువాక పండగ...శ్రావణమాసం నోములు...పేరంటాలతో సందడిగా.. కళకళలాడుతూ ఉండేది! మగ పిల్లలు దీపావళి పండక్కి...వినాయక చవితికి ఎదురు చూస్తే, ఆడపిల్లలం అట్లతద్ది, సంక్రాంతి పండగ ఎప్పుడొస్తాయా అని ఎదురు చూసేవాళ్ళం. ఈ రెండు పండగలకు, ఆ టైములో మా దొడ్లో గోరింటాకు చెట్టుకు ఎంత డిమాండ్ ఉండేదో! పండగలకు, పేరంటాలకు ఆడపిల్లలం గోరింటాకు తప్పనిసరిగా పెట్టుకునేవాళ్ళం. ఆ రోజుల్లో మాకదే మెనిక్యూర్, పెడిక్యూర్! అట్లతద్ది ముందురోజు సాయంకాలం అమ్మ గోరింటాకు రుబ్బి పెట్టేది. వేళ్ళకు తొడుగుల్లా సగం వరకు పెట్టి, అరచేతి మధ్యలో నయాపైసంత సైజులో చందమామను పెట్టి, "ఇవి నక్షత్రాలు" అంటూ చుట్టూ చిన్నచిన్న చుక్కలు పెట్టేది.

ఏమిటీ..... మరి ఇంకో చెయ్యి సంగతేమిటంటారా?

రెండో చేతిలో " కాకరాకు డిజైన్ కావాలా బంతి ఆకు డిజైన్ కావాలా" అంటూ అమ్మ నేను ఎంచుకున్న ఆకుని అరచెయ్యి మధ్యలో పెట్టి ఆకు కదలకుండా, జాగ్రత్తగా నాకెంతో ఇష్టమైన అప్పచ్చి వేసేది! ఎత్తు ముక్కాలిపీట మీద కూర్చోమని పాదాలకు అందంగా పారాణి పెట్టేది. అమ్మ నాకు పెట్టే గోరింటాకు చూసి "మాకూ" అంటూ ఇద్దరు తమ్ముళ్ళు చేతులు చాపేవారు! ఇంక అక్కడినుంచి రాత్రి పడుకునే దాకా మాకు సేవలే సేవలు!!

బాదంకాయ కంచంలో ముగ్గురికి అన్నం కలిపి నోట్లో ముద్దలు పెట్టేది. చేతులు రెండు దూరంగా పెట్టుకుని అమ్మ చెప్పే కథలు వింటూ రోజు కన్న ఎక్కువ తినేవాళ్ళం. ఎండకుండానే గోరింటాకు ఎక్కడ చెరిపేసుకుంటానో అని, నేను " దురద " అంటే వెంటనే నెమ్మదిగా చేత్తో రాస్తూ "దాహం" అంటే మంచినీళ్ళు నోటికందిస్తూ.......పాటలు పాడుతూ.... మరిపిస్తూ ఉండేది అమ్మ. మేము పడుకున్నాక అప్పుడు రోటిముందు కూర్చుని కందిపచ్చడి రుబ్బేది.

ఏమిటీ మా అమ్మ చేతి కందిపచ్చడి రుచి, మీకూ గుర్తుందంటారా?

అవునౌను! మన పెళ్ళైన కొత్తల్లో ఓసారి నన్ను పంపించమని మా నాన్న అడిగితే "అలాగే మామయ్యగారు" అంటూ నన్ను పంపించి నట్టే పంపించి, మూడోరోజే బుజాన బ్యాగు తగిలించుకుని చీకట్లో ఇల్లు వెతుక్కుంటూ వచ్చారు!! ఉన్నపళంగా ఊడిపడ్డ అల్లుడికి కూర లేకుండా కంది పచ్చడి, పప్పుపులుసుతో భోజనం పెట్టాల్సి వచ్చిందని అమ్మ ఎన్ని సార్లు అనుకునేదో! కాన్పూరు లో పెరిగిన మీకు, అది కందిపచ్చడి అని తెలియకపోయినా, మళ్ళీమళ్ళీ వేయించుకుని లాగించటం నాకు బాగా గుర్తుంది లేండి!

పండగ రోజు తెల్లవారుజామున అమ్మ నిద్ర లేపటం ఆలస్యం, చెంగున లేచి గబగబా మొహం కడుక్కుని రెడీ అయిపోయేదాన్ని. గోరింటాకు కడిగేసుకున్న వెంటనే, పరిగెత్తుకుంటూ మా నాన్న దగ్గరకు వెళ్ళి పండిన చేతులు చూపించేదాన్ని. నాన్న నా అరచేతులు రెండూ పట్టుకుని, కాసేపు ముక్కు దగ్గర పెట్టుకుని నవ్వుతూ నావంక చూసేవారు. ఆయనకు ఆ గోరింటాకు వాసన అంటే ఎంతో ఇష్టంగా ఉండేది!

నన్ను చూసి మా రాము, కృష్ణ కూడా లేచేవారు. అమ్మ మా ముగ్గురికి దొడ్లో తులసికోట దగ్గర వేడివేడి అన్నం, కందిపచ్చడి తో పాటు పెరట్లో కాసిన పొట్లకాయ కూర, గడ్డపెరుగు వేసి అన్నం పెట్టేది. తెలవారుఝామున అలా ఆరుబయట తింటుంటే భలేగా ఉండేది! ఆ వెన్నెల్లో

కూర్చుని మేము అన్నం తింటుంటే అమ్మ ఆనందంగా మా మొహాల్లోకి చూస్తూ ఉండేది!

"ఆడపిల్లవు! పనులు చేయడం రాకపోతే ఎలా" అంటూ ఇల్లు చిమ్మమని.....కంచాలు, గ్లాసులు కడగమని, చెట్లకు నీళ్ళు పొయ్యమని ప్రతి రోజు పనులు పురమాయించే అమ్మ ఆరోజు




మాత్రం నాకు ఒక్క పని కూడా చెప్పేది కాదు. పైపెచ్చు వెళ్ళి ఆడుకోమనేది! పొద్దున్నే అంచు పరికిణీ, జాకెట్టు వేసుకుని తాంబూలం వేసుకుని రాజకుమారి స్టైల్లో మొహం వెలిగిపోతుంటే, ఉయ్యాలలూగటానికి పరిగెత్తుకుంటూ వెళ్ళేదాన్ని!

ఆడపిల్లలం అందరం, ఎక్కిన ఉయ్యాల ఎక్కకుండా....ఊగిన ఉయ్యాల ఊగకుండా రోజంతా "అట్లతద్దోయ్ ఆరట్లోయి.. ముద్దపప్పోయి మూడట్లోయి" అంటూ ఊరంతా తిరిగేవాళ్ళం.

కళ్ళు తిరుగుతున్నా...ఒళ్ళు తూలుతున్నా "అన్ని ఉయ్యాళ్ళు ఎక్కాల్సిందే" అనేది అనసూయ. మా అందరికీ లీడర్ అదే. దానికి అసిస్టెంట్ వరలక్ష్మి. వాళ్ళిద్దరికీ ఉన్న క్వాలిఫికెషన్ ఒకటీ.. ఒక జడ! మా పక్కింట్లో ఉండే సావిత్రికి ఉయ్యాల ఊగటం అంటే భయంగా ఉండేది. అందుకని ఉయ్యాల ఎక్కీఎక్కగానే గట్టిగా కళ్ళు మూసుకునేది!

ముందుగా వేణుగోపాలస్వామి ఆలయం దగ్గర వేసే ఉయ్యాలతో మొదలు పెట్టి అక్కడినుంచి చాకలి చెరువు...సాయబుల వీధి.......కోమట్ల బజారు...ఇలా అన్ని చోట్లకు వెళ్ళి ఉయ్యాలలు ఊగి చివరికి నాయుడి గారి ఇంటికి చేరుకునేవాళ్ళం. ఆ రోజుల్లో మా ఊళ్ళో, నాయుడి గారి ఇల్లు, ఆతిథ్యానికి పెట్టింది పేరుగా ఉండేది. పెద్ద మండువా ఇల్లు, ముందు వెనక బోలెడంత ఆవరణతో ఎంతో బావుండేది! ఆ ఇంట్లో, లేని చెట్టు లేదు. ఇంటిముందున్న వేపచెట్టుకు మొకుతో పెద్ద ఉయ్యాల వేసేవారు. అందరం ఆ ఉయ్యాల ఊగటానికి మా టర్న్ కోసం ఎదురు చూస్తూ నాయుడి గారి ఇంటి ఎత్తు అరుగులమీద వరసాగ్గ కూర్చునే వాళ్ళం! వాళ్ళ ఇంటి పాలేరు రాజయ్య తాతకు పిల్లలంటే అందులో ఆడపిల్లలంటే మరీ ఇష్టం! పిల్లలు వస్తారని ఆ రోజు రాజయ్యని పొలం పంపించే వారు కాదు నాయుడు గారు. రాజయ్య తాత హుషారులో, ఉన్నట్టుండి పెద్ద పెద్ద ఊపులు వేసేవాడు. ఉయ్యాల ఆపమంటే ఓ పట్టాన ఆపేవాడు కాదు. "నీ మొగుడు పేరు చెప్తే కాని ఆపన"ని ఆట పట్టించేవాడు! ఇక నవ్వులే నవ్వులు! నాయుడి గారి భార్య ఇందిరమ్మగారు మా అందరికీ పూల చెండు, ఓ జామకాయ ఇచ్చేవారు. అబ్బో! ఆ జామకాయ రుచేరుచి!!!

ఏమిటీ..... "నీ మొగుడి పేరు చెప్పావా నువ్వు" అంటారా?! ఆ! ఒకసారి నాకూ అయింది. వెంటనే నోటికొచ్చిన పేరు "సుబ్బయ్య" అని చెప్పి ఎలాగో తప్పించుకున్నాను. నాకేం తెలుసు నిజంగానే "సుబ్రహ్మణ్య శర్మ గారు" నాకు మొగుడౌతాడని?!!

ఏమిటీ....మంచి మొగుడు కోసం, చిన్నప్పుడు నేను గొబ్బెమ్మలు పెట్టబట్టి మీరు నా మొగుడయ్యారా?

మంచి మొగుడు సంగతేమో కాని...సంక్రాంతి నెల రోజులు గొబ్బెమ్మల పేరుతో బహు గొప్పగా ఎంజాయ్

చేసేవాళ్ళం లేండి! ఆ నెలరోజులు బళ్ళో మాస్టర్లు కూడా పాఠం సరిగ్గా అప్పచెప్పక పోయినా, లెక్కల్లో తప్పులచ్చినా మమ్మల్ని పెద్దగా కోప్పడేవారు కాదు.

రోజు చీకటితోనే లేచి గజగజ వణుక్కుంటూ ఆవుపేడ కోసం బుట్టతీసుకుని బయలుదేరే వాళ్ళం. ఆ నెలరోజులు నేను తెలివిగా మా తమ్ముళ్ళతో పోట్లాట పెట్టుకునేదాన్ని కాదు! వాళ్ళు కూడా నేను రోజూ గొబ్బెమ్మలకు నైవేద్యం పెట్టే బెల్లం ముక్క, జామకాయలో వాటాకోసం నాతో మంచిగా ఉంటూ నేను ఏ పని చెప్తే అది చేసేవాళ్ళు! తక్కువైతే అర్జెంట్ గా ఆవుపేడ తెమ్మని...పొలంలో ఉన్న పువ్వులు తెమ్మని... చీకట్లో నేను ఆవుపేడ సేకరించేటప్పుడు లాంతరు వత్తి పెద్దది చెయ్యమని...ఇలా అవసరాన్ని బట్టి ఎస్సైన్ మెంట్లు ఇచ్చేదాన్ని! బళ్ళోకి వెళ్తూనే "నువ్వెన్ని గొబ్బెమ్మలు పెట్టావంటే నువ్వెన్ని పెట్టావని? ఇంటిముందర ఆరోజు ఏ ముగ్గు పందిరి ముగ్గా? తులసికోట ముగ్గా? నెమళ్ళ ముగ్గా? రథం ముగ్గా? పద్మం ముగ్గా.... అంటూ ఆరాలు తీస్తూ కబుర్లు చెప్పుకునే వాళ్ళం. క్లాసులో మాస్టారు పాఠం చెప్తున్నా, ఈ కాలంలో స్టూడెంట్స్ ఎస్.ఎం.మెస్ లు, లవ్ మెసేజ్ లు పంపించుకున్నట్టు మేము పుస్తకం అడ్డం పెట్టుకుని కాగితం మీద ముగ్గులేసి సైలెంట్ గా ఒకళ్ళకొకళ్ళం పాస్ ఆన్ చేసుకునేవాళ్ళం!

అసలు "గ్రాండ్ ఫినాలి" సందె గొబ్బెమ్మలు పెట్టటం. నెల రోజుల తర్వాత సందె గొబ్బెమ్మలు పెట్టటం అంటే "పార్టీ టైమ్" అన్నమాటే! ఈ పార్టీ లో బెస్ట్ పార్ట్ ఏమిటో తెలుసా? పెద్ద వాళ్ళ జోక్యం ఉండేది కాదు. మాదే రాజ్యం! ఏరోజు ఎవరింట్లో సందె గొబ్బెమ్మలు పెట్టాలో స్నేహితురాళ్ళం అందరం కలిసి చాలా జాగ్రత్తగా ప్లాన్ చేసుకునే వాళ్ళం. పేరంటం ముందు రోజే వెళ్ళి నా స్నేహితురాళ్ళ0దర్ని పిలిచేదాన్ని.

ఆ రోజు సాయంకాలం సందె గొబ్బెమ్మను చేసి పసుపు, కుంకుమ, పూలతో అలంకరించి ముక్కాలి పీట మీద పెట్టేదాన్ని. బంతిపూలతో అమ్మ చేత పూలజడ వేయించుకుని, పట్టు పరికిణీ జాకెట్టు వేసుకుని... పారాణి పెట్టిన కాళ్ళకు వెండి గజ్జెలు పెట్టుకుని అందరం "గొబ్బియల్లో సఖియా వినవే - చిన్నీ కృష్ణుని చరితము వినవే " అంటూ చేతులతో తట్టుతూ గొబ్బెమ్మ చుట్టూ తిరుగుతూ పాటలు పాడేవాళ్ళం! మధ్యమధ్యలో కిచకిచలు.....పకపకా నవ్వులు....వెనక నుంచి పెద్దవాళ్ళ హాస్యాలు...భలే సరదాగా ఉండేది! ఆ తర్వాత అమ్మ పళ్ళెంలో సిద్ధంగా ఉంచిన శెనగలు....అటుకులు - బెల్లం....నూపప్పుండలు...అరిటిపళ్ళు గబగబా గొబ్బెమ్మకు చూపించేసి మేము "పండగ" చేసుకునేవాళ్ళం!

ఏమిటీ.....యాభై ఏళ్ళ నాటి సంగతి కళ్ళకు కట్టినట్టు ఇంత బాగా ఎలా చెప్పగలుగుతున్నాను అంటారా?

అవును కదా! నే చెప్పే ఈ ముచ్చట్లు ఈనాటివా.? కానీ.....

ఆ చిన్నతనం.........ఆ చిన్ని చిన్ని కోరికలు..... ఆ చిన్ని చిన్ని సరదాలే మాకు కొండంత ఆనందాన్నిచ్చాయని ఊరు వదిలి చదువులకోసం పట్నం వెళ్ళాక, పెళ్ళయి అమెరికా వచ్చాకే తెలిసింది. ఆ పల్లెటూరిలో పడ్డ పునాది...అక్కడ అలవడిన సంస్కారమే, మా భవిష్యత్తుని తీర్చి దిద్దాయి.

మనకున్నదానితో తృప్తిగా ఎలా ఉండాలో, దానిని నలుగురితో ఎలా పంచుకోవాలో...నలుగురితో ఎలా కలిసిమెలిసి ఉండాలో....సమాజంలో ఎలా మెలగాలో, ఆరాటాలు లేకుండా ఆనందంగా ఎలా ఉండచ్చో ఆ ఊరు మాకు నేర్పిందండి. అందుకే ఆ బాల్యపు తీపి గుర్తులు నా మనస్సులో ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉన్నాయి!

మీరు నాకు గోరింటాకు పెడతారా? ఎర్లీ మార్నింగ్ లేచి డెక్ లోకూర్చుని బ్రేక్ ఫాస్ట్ బదులు వేడి వేడి అన్నంలో కందిపచ్చడి, ఉల్లిపాయ పులుసు వేసుకుని తిందామా? మీరు నాకు తాంబూలం చేసి ఇస్తారా?

మనవరాళ్ళ కోసం వేసిన స్వింగ్ సెట్ మీద నన్ను కూర్చోపెట్టి, నేను నా "మొగుడి పేరు" చెప్పేదాకా మీరు ఊపుతూనే ఉంటారా?!

ఏం పేరు చెప్పనబ్బా......?!!!!!

- శ్రీమతి శ్యామలాదేవి దశిక



పంతొమ్మిదేళ్ళ వయస్సులో అమెరికాలో అడుగు పెట్టిన శ్యామలాదేవి ఇక్కడికి వచ్చాకే మాతృభాష విలువ, రాయాలన్న ఆసక్తి కలిగిందంటారు. **1976** నుంచి న్యూజెర్సీలో నివాసం. అమెరికా ఇల్లాలి ముచ్చట్లు" అన్న శీర్షకతో హాస్యతో కూడిన ముచ్చట్లు రాస్తూ ఉంటారు. వంగూరి ఫౌండేషన్ వారి ద్వార ఇప్పటివరకు రెండు పుస్తకాలు ప్రచురించబడ్డాయి. వీరికి సమాజానికి చక్కని సందేశం ఇచ్చే కథలు, సున్నితమైన హాస్య కథలు అంటే చాలా ఇష్టం. సిలికానాంధ్ర జగమంత కుటుంబంలో భాగమైన మనబడిలో ఉపాధ్యాయురాలిగా పిల్లలకు తెలుగు బోధిస్తూంటారు.

# కోడి పందెములు

- యర్రమిల్లి శారదా కుమారి

ఉత్సవాలు, పండుగల సందర్భములలో కోడి పందెములు కూడా ఒక వేడుకగా గ్రామములలో జానపదుల వినోదముగా వింటూనే ఉంటాము. పూర్వము ఈ కోడి పందెములు విస్తారంగా జరిగేవి. అనేకమైన చారిత్రక రణములకు ఈ కోడి పందెము ప్రధాన కారణంగా చరిత్రలో చదివే ఉన్నాము. ప్రభుత్వము దీనిని నిషేధించినా మారుమూల గ్రామ సీమలలో ఈ వేడుక జానపదులకు ఆనందమే.

అయ్యలరాజు నారాయణామాత్యుడు 'తన హంస వింశతిలో'' కోడి పందెములను ఈ క్రింది పద్యములలో వర్ణించాడు.

కందపద్యం : అంతటని తాంతహర్ష
స్వాంతయుత ద్యూత జనవరక్షుభిత హరి
ద్దంతి శ్రుతియైనగర
ప్రాంతంబున కోడి పదువు పందెము సాగెన్
(హంస వింశతి 3ఆ - 211 పద్యం)

కోడి పందాలు జరిగే చోట పందెం కాసేవారు, ఆట చూసేవారు ఒక చోట పోగయ్యారు. జనం అధిక సంఖ్యలో వచ్చారు. చాలా ఆనందంగా కేరింతలు కొడుతున్నారు. వారి అరుపులు, కేకలకు దిగ్గజముల చెవులకు బాధకలిగినదని అతి శయోక్తిలో వర్ణనమిది. అంత అధికమైన కోలాహలం వాతావరణం నెలకొందని పద్యమునకు తాత్పర్యం.

తేటగీతి : కావి ప్రాతలు దారాలు కట్టుముళ్ళు
ముష్టులును నీళ్ళ ముంతలు మూలికలును
కత్తుల పొదుళ్ళు మంత్రముల్కట్టు పసరు
లెనయ వచ్చిరి పందెగాళ్ళేపు రేగి
(హంస వింశతి 3ఆ 212 పద్యం)



కోడి పుంజులను పట్టుకు వచ్చిన పందెం కాసిన వారిని కవి వర్ణిస్తున్నాడు. కాషాయ బట్టలు కట్టుకొని ఉన్నారు. దారములు కట్టుముడులు, కత్తిపిడులు పట్టుకు వచ్చారు. నీళ్ళలో నిండి ముంతలు కోళ్ళకు గాయాలైతే ప్రథమ చికిత్సకు కొన్ని మూలికలు, కత్తుల పొదులు కోళ్ళకు కట్టే కత్తులు తెచ్చారు. సరంజామా అంతా సిద్ధం చేసుకొని కోడిపందాలకు పందెం కాసే వారు హుషారుగా వచ్చారని అర్థం.

కోళ్ళు అనేక లక్షణాలతో ఉంటాయి. ముఖ్యంగా పందానికి పెంచబడుతున్న కోళ్ళకి చాలా చరిత్ర ఉంటుంది.డేగవన్నె నెమలి వన్నె పింగళి వన్నే, కోడివన్నె డేగకాకివన్నె ఇలా సాముద్రిక చిహ్నాలను బట్టి 5 జాతులు ఉంటాయి. వీటిలో ఏ పుంజు ఎప్పుడు గెలుస్తుందో ఏ జాతి పుంజుకు భోజన సమయమెుప్పుడో, నిద్రా సమయమెప్పుడో, ఆ పుంజుతో ప్రయాణం ఎప్పుడు చేయవచ్చో దాని మరణ కాలమెప్పుడో - ఈ వివరాలన్నీ తెలిసికొని వాని ఉపజాతులు జాతకాలు పరిశీలించి పందెమునకు తగిన వనుకొన్న పుంజులను నిర్ధారించి వానిని తీసికొని పందెములు జరిపే ఆట స్థలమునకు పందెగాళ్లు వచ్చారు.

గిరిగీసి వృత్తాకారపు గీత లోపల పుంజులను వదలిపెడతారు. బరిలో నిలబడి ఉన్న కోళ్ళను చిటికె వేసి యుద్ధమునకు ప్రారంభించమని బయటకు తప్పుకుంటారు. పుంజులు పెడేపెడీ తన్నడం మొదలు పెడతాయి. అదొక కురుక్షేత్రం మాదిరి కోలాహలం.

కోడిపుంజులకు పందెగాళ్ళ పెట్టిన పేర్లు ఈ సీసపధ్యంలో వర్ణించబడింది.

సీసపద్యం : పట్టెజుట్టుది మైలపుట్టజట్టుది గూబ
చిలుక జుట్టుది మూగ చిల్లకోడి
పట్టుమార్పుది యరజుట్టుది బోరది
బూడిద వన్నెది పొడది చిల్ల
కాలుది గుజ్జుది గాజుల కాలుది
కలది పండె జ్జదిగద్దెకాలు
దెజ్జని దురగది నీకెలకాలిది
నల్లది కొప్పది త్లెయురగ
తేటగీతి : పిల్ల వేళ్ళది మొుద్దది నల్లయురగ
లనగ దగుకత్తి కాట్టంజులందులోన
ఓసపు పావళ్ళు కాలందెలెసగునట్లు
రావిరేకలు బిరుదలు - శీవిగలుగు
(హంస వింశతి 3ఆ - 214 పద్యం)

వాటి ఆకార విశేషాలను బట్టి వాటిని పిలుస్తారు. ఎక్కువగా కూత పెట్టని పుంజు ''మూగ'' అనీ బూడిదరంగులో ఉన్నదానిని బూడిద వన్నెది అని

పేరెట్టారు. పుంజులకు పసుపు గుడ్డ పీలికలు చుట్టి రక్షణ కోసం రావిరేకలు కట్టారు. అంటే రావి ఆకు ఆకారంలో ఉండే వెండి రేకులు అని అర్థం ఇలా అలంకరింపబడిన పుంజులు చాలా ఠీవిగా ఉన్నాయి.

సీసపద్యం : గరుడుండు శరభంబు కంచుడమారము
రణభేరి కార్చిచ్చు జాతిబొమ్మ
రాముబాణముమిత్తి రాహుత్తి పిడుగుహం
వీరుండు పుంజుల వేరువిత్తు
గండకత్తెర గుండె గాలంబు మాస్టీడు
పట్టభద్రుడు జెట్టి భైరవుండు
కత్తులపాది సింహగాలి బేతాళుండు
పసులపాతర పాదరనము చిలుకు

తేటగీతి : టమ్ము సుడిగాలి చక్రంబు నలజడదరి
శూలము పిరంగి వెలినక్క సాలువంబు
కాళరాత్ర్యంతకుడు పందెగాండ్ర మెచ్చు
లనెడు పేరుల పుంజుల గొని మొగించి
(హంస వింశతి 3ఆ - 215 పద్యం)

ఇవి అన్నీ పందెపు పుంజుల పేర్లే. కోడి పుంజులు పందెంలో ఏ విధంగా పౌరుషం ప్రదర్శిస్తాయో ప్రత్యర్థులైన పుంజులను ఓడిస్తాయో చూసి వాని స్వభావానికి అనుగుణంగా పెట్టిన పేర్లు ఇవి. కార్చిచ్చు ఒక జాతి పుంజు పేరు. కార్చిచ్చు అంటే అడివిని కాల్చేస్తూ వ్యాపిస్తున్న అగ్ని. అది ఇటువంటి పరాక్రమం కలది అని అర్థం అనమాట. అలాగే మరోపుంజు పేరు 'రాతిబొమ్మ' బరిలోకి దిగితే ధైర్యంగా స్థిరంగా నిలబడుతుంది. పారిపోదు అని భావం. మస్టీడు - అంటే ఏనుగును నడిపేవాడు అంతటి పరాక్రమంగల పుంజు అని అర్థం. సింహగాలి - సింహంలా గాల్లోకి ఎగురుతుంది అని బహుశ అలా చెప్పి ఉంటారు. నలజడది - నల్లని ఈకలు ధరించినది అరిశూలము - కాళరాత్రి లాంటి సంస్కృత సమాసాలు కూడా వీటికి నామధేయాలే. కవిత్వం కూడా మన జానపదుల జీవితంలో అంతర్భాగం.

మిగిలిన పేర్లన్నీ సులభంగా అర్థమవుతాయి.

ఈ విధంగా జానపద సాహిత్యంలో స్పష్టంగా ప్రాచీనమైన ఆచారాలు, నమ్మకాలు గుబాళిస్తూ చదువరులను అలరిస్తూనే ఉంటాయి. దీనిలోని సాంఘిక చరిత్ర, వైభవము తెలుగుజాతి చరిత్ర సంస్కృతులతో రంగరించి ఆహ్లాదాన్ని కలిగిస్తూ తెలుగు వారి హృదయాలపై చెరగని ముద్ర వేసింది జానపద సాహిత్యం.

**– యర్రమిల్లి శారదా కుమారి**



తెలుగులోను, సంస్కృతం లోను ఎం.ఎ పట్టా పుచ్చుకున్న శారదా కుమారి గారు కాకినాడ పి.ఆర్. ప్రభుత్వ కళాశాలలో అధ్యాపకురాలిగా పనిచేస్తున్నారు. వీరు "కోనసీమ కవికోకిల" అని పేరుగాంచిన కీర్తిశేషులు డా. వక్కలంక లక్ష్మీపతి రావు గారి కుమార్తె. శారదా కుమారి గారు పలుచోట్ల అష్టావధానాలలో, అనేక సాహితీ సదస్సులలో పాల్గొన్నారు.



# జానపద గేయాలు

ఆంధ్రులకు ఆశయాలూ, ఆవేశాలూ కూడా ఎక్కువేకదా! పండుగలకు పబ్బాలకూ, కష్టాలకు సుఖాలకు, జానపదుల హృదయ తంత్రులు ఇచ్చే స్పందన, వెంటనే సంగీతంతో



పెనవేసుకుని పోయిన మాటలే జానపద గేయాలు. తెలుగునాటి జానపదులంతా తమ్ముతామే యెరుగని, తమ సాంస్కృతి ప్రతి బింబాన్ని చూసుకోడం చేతకాని, అదృశ్య వాగ్గేయకారులే అనిపిస్తుంది. మానవ జీవితంలోన వెలుగు, నీడలు, ప్రేమ, ద్వేషము, శాంతి, సమరము, సంరంభము, సంతాపము, యౌవ్వనము, వృద్ధాప్యము, - అన్నీ జానపద గేయాలకు కథా వస్తువులే. తెలుగునాటి జానపద తటాకంలోని ప్రతీ అలా, ఒక గేయంగా రూపొందుతూ వచ్చింది. తెలుగు వారి నిత్య జీవిత క్రమాన్ని అనుసరించే వారి జానపద గేయాల క్రమముకూడా ఏర్పడింది.

తెలుగువారి జానపద సంగీతానికి, శాస్త్రీయ లలిత సంగీతాలతోపాటు ఒక గౌరవస్థానం, సభార్హత వచ్చాయంటే, దానికి ముఖ్య కారకురాలిని నేనేని చెప్పకోక తప్పదు. నా చిన్ననాటి నుంచీ జానపదగేయాలు సేకరించడం, పాడడం, నాకు సరదా. నేను పుట్టిన ఊరు తూర్పు గోదావరి జిల్లాకు చెందిన కాకినాడ. ఆ ఊరికి కాస్త పట్నవాసపు పోకడ పల్లెటూరి వాతావరణం ఉండేది. దాని ప్రతి బింబాన్ని నేను. నా చిన్నప్పుడు, మా మామయ్య కృష్ణశాస్త్రి ఊరైన పిఠాపురం వెళ్ళాలంటే బస్సులు లేవు. రెండెడ్ల బండిలో వెళ్ళేవాళ్ళం. త్రోవలో పొలాల్లో పాడుకునే పాటలు, పిఠాపురంలో పొన్నాడమంద బయల్లో సత్యభామ కట్టిన భామాకలాపం, రథోత్సవాలలో చెక్క భజనలూ, తప్పెటలూ, కోలాటాలూ తోలుబొమ్మలూ, వీధినాటకాలూ, మా ఊరు ఉప్పుటేరుగట్టున పడవవాళ్ళు పాడుకుంటూ పోయే పాటలు, ఇంటిప్రక్క ఆముదం ఫ్యాక్టరీలో పనివాళ్ల పాటలు, మా నూకాలమ్మ గుడివద్ద సంవత్సరాది సంబరంలో ఆడించే గరగలూ, సిరిబొమ్మా- ఇవన్నీ చూసి, ఉత్తేజితురాలునయి, ఆ పాటలను తు.చ తప్పకుండా గ్రహించి, సేకరించి, నేర్చి, పాడేదాన్ని. చుట్టుప్రక్కలగ్రామాల్లో తీర్థాలూ, జాతరలూ జరిగాయంటే, అక్కడికి నేను మా నాన్నగారితో వెళ్ళడం, ఆ జానపద వినోదాలు చూసి, ఆపాటల్ని సేకరించడం జరిగేది. ఆ అభిరుచే నాలో ఒక ఉద్యమంగా రూపొంది, జానపద రచనలను, వాటి సంగీతాన్ని సేకరించి, పొందుపరచి ప్రచారంలోకి తేవడం నా జీవితాశయం అయింది. నా ఈఆశయాన్నీ, అభిరుచినీ, పెంపొందించిన వారు జానపద సంగీత పితామహులు, కీ.శే. వల్లూరి జగన్నాథరావు గారు. కర్ణాటక, హిందూస్థాని, శాస్త్రీయ సంగీతాల్లో పాండిత్యం కలిగి, జానపద సంగీతంలోని మెళకువల్ని, మాధుర్యాన్నీ గ్రహించీ, నాకనుగ్రహించిన వారు. జానపద గేయాలకు నా గాత్రం బాగుంటుందని గుర్తించి, నాల్గవ ఏటనే నాచేత, ప్రఖ్యాత జానపద గేయం "అయ్యోకొయ్యోడ", ఇంకా ఎన్నో జానపద గేయాలు, గ్రామఫోను రికార్డులు ఇప్పించారు. వారికి నేనెంతో ఋణపడిఉన్నాను.

నేను నేర్చి సాధనం చేసిన శాస్త్రీయ సంగీతం, నేను ముందంజవేసి సాధించిన లలిత సంగీతం, నేను శ్రమించి సేకరించిన జానపద సంగీతం ఈ మూడు నా దృష్టిలో, ఒకే సంగీతార్ణవంలో కలిసే మూడు జీవప్రవంతులని నా నమ్మకం. నా చిన్నప్పటి కచేరిలలో ఈ మూడింటికీ సమాన స్థానమిచ్చి గౌరవించేదాన్ని.

శాస్త్రీయ సంగీతంలో లాగే, జానపద సంగీతంలో కూడా, ప్రతి రాగము సంపూర్ణంగా ఉండాలని మనం అనుకోకూడదు. జానపద సంగీతానికి ఏ శాస్త్రగ్రంథాలూ ప్రమాణాలుకావు. వాళ్ళ హృదయాలే వాళ్ళకు ఆధారం. అందువల్ల అనుకోకుండా కొన్ని పాటలు పూర్తి రాగాల్లో దొర్లినా చాలా వరకు వాళ్ళ పాటల్లో రాగచ్ఛాయలు మాత్రమే కనపడుతూ ఉంటాయి. అందుకే నా పుస్తకంలో రాగం పేరుకాక, ఫలానా రాగస్వరాలు అని మాత్రమే వ్రాశాను. తరచుగా హనుమతోడి (8) వకుళాభరణం (14) మాయా మాళవ గౌళ (15), నటభైరవి (20) కీరవాణి (21) ఖరహరప్రియ (22) హరికాంభోజి (28), ధీర శంకరాభరణం (29) ఈమేళకర్తలకు చెందిన రాగాల్లోనో, రాగచ్ఛాయల్లోనో, జానపదుల పాటలు ఉంటుంటాయి.

అవి వాళ్ళ మనస్తత్వాలకి ఎక్కువ సన్నిహితమైనవి అనిపిస్తుంది. ముఖ్యంగా, నాటకరంజి, నవరోజు, యదుకుల కాంభోజి, రేగుప్తి, ఆనందభైరవి, ముఖారి, వాళ్ళకి అభిమానరాగాలా అనిపిస్తుంది.

అదే విధంగా, ఏ సంగీతానికైనా సరే అలంకారం గమకాలే. శాస్త్రీయ గాయకుల్లాగా జానపద గాయకులు, గమకాలను దశవిధాలుగా విభజించి, ప్రయత్న పూర్వకంగా వాటిని ప్రయోగించక పోవచ్చును గాని, ఆ గమకాలన్నీ వారి సంగీతంలో అప్రయత్నంగా దొర్లుతూనే ఉంటాయి. జంటడాలు స్ఫురికం, కంపిత, హరిపితం - లాంటి



గమకాలన్నీ జానపద గేయాల్లో ఉండనే ఉన్నాయి. పాడే గాత్రాలకి గమకం అనేది ఉగ్గు పాలతో అలవడుతుంది.

35 సంవత్సరాల ముందే నేను తెలుగు దేశం వివిధ ప్రాంతాలు పర్యటించి పొందుపరచిన కొల్లలైన జానపద గేయాల్ని క్షుణ్ణంగా పరిశీలించి, ఏయే రాగచ్ఛాయలలో ఉన్నాయో, ఏ గమక ప్రయోగాలు చేశారో గుర్తించి, వారియాస, వారి భాష, పాడే పద్ధతి అలవర్చుకున్నాను. నాది ఒక విధమైన రిసెర్చి అనవచ్చు. నా ఈజ్ఞానాన్ని (Knowledge) పాడడంలో చూపించాను కాని, డిగ్రీలకి ఆశపడలేదు. అయితే 1977వ సంవత్సరంలో ఆంధ్రా యూనివర్సిటీ వారు లలిత, జానపద సంగీతాల్లో నేను చేసిన కృషిని గుర్తించి, నాకు "కళాప్రపూర్ణ" Honorary Doctarate ఇచ్చి గౌరవించారు. నేను సేకరించిన జానపదగేయ సమూహంలోనుంచి చాలా పాటలు నా చెల్లెలు వింజమూరి సీతాదేవికిచ్చి, ఆమె M. Lit కి సహకరించాను. ఈ పుస్తకంలో కొన్ని పాటలను మాత్రమే స్వరపరచి, సంగీతంలో ప్రవేశం ఉన్న వారందరూ పాడుకోవడానికి వీలుగా ఈ గ్రంథ రూపంగా మీకు అందజేస్తున్నాను.

మచ్చుకు కొన్ని గేయాలు

## నీకు నీవారు లేరు

**నఠభైరవిస్వరాలు - ఆదితాళం**

1 సా, సా, సా । రీమ । పాపా ॥
నీ కూ నీ । వారు । లేరు॥

మ ప మ ప ద ప మ ప । మ గ మ గ । రి స సా ॥
నా- - కు - - నా- । - వా - రు । లే - రు ॥

స రి గ రి రి గ మ ప । మ గ రి స । స రి గ రి ॥
ఏటిఒడ్డునా - - - । - ఇ - ల్లు । కడదము ॥

రి స సా ; పా । మ ప మ । గ రి స ని ॥
ప ద రా చల్ । మో హ న । ర ం గా - ॥

నీకు నాకూ జోడు కలసెను గదరా చల్ మోహనరంగ

2) మారుమల్లీ తోటలోన
మంచినీళ్ళ బావికాడ
ఉంగరాలు మరచివస్తిని
గదరా చల్ మోహనరంగ ॥

3) కంటికి కాటు కెట్టీ
కడవా సంకానబెట్టీ
కంటినీరు కడవనింపితి
గదరా చల్ మోహనరంగా ॥

## నాటు వేసీ వేసీ

శంకరాభరణ స్వరాలు త్రిశ్రం

ఆమె 1) స స స రి గ రి రి గ మ గ గ మపా ॥
నాటవే - సీ - వే - సీ-వే - సీ॥

స రి గ ప మ గ రి గా మ గ రి స సా ॥
న డు మె - ల్లా - నొచ్చే -- నొ - చ్చే ॥

స స స రి గ రి గ ప మ గ రి స సా ॥
క న్న వా - రీ - క ం డ ట్ల మ ం డా ॥



ఈడు గా నీ జో డెట్ల ఇచ్చే ॥
అతను ఎవరినీ?
ఆమె నిన్ను కాదూ నీలంపు దొరా
నావోళ్లా నేనను కొంటీ ॥

2) నీళ్ల సేదీ, సేదీ, సేదీ,
సేతులెల్లా తీపులు పుట్టే
కన్న వారీ కండట్ల మండా ॥

3) వడ్ల దంచీ దంచీ దంచీ
సేతులెల్లా ఒబ్బాలొచ్చే
కన్నవారి కండట్లా మండా ॥

4) పెండ తీసీ తీసీ తీసీ
కాళ్ళన్నీ తూపులు పుట్టే
కన్నవారీ కండట్లా మండా ॥

## దేవుడయ్యా దేవుడూ

### హరికాంభోజి స్వరాలు - త్రిశ్రం

1) సా స । రి గా । సా స । సా, ॥
దే వు । డ య్యా । దే వు । డూ ॥

పా ప । ద ని ద । ప ద ప । మ గ స ॥
మా య । దా - రి । దే - వు । డూ - - ॥

రి మ మ । గ గ రి । రీ రి । రి గ స ॥

2) ఊ రె । - ల్ల - । ఇ ళ్లు । చే - సె ॥
నో రె । - ల్ల । ప ళ్ళు । చే - సె ॥
మం చ । మె ల్ల - । గ ళ్ళు । చే - సె ॥
కం చె । ల్లా - । ముళ్ళు । చే - సె ॥

రి మ మ । గ గ రి । రి రి రి । గ రి స ॥
న ల్ల । ని మే - । క ల పా । - లు- ॥

సా స । రి మ గ । రీ రి । రీ గ రి గ స ॥
తె ల్ల । చే - సె । దే వు । డుం - - - ॥
పా ప । ప పా । పా ప । ప ద మ ॥
తెల్ల । ని పా । ల లొ । నీ - ళ్ళు ॥

మ ప ప । ప ని ద । ప ద ప । మ గ స ॥
తె - ల్ల । చే - సె । దే - వు । డు - - ॥



**- డా॥ వింజమూరి అనసూయాదేవి**

1920లో కాకినాడలో జన్మించి, ప్రస్తుతం అమెరికాలో నివసిస్తున్న నాటి అపురూప గాయని "కళాప్రపూర్ణ" డా॥ వింజమూరి అనసూయాదేవి అసాధారణ ప్రజ్ఞావంతురాలైన మహోన్నతమైన వ్యక్తి, మారుమూల పల్లెల్లో మరుగునపడి ఉన్న జానపద గేయాలకు మెరుగుదిద్ది వాటికి సభాగాన మర్యాదను చేకూర్చడమేగాక సంగీత జగత్తులో ఒక ప్రత్యేకస్థానాన్ని, గౌరవ మర్యాదలను చేకూర్చిన ఘనత ఆమెకే దక్కుతుంది. అనసూయాదేవి గారు ప్రపంచవ్యాప్తంగా 11 జీవనసాఫల్య పురస్కారాలు, గృహలక్ష్మి కంకణం, సహస్రాధిక సత్కారాలు, పురస్కారాలు, ప్రభుత్వ గుర్తింపులు పొందారు.

# "ఒగ్గుకథ"

- డా॥ లింగా శ్రీనివాస్



తెలంగాణా ప్రాంతపు "ఒగ్గుకథ" కళారూపాన్ని, ఆ ప్రాంతానికే వన్నె తెచ్చే విధంగా రూపొందించి, ప్రపంచానికి అందజేసినవారు ఇద్దరు. వారిలో దక్షిణ తెలంగాణాకు ఒగ్గుకథ పితామహుడుగా పేరుతెచ్చుకున్న చుక్కా సత్తయ్యగారు ఒకరైతే, ఉత్తర తెలంగాణాలో పుట్టి ఒగ్గుకథను నిగ్గుదేర్చి గద్దెనెక్కించిన మిద్దె రాములు రెండవ వారు. ఒగ్గు కథకు నిలువెత్తు సంతకమై, జానపద కళాజగత్తులో సాటిలేని మేటియైన కళాకారుడు మిద్దె రాములు. అజరామరమైన ఒగ్గుకథా కళారూపానికి అలుపెరుగని సేవకుడు ఈ మిద్దె రాములు. కానీ, ఇప్పుడు తను మన లోకంలో లేడు. అటువంటి కళాసేవకుని యొక్క జీవితాన్ని గూర్చి, ఈ రోజు తెలంగాణా ప్రజలందరూ ఒక చరిత్రగా చెప్పుకుంటున్నారు. అంతకుముందు ఒగ్గుకథను గూర్చి సంక్షిప్తంగా తెలుసుకుందాం.

**ఒగ్గుకథ**

తెలంగాణ జానపద కళారూపాల్లో ఒగ్గుకథ ఒకటి. ఇది జానపద నృత్య, గాన, అభినయ సమ్మేళనం. గొర్రెల పెంపకం వృత్తిగా గల గొల్ల కురుమలు తమ కుల పురుషుడు బీరప్ప కథను ప్రధానంగా చేసుకొని కులపురాణంగా చెప్పుకుంటారు. ఈ కథను ప్రదర్శించే కళారూపమే ఒగ్గుకథ.

**నామౌచిత్యం**

ఈ కళాప్రదర్శనలో వినియోగించే వాద్యాలలో ముఖ్యమైనది ఒగ్గు. 'ఒగ్గు' అనగా 'డమరుకము' దీనినే ఒగ్గు, జగ్గు, డమరు అని కూడా అంటారు. తెలంగాణా ప్రాంతంలో ఒగ్గు అని పిలుస్తారు. ఒగ్గును ఉపయోగించి చెప్పే కథ కావున దీనిని 'ఒగ్గుకథ" అని పేరు వచ్చింది.

ఇది సాధారణంగా అయిదుగురు కళాకారులతో సాగుతుంది. ఇందులో ఒక ప్రధాన కథకుడు, ఇద్దరు వంతగాళ్ళు, ఒక వాద్య కళాకారుడు, ఒక స్త్రీ పాత్రగాడు తప్పనిసరిగా ఉంటారు. అవసరమైన చోట కళాకారుల సంఖ్య పెరుగవచ్చును.

**ఆహార్యం**

ఈ కథాగానాన్ని ప్రదర్శించే కళాకారులు ప్రధానంగా ధోవతి, అంగి, శాలువా (శెల్లా) తలపాగా, నడుము పంచె, కాళ్ళకు గజ్జెలు కట్టుకొని చేతిలో కర్ర పట్టుకొని గ్రామీణవాసుల వలెనే కనిపిస్తారు. ఇతర కళారూపాల వలె ప్రత్యేకమైన ఆహార్యం ఉండదు. కానీ, కథ ప్రదర్శించేటప్పుడు మాత్రం అవసరాన్ని బట్టి ఆయా పాత్రలకు అనుగుణంగా ఒంటిమీద ఉన్న వస్త్రాలనే వివిధ రకాలుగా ఉపయోగిస్తారు. ఉదాహరణకు : మారువేషం అంటే ముఖానికి తువ్వాల కట్టుకోవటం, బండి నడిపేటప్పుడు అదే తువ్వాలను చెరకోలగాను, కళ్ళెంగానూ ఉపయోగించటం చేస్తారు.

**వాద్యాలు**

'ఒగ్గుకథ' ప్రదర్శనలో ముఖ్యంగా ఒక డోలు, తాళాలు, నపీర (పీక), జగ్గు (డమరుకం), కంజీర మొదలగు వాద్యాలు ఉపయోగిస్తారు.

**సందర్భం**

ఈ కళారూపం సామాన్యంగా గ్రామాల్లోని కురుమ, గౌడ మొదలగు కులం వారు వివాహాది శుభకార్యాలకు, ఎవరైనా చనిపోయిన పదకొండవ రోజు (కర్మ చేసిన రోజు) చెప్పించుకుంటున్నారు. కానీ, ముఖ్యమైన ఒగ్గుకథ, బీరన్నల పట్నాలతోనే మొదలవుతుంది. పుష్యమాసం ఆదివారాలు బీరన్న పట్నాలకు ముఖ్యమైన దినాలు. అప్పుడు ఒగ్గు వారందరూ అమితమైన ఉత్సాహంతో గ్రామాలలోని గ్రామదేవతల ఆలయాల వద్ద ముగ్గులతో బీరన్న పట్నాలు వేసి పూజలు చేస్తారు. ఈ పూజలలో వీరభద్రుడు ఆవహించటం, అమ్మవారు ఆవహించటం వంటి సన్నివేశాలు గ్రామీణుల దైవభక్తిని చాటుతాయి.

పై సందర్భాలే కాకుండా గ్రామాల్లో అనేక సందర్భాల్లోనూ ఈ ఒగ్గుకథను విరివిగా ప్రదర్శిస్తారు.

**ఏయే కథలు**

ఒగ్గు కథ ప్రదర్శనలో దాదాపు యాభైకి పైగా కథలను ప్రదర్శించే వారున్నారు. ముఖ్యంగా ఎల్లమ్మకథ, నల్లపోషమ్మ కథ, బీరయ్య కథ, మల్లన్న దేవున కథ, సత్యహరిశ్చంద్ర, సతీ అనసూయ, దమయంతి, సావిత్రి, శివలీల, గౌడపురాణం, ఐదు మల్లెపూల కథ, యాదగిరి మహారాజు కథ, అలక్ష్యమహారాజు కథ, అపరితకథ, శివకుమారుని కథ, రంభ రంపాల కథ, పెద్దమ్మ కథ, సిందేవి కథ, పుష్పలత, రామాయణం, భాగవతంలోని కొన్ని ఘట్టాలు మాత్రమే కాకుండా చనిపోయిన వారి గురించి,

అంతేకాకుండా ఈ రోజుల్లో ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను గూర్చి కూడా ప్రదర్శనలు ఇస్తున్నారు. ఈ ప్రదర్శన సాధారణంగా రాత్రివేళల్లోనే జరుగుతుంది. కనీసం మూడు నుండి ఐదు రాత్రులు ఒక్క కథను చెబుతారు. సాయంత్రం ప్రారంభమై తెల్లవార్లు జరిగే ఈ కథ పాటలు, ఆట, అభినయం కూడగట్టుకొని ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేస్తున్నదనుటలో క్రొత్త విషయమేమీ లేదు...!

ఇటువంటి కథాగాన ప్రదర్శన, కళారూపాన్ని అటు పల్లె నుండి ఢిల్లీ దాకా, మన మానేరు నుండి మారిషస్ దాకా తీసుకెళ్ళి ఎంతోమంది కళాభిమానుల, నాయకుల, మేధావుల, సాహితీవేత్తల అభిమానాన్ని చూరగొన్న సాటిలేని మేటి కళాకారుడు మిద్దె రాములను గూర్చి తెలుసుకుందాం.

కం॥ రామయ! నీ కథలన్నను
ఏమయ! వేవేలు వత్తురేమి విచిత్రం
బేమ మహత్యం లేనిది
రామయ కథకిట్లు జనం రాగలుగుదురే?

(కవి హంస, దాసరి శంకరయ్యగారు, 'బోనం' స్వర్ణోత్సవాల సంచిక)

ఒగ్గు కథకు మరోపేరు మిద్దె రాములు, అతని పాటకు పల్లె పల్లవయ్యేది. అతని గొంతు, గట్లను తాకుతూ పంట పొలాల్ని స్పృశించేది. అతని కథకు తంగెడుపూలు తల ఊపుతూ స్వాగతం చెబితే, గ్రామాలు, పల్లెలు, తండాలు ప్రాణంపోసుకునేవి. 'అతను ఆ రోజు ఊళ్ళో కథ చెపుతాడంటే ఆ ఊరికే కొత్త కళ వచ్చేస్తుంది. ప్రజలు సాయంత్రం లోగా అన్ని పనులు ముగించుకునేవారు. అందరిలోను ఉబలాటం, అందరికీ ఆరాటం, అటువంటి 'మిద్దె రాములు' 'ఒగ్గుకథ'ను వినని వారు ఉత్తర తెలంగాణ ప్రాంతంలో లేరనే చెప్పవచ్చు.

ఒగ్గు కథకు అంతర్జాతీయ ఖ్యాతిని తెచ్చిన మిద్దె రాములు, గత నాలుగు దశాబ్దాలుగా దాదాపు పదివేలకు పైగా ప్రదర్శనలిచ్చారు. జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డా॥సి. నారాయణరెడ్డి గారి స్వగ్రామమైన హన్మాజీపేటలో 1942లో జన్మించారు. ఆ గ్రామంలోని గౌడ కులానికి చెందిన తీగెల లస్మాగౌడ్, ఎల్లవ్వలు ఇతని తల్లిదండ్రులు. చిన్నతనంలో వీరు కలాల్ (కల్లుగీత పని) చేసుకొని బతికేవారు. రాములుకు చదువంటే ఇష్టం ఉండేది కాదట. కాయకష్టం చేసి జీవనం సాగించే ఇతనికి చిన్నతనం నుండి జానపద గీతాలన్నా, నాటకాలన్నా, హరికథలన్నా డ్రామాలు వంటి వాటిపై మక్కువ ఎక్కువ. ఎక్కడ డోలు, మద్దెల శబ్దం వినిపించినా తిండిని, నిద్రను కూడా లెక్కచేయని స్వభావం ఉండేదట. తాను నివసించే గ్రామానికి పది కిలోమీటర్ల దూరంలోనే వేములవాడ పుణ్యక్షేత్రం. ఆ దేవాలయంలో అనునిత్యం రాత్రివేళల్లో జరిగే హరికథలు, డ్రామాలు చూసి, ఇంటికి వెళ్ళి 'తుమ్మ కాయలను కాళ్ళకు కట్టుకొని (గజ్జెలను పోలి ఉంటాయి కాబోలు) గదిలో అందరూ పడుకొన్న తర్వాత ఆముదపు దీపపు వెలుగుల్లో తన నీడను గోడమీద చూసుకొంటూ అభినయం స్వయంగా నేర్చుకొన్నానని అలనాడు తాను స్వయంగా ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. అంతటి కళాతృష్ణ కలిగిన కళాకారుడు మన మిద్దె రాములు.

**నామౌచిత్యం**

రాములును ఇంటి పేరుతో తీగల రాములు అని పిలవాలి. కానీ, వీరి గ్రామంలో ఒక ఎత్తైన ప్రదేశంలో వీరి ఇల్లు ఉండేది. కావున వీరికి మిద్దె రాములు అన్న పేరు వచ్చినది. గ్రామంలోని వారు అలా పిలవటం మొదలు అంతటా మిద్దె రాములు అని పిలిచారట. ఎలాగైతేనేం, ఆ మిద్దెపై నున్న రాములు ద్వారా ఒగ్గు కథ కూడా అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొంది రాములును నిజంగానే మిద్దె రాములును చేసింది.

**కులం**

నిజానికి ఒగ్గు కథను బీరన్నలు, కురుమలు ప్రదర్శించేవారు. కానీ, ఒగ్గుకథపై గల మక్కువతో నేర్చుకొని ఆ ఒగ్గు కథకే అందం తీసుకొని వచ్చిన వాడు మన మిద్దె రాములు. నిజానికి ఇతడు గౌడ కులం వాడు. అటు బీరన్న, మల్లన్న కథలను ఇటు రేణుకా ఎల్లమ్మ తల్లి కథలను అవలీలగా చెబుతూ అందరినీ ఇట్టే ఆకట్టుకొనేవాడు.

కం॥ ఏదీ నీసరి కథకులు?
లేరని తెప్పంగవచ్చు లేరెచ్చోటన్
లేరే ఒగ్గులు బోలెడు
రారే నీసాటి మిద్దె రామయ్యాఖ్యా!

(కవి హంస దాసరి శంకరయ్యగారు 'బోనం' అనే సంచికలో)

డోలు, జగ్గు, కంజెర వాద్యాలు పోటాపోటీగా వాయించేటప్పుడు, పట్నాల ముగ్గుల ముందర వీరభద్రుని అంశలో గర్జించే మిద్దె రాములు రూపం చూచుటకు రెండు కండ్లు చాలవు. బోనాల సన్నివేశంలో శివసత్తి వేషం వెయ్యాలంటే, అచ్చు అదిశక్తిని పోలి ముందున్న ప్రేక్షకులు దిగ్గున జడుసుకునేలా అరుపులు, పెడబొబ్బలమధ్య సాగేటప్పుడు, మిద్దె రాములు అమ్మవారు పూనినట్లుగా బోనం నెత్తిమీద పెట్టుకొని, చేసే పదవిన్యాసాలు, వేప మండల కదలికలతో రాములు

నాగుపాములా మెలికలు తిరిగినా బోనం కిందకు జారని వైనం చూడడం కోసం ఆబాలగోపాలం చెవికోసుకుంటారు. రాత్రంతా జరిగే ఈ ప్రదర్శనలో ఎన్నో అడ్డకథలు, హాస్యం, ఛలోక్తులు, మన సంప్రదాయాలు, మన నేటి వ్యవస్థ అన్నింటినీ స్పృశిస్తాడు.

"జమిడికె మోగుతున్నది. పట్నాల ముగ్గులు పరుసుకున్నవి. శివశక్తి తూలుతున్నది. తెగారం, దేవుడచ్చిన భోంతి. "నీ శిరసు పగల, తలపండు మొలువ" హి..క్కే.. అంటూ పలవరిస్తున్నది - శివస్తుతి. బిడ్డా! నీ మీద కూసున్నది రేణుక ఎల్లమ్మ మనసుల ఎన్ని సుతులున్నయో! నా మాటకు దండం బెడ్తా! పాటకు దండం బెడ్తా! రేణుక ఎల్లమ్మ పలికిస్తున్న నుడుగుకు దండంబెడ్తా! శణార్థి" ... శణార్థి!!... అరీ... శణార్థీ..!"

(అల్లం నారాయణ, జర్నలిస్టు గారి శీర్షిక, నమస్తే తెలంగాణ)

తీగెవారె తీగవారె.. అంబరేణుకో... అది రేణుకా... ఏం ముగ్గ తీగె వారె అంది రేణుకా, అది రేణుకా! ఎర్ర ముగ్గ తీగె మీద అంది రేణుకో, అది రేణుకా! పచ్చ ముగ్గ తీగ వారె అంబరేన్నాకో అది రేణుకా...!

ఈ పాట, రేణుకా ఎల్లమ్మ తల్లి బోనాల సమయంలో పట్నాల ముగ్గులను వర్ణిస్తూ ఈ రకంగా పాడుతాడు. ఒక్కటేమిటి నవరసాలను కలుపుకొని, నాట్యం ఒకవైపు, అభినయం ఒకవైపు అయితే, మిద్దె రాములు స్త్రీ పాత్రలో చేసే చేష్టలు మరోవైపు అని చెప్పుకోవచ్చు. బతుకమ్మలు, కోలాటం ఆడే సన్నివేశాలలో తెలంగాణా స్త్రీలు ఒలుకబోసే సిగ్గు, బిడియం మరియు చీర కుచ్చీలు దోపుకొని, కొంగు సరిజేసుకొని ఒకరితో ఒకరు మాట్లాడుకొంటూ అడే ఆటను అభినయించేటప్పుడు ఆ ప్రాంగణంలోని ప్రతి ఆడపడుచు కొంగులు చాటుగా పెట్టుకొని నవ్వక తప్పదు.

### వివాహం - కుటుంబం

మిద్దె లస్మాగౌడ్ - ఎల్లవ్వల నాల్గవ సంతానంగా జన్మించిన మిద్దె రాములు భార్య దేవవ్వ. మిద్దె రాములుకు ఏకైక కుమారుడు పర్శరాంగౌడ్. ఇతను కూడా ఒగ్గు కథాప్రచారంలో ఇప్పటికే పలు రాష్ట్ర, జాతీయస్థాయి కార్యక్రమాలిచ్చి తండ్రి బాటలోనే కళాసేవ చేస్తున్నాడు. పర్శరాం భార్య పేరు రేణుక. వీరి కుమారుడు శరత్‌గౌడ్ ప్రస్తుతం చదువుకుంటున్నాడు.

### మిద్దె రాములుగారు పొందిన అవార్డులలో కొన్ని :

* ఒగ్గు కళారత్న, చామన్‌పెల్లి గ్రామస్థులు
* ఒగ్గు కథా చక్రవర్తి, కమలాపూర్ గ్రామస్థులు
* కరీంనగర్ శాతవాహన కళోత్సవాలలో సన్మానం
* 1990 మారిషస్‌లో ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా ఒగ్గు కథా ప్రదర్శన
* 1999 తెలుగు విశ్వవిద్యాలయం ఆంధ్రప్రదేశ్ వారిచే ప్రతిభా పురస్కారం.
* సిరి వెలుగుల ఆత్మీయ సత్కారం - పోలీసు శాఖ సిరిసిల్ల వారిచే
* జగిత్యాల, సిద్ధిపేట, కామారెడ్డి, బిక్కనూరు మొదలగు గౌడ సంఘాల

వారిచే సన్మానం - ద్వారా 'గౌడకుల రత్న' పురస్కారం.

* కళావాణి వరంగల్ వారిచే సన్మానం
* వేములవాడ నృత్య కళానికేతన్ వారిచే ఉగాది పురస్కారం
* కరీంనగర్ జిల్లాలో త్యాగరాజ పురస్కారం
* రాజీవ్ ప్రతిభా పురస్కార్ - 2009 (ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం)
* కళారత్న (హంస) అవార్డు, 2010 (ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సాంస్కృతికశాఖ)

అవార్డులు మనిషి కళారంగ జీవితాన్ని ఉత్తేజం చేసి, ఆనందాన్నిస్తాయి. కానీ, మిద్దె రాములుకు వచ్చిన అవార్డులు ఎంతోమంది నూతన కళాకారులకు స్ఫూర్తిని నింపాయి. దాదాపు 400 మందికి పైగా శిష్యులను తయారు చేసి, సుమారు 5000లకు పైగా ప్రదరనలిచ్చిన నిరంతర కళాప్రదర్శనా చక్రం ఇప్పుడు, ఇకముందు లేదు. జాతస్య హి మరణం ధృవం' అన్నారు కదా. అందుకేనేమో అనారోగ్య కారణాలవల్ల తేది: 25-11-2010 నాడు మిద్దె రాములు తన తనువు చాలించారు.

భౌతికంగా ఆయన మన మధ్య లేకపోయినా, నేడు ఉత్తర తెలంగాణాలోని ప్రతి గ్రామంలోనూ ఆయన శిష్యులున్నారు. ఎక్కడ ఒగ్గు కథ ప్రదర్శన జరిగినా వారు మిద్దె రాములు పాటలే పాడుతారు. ప్రజలు గుండెల్లో మిద్దె కట్టుకొని చిరంజీవిగా నిలిచిపోయిన మన రాములు ఒగ్గు కథకు చేసిన సేవలు భవిష్యత్తులో ఎవరు చేయగలుగుతారనేది ప్రశ్నగానే నిలిచిపోతుందేమో!

### ముగింపు

కెరటం మనకు ఆదర్శం! ఎగిసి కిందపడుతున్నందుకు కాదు, అది కింద పడి కూడా మళ్ళీ ఎగుస్తున్నందుకు. ఈరోజు అస్తమిస్తున్న సూర్యుణ్ణి చూసి నిరాశపడితే, రేపు ఉదయించే సూర్యుణ్ణి చూడలేము. నాడు మన గ్రామాల్లోని ఆశ్రిత కులాలుగా మనుగడలో గల ఎన్నో కళారూపాలు ఆశ్రయం లేకుండా పోతున్నాయి. రాజరిక వ్యవస్థలో పోషింపబడ్డ కళారూపాల ఉనికి ఇప్పుడు పోషణ లేకుండా పోతున్నాయి. ఎన్నో విప్లవాలకు ఆజ్యం పోసి,

ఎందరో రాజుల, పాలకుల, నాయకుల కీర్తి ప్రతిష్టలను గద్దెనెక్కించిన కళారూపాల జాడలు కూడా ఇప్పుడు మన కనుసన్నల నుండి దూరమైపోతున్నాయి. ఆ కళల పట్ల అభిరుచిగల ఔత్సాహిక కళాకారులకు సైతం నేర్చుకొనే వీలు లేక నేర్చుకున్నా భృతి లేక కళలు, కళాకారుల ఉనికి దయనీయమైపోతోంది. మన ప్రభుత్వం చేసే పనితీరులో కొంత ఆలస్యం జరిగినా కళారూపాల పోషణ జరగకపోలేదు. కానీ, సమాజంలోని ఔత్సాహిక కళాకారులు మన మిద్దె రాములును వారి కళారంగ జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని, కృషి చేసి నిగ్గుచేర్చిన ఒగ్గు కథను మిద్దె నెక్కించిన నేపథ్యం చూసి, మనం స్పందించి, కనీసం ఆ మిద్దెకు రంగులు పులుముకోగలిగినా మన జీవితం ధన్యమౌతుందని నా భావన.

- డా॥ లింగా శ్రీనివాస్



పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్ నుండి జానపద సాహిత్యంలో డాక్టరేట్ పట్టా పొందిన డా॥లింగ శ్రీనివాస్ పేరొందిన జానపద కళాకారుడు కూడా. అలాగే మంచి డప్పు కళాకారుడు. జానపద గీతాలకు సంగీతం, నాట్యాం సమకూర్చటలో అందె వేసిన చేయి. అమెరికాలో పలుమార్లు తెలుగు సంధాల ఆహ్వానం మేరకు ప్రదర్శనలు ఇచ్చారు. ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వ జానపద కళాసారథిగా పనిచేస్తున్నారు.



# జానపదంలో పురాణాలు

డా॥ బిరుదురాజు రామరాజు



వేదాలలో కథలు, రామాయణ, మహాభారత, భాగవత కథలూ, ఇతర పురాణ కథలూ, కదా నరిత్సాగరంలోని కథలూ, అన్నీ జానపదులు ఉపయోగించుకున్నవే. జానపదుల్లో విస్తారమైన వాడుకలో ఉన్న రామాయణాలు ఎన్నో

ఉన్నాయి. అవి, కూచికొండ, శారద, ధర్మపురి, మొక్షగుండ, సూక్ష్మ, సంక్షేప, గుత్తెనదీవి, చిట్టి, రామాయణాలే కాక, రామకథ యింకా శ్రీరామదండాలు, రామాయణ గొబ్బిపాట, శ్రీరామ జావళి, అడవి గోవింద నామాలు, శాంత గోవిందనామాలు, పెండ్లి గోవింద నామాలు వంటివి రామాయణ పాత్రలపైన కూడా ప్రత్యేకంగా పాటలు రచించి జానపదులు పాడుకోవడం కద్దు. శాంతాకల్యాణం, పుత్రకామేష్ఠి, కౌసల్య బైకలు, శ్రీరాముల ఉగ్గుపాట, రాఘవ కళ్యాణము, రాములవారి అలక, సుందరకాండ పదము, ఋషుల ఆశ్రమం, సుగ్రీవ విజయం, కోవెల రాయబారం, అంగద రాయబారం, లక్ష్మణ మూర్ఛ, లంకాయాగం, గుహ భరతుల అగ్ని ప్రవేశం, లక్ష్మణ దేవర నవ్వు, ఊర్మిళా దేవి నిద్ర, కుశలాయకం, కుశలవ యుద్ధం, పాతాళ హోమం, శతకంఠ రామాయణం, శ్రీరామ పట్టాభిషేకం వంటి పాటలు వివిధాలయిన రామాయణ సంఘటనలపైనా, పాత్రలపైనా, అల్లబడి జానపదుల నోళ్ళలో చిరంజీవత్వాన్ని పొంది ఉన్నాయి ఇంకా సీతాచరిత్రను గురించి, సీత పుట్టుక, కళ్యాణం, అత్తవారింటి కంపడం, సమర్త, శుభగోష్ఠి, గడియ, వామన గుంటలు, అలుక, వసంతం, దాగిలి మూతలు, ఆనవాలు, అగ్ని ప్రవేశం, వేవిళ్ళు ఇట్లా ఎన్నెన్నో సంఘటనలు పాటల్లో బంధింపబడి ఉన్నాయి.

రామాయణం లాగే భారతం కూడా జానపదులకు మిక్కిలి ప్రీతిపాత్రమైనది. నల చరిత్ర, దేవయాని చరిత్ర, సుభద్రా కళ్యాణం, సుభద్ర సారె, ధర్మరాజు జూదం, ద్రౌపదీ విలువలు, పండు పాట, విరాట పర్వం, పద్మవ్యూహం, భగవద్గీత, సావిత్రికథ, శశిరేఖ పరిణయం, గయోపాఖ్యానం, పరాశర మత్స్యగ్రంథి సంవాదం మొదలైన కథలన్నీ జానపదులు భారతాన్నించి గ్రహించి అల్లుకున్న పాటలు. భాగవత కథలు, శ్రీకృష్ణ దేవుని వలన గ్రామీణులకు మరీ సన్నిహితాలయినాయి. ఆయన చిన్నతనపు చిలిపి చేష్టలూ, గోపికలతో చేసిన రాస క్రీడలూ జానపదుల హృదయాల్లో స్థిర స్థానాన్ని వహించిన అంశాలు. శ్రీకృష్ణ జననం, కృష్ణుని చల్దులు, బాలకృష్ణ లీలలు గుమ్మడి పాట, యశోద కొంగపాట, గోపికల జలక్రీడలు, రుక్మిణీ కళ్యాణము, చిలుక రాయబారం, సత్యభామ సరసం, రుక్మిణి ముచ్చట్లు, రుక్మిణి సీమంతం, పారిజాత పల్లవి, ఉషా స్వప్నం, కుచేలోపాఖ్యానం భ్రమర గీతాలు ఇవన్నీ జానపద గేయాలు. ఇవి కాక భాగవత కథలైన ప్రహ్లాద చరిత్ర, అంబరీషోపాఖ్యానం వంటివి కూడా వాళ్ళు అల్లుకున్నారు.

ఇతరాలలో సత్య హరిశ్చంద్ర, దత్తాత్రేయ జననం, దక్షయజ్ఞం, గంగా వివాహం, గంగా గౌరి



సంవాదం సవతుల కయ్యం, ఈశ్వర భృంగి సంవాదం, మేనకా పార్వతీ సంవాదం, లక్ష్మీ పార్వతీ సంవాదం, త్రిపురాసుర సంహారం, సురాబాండేశ్వరం, మార్కండేయ జననం, సిరియాల రాజు చరిత్ర, భళ్ళాణ రాజు కథ, కొమిరెల్లి మల్లన్న కథ, వరదరాజు పెండ్లి పాట, ఆండాళ్ చరిత్ర, శ్రీరంగ మహాత్యం, తిరుమంత్రపు పాట, దశావతారాల పాట, లక్ష్మీదేవి సొంగటాలాట, లక్ష్మీదేవి వర్ణనం, వెంకటేశ్వర్ల వేట, చెంచిత కథ, ఏకాదశి మహాత్మ్యం, వరహావతార చరిత్ర, నూట యెనిమిది దివ్యస్థలములు -వంటి యెన్నో కథలు, సంఘటనలూ జానపదుల చేత చేపట్టబడి పాటలుగా, యక్షగానాలుగా వెలిశాయి. మూల కథకంటే భిన్నంగా ఎన్నో కల్పనలు చేయడం, జానపదులకా కథల మీద ఉండే ప్రీతిని తెలియజేస్తుంది. తమ జీవన పద్ధతి కనుగుణంగా, ఆ పాత్రల్లో తాదాత్మ్యం వహించడం వలననే, ఎన్నో మార్పులూ, చేర్పులూ ఆయా కథల్లో కలగడం సంభవించింది.

జానపద గాయకులు ఈ కథల్ని గేయరూపంలో పాడేటప్పుడు కేవలం కథ చెప్పటమే కాక, సమకాలిన సంఘటనల్నీ, వ్యక్తుల నడవడికల్నీ అన్నిటినీ వ్యాఖ్యాన రూపంలో మలిచి కథను జోడిస్తారు. అందువల్ల విశ్వదనీనాలైన కథల్లోని పాత్రలు ఒక్కొక్కసారి జానపదుల అనుభవాలూ జీవితమూ జోడింపబడడం వల్ల కేవలం వారికి సంబంధించిన కాలానికో నెలకో పరిమితమైన వస్తువులుగా గోచరిస్తాయి. జానపదుల సీత కానీ, ఊర్మిళకానీ, అచ్చు తెలుగు పడతులు. వాళ్ళు తెలుగు వారి బిడ్డలు. సంస్కృత కవుల సృష్టిగా వాళ్ళను చెప్పడానికి వీలుండదు. కొన్ని చోట్ల కొన్ని పాత్రల విషయంలో నంస్కృతంలో లేని పెంపు కనిపిస్తుంది.

ఉదాహరణకు రామాయణంలోని ఊర్మిళా పాత్ర కేవలం ఊర్మిళా లక్ష్మణుల వివాహ సందర్భంలోనే మనకు కనిపిస్తుంది. భర్త వెంట, సీతలాగా, అడవికి పోలేని ఆమె నిస్సహాయతను గ్రామీణులు గుర్తించారు. ఆ సానుభూతి వలన ఊర్మిళాదేవి నిద్ర అనే ఒక చక్కని కల్పనను కల్పించి పాటలో బంధించ గలిగారు. ఆ విధంగా జానపదుల కల్పనల వలన పురాణ పాత్రల వన్నె పెరిగిందే కాని తరగలేదు.

**చారిత్రకేతి వృత్తాలు :**

చరిత్రకు సంబంధించిన కథా గేయాలు జానపద సాహిత్యంలో ఎన్నో ఉన్నాయి. స్థానిక వీరుల ఉదాత్త వర్తనం, త్యాగదీక్ష, పరాక్రమం ఇటువంటి కథలలో ప్రస్ఫుటమై ఉంటాయి. వినే వాళ్ళకు ఒళ్ళు ఉప్పొంగే టట్లుగా జానపదులీ కథాగానం చేస్తారు. కాటమరాజు కథ, పల్నాటి వీర చరిత్ర, బొబ్బిలి కథ, కుమారరాముని కథ, పల్నాటి వీరుల కథ వంటి ఎన్నో చారిత్రక కథలు, కాటమ రాజు కథ, ఒక్కొక్క కథ కాక కథా చక్రమని చెప్పవచ్చు.

కుమార రాముని కథ ఆంధ్ర, కర్నాటక దేశాలకు రెంటికీ సంబంధించింది. అలాగే దేశింగు రాజు కథ ఆంధ్ర, తమిళ దేశాలకూ, ఆరె మరాటీల కథ, ఆంధ్ర, మహారాష్ట్ర దేశాలకూ సంబంధించింది. ఇవి కాక మియాన్ సాహిబ్, సోమనాద్రి, రాజా రామేశ్వరరావు, రాణి శంకరమ్మ, సర్వై వెంకటరెడ్డి, కర్నూలు నవాబు, సదాశివరెడ్డి, సర్వాయి పాపడు, బలుగూరి కొండయ్యలకు సంబంధించిన కథలు తెలంగాణా ప్రాంతానికి చెందినవి. అల్లూరి సీతారామరాజు కథ మన్య ప్రాంతానికీ, పెద్దాపురం కోడి పందేల కథ తీర ప్రాంతానికి చెందినవి.

డా॥ బిరుదురాజు రామరాజు




100% Free Estimates from the Nation's Leading Moving Companies

MOVERS.Com™

Visit us online or call 866-343-1243 today and tell us about your move.




Vidyadhar Garapati, CEO

TANA Regional Coordinator – New York




Have you started saving for your kid's college?

**WE CAN HELP**

**The importance of education today is undeniable. Are you prepared for what it costs?**

It takes planning to fund the cost of an education considering that between 2006-07 and 2016-17, published in-state tuition and fees at public four-year institutions increased at an average rate of 3.5% per year beyond inflation[1]. While tuition will be the largest expense, don't forget about these additional costs that may be incurred:

## Pre-College Costs

- Standardized test fees
- Test prep courses and materials
- Campus visits
- Moving costs

## Additional College Costs

- Room & Board
- Books & Supplies
- Transportation

1 College Board (Trends in Higher Education) 2017

## Talk it through with an expert.

**We're here to help.**



**Lakshmi Moparthi**
Agent
**Phone: (732) 789-9677**
**lmoparthi@ft.newyorklife.com**
**lakshmim.com**
**New York Life Insurance Company**
379 Thornall st.
Edison, NJ 08837

1729183 EXP: 3/10/2019

Insure. Prepare. Retire.

**Be good at life.**

NEW YORK LIFE


Best Wishes from
Siddhendra Kuchipudi Art Academy
The Premier Kuchipudi Dance Academy in USA
SIDDHENDRA
KUCHIPUDI ART ACADEMY
Contact: Guru Smt. Swathi Atluri (Gundapuneedi)
Phone : 732 429 2948 http://www.kuchipudiartacademy.com/
E-mail : kuchipudi_usa@yahoo.com, siddhendra.kuchipudi@gmail.com
Locations: New Jersey, Connecticut, Pennsylvania

24 mantra ORGANIC

Pure, sure and all things honest. Only 24 MANTRA ORGANIC






200+ products to live an organic life

24 Mantra Organic
www.24mantra.com

Certified as per Indian, US & European Organic Standards
USDA ORGANIC
IN-ORG-004
Non-EU Agriculture